# TUMMETI RAGHOTHAMAREDDY KATHALU – PARISEELANA

A Dissertation submitted to the University of Hyderabad in partial fulfillment of the degree of

MASTER OF PHILOSOPHY
In
TELUGU

By
MADISHETTI ABHISHEK

DEPARTMANT OF TELUGU
SCHOOL OF HUMANITIES
UNIVERSITY OF HYDARABAD
HYDARABAD – 500046
TELANGANA
JUNE - 2015

# Tummeti Raghothamareddy Kathalu - Pariseelana

A Dissertation submitted to the University of Hyderabad in partial fulfillment of the degree of

MASTER OF PHILOSOPHY
In
TELUGU

By
MADISHETTI ABHISHEK

DEPARTMANT OF TELUGU
SCHOOL OF HUMANITIES
UNIVERSITY OF HYDARABAD
HYDARABAD – 500046
TELANGANA
JUNE – 2015

# తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – పరిశీలన

ఎం.ఫిల్. పట్టాకోసం

హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన తెలుగు పరిశోధన వ్యాసం.


పరిశోధన

మాడిశెట్టి అభిషేక్

తెలుగుశాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాద్ విశ్వవిద్యాలయం

హైదరాబాద్, తెలంగాణ


జూన్ – 2015

# CERTIFICATE

This is to certify that the dissertation entitled "Tummeti Raghothamareddy Kathalu - Pariseelana" submitted by Mr. MADISHETTI ABHISHEK bearing Reg. No. 14HTHL17 in partial fulfillment of the requirements for the award of Master of Philosophy in Telugu is a bonafide work carried out by him under my supervisor and guidance.

This dissertation has not been submitted previously in part or full to this or any other University or Institution for the award of any degree or diploma.

Dr. B.Bhujanga Reddy
Signature of the Supervisor

Head
Department of the Telugu

Dean
School of Humanities

# DECLARATION

I, MADISHETTI ABHISHEK hereby declare that this Dissertation entitled “Tummeti Raghothamareddy Kathalu - Pariseelana” submitted by me under the guidance and supervisor of Dr. Baanala Bhujanga Reddy is a bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

I hereby agree that my thesis can be deposited in showdganga / INFLIBNET.

Date: Signature of the Student

Place : HYDERABAD Reg No. 14HTHL17

# కృతజ్ఞతలు

కనకున్న కన్నకొడుకులాగా చూసుకొని నన్ను పెంచి పెద్ద చేసిన మా అమ్మమ్మ రాపర్తి శాంతమ్మకు, మా కుటుంబ ఆర్థిక జీవనగతి గడ్డుగా సాగుతున్న తరుణంలో నాన్న బాధ్యతను తన మీదేసుకొని ఊపిరి పీల్చుకోని కష్టాల మధ్య ఎదురీడి మమ్మల్ని ఏ లోటు రాకుండా పెంచిన అమ్మ గుండమ్మకు, నిరంతరం నా బాగోగులను గురించి పట్టించుకుంటూ నా వెన్నంటే ఉండి ఆర్థికంగా ఏ లోటు రానీయకుండా కష్టపడే తత్త్వాన్ని నేర్పిన ఆదర్శవంతులు మా మామయ్యలు రాపర్తి రమేష్, సతీష్, రాములు, లక్ష్మణ్‌లకు, ఎల్లప్పుడూ నా శ్రేయాన్ని ఆశిస్తూ అభి అంటూ ఆప్యాయతల మధ్య ముంచెత్తే మా కుటుంబ సభ్యులు నాన్న మల్లేశం, అక్క అనూష. తమ్ముడు సాయి, కోడలు అశ్వితలకు ఇంకా మిగిలిన మా కుటుంబ సభ్యులందరికీ పేరు పేరున నా శతకోటి వందనాలు......

నేను ఎంచుకున్న పరిశోధనాంశాన్ని సహృదయంతో మన్నించి లోకం పట్ల, సమాజం పట్ల విషయ అవగాహనను విస్తృత పరుస్తూ, ఏ గురువు అందించని స్నేహభావాన్ని చూపి మమల్ని, మా అభ్యున్నతిని ఆశించే మా ఆత్మీయ గురువులు డా. బాణాల భుజంగరెడ్డి గారికి ప్రత్యేకంగా నా హృదయ పూర్వక నమస్కారాలు......

ముందుగా నాకు పరిశోధన అవకాశం కల్పించిన హైదరాబాద్ విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు నా ధన్యవాదాలు.

నాకు, నా పరిశోధనకు సహకరించిన మాజీ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య శరత్‌జోత్స్నరాణి గారికి, ప్రస్తుత తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి, ఆచార్య ఆర్. వి. ఆర్. కృష్ణశాస్త్రి గారికి, ఆచార్య అరుణకుమారి గారికి, డా. పిల్లలమర్రి రాములు గారికి, డా. దార్ల వెంకటేశ్వర రావు గారికి, డా. పమ్మి పవన్‌కుమార్ గారికి, డా. విజయలక్ష్మి గారికి, డా. విజయకుమారి గారికి కృతజ్ఞతలు.

నా పరిశోధనకు, అకడమిక్ పనులకు తమ వంతు సహాయం అందించిన భవానీ శంకర్, రాంబాబు, గణేష్, సాయి గార్లకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.

బాల్యం నుండి స్నేహితులు కాకపోయినా ఇంటి బాధ్యతలను తెలియజేసి చదివేలా చేసిన నా మంచి మిత్రులు దేవరకొండ అవినాష్, బురుగు శ్రీనివాస్ గౌడ్, బోగ మల్లేష్, చిట్టన్నోజు కిరణ్, బోగ మహేష్ లకు.....

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో చదువుకోవడానికి చదివి సాధించుకొన్న ఫలితాల ప్రేరణకు, హార్డ్‌వర్క్ చేయాలంటూ ఆలోచననిచ్చే మా మాజీ డిగ్రీ ప్రిన్సిపల్, ఆత్మీయ గురువులైన డా. జైకిషన్ గారికి, నా పట్ల, నా చదువు పట్ల స్వంత అన్నల్లాగా బాధ్యతను స్వీకరించి సమయానికి తగిన సహాయాన్ని అందజేస్తూ, నేనింత చదువుకోవడానికి మార్గదర్శకులై నిరంతరం నన్ను ప్రోత్సహించే గంద్ర మహేష్, గరిగె రాజేష్, మెరుగు రామచందర్, కల్యాడపు రమేష్, అజ్మీర్ రాజేందర్, కిష్టయ్య అన్నలకు.....

బామ్మరిది అంటూ ఆప్యాయంగా పిలిచే రాయమల్లు బావకు, విశ్వవిద్యాలయంలో కొత్తగా అడుగుపెట్టినప్పుడు నిత్యం తోడుండి, ముందుకు నడిపించిన మిత్రుడు తిరుపతి, సంతోష్‌లకు.. ఇంకా జూనియర్ మిత్రులు గట్ల వెంకట స్వామి, సంద రాము, జనార్ధన్‌లకు...

సమాజం గురించి, సమాజ వైఖరిని నిత్యం గమనిస్తూ తనదైన తీరులో వాఖ్యానించి చెప్తూ, టైపింగ్ చేసుకోవడానికి తన సిస్టమ్‌ను వాడుకొమ్మని ఇచ్చినందుకు నా రూమ్‌మేట్ కిరణ్‌కు, సాంకేతిక ఇబ్బందులను తీర్చిన అతని సహచరులు రాము, వెంకటేష్, వీరన్నలకు...

నా ఈ పరిశోధన రావడానికి ముందుగా అంగీకరించి, వారి మీద వచ్చిన "ఒక కథకుడు నూరుగురు విమర్శకులు" అనే పుస్తకాన్ని పంపించి, అన్ని వేళలా సలహాలను ఇస్తూ తన వంతు సహకారాన్ని అందించిన సమర్థవంతమైన సామాజిక బాధ్యత కలిగిన అరుదైన రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి గారికి....

నా పరిశోధనకు కావల్సిన పుస్తకాలను అందించి తగిన సహాయం చేసిన ఇందిరా గాంధీ మెమోరియల్ లైబ్రరీకి, స్టాఫ్ సిబ్బందికీ...

ప్రేమతో పలకరించి స్నేహభావాన్ని పంచిన సీనియర్ అన్నలు సురేష్, హనుమంతరావు, గంగాప్రసాద్, సంజీవ్, అదినారాయణ, ఉదయభాను, కృష్ణ, ఆంజనేయులు, సత్యనారాయణ,

చిరంజీవి మొదలైన వారేకాకుండా నా జ్ఞాపికలో మిస్సైన మిత్రులందరికీ, సీనియర్ అక్కలు శరణ్య, స్రవంతి, పావని చెల్లెల్లు మానస, జగదీశ్వరీ, రాణీ, శారదలకు, క్లిష్ట పరిస్థితిలో ప్రూఫ్ రీడింగ్ చేసిచ్చిన సుమలత చెల్లెమ్మకు..

ఇంకా నా ఈ పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన మిత్రులందరికీ కృతజ్ఞతలు.

అందరికీ మించి ఎల్లవేళలా నా తోడు ఉండి, నా కష్టాన్ని సగం పంచుకుంటూ, మానసికంగా గుండె ధైర్యాన్ని నింపుతూ నా అభ్యున్నతిని ఆశించే భార్గవికి ప్రత్యేక కృతజ్ఞత **అభి**వందనాలు.......

వినయంతో మీ

**అభిషేక్...**

# ముందుమాట

ఒక తరం నుండి మరో తరానికి వారధిగా నిలిచే సాహిత్యాన్ని చదువుతున్నందుకు ముందుగా ఆనందిస్తున్నాను. చిన్నప్పటి నుండి కథలపై ఉన్న కొద్ది పాటి ఆసక్తి యం.ఎ. చదవడం వలన ఇంకా బలపడింది. సిలబస్ ప్రకారం చదువుతున్న తరుణంలోనే విమర్శను బోధిస్తున్న దార్ల వెంకటేశ్వర రావు గారిచ్చిన అసైన్‌మెంట్లో భాగంగా కొన్ని కథలు పరిచయమయ్యాయి. ఆ కథలో తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు కూడా ఉన్నాయి. మొదటగా 'ఇల్లు', 'ఉరి' అనే రెండు కథలు చదివి ఆశ్చర్యపోయాను. ఎందుకంటే ఆ రెండు కథల్లో నేను పెరిగిన ప్రాంత వ్యవహారిక భాష, వాస్తవిక జీవితం నన్ను కదిలించాయి. అలా కథలపై నాకే తెలియని మక్కువ, సదాభిప్రాయం ఏర్పడ్డాయి. ఇక యం.ఎ. పూర్తి చేసుకొని పరిశోధన అవకాశం రాగానే ఏదైనా ఒక పరిశోధనాంశం కోసం వెతకడం ప్రారంభించాను. నాకు నిత్యం తోడుండి సలహాలు అందించే గంద్ర మహేష్ అన్నను కలిసి పరిశోధనాంశం గురించి కొన్ని చర్చలు చేసుకోవడం జరిగింది. ఆయన నాకు చూపిన కొన్ని టాపిక్‌లలో రఘోత్తమరెడ్డి కథలు చూసి గడిచిపోయిన జ్ఞాపకాలు స్మరణకు వచ్చాయి. నాకు ముందే పరిచయమున్న రఘోత్తం గారి కథల మీద పూర్వ పరిశోధనలు జరిగాయేమోనని ఆచూకీలను వెతికాను.

తెలంగాణ కథకులలో విశిష్ట, అగ్ర కథకుడుగా పేరొందిన రఘోత్తమరెడ్డి లాంటి వారి మీద ఎటువంటి పరిశోధనలు జరుగలేదని తెలిసి కలవరపడ్డాను. వెంటనే ఆ టాపిక్‌ను మా గురువు గారు భుజంగ రెడ్డి గారి అనుమతితో యం.ఫిల్ పరిశోధనాంశంగా స్వీకరించాను. 1980-90 కాలాల మధ్య ఉన్న తెలంగాణ ప్రజాపోరాటాలను, బొగ్గుగని కార్మికుల కష్టాల కడగండ్లను. ఆర్థిక లోపాల్లో కూరుకుపోయిన రైతుల పరిస్థితిని, ఎన్నో వాస్తవిక జీవితాలను సమర్థవంతంగా ప్రతిఫలింపజేసిన రఘోత్తం గారి కథలు ఎటువంటి పరిశోధనకు నోచుకోకపోవడం వల్ల ఆ కథలను నా పరిశోధన ద్వారా పరిచయం చేయాలనే ఉద్దేశంతో, ప్రత్యేక ఆసక్తితో పరిశోధనాంశంగా స్వీకరించాను. అలా 1980-90 తెలంగాణలో సామాజిక పరిస్థితులు, రాజకీయ పరిణామాలను, ఆర్థిక స్థితిగతులను

తెలుసుకోవడానికి పనికి వచ్చే కథలు రఘోత్తమరెడ్డి గారి కథలు. రైతుల సమస్యలు, దోపిడిదారులకు నిరసన తెలిపిన సామాన్యుల పీడిత జనం చైతన్యాన్ని, బొగ్గుగని కార్మికులు పడే సమస్త బాధలను, గని అధికారుల దాష్టీకాన్ని చిత్రించిన ఈ కథలను పరిశోధన చేయడమే ఈ పరిశోధనాంశం వివరణ.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి 17 సంవత్సరాలుగా 22 కథలను మాత్రమే రాసారు. రాశిలో తక్కువైనా వాసిలో ఎక్కువ అయినట్లు రఘోత్తమరెడ్డి రాసిన కథలు తక్కువే అయినా వాటి యొక్క కాన్వెస్ చాలా విస్తృతమైంది. వాస్తవిక ప్రపంచంలో మానవుల జీవితాలను ఉన్నది ఉన్నట్లుగా చిత్రించడం వల్ల వాటికా విస్తృతి వ్యాప్తి కలిగిందని చెప్పవచ్చు. అలాంటి కథలను నా పరిశోధన కాల పరిమితి, విషయ పరిధి దృష్ట్యా 1980-90ల మధ్య తుమ్మేటి రాసిన 16 కథలను మాత్రమే ఈ పరిశోధన అంశానికి పరిధిగా తీసుకున్నాను. మొదట ఆ కథలు చదివి అన్ని కథలను పరిశోధనకు తీసుకొవాలనుకున్నా వాటి విస్తృతికి, నా విషయావగాహనకు మధ్య కొంత సందిగ్ధత ఏర్పడింది. అలాంటి సమయంలో కాలపరిమితిని దృష్టిలో పెట్టుకుని పైన చెప్పిన కాలానికే కథలను నిర్దేశించుకొని నా ఈ పరిశోధనను కొనసాగించాను. వీటన్నింటికి బలమైన కారణమొకటే. ఆ కథలను స్థూలంగా చదివినప్పుడు ఏర్పడిన అవగాహన కన్నా సూక్ష్మంగా చదివినప్పుడు తెలిసిన అవగాహాన వల్ల ఈ కథల సంఖ్యను కుదించుకున్నాను. తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన 22 కథలను, 1నల్లవజ్రం నవలికను కలిపి విరసం వారు 2006లో ఎన్. వేణుగోపాల్ గారి సంపాదకత్వంలో *"తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు"* అనే పుస్తకాన్ని ప్రచురించారు. నా పరిశోధనను కొనసాగించేందుకు ఆ పుస్తకంలో నేను పరిశోధనకు ఎంచుకున్న కథలను తీసుకొని పరిశీలించడం నా పరిశోధన పరిధి.

నాకు లభించిన సమాచారం మేరకు, పూర్వ పరిశోధన గ్రంథాల ఆధారంగా తుమ్మేటి రఘోత్తమరెడ్డి గారు రాసిన కథల మీద ఎటువంటి పరిశోధనలు జరగలేదని తెలిసింది. ఒకవేళ, ఏ విశ్వవిద్యాలయంలోనైనా పరిశోధన జరిగినా ఆ సిద్ధాంత వ్యాసం రచయిత రఘోత్తం గారి వద్దకు రాలేదని వారే స్వయంగా విన్నవించారు. నాకున్న సందేహాన్ని నివృత్తి చేసిన రచయిత మాటను గట్టిగా

నమ్ముకొని పూర్వ పరిశోధన జరుగలేదని తేల్చి చెప్తున్నాను. రఘోత్తమరెడ్డి గారు వేసినా విమర్శ సంకలనం *“ఒక కథకుడు–నూరుగురు విమర్శకులు”* అనే పుస్తకం వచ్చింది. రఘోత్తమరెడ్డి రచనల మీద వివిధ పత్రికలలో వచ్చిన విమర్శ వ్యాసాలను సేకరించి, వారికి వచ్చిన బహుమతి డబ్బులతో ఒక పుస్తకరూపంలో తీసుకొచ్చారు. ఆ పుస్తకం రఘోత్తమరెడ్డి రాసిన రచనలన్నింటి మీద వచ్చిన రచనా సర్వస్వం. అంతేగాని విడిగా రఘోత్తమరెడ్డి కథల మీద పరిశోధనలు జరుగలేదని ఉద్దేశ్యంతో ఈ పరిశోధనాంశాన్ని “తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – పరిశీలన” అని నిర్ణయించుకున్నాను.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన కథలు తెలంగాణ సామాజిక సంబంధాల నేపథ్యాల నుంచి ఆవిర్భవించాయి. అలాంటి కథల్లో వస్తు, శిల్ప, పాత్రచిత్రణను పరిశీలించడం నా పరిశోధన ప్రధాన లక్ష్యం. నేను పరిధిలోకి తీసుకున్న కథలను పరిశీలించి విశ్లేషణ చేయడానికి కొన్ని పుస్తకాలు ఉపకరించాయి. కథాశిల్పానికి సంబంధించిన పుస్తకాలు, పూర్వం కథలపై వచ్చిన పరిశోధన సిద్ధాంత వ్యాసాలు, కథలపై వచ్చిన మరికొన్ని వ్యాసాలు, రఘోత్తమరెడ్డి గారి మీద వచ్చిన విమర్శ వ్యాసాలు మొదలైన వాటి ఆధారంగా నా ఈ పరిశోధనను కొనసాగించాను. కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఎలాంటి చారిత్రక, రాజకీయ నేపథ్యాల జోలికి పోలేదు. అంతేగాకుండా, ఒక దృక్పథమంటూ పరిమితమైన భావజాలానికి ప్రాధాన్యతను ఇవ్వకుండా కేవలం రఘోత్తం కథలు సాహిత్యపరంగా మనకు అందించే అంశాలను మాత్రమే తెలియజేశాను. నా పరిధిలోకి వచ్చిన కథలను ఆయా భాగాలల్లో చేర్చి వస్తువిశ్లేషణ. పాత్రచిత్రణలో రచయిత చూపించిన వైవిధ్యం, శిల్పనైపుణ్యాలను అంచనా వేయడానికి మాత్రమే ఈ పరిశోధన కొనసాగిందని తెలియజేస్తున్నాను. నాకున్న విషయ పరిజ్ఞానం మేరకు, నా ఆలోచన పరిధికి లోబడి మాత్రమే ఈ పరిశోధనను కొనసాగించాను. వీలైనంత వరకు కథా మూలాల్లోకి వెళ్లకుండా సాహితీ పరంగా మాత్రమే ఈ కథలను పరిశీలించాను. తెలంగాణ కథలలో, విప్లవ కథలలో ఎంతో పేరు ప్రఖ్యాతులను పొంది, ఉన్నత స్థానాన్ని సంపాదించిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలను నా ఈ పరిశోధన ద్వారా తెలుగు సాహితీ లోకానికి పరిచయం చేయడం ఎంతో తృప్తిని కలిగిస్తుంది.

# విషయసూచిక

# తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు - పరిశీలన


**కృతజ్ఞతలు**

**ముందుమాట**

**విషయసూచిక**


## అధ్యాయం - 1


**1. తుమ్మేటి రఘోత్తమ రెడ్డి - జీవిత విశేషాలు** **1 - 23**

1. 1 జననం

1. 2 బాల్యం పై కొన్ని సంఘటనలు

1. 3 విద్యాభ్యాసం

1. 4 రైతుగా తుమ్మేటి

1. 5 బొగ్గు గని కార్మికుడిగా తుమ్మేటి

1. 6 సాహిత్య ప్రవేశం

1. 7 రచనలు

1. 8 తుమ్మేటి రచనల మీద వచ్చిన విమర్శ

1. 9 అవార్డులు

1. 10 రఘోత్తమ రెడ్డి వ్యక్తిత్వం

1. 11 తుమ్మేటి రచనా దృక్పథం

1. 12 తెలంగాణ కథా సాహిత్యంలో తుమ్మేటి స్థానం

## అధ్యాయం - ౨


**2. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – వస్తు వైవిధ్యం** **24 - 73**

2. 0 పరిశోధనకు స్వీకరించిన కథలు

2. 1 వస్తువు

2. 2 బొగ్గుగని కార్మిక సాహిత్య నేపథ్యం

**2. 3 భూస్వామ్య వ్యవస్థపై నిరసనకు సంబంధించిన కథలు**

2. 3. 1 ధిక్కారం

2. 3. 2 ఈ భూమి ఎవరిచ్చిన్రు..?

**2. 4 వెట్టిచాకిరీకి సంబందించిన కథలు**

2. 4. 1 సవారీ – I

2. 4. 2 సవారీ – II

**2. 5 రైతులకు సంబంధించిన కథలు**

2. 5. 1 ఒక్కటైతే..?

2. 5. 2 పగలూ రేయీ శ్రమ పడుతున్నా

**2. 6 వివాహనికి సంబంధించిన కథలు**

2. 6. 1 పెండ్లి

2. 6. 2 వేటగాడి చూపులు

**2. 7 మానవ సంబంధాలకు సంబంధించిన కథలు**

2. 7. 1 ఓ మెరుపు మెరిసింది

2. 7. 2 పట్టు

2. 7. 3 శత్రువు

2. 7. 4 నా పాత స్నేహితుడు

**2. 8 బొగ్గుగని కార్మిక సమస్యలకు సంబంధించిన కథలు**

2. 8. 1 నీళ్ళతగువు

2. 8. 2 ఇల్లు

2. 8. 3 పురుడు

2. 8. 4 వాల్‌పోస్టర్

## అధ్యాయం - 3

**3. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – పాత్ర చిత్రణ 74 - 102**

3. పాత్రచిత్రణ – నిర్వచనాలు

3. 1 తుమ్మేటి కథలు – పాత్రచిత్రణ

**3. 2 ప్రధాన పాత్రలు**

3. 2. 1 రాయమల్లి

3. 2. 2 ప్రతాప్ దొర

3. 2. 3 ఓదెలు

3. 2. 4 బాలయ్య

3. 2. 5 రాంరెడ్డి

3. 2. 6 రంగారెడ్డి

3. 2. 7 నర్సయ్య

3. 2. 8 సమ్మక్క

3. 2. 9 ఓదెలు

3. 2. 10 పోశెట్టి

3. 2. 11 మల్లేశం

3. 2. 12 సమీర

3. 2. 13 లింగయ్య

3. 2. 14 కథకుడు

**3. 3 అప్రధాన పాత్రలు**

3. 3. 1 నర్సింహరామయ్య

3. 3. 2 గోపయ్య

3. 3. 3 కొమరమ్మ

3. 3. 4 సమ్మిరెడ్డి

3. 3. 5 సుగుణ

3. 3. 6 సమద్

**3. 4 కథను మలుపుతిప్పే పాత్రలు**

3. 4. 1 జగదీశ్వరరావు

3. 4. 2 అత్తగారు

3. 4. 3 రాజవ్వ

3. 4. 4 పిచ్చివీరయ్య

3. 4. 5 మల్లేశు

## అధ్యాయం - 4

**4. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – రచనాశిల్పం** **103 - 147**

4. శిల్పం – పరిచయం

4. 1 వస్తువు

4. 2 పాత్రచిత్రణా శిల్పం

4. 3 కథాకథనం

4. 3. 1 ఉత్తమ పురుష కథాకథనం

4. 3. 2 ప్రథమ పురుష కథనం

4. 3. 3 సంభాషణాత్మక కథనం

4. 3. 4 ఫ్లాష్‌బ్యాక్ కథనం

4. 3.5 చైతన్య స్రవంతి కథనం

4. 3. 6 వాస్తవిక కథనం

4. 4 సంఘటనాఘటనా శిల్పం

4. 5 సంఘర్షణోత్పాదక శిల్పం

4. 6 సన్నివేశకల్పనా శిల్పం

4. 7 వర్ణనాశిల్పం

4. 7 . 1 ప్రకృతి వర్ణన

4. 7. 2 స్వభావ వర్ణన

4. 7. 3 సన్నివేశాల వర్ణన

4. 7. 4 బొగ్గుగని కార్మిక కష్టాల వర్ణన

4. 8 శీర్షికా శిల్పం

4. 8. 1 ధ్వని ప్రధానంగా సూచించే శీర్షికలు

4. 8. 2 సన్నివేశాలు ప్రధానంగా సూచించే శీర్షికలు

4. 8. 3 ప్రశ్నార్థకాన్ని సూచించే శీర్షికలు

4. 8. 4 సంఘటనాత్మకంగా సూచించే శీర్షికలు

4. 9 ఎత్తుగడ

4. 9. 1 సంభాషణాత్మక ఎత్తుగడ

4. 9. 2 శీర్షికతో కూడిన ఎత్తుగడ

4. 9. 3 సందేహాత్మక ఎత్తుగడ:

4. 9. 4 బొగ్గుగని ప్రాంతాల పరిస్థితుల గురించి ప్రారంభమైన ఎత్తుగడ

4. 9 . 5 పాటతో ప్రారంభమైన ఎత్తుగడ

4. 10 ముగింపు

4. 10. 1 పాత్రకు సంబంధించిన ముగింపు

4. 10. 2 విషాదాత్మకమైన ముగింపు

4. 10. 3 ఆలోచనాత్మక ముగింపు

4. 11 భాషాశైలి

4.11.1 మాండలిక పదాలు

4.11.2 బొగ్గుగని కార్మికులు వాడే పదాలు

4. 11.3 సామెతలు

4. 11.4 జాతీయాలు

**ముగింపు** 148 – 151

**ఉపయుక్త గ్రంథ సూచి** 152 – 155

**అనుబంధం**

తుమ్మేటి రఘోత్తమరెడ్డి గారితో ఇంటర్వ్యూ....

# అధ్యాయం – 1

# తుమ్మేటి రఘోత్తమరెడ్డి - జీవిత విశేషాలు

## 1. పరిచయం

సాహితీ ప్రపంచంలో ఎందరో కథకులు ఉన్నారు. ఒక్కొక్కరిది ఒక్కొక్క బాణీ. ఒక్కొక్క కంఠస్వరం. తమ కథల్లో ధిక్కార స్వరాన్ని వినిపించిన వారు కొందరే కనిపిస్తారు. ప్రజల జీవితాల్ని, కార్మికుల బాధలను స్వయంగా చూడటమేకాక ఆ జీవితాన్ని అనుభవించి వాటిని కథల రూపంలో మనకందించిన తెలంగాణ విశిష్ట కథకుడు తుమ్మేటి రఘోత్తమ రెడ్డి.

1970-90లలో తెలంగాణ బతుకు చిత్రాన్ని రఘోత్తం కథల ద్వారా మన కళ్ళ ముందు ఉంచాడు. ఆధునిక కాలంలో వాస్తవిక అంశాలను కథల్లోకి ఎక్కించి పాఠకులతో చదివించటమంటే కష్టతరమైన పని. కాని తుమ్మేటి తన కథలను పాఠకులు ఆసాంతం చదివేలా చేయగల నేర్పరి. తుమ్మేటి కథావస్తువును ఎన్నుకున్న విధానం, పాత్రల అభినివేశం, వాటి మధ్య జరిగే సంభాషణ తీరు, చదువుతున్న పాఠకులకి తాము అనుభవిస్తున్న జీవితం ఈ కథల్లో ప్రతిఫలించిందేమో అన్న భావావేశానికి లోనవుతారు. అందుకే రఘోత్తం తెలంగాణ కథా సాహిత్యంలో తక్కువ కథలతో అనతి కాలంలోనే ఉన్నత స్థానాన్ని పొందారు. "వస్తువు ఎన్నుకోవడంలోనూ, గొప్ప ఎత్తుగడతో కథ ప్రారంభించడంలోనూ, సమర్థవంతంగా చివరకంటా నడపడంలోనూ, కొసమెరుపు కథను ముగించడంలోనూ, చక్కటి ప్రతిభను ప్రదర్శిస్తూ పాఠకుల హృదయాలపై ప్రభావం వేయడమేకాదు, మనుస్సులను అల్లకల్లోలం చేసి, అవిశ్రాంతపరచే పదును గల ఈ తరం కథారచయిత శ్రీ తుమ్మేటి రఘోత్తమరెడ్డి" (సత్యనారాయణ, 2013: 90). అసలు సిసలైన తెలంగాణ యాసతో కూడిన మాండలికాన్ని తన కథల్లో ప్రవేశ పెట్టి కనుమరుగవుతున్న తెలంగాణ భాషాస్థిత్వాన్ని ఆ కాలంలోనే ప్రయోగించి ప్రాంతీయ భాషాభిమాన ఉనికిని చాటారు. నిజాయితీతో వాస్తవికతను తన కథల్లో ఎంత

సమగ్రంగా నిర్వహించాడో అంతే నిజాయితీతో తన నిజ జీవిత కార్యచరణలో సంయమనంతో ఒక విలక్షణ, విశిష్ట, ఆదర్శ వ్యక్తిత్వం గల రచయిత. రఘోత్తమరెడ్డి గురించీ, ఆయన కథల గురించీ చర్చించాలంటే ఈ సిద్ధాంత గ్రంథం ఏ కోశాన సరిపోదని నా భావన ఎందుకంటే ఆయన రచనలపై వచ్చిన "ఒక కథకుడు నూరుగురు విమర్శకులు" పుస్తకమే అందుకు నిలువెత్తు నిదర్శనం.

కవిత్వం, నవల, గల్పిక మొదలైన సాహితీ ప్రక్రియలను అవి రచించిన కవుల, రచయితల జీవితాలతో సంబంధం లేకుండా ఆస్వాదించగలం, అనుభూతులెన్నో పొందగలం. కాని మనిషి జీవితాన్ని ఎంతో వాస్తవికతతో ప్రతిభావంతంగా చిత్రించే కథలనూ వాటిలోని వాస్తవికతనూ గ్రహించటానికి కథారచయిత గురించి తెలుసుకోవటం అవసరమని నా అభిప్రాయం. తుమ్మేటి కథలను సమర్ధవంతంగా, వాస్తవిక దృష్టితో అర్థం చేసుకోవాలంటే ఆయన జీవిత నేపథ్యం తెలుసుకోవడం ఎంతైనా అవసరం. కనుక ఈ అధ్యాయంలో తుమ్మేటి రఘోత్తమరెడ్డి జీవన రేఖలను సూత్రప్రాయంగా మాత్రమే పరిచయం చేస్తున్నాను.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి తన బాల్యం నుండి బహుముఖ రచయితగా ఎదగడానికి గల చారిత్రక పరిణామన్నంతా తెలుసుకోవడానికి "తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు" అన్న పుస్తకంలో "నా రచనా నేపథ్యం" అనే వ్యాసం ఉంది. ఆ వ్యాసం పుస్తకం కోసం రాయలేదు. తుమ్మేటి గొప్ప కథా రచయితగా పేరు పొందడానికి గల చరిత్రంతా "నా రచనా నేపథ్యం" అనే శీర్షికతో 'రచన' మాస పత్రికలో ఏప్రిల్ 1996 నుంచి అక్టోబర్ 1996 దాకా ప్రచురించబడింది. ఆ వ్యాసమంతా తుమ్మేటి ఆత్మకథ లాంటిదని చెప్పాలి. ఈ వ్యాసంలో తన జీవితం వెనుకవున్న సంఘర్షణ, చారిత్రక పరిణామాలు, సామాజిక సందర్భాలు, సాగించిన పోరును రాసి మనందరికి అందించాడు. ప్రతి సాహిత్య విద్యార్థి, ప్రతి పరిశోధకుడు చదవాల్సిన వ్యాసం ఇది. ఈ వ్యాసంలో వున్న ఎన్నో సంఘటనలు, అంశాలు, విషయాలు తుమ్మేటి కథల్లో ప్రతిఫలిస్తాయి. వ్యక్తిగత జీవితం నుండి సామాజిక జీవితం వరకు ప్రతి మానవీయ అంశాలను నిశితంగా పరిశీలించి వాటి ములాలను, తాత్వికతను కథల్లో ప్రతిభావంతంగా చిత్రించారని చెప్పాలి. రచయితగా మారడానికి అతని జీవితంలో ఎదురైన సామాజిక పరిస్థితులు,

రాజకీయ పరిణామాలని చూడాలి. ప్రస్తుతం అతని జీవిత విశేషాలను “నా రచన నేపథ్యం” ఆధారంగా రాస్తున్నదే.

## 1.1. జననం

రఘోత్తమరెడ్డి వరంగల్ జిల్లా చిట్యాల మండలంలో 1959వ సంవత్సరం డిశంబర్ 1వ తేదీన జన్మించారు. వారి తల్లిదండ్రులు అమృతమ్మ, లక్ష్మా రెడ్డి. వీరికి ఒక అన్న, ఇద్దరు అక్కలు. తుమ్మేటి తాత గారి కాలంలో వాళ్ళది పెద్ద భూస్వామ్య కుటుంబం. కుటుంబ కలహాల వల్ల, ఇంకా అనేక కారణాల వల్ల ఉమ్మడి కుటుంబం కాస్త చిన్న చిన్న కుటుంబాలుగా విడిపోయింది. ఆస్తి పంపకాల్లో పదెకారాల మాగాణీ, ఇరవై ఎకారాల మెట్ట భూమి తుమ్మేటి కుటుంబానికి మిగిలిన ఆస్తి. తుమ్మేటిది ఒకప్పుడు బాగా బతికిన భూస్వామిక కుటుంబం. అనాటి సామాజిక, కుటుంబ పరిస్థితుల వల్ల రఘోత్తం వచ్చేసరికి చితికిపోయిన భూస్వామ్య కుటుంబంగా మారింది. ఆ పరిణామాలే రఘోత్తంకు జీవితం పట్ల ఒక విలక్షణమైన దృక్పాథాన్ని ఏర్పరిచాయి.

## 1.2. బాల్యంపై కొన్ని సంఘటనల ప్రభావం

బాల్యంలో కొన్ని సంఘటనలు ప్రతివారిని ప్రభావితం చేస్తాయి. అవి చిరకాలం గుర్తు ఉండిపోతాయి. జీవితాన్ని నిశితంగా పరిశీలించి, గమనించే తుమ్మేటికి చిన్ననాటి సంఘటనలు ఎన్నో మదిలో నిలిచిపోయాయి. బాల్యంలో అతనిపై ప్రభావం చూపించిన వాటిలో ముఖ్యమైన వాటిని పరిశీలించడం ద్వారా ఆయనకు జీవితంపై కలిగిన సంవేదనాదృష్టి, సూక్ష్మ పరిశీలనాశక్తిని గమనించవచ్చు.

తుమ్మేటిపై మొదట ప్రభావం చూపిన సంఘటన వారి నాయనమ్మ మరణంతో ప్రారంభమైందని ఆయనే చెప్పారు. ఆవిడతోనే తన చిన్ననాటి జ్ఞాపకాలు మొదలైనవి. దాని గురించి ఈ విధంగా అన్నారు. ‘‘శవ యాత్రలో నన్నెవరో భుజాల మీద కూర్చుండ బెట్టుకొని తీసుకు పోయారు.

దింపుడు కళ్లం – భగభగ మండే చితి మంటల్లో నాయనమ్మ శరీరం ఆ దృశ్యం ఈనాటికి నా కళ్లల్లో– నా మెదట్లో అస్పష్ట, అవ్యక్త ప్రశ్నలు నాయనమ్మ చనిపోయిందా? ఎందుకు? చనిపోతే ఏమవుతుంది? తిరిగి రాదా? అప్పటికి అటు ఇటుగా నాకు మూడు సంవత్సరాలు. మా నాయనమ్మ బహు వృద్ధురాలే అది నేను చూసిన మొదటి చావు. అది నా మొదటి జ్ఞాపకం'' (రఘోత్తమరెడ్డి, 2006: 345).

ఆ తర్వాత రెండో సంఘటన ఒక మూగ అవివాహిత స్త్రీ ఆత్మహత్య. ఆ మరణం అతన్ని విపరీతంగా కుదిపేసింది. ఆమె మరణానికి కారణం అక్రమ సంబంధం అని కొందరంటే విన్నారు. అది నిజమో కాదో తెలియదు. వాటి గూర్చి కొన్ని ప్రశ్నలను వేసుకోవడం ప్రారంభించాడు. అవి ''అక్రమ సంబంధం అంటే ఏమిటి? ఎందుకేర్పడుతుంది? ఏర్పడితే చావాలా? ఇట్లా చనిపోతారా? అనే సందేహాలు మస్తిష్కంలో ఉండిపోయాయి. వెను వెంటనే మరో సంఘటన. తన సహవిద్యార్థిని తండ్రిపై జరిగిన హత్య. అకారణంగా గ్రామంలోని కొందరు ఆమె తండ్రిని గొంతు కోసి చంపారు. అతన్నెందుకు హత్య చేశారనే ప్రశ్న, బయటకు అడగరాని లోపల అణుచుకోజాలని ప్రశ్న'' (రఘోత్తమరెడ్డి, 2006: 345) అని వాపోయాడు. ఈ విధంగా మూడు రకాల ఘటనలు సహజ మరణం, ఆత్మహత్య, హత్యలు తుమ్మేటి బాల్యం పై తీవ్రంగా ప్రభావం చూపి ఎడతెగని ప్రశ్నలకు కారణమయ్యాయి.

పై అంశాలే కాకుండా మరికొన్ని ఘటనలున్నాయి. వాటిలో ముఖ్యమైనవి. వారి పెద్ద బాపు మామిడి చెట్టుకు ఉరి వేసుకోవడం, వాళ్ళ ఊరులో పిచ్చి పుల్లయ్య అర్ధం లేని పిచ్చి సైగలు, మూఢ నమ్మకాల ఊబిలో కురుకుపోయిన గ్రామస్థుల దాడికి బలైన మేర ఎంకమ్మ చేష్టలు, జీవితాన్ని నిర్దుష్టమైన రీతిలో అర్థం చేసుకోలేక మనిషి మానసిక తత్త్వంలో మార్పు కలిగి, తన అస్థిత్వాన్ని మరచి విరక్తి చెందిన కొమటి సన్యాసి మొదలైన వారి జీవితాలు తుమ్మేటికి ఎన్నో అంతులేని ప్రశ్నలను మిగిల్చాయి.

## 1.3. విద్యాభ్యాసం

1965వ సంవత్సరంలో తుమ్మేటి విద్యాభ్యాసం మొదలైంది. మొదట వెలంపల్లి గ్రామంలో ప్రవేట్‌స్కూల్లో చదువును ఆరంభించారు. ఆ స్కూల్లోని ఒక ఉపాధ్యాయుడి కఠిన శిక్షలు భరించలేక

విద్యార్థులందరు సర్కారు బడిలోకి మారేవారు. వారిలో ఆయన కూడా ఒకరు. అలా కాన్వెంట్ నుండి ఒకటో తరగతికి సర్కారు బడికి మారారు. సర్కారు బడిలో మంచి బాధ్యత గల ఉపాధ్యాయుడిని కలుసుకున్నారు. ఆయన పేరు నారాయణ స్వామి. నారాయణ స్వామి చూపులతో భయపెట్టడమేగాని దండిచటం తెలియదు. అంతేగాదు విద్యార్థులకు వాత్సల్యంతో పాఠాలు బోధించేవాడు. ఆయన పాడిన వేమన పద్యాలు తుమ్మేటికి సాహిత్య పట్ల ఆసక్తి కలిగించాయి. "ఆయన వేమన మహకవిని పరిచయం చేసిన తీరు, ఆయన గొంతు నన్ను వేమన పద్యాలే పదే పదే ఆలోచింపజేశాయి. అప్పటి దాకా చదువుకున్న చదువులో నాకు వేమన పద్యాలే బాగా నచ్చాయి. సంఘంపైన వేమన చేసిన విమర్శ నాకు పట్టింది" (రఘోత్తమరెడ్డి, 2006: 350).

లోకం తీరుపై వేమన అందించిన విషయాన్ని బాగా అర్థం చేసుకున్న రఘోత్తం జీవితాలకు, దాన్ని చిత్రించే సాహిత్యానికి వున్న సంబంధాన్ని పట్టుకోగలిగారు. ఆ విషయాన్ని గురించి ప్రస్థావిస్తూ ఈ విధంగా అంటాడు. "మొదటిమారుగా కవిత్వానికి, జీవితానికి ఉండే అన్యోన్య సంబంధం నాకు వేమన పద్యాల వల్లనే అర్థమయ్యింది. నాకు తెలియకుండానే ఆ పద్యాలు నాలో రాయాలనే బీజాన్ని నాటాయి. జీవితం గురించి పదే పదే మననం చేసుకునే వాన్ని– ఆనాటి జీవితాన్ని పునర్నినిర్మించుకొనే ప్రయత్నం చేసేవాన్ని" (వేమన కాలపు) (రఘోత్తమరెడ్డి, 2006: 350). ఆ విధంగా వేమన పద్యాలు సమాజానికి, సాహిత్యానికి గల సంబంధాన్ని తెలియజేసి తన జీవితానికి నిర్ధుష్టమైన దృక్పథాన్ని ఏర్పరిచాయి.

వెలంపల్లి గ్రామంలో ఐదవ తరగతి వరకు చదివి, ఆ తర్వాత చదువు కోసం వెలంపల్లి నుండి 5కి. మీ. దూరంలో వున్న వావిలాలకు (కరీంనగర్ జిల్లా) రోజూ నడిచి వెళ్ళి చదువుకోనేవారు. అప్పడప్పుడే తెలుస్తోన్న లోకంలో భయ సందేహలతో బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టారు. అక్కడ కొంతమంది ఆవారా పిల్లలు ఆత్మన్యూనతా భావంతో, అమాయకత్వంతో ఉన్న తుమ్మేటిని అవమాన పరిచారు. ఈ సంఘటనకు అతని మనస్సు క్షోభ పడింది. "మొదటి మారుగా పరాయి వూళ్ళోకి అడుగు పెట్టడం, వివక్షతలు తెలియవు. తెలిసినా పాటించడం చేతకాదు. చదివేపని లేదు. పంతుళ్ళు

చుట్టూ తిరిగితే చాలు పాసు కావచ్చు. అస్తవ్యస్తమైన బోధన పద్ధతులు వీటన్నింటికి తోడు మొదట్లో నిత్యం నాకే తెలియని స్పష్టాస్పష్ట ప్రశ్నలు–నాకు ఆ బడి, ఆ చదువు ఇబ్బందికరంగా తోచింది. మావూరు, పరిసరాలు, మా అమ్మ, బాపు యాదికొచ్చేవారు. నాకు బాగా దు:ఖం కలిగేది. సాయంత్రం స్కూలు వదలగానే పంజరంలో నుంచి బయట పడ్డట్టుగా వుండేది'' (రఘోత్తమరెడ్డి, 2006: 357). పై విధంగా విద్యాభ్యాసంలో అనేక ఒడిదుడుకులతో, అవమానాలతో సంకుచిత మనస్తత్వంతో 1970 – 74 సంవత్సరాల మధ్య వావిలాలలో ఆరు నుండి తొమ్మిది వరకు చదువుకున్నారు. పద్నాలుగేళ్ళ వయస్సులో తుమ్మేటి పదవ తరగతి విద్యాభ్యాసానికి వాళ్ళ అక్క సౌభాగ్యవతి ఇంటికి గోదావరిఖని వచ్చారు. ఆ సమయంలో అతను చదువులో వెనకబడిన విద్యార్థి. అందులోను లెక్కల్లో చాలా వీక్. తన కున్న బిడియంతో ఉపాధ్యాయులను అడగలేక 'మణి' అనే బాల్య మిత్రురాలితో లెక్కలు చెప్పించు కునేవాడు. కొన్ని ప్రతికూల పరిస్థితుల్లో కంపోజిట్ (మిశ్రమ) లెక్కలు నేర్చుకోగలిగాడు. ఆ విధంగా తొమ్మిదో తరగతిలో ఉన్న జనరల్ లెక్కల్ని నేర్చుకోగా పదవ తరగతిలో కంపోజిట్ లెక్కల్ని నేర్చుకోగలిగాడు. "ఏతావాతా నాకు ఏ లెక్కలూ రాకుండా పోయాయి. రెంటికి చెడ్డ రేవడి అయ్యింది నా స్థితి. ఆ స్థితిలోంచి నా ఆసక్తి సైన్సు మీదికి అందులో జీవశాస్త్రం మీదికి, చరిత్ర మీదికి వెళ్ళింది'' (రఘోత్తమరెడ్డి, 2006: 360).

ఈవిధంగా లెక్కల మీద వున్న భయంతో తుమ్మేటి పెద్దమ్మ రెండవ కొడుకు నోటిమాటతో మొదటిగా విన్న తరువాత బి.యస్సీ అగ్రికల్చర్ చదవాలని కోరిక కలిగింది. కాని ప్రతికూల పరిస్థితుల వల్ల ఆ కోరికను నేరవెర్చుకోలేక పోయారు. ఆ విధంగా లెక్కలు సరిగా చదవలేక 1974 లో పదవ తరగతి ఫెయిల్ అయ్యాడు. తిరిగి మరోసారి 1975లో పదవ తరగతి పరీక్ష రాసి ఉత్తుర్ణుడయ్యాడు. పై చదువుల కోసం తాను ముందే నిర్ణయించుకున్న బై.పి.సి కోర్సు కోసం విపరీతంగా తిరిగినా ఫలితం లేకపోగా చివరికి మరల తన జన్మ శతృత్వం అయిన లెక్కల్ని (1976–78 మధ్య సంవత్సరాలలో) ఇంటర్ చదవాల్సి వచ్చింది. ఆ ఇంటర్ సమయంలో గడిచిన రోజులన్ని తుమ్మేటికి తీవ్ర దుర్ధినాలైనాయి. ఆ చదువు రోజుల గురించి ఈ విధంగా అన్నారు. "చదివే చదువులకు బయట

జీవితానికి పొంతన ఎలా కుదురుతుందో తెలియక, చదివే చదువుల కంటే మిక్కుటమైన ప్రశ్నలేవో నిరంతరం పోటెత్తించడం వల్ల నేను సాహిత్యాన్ని ఆశ్రయించిన ఫలితంగా 1978లో ఇంటర్మీడియట్ తప్పాను. మరో మారు పరీక్ష రాయడం అసలే ఇష్టం లేదు" (రఘోత్తమరెడ్డి, 2006: 362). పై విధంగా తుమ్మేటి అంతరంగంలో చెలరేగిన ఎన్నో అవాంతర ప్రశ్నలకు సాహిత్యంలో సమాధానాలు వెతుక్కోనే క్రమంలో తన చదువు పట్ల ఆసక్తి తగ్గింది. సాహిత్యం పట్ల మక్కువ పెరిగింది. చదువును అర్ధాంతరంగా ఆపేయాల్సి వచ్చింది.

## 1.4. వివాహం

తుమ్మేటి రఘోత్తమరెడ్డి 1984 వ సంవత్సరంలో, కరీంనగర్ జిల్లా మంథని మండలం ఒడేడు గ్రామానికి చెందిన రూపను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు తిలక్. హోటల్ మేనేజమెంట్ చదివి గతనాలుగేళ్ళుగా మాల్దీవులు—పిషెల్స్‌లో ఉద్యోగం చేస్తున్నాడు.

## 1.5. రైతుగా తుమ్మేటి

తుమ్మేటిది వ్యవసాయ కుటుంబం. పన్నెండు సంవత్సరాల వయస్సులోనే తండ్రి వెంట పొలాలు చూడటానికి వెళ్ళేవాడు. ఆ పొలాల చుట్టూ వున్న పరిసర ప్రాంతాలను చూసుకుంటూ ఉత్సాహంగా నడిచేవాడు. ఆ సమయంలోనే సృష్టి గురించి, ప్రకృతి గురించి సవాలక్ష ప్రశ్నలను వారి నాన్నను అడిగి తెలుసుకొనేవాడు. ఆయన ఓపికగా, హేతుబద్ధంగా తెలిసినకాడికి సమాధానాలు చెప్పేవాడు. చదువాగినాక జీవితంలో పని ఎంచుకోవాల్సిన దశ మొదలైంది. వీరిది వ్యవసాయ కుటుంబం కనుక సాగు మీద మోజు, ఒకానొక అనివార్యత కలిసి వ్యవసాయం చేయాలనుకున్నారు. హరిత విప్లవ ప్రభావం, యాంత్రీకరణ, పెరుగుతున్న పెట్టుబడులు—పెరగని ధాన్యం ధరలు, ముప్పయి ఎకరాల భూమి వున్న వీరికి వెయ్యి రూపాయల పెట్టుబడి దొరకని సమయమది. ఆ స్థితిలో వ్యవసాయాన్ని ప్రారంభించారు. చదువుతున్న చదువులో వెనకబడటం, ఉద్యోగం చెయ్యటం ఇష్టంలేక బయటకు

రావటం వల్ల వ్యవసాయమే తనపాటి వాడికి సరైన జీవనోపాధి అనుకొని రైతు జీవనంలోకి అడుగు పెట్టాడు. ఆయన వ్యవసాయంలో దిగడానికి కారణాన్ని ఈవిధంగా చెప్పారు. "వ్యవసాయం చేయడం తప్ప మరేది నాకు సరిపడదని నిర్ణయించుకున్నాను. అందులోనైతే ఎవడి పెత్తనం మన మీద వుండదు. ఎవడికి లొంగి ఉండాల్సిన అవసరం లేదు. వ్యవసాయాన్ని ఎలాగైతేనేమి తిరిగి నిలబెట్టాలనే గట్టి తలంపుతో వ్యవసాయంలోకి దిగాను" (రఘోత్తమరెడ్డి, 2006: 363). ఇలా తుమ్మేటి వ్యక్తిత్వం గమనించినట్లయితే బానిసత్వపు బతుకును నిరసించే స్వేచ్ఛాయుత జీవనానికి పగ్గాలు వదిలేశారు. కాబట్టే ఆయన కథల్లో కుడా శ్రమకు తగిన ఫలితం ఏది? శ్రమ జీవులకు సరైన వేతనాలు ఎక్కడ? ఎవరి జీవితాన్ని ఎవరు దోచుకెలుతున్నారు? అనే ప్రశ్నల ఆవేదన వెల్లడి అవుతుంది.

ఇక తుమ్మేటి అన్న అశోక్‌రెడ్డితో వ్యవసాయం ప్రారంభించారు. రోజంతా వ్యవసాయ పనులతో కష్టపడేవాళ్ళు. చిన్నప్పటి నుండి కష్టాలతో పెరిగిన తుమ్మేటికి వ్యవసాయ పనులు కష్టంగా ఏమనిపించలేదు. బాల్యం నుండి ప్రతి అంశాన్ని సునిశితంగా పరిశీలించే తుమ్మేటికి ఆర్థికంగా తమ కుటుంబం వెనకబడటం, నలుగురిలో తమ కుటుంబాన్ని ఒక ఉన్నత స్థాయికి తీసుకురావాలనే ఆశ పడేవారు. అందుకే వ్యవసాయాన్ని కొనసాగించి తాను అనుకున్న ఆశయాన్ని నెరవేర్చారు. "చిల్లకల్లంగా ఉన్న భూములను ఒక్క రేవుకు తేవడం – కొత్తగా నీళ్ళకోసం భూముల్లో బావులు తోడటం – కరెంటు మోటర్లు బిగించుకోవడానికి నానా యాతనలు పడడం ఇలాంటి విషయాల్లో మా అక్క సౌభాగ్యవతి ఆర్థిక సహాయం చేసేది. ఆ రోజుల్లో రోజంతా ఎంత కష్టం చేసే వాళ్ళమో అంతు లేదు. దున్నటం, నాట్లు తవ్వటం, కలుపులు, కోతలు, నూర్పిళ్లు అన్ని రకాల వ్యవసాయ పనులు నిర్విరామంగా చేసే వాళ్ళం. మా అమ్మ ఏనాడు పొందనంతా ఆనందం పొందింది. ఎప్పుడూ అనేది మనిషికి చేతి నిండా పనీ, కడుపు నిండా తిండీ, కంటినిండా నిద్రా ఉండాలి అని–వాటి మధ్య సమతూకం వుంటే మనిషి బాగుంటాడని" (రఘోత్తమ రెడ్డి, 2006: 363).

అలా తన రెండో అక్క సౌభాగ్యవతి చేసిన ఆర్థిక సహాయం వల్ల వ్యవసాయ పనులు సజావుగా నిర్వహించినా ఆశించిన ఫలితం దక్కక వ్యవసాయం భారమయ్యేది. అయితే ఎంత కష్టపడి పనిచేసినా,

ఎంత శ్రమపడి ధాన్యం పండించినా, వాటికి తగిన గిట్టుబాటు ధర రాకపోవడం, నిరాశతో రైతులు ధాన్యానికి నిప్పంటించుకుని ఆత్మహత్యలు చేసుకోవడం, తక్కువ రేటుకు మిర్చిని, ధాన్యాన్ని కొనుగోలు చేసే షావుకారుల మోసాలు చూసి సన్నకారు, చిన్నకారు రైతుల కళ్ళ నిండా నీళ్ళు గిర్రున తిరిగే సంఘటనలు ఇలా ఎన్నో ఆనాటి తెలంగాణ రైతాంగ జీవన విధానంలో రైతులు పడిన పాట్లు అంతా ఇంతా కాదని చెప్పాలి. దోపిడి దారుల దారుణాలు నాడు, నేడు, రేపు వుంటూనే ఉంటాయి. వాటికి స్పందించిన రచయితలెందరో సాహిత్యీకరించినా, సమస్యలకు పరిష్కారమార్గం మృగ్యమేనని చెప్పాలి. తుమ్మేటి రైతు జీవితాన్ని బాగా పరిశీలించినట్లయితే ఆనాటి తెలంగాణ రైతుల బాధలు, సమస్యలు మనకు స్పష్టమవుతాయి.

## 1.6. బొగ్గు గని కార్మికుడిగా తుమ్మేటి

వ్యవసాయంలో ఒడిదుడుకులు ఎదుర్కొన్న రఘోత్తం తీవ్రమైన పట్టుదలతో వ్యవసాయాన్ని కొనసాగించాలనుకున్నారు. కాని సరైన ఆదాయం లేకపోవడం వల్ల పెట్టుబడి కొరత ఏర్పడింది. దాన్ని పూరించడానికి ఆలోచిస్తున్న తరుణంలో బొగ్గుగని కార్మిక ఉద్యోగం కోసం పిలుపు రావడం జరిగింది. వ్యవసాయం కొనసాగిస్తున్న సమయంలో బొగ్గుగనిలో ఉద్యోగం వచ్చిందని బంధువు సమాచారం మేరకు గనిలోకి వెళ్ళడానికి నిశ్చయించుకున్నారు. కాని, వారి కుటుబంలో బొగ్గు గని కార్మికునిగా తట్టమోసే ఉద్యోగం నామోషిగా భావించే రోజులు. అలాంటి పరిస్థితుల్లో ఏది ఎలావున్న బొగ్గు గనిలోకి వెళ్ళడానికి రఘోత్తం నిర్ణయించుకున్నారు. ఒక ధృడసంకల్పంతో ధైర్యంగా గని జీవితాన్ని ప్రారంభించారు. తెలంగాణ రైతాంగం మొత్తం పొట్టకూటి కోసం వేరే ప్రాంతాలకు దార్లు వెతికే తరుణం. వారిలో తుమ్మేటి ఒకడై ఆనాటి సామాజిక స్థితిగతులకు ఎదురీది పోరాటం చేసినవారే.

తెలంగాణలో రాజ్య పరిస్థితుల వల్ల ఊళ్ళు బోసిపోయి, బొగ్గు గనుల్లో కార్మికులుగా మారిన రైతుల గురించి అందులో తానొకడు అయినా విషయాన్ని ఈవిధంగా వివరించారు. “తెలంగాణ జిల్లాల్లోని కూలి జనానికి ఎంతో ఆశ్రయంగా వున్న సింగరేణి బొగ్గు గనులు–1947 తరువాత దేశంలో

వేసిన పంచవర్ష ప్రణాళికలు, హరిత విప్లవాల ఫలితంగా భూములు వదలుకొని తెలంగాణ ప్రాంత రైతు బిడ్డలు కూడా నాలాగే కూలీలతో పాటు వలస రావడం 1980కి కొంచెం ముందే నుంచే ఉధృతమైంది” (రఘోత్తమరెడ్డి, 2006: 366). పైవిధంగా తెలంగాణ జన జీవన స్థితిని వాళ్ళబతుకు భారాన్ని గురించి వివరించారు. తుమ్మేటి బొగ్గుగని కార్మిక జీవితం ఆరంభించే ముందు ఈవిధంగా అంటాడు. “ఏదిఏమైనా నేను బొగ్గు గనుల్లోకి రావడానికి నిర్ణయించుకున్నాను. ఆనాడు నేను అనుకున్నాదల్లా ఒకటి వ్యవసాయానికి నెలనెలా కొంత పెట్టుబడి అందించవచ్చు. రెండు ఎనిమిది గంటల డ్యూటి ముగించుకుంటే నాకు ఇష్టమైన సాహిత్య వ్యాసంగం ప్రారంభించవచ్చు” (రఘోత్తమరెడ్డి, 2006: 367). అని అనుకున్న రఘోత్తం గోదావరి ఖనికి బొగ్గుగని కార్మిక ఉద్యోగానికి బయలుదేరారు. అలా ఆర్థికంగా చేదోడు వాదోడుగా వుండొచ్చు. తనకు నచ్చిన సాహిత్యాన్ని చదువుకోవడానికి అనుకూలమైన సమయాన్ని కేటాయించవచ్చునని ఉద్దేశ్యంతో గనుల్లోకి ప్రవేశించారు. బొగ్గుగని జీవితం ఆరంభించడం తమ తల్లిదండ్రుల అభ్యంతరం లేకుండానే సాఫీగా జరిగింది. ఆయన జీవితంలో అనుకోని సంఘటనగా ఎదురై, తన జీవితానికి తీవ్రమైన మార్పును తెచ్చి పెట్టింది ఆ రోజులే.

ఈవిధంగా తుమ్మేటి బొగ్గుగనుల్లోకి ప్రవేశించి అనేక విధాలుగా కష్టాలు అనుభవించారు. అక్కడి గనిఅధికారుల అహంకారానికి, దౌర్జన్యానికి బలైపోయారు. ఆ సమయంలో తానెందుకు వ్యవసాయపు జీవితాన్ని వదిలి బొగ్గుగని కార్మిక ఉద్యోగాన్ని చేపట్టానని తీవ్రంగా మధన పడేవారు. బానిసజీవితం కంటే బాధ్యతయుతజీవితమే మేలని భావించారు. ఒంటరితనంతో ఎవరితో కలవజాలని మనస్తత్వంతో గోదావరిఖని వీధుల్లో ఉన్మాదిలా తిరిగేవాన్ని అని తానే వాపోయాడు. ఏదేమైనప్పటికి ఆ బొగ్గుగని జీవితమే తనకొక కొత్త జీవితాన్ని ప్రసాదించిందని చెప్పాలి. ఎందుకంటే అక్కడ పరిచయం అయిన ఖలీల్ అనే మిత్రుడి సాన్నిహిత్యం అతనికెంతో మేలు చేసింది. అంతేకాదు, మానవ జీవిత మూలాలను, మనస్తత్వాలను, అంతర్గత సంఘర్షణలను బోధపడని వైరుధ్యాలన్నిటిని గురించి ఖలీల్‌తో చర్చించేవారు. ఈవిధంగా సాగేది అతని కార్మిక జీవితం. 1980లో గోదావరిఖనిలో సింగరేణి బొగ్గు

గనుల్లో బొగ్గుగని కార్మికుడిగా పని చేయడం ప్రారంభించి 2007లో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. 27 సంవత్సరాలు బొగ్గుగని కార్మికునిగా పనిచేశారు. ఆ క్రమంలోనే తాను చూసిన, అనుభవించిన, పూర్వపు రైతు జీవితాలను, కార్మికుల కష్టాలను, మానవ సంబంధాలను కథలుగా మలచి తెలంగాణ కథా సాహిత్యంలో అగ్రశ్రేణి కథకుడిగా పేరొందారు.

## 1.7. సాహిత్య ప్రవేశం

తుమ్మేటి సాహిత్యంలోకి ప్రవేశించడానికి అనేక సంఘటనలు కారణం అయ్యాయి. వేమన పద్యాల మీద ఆసక్తితో తెలుగు సాహిత్యంపై అభిరుచి పెంచుకున్నారు. వారు సాహిత్యంలోకి ప్రవేశించడానికి మొదట ప్రభావం చూపిన అంశాలు వారి గ్రామంలోని జానపద కళారూపాలు. సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతుంటే ఆసక్తిగా వెళ్ళి చూసేవారు. వెంకట్రాజం చెప్పిన ఆరె మరాఠీ కథలు, బుర్రకథ తుమ్మేటిపై ప్రభావం చూపిన మొదటి సాంస్కృతిక అంశం. ఆ తర్వాత ఈదెమ్మ కొలుపు కథ రెండో సాంస్కృతిక అంశం. తుమ్మేటి సాంస్కృతిక ప్రదర్శనల మీద ఆసక్తితో చిందు మాదిగ బాగోతాలు, గంటె బాగోతాలు, నాటకాలు మొదలైనవి ఊరురా తిరిగి చూసేవారు. చదువు నిమిత్తం తరగతి పుస్తకాల్లో వున్న బాలకథావళులు, బాలల బొమ్మల రామాయణ, భారత, భాగవతాలు, చిన్నయాసూరి పంచతంత్రకథలు, కాశీమజిలీకథలు మొదలైన పుస్తకాలను సమయం దొరికినప్పుడల్లా చదివేవారు. ఎవరితో కలవని ఒంటరి మనస్తత్వమే ఈ పుస్తకాలను తన చెంతకు చేర్చాయి. పై పుస్తకాలను చదవడమే కాదు వాటిలో చిత్రించిన ఘట్టాల గురించి, అంశాల గురించి, నిరంతరం మనస్సులో విశ్లేషణ జరపుకుంటూ వాస్తవిక మానవ జీవితానికి అన్వయం చేసుకోవడానికి ప్రయత్నం చేసేవారు. మానవజీవితాలకూ, సాహిత్య కళారూపాలకూ మధ్య వున్న సంబంధాన్ని తెలుసుకోవడానికి ప్రశ్నలను వేసుకొనేవాడు. “అట్లా నా మెదట్లోని ప్రశ్నలు వ్యక్తీకరణలో–జవాబులు వెతుక్కొనే కోసమో సాహిత్యం చదవాలనే కోరిక ఉద్భృతమైంది. తెలుసుకోవాలనే జిజ్ఞాసలోంచి నా ఆలోచనలు సరైనవో

కావో తేల్చుకోవాలనే పట్టుదల కలిగింది. అందుకు సాధనంగా సాహిత్యం రాయాలనే ఆసక్తి కలిగింది" (రఘోత్తమరెడ్డి, 2006: 362).

తన ఆలోచనాలకు, భావాలకు ఒక అక్షర రూపం పెట్టాలని, సాహిత్య సృజనకు పైఅంశాలు ప్రేరణగా నిలిచాయి. వ్యవసాయపనుల్లో ఉండటం మూలాన సమయాన్ని సాహిత్యానికి కేటాయించటం కుదిరేది కాదు. సాహిత్యాన్ని చదవాలని ఆసక్తి ఉండడం వల్ల, అది నేరవేరకపోవడం వల్ల ఎంతో ఆవేదనకులోను అయ్యారు. వీలున్నప్పుడు పాత సాహిత్య పత్రికలను కిలోల చొప్పున కొనుక్కొని చదివేవారు. ప్రతికూల పరిస్థతుల్లో కూడా సాహిత్యాన్ని చదవాలనే ఆశ కుంటుపడుతుందని భయపడేవారు. తుమ్మేటికున్న క్లిష్ట పరిస్థితుల్లో బొగ్గు గని కార్మికుల్లో ఒకడైన 'ఖలీల్' అనే మిత్రుడి సాన్నిహిత్యం వల్ల సాహిత్య సృజనకు బీజాలు పడ్డాయి. ఖలీల్ తుమ్మేటి వ్యక్తిత్వాన్ని గమనించి తనకు మార్గాన్ని నిర్ధేశించాడు. తుమ్మేటికి ఒక ఆలోచనా ధోరణిని నిర్ణయించాడు. ఖలీల్ గురించి తుమ్మేటి మాటల్లోనే... "జీవితానికి సంబంధించే కాదు. సాహిత్య సృజనలకు సంబంధించిన ఆలోచనలు కూడా ఒక పట్టాన తేలేవి కావు. ఆ రోజుల్లో మా గనిలో క్లర్కుగా పనిచేసే ఖలీల్ అనే మిత్రుడు పరిచయమయ్యాడు. అప్పటికి అతను కథలు రాసి, ప్రచురణ కాక విరమించుకున్నాడు. అచ్చుకాని అతని కథల్లో మనుషుల పట్ల దయ దాక్షిణ్యలుండేవి. ఆదిలో నేను రాసిన నా కథలన్ని మొదట వినేది చదివేది అతనే. అతను రాయడం విరమించుకుని నన్ను రాయమని ప్రోత్సహించాడు" (రఘోత్తమరెడ్డి, 2006: 367). ఆ విధంగా అయోమయంగా, అంతులేని ప్రశ్నలతో వున్న జీవితాన్ని సరైన దిశానిర్ధేశం చేసి అల్లం రాజయ్య దాకా ఎదగడానికి ఖలీల్ కారకుడయ్యాడని తుమ్మేటి చెప్పారు.

అంతేకాకుండా సాహిత్య రచన చెయ్యడానికి సరైన మార్గం కోసం కా.రా కథలను, కొడవటిగంటి కుటుంబరావు పుస్తకాలను ఇచ్చారు. వాటి వల్ల సాహిత్యంపై శాస్త్రీయ దృక్పథం ఏర్పరచుకోగలిగారు. కా.రా మాష్టారు 'యజ్ఞం', 'కుట్ర' కథలు చదివి తాను అనుభవించిన జీవితాన్ని అందులో చూసుకున్నారు. రఘోత్తం వ్యవసాయ జీవితానికి దగ్గరగా 'యజ్ఞం' కథ ఉంటే, వలస వచ్చిన పారిశ్రామిక జీవితం, బొగ్గుగని జీవితానికి దగ్గరగా 'కుట్ర' కథలు ఉన్నాయి. "నా బోటి వాడు గడిపిన

జీవితం సాహిత్యంగా రాయెచ్చుననే భరోసా కా.రా. మాష్టార్ కథలు కలిగిస్తే కుటుంబ రావు గారి వ్యాసాలు జీవితాన్ని ఏ దృక్పథం నుండి చూడాలో సాహిత్యానికి, జీవితానికి సంబంధం ఎలా వుండాలో చెప్పాయి" (రఘోత్తమ రెడ్డి, 2006: 368). అలా సాహిత్యంలో మానవ జీవితం, మనిషి స్థితిగతులు, రైతు, పేద, ధనిక, కష్ట సుఖాలు కూడా చిత్రించవచ్చని కాళీపట్నం రామారావు రచనలు చదువుకున్నాకే తుమ్మేటికి అర్థమైంది. చిన్నప్పుడు అవ్యక్తంగా అంతరంగాల్లో వున్న ప్రశ్నలు వేధిస్తుంటే, తను గడిపిన జీవితాన్ని సాహిత్యీకరించాలని ఆశ ఒకవైపు మథించేది. ఏదైనా రాసి తన భావాలను, బాధలను సమాజానికి వ్యక్తం చేయాలనీ, అతని మదిలోని ఆలోచనలకు ఒక రూపాన్ని యివ్వాలనీ సాహిత్య రచనకు పూనుకున్నారు. అలా సాహిత్య రచనాసక్తి కలిగాక భాష విషయంలో కొంత సంశయపడ్డారు. ఆ సమయంలో తన స్నేహితుడైన రమేశ్‌బాబు ఇచ్చిన అల్లం రాజయ్య 'కొలిమంటుకున్నది' నవల చదివి ఆశ్చర్యానికి లోనయ్యారు. మనం ఏదైతే వ్యవహారంలో వాడుతున్నామో ఆ భాషనే సృజనాత్మక రచనల్లో వాడుకోవచ్చని అర్థమైంది. అప్పటి వరకు భాష పరంగా వున్న భయాన్ని, జంకును వదిలిపెట్టారు.

ఒకవైపు 'కొలిమింటుకున్నది' నవల ప్రేరణ, మరోవైపు శ్యాంబెనెగల్ అంకుర్, నిశాంత్ సినిమాల ప్రభావం వల్ల ధైర్యంతో ఎక్కడో ఒకచోట రచన ఆరంభించటం మంచిదనుకున్నారు తుమ్మేటి. అలాగా మొదటి రచన 'నిరసన' అనే కథతో తుమ్మేటి సాహిత్య రచన మొదలైంది. అప్పటి నుండి ఇప్పటి వరకు (1981-1997) రాస్తున్న ప్రతి రచనలో తుమ్మేటి జీవితంలోని సంఘటనలు ప్రధానంగా ప్రతిఫలిస్తుంటాయి. తుమ్మేటి తెలంగాణ కథాసాహిత్యంలో విశిష్ట కథకుడుగా ఎదగడానికి ఎన్నో కారణాలు దోహదం చేసాయని చెప్పాలి. వాటిని స్థూలంగా మాత్రమే ఇక్కడ తెలుసుకోగలం (పరిశోధన పరిమితి దృష్ట్యా).

తుమ్మేటి సాహిత్య ప్రవేశం గురించి పలువురు సాహితీవేత్తలు, కథకులు ఈవిధంగా అన్నారు. "నాగేటి చాళ్ళలోంచి బొగ్గుపొరల్లోకి ఈడ్చబడ్డ జీవితం. ఒక్క ఉదుటున మారిన జీవితానుభావాలు సాహిత్యం గురించి నూతన ఆలోచనలకు పునాది వేశాయి. బాల్యం నుండి సామాజిక వ్యత్యాసాల పట్ల,

అసమానతల పట్ల పొందిన మానసిక వేదనలకు ఈ మార్పు అధనంగా చేరింది (సత్యనారాయణ, 2013: 90). పొలాల్లో గడపాల్సిన ప్రశాంతమైన జీవితానికి, భిన్నమైన పరిస్థితుల మధ్య గడపాల్సి వచ్చిన జీవితానికి మధ్య జరిగిన సంఘటనలకు రఘోత్తం రూపాన్నిచ్చే ప్రయత్నం చేశారని చెప్పాలి. ఈ రెండు జీవితాలకు వున్న బేధాలను స్పష్టంగా వ్యక్తం చేస్తాయి ఈయన కథలు.

“ముఖ్యంగా పల్లెల్లో మట్టిని తలకిందులుచేస్తూ, పచ్చని పంట పోలాల మధ్య స్వేచ్ఛగా జీవించాలనుకున్న కలల్ని, మొక్కల లేలేత చివుళ్ళ వంటి కలలను నిర్ధాక్షణ్యంగా నరికి వేయగా రఘోత్తం అనేక ప్రశ్నలతో సాహిత్యంలోకి ప్రవేశించాడు'' (రాజయ్య, 2013: 341). పచ్చని పోలాల్లో జీవించాల్సిన రఘోత్తం జీవితం సంఘర్షణాత్మకమైన కాలం వల్ల వలస జీవితానికి బాటకట్టి సాహిత్యంలో దూకేలా చేసింది.

“సమాజం ద్వారా అనుభూతి చెంది తన ఆచరణ ద్వారా నిగ్గు తెల్చుకొని, నిర్ధారణకు వచ్చి, చెప్పాలనుకున్న విషయాన్ని దశల వారిగా చెప్పారు. వాటిని ప్రపంచం కథలుగా ఆదరిస్తే, తాను మాత్రం అనుభవాలుగా, సహనుభూతులుగా స్వీకరిస్తాడు” (స్వామి, 2013: 92). బాల్యం నుండి వేధించిన ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కోగా, తన అనుభవంలోంచి, తను పరిశీలించిన అంశాలనే కథలుగా తీసుకున్నారు. స్థూలంగా చెప్పాలంటే తుమ్మేటి జీవిత నేపథ్యం ఆనాటి తెలంగాణ ప్రజల జీవన స్థితిగతులను తెలియచేసే ప్రధాన ఘట్టంగా అర్థం చేసుకోవచ్చు.

## 1.8. రచనలు

- ❖ 1981లో మొదటి కథ ‘ధిక్కారం’ (నిరసన పూర్వ నామం) ‘సృజన’ మాస పత్రికలో ప్రచురితమైంది. ఆ తరువాత 17 సంవత్సరాలలో వివిధ పత్రికలకు (1981–97) ‘ధిక్కారం’ నుండి ‘హంతకులు’వరకు కథలు, ‘నల్లవజ్రం’ అనే నవలికను రాశారు. వాటన్నిటిని కలిపి ఎన్. వేణుగోపాల్ సంపాదకత్వంలో “తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు” అనే పుస్తకాన్ని విరసం వారు (విప్లవ రచయితల సంఘం, ఆంధ్ర ప్రదేశ్) 2006లో ప్రచురించారు.

- ❖ బండమీది బతుకులు(అల్లం రాజయ్యతో కలిసి రాసిన నవలా రచన)
- ❖ నల్లవజ్రం (బొగ్గు కార్మిక జీవితానికి సంబంధించిన నవల)
- ❖ ఆధునిక జానపద కథలు
- ❖ సాహితీ సౌరభాలు (స్మృతులు)
- ❖ ది సీట్ (2009 లో వచ్చిన రెండున్నర నిమిషాల ఫీచర్ ఫిల్మ్)
- ❖ తుమ్మేటి చెప్పిన ఆశు కథలు 2009లో వచ్చాయి.ఇవి కెమెరా ముందు ఆశువుగా చెప్పిన కథలు. ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో వినూత్న ప్రయోగం. ఈ కథలు ఇంటర్నెట్ (అంతర్జాలంలో) **www.thummetikathulu.blog.spot.com**లో, మార్కెట్‌లో డివిడి రూపంలో లభ్యమైతాయి.
- ❖ "జీవించు–నేర్చుకో–అందించు" అనే పుస్తకం స్వతంత్ర కోట్స్ రచన 2011లో వచ్చింది. గత 5 సంవత్సరాలుగా ఈ రచన కొనసాగుతూ దిన దిన వృద్ధి చెందుతూ నేటికి 11,500 కోటెషన్స్‌తో 3 సంపుటాలను ఎమెస్కో వారు 2015లో ప్రచురిస్తున్నారు.

## 1.9. తుమ్మేటి రచనల మీద వచ్చిన విమర్శ

తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన కథల మీద చాలా చర్చ జరిగింది. ఆయన రాసిన "పనిపిల్ల" కథ మనందరికి సుపరిచితమే. ఆ కథపై జరిగిన చర్చ మాములు స్థాయిలో లేదు. తెలుగు కథా సాహిత్యంలో "యజ్ఞం" కథ పై జరిగిన చర్చ తరువాత అంతటి స్థాయిలో మళ్లీ చర్చకు పురిగొల్పిన కథ "పనిపిల్ల". ఈ కథపై జరిగిన చర్చంతా మట్టి ముద్రణలు–ఆలగడప (నల్గొండ)–వేనేపల్లి పాండు రంగారావుగారు, ఠాకూర్ రాసింగ్ సంపాదకత్వంలో పుస్తకంగా 2003లో ప్రచురించారు.

కేవలం పనిపిల్ల కథపైనే కాదు. అతని మిగతా రచనలపై వచ్చిన విశ్లేషణలు, వ్యాసాలు, సమీక్షలు, విమర్శలు అన్నిటిని కలిపి **'ఒక కథకుడు నూరుగురు విమర్శకులు'** అనే పుస్తకాన్ని 2013లో తుమ్మేటి ప్రచురించారు.

## 1.10 అవార్డులు

1. రాచకొండ విశ్వనాథశాస్త్రి పేరు మీదుగా "రాచకొండ రచనా పురస్కారం" 6000 వేల రూపాయలు 2007లో తుమ్మేటి పొందారు. ఈ పురస్కారానికి సంబంధించిన డబ్బుని "2006 – తెలంగాణ కథ" కోసం సంపాదకుడు కర్ర ఎల్లారెడ్డి గారికి ఇచ్చారు.
2. మధురాంతకం రాజారాం పేరు మీదుగా ఇచ్చే "కథాకోకిల పురస్కారం" అయిదు వేల రూపాయలను 2007లో అందుకున్నారు. ఈ అవార్డుకి సంబంధించిన డబ్బుని "శ్రీకాకుళ సాహితీ" వేసిన "వేగావతి కథలు" 2014కు తుమ్మేటి ఇచ్చారు.
3. 2012లో ''యుగళ్ల ఫౌండేషన్ – శ్రీకాకుళం'' వారి నుంచి ఇరవై వేల రుపాయలను పొందారు.
4. లో 2012"రాష్ట్ర కథా నిలయం" నందలూరి వారి ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి పేరు మీదుగా ఇచ్చే రూపాయల అవార్ 5000డుని తుమ్మేటి పొందారు.

పై 3,4 అవార్డులకు సంబంధించిన డబ్బుని 25,000 "ఒక కథకుడు – నూరుగురు విమర్శకులు'' అనే పుస్తక ప్రచురణ కోసం ఉపయోగించారు.

## 1.11 రఘోత్తమరెడ్డి వ్యక్తిత్వం

సమాజంలో భిన్నమైన మనస్తత్వాలు కలిగిన వారుంటారు. ఒక్కొక్కరది ఒక్కొక్క రకమైన వ్యక్తిత్వం. సామాన్య ప్రజల కన్నా రచయితలు, కవులు సమాజం పట్ల, ప్రజానీకం పట్ల ప్రత్యేక దృష్టిని కలిగి వుండి విశిష్టమైన వ్యక్తిత్వం కలిగి వుంటారు. అందుకే వారు మిగతావారి కంటే ప్రత్యేకమైన గుర్తింపు పొందుతారు. వారి రచనల ద్వారా ప్రజల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. అలాంటి ఉత్తమ రచయితలలో రఘోత్తమరెడ్డి ఒకరు. వీరి జీవితాన్ని, కథలను చదివిన ప్రతి ఒక్కరం ఆయన రచనల ద్వారా ఆయన వ్యక్తిత్వాన్ని అంచనా వేయగలం.

చాలా మంది రచయితలు తాము రాసే రచనలకూ, తమ జీవితాలకు పొంతన లేకుండా రాస్తారు. ఒకవేళ తమకు బాగా పరిచయం లేని విషయాలను గురించి రాసినా, వారి బాహ్య జీవితంలోకి వచ్చేసరికి పూర్తి భిన్నంగా ప్రవర్తిస్తారు. కాని రఘోత్తం విషయంలో ఇది పూర్తి భిన్నంగా ఉంటుంది. తాను చిత్రించే జీవితం గురించి పూర్తి అవగాహన తెచ్చుకున్నాకే రాసే ప్రయత్నం చేస్తారు. అలా రఘోత్తం సాధారణ మనిషిగా ఉండి అసాధారణ వ్యక్తిత్వం కలిగిన రచయితగా ఎదిగారు. సమాజంలో తాను జీవిస్తున్న క్రమంలో ఎదురైన అసాధారణ జీవితాలు, విలక్షణమైన వ్యక్తిత్వాలను, విభిన్న సంఘటనలను కథలుగా రాసారు. బాహ్య జీవితంలో, కార్యచరణలో నిలిచిన వాస్తవికతను నిజాయితీతోనే కథల్లో ప్రవేశపెట్టారు. రఘోత్తం ఉత్తమ వ్యక్తిత్వం కలిగిన వారు. మృదు స్వభావి. అంతకు మించి నిజాయితీ పరులు. అతని నిజాయితీ గురించి రామశంకర్ గారి మాటల్లో... "బొగ్గు గనిలో కిలోమీటర్ల కొద్ది నడచి, దుమ్ము, ధూళి, చీకట్లో పెనుగులాడి జీవం లేని శరీరంతో వచ్చే ఉద్యోగం చేసే రఘోత్తంరెడ్డి రాసే ప్రతి అక్షరం ఒక శ్వాస లాంటిదే ఎంతో గంభీరంగా ప్రవహించే గోదావరి లాగే ఆయన స్వభావం కూడా రాసే రాతలకు, చేసే చేష్టలకు పొంతని ఉండని రోజుల్లో రఘోత్తమరెడ్డి నిజాయితీ చూస్తే భయమేస్తుంది. నిజాయితికి, ధైర్యానికి, నిజమైన జీవనానికి ఆయనో మచ్చు తునక. ఆయన జీవితం లాగే ఆయన కథల్లో కూడా ఎంతో నిజాయితి కనిపిస్తుంది" (రామ శంకర్, 2013: 97)

బాల్యం నుండి గడిపిన ఒంటరి జీవితం ఒకవైపు, తనను వేధిస్తున్న భిన్నమైన, అవ్యక్తపరిచే ప్రశ్నలకు సమాధానాలు వెతుక్కునే ఆశ మరోవైపు అతనిని తీవ్ర సంవేధనకు గురిచేసాయి. అందుకే రఘోత్తం సాహిత్యాన్ని ఆశ్రయించి ఆ ప్రశ్నల అలజడి నుండి తప్పించుకునే ప్రయత్నం చేసారు. వాటి ప్రతిఫలనమే ఆయన రాసిన సాహిత్యం. "రఘోత్తమరెడ్డిలో మితిమీరిన సంవేదనాశీలత ఉన్నది (అని నేను అనుకుంటాను) మితిమీరిన సంవేదనాశీలతా అంటే తేలికగా తీసుకోదగిన కొన్ని అంశాలకు తీవ్రంగా స్పందించటం. చాలా చోట్ల "నా ఒంటరితనం" అంటాడు. అతడెన్నడూ ఒంటరి వాడు కాడు. కుటుంబంలో అందరి పట్ల అతనికి ప్రేమే. ముఖ్యంగా తల్లిదండ్రి, చెన్నైలో చదువుకుంటున్న తన

కొడుకు పట్లఅతనికి గల ప్రేమ మా ఫోన్ సంభాషణల్లోనే వెలువడుతుంది. ఒంటరితనంతో బాధపడిన కాలంలో అంటే భావసామ్యత గల మిత్రులెవరో అతని కంపెనీలో లేనప్పుడుఅని భావం. ఆ భావ సామ్యత కారణంగానైనా అటో ఇటో అయినప్పుడు మిత్రులకు దూరమై మళ్ళీ ఒంటరి వాడవుతాడు. అతనిలో రసార్ధ్రమైన హృదయమున్నది. (అందుకే సంగీతం పట్ల అంతటి అనురక్తి) ప్రేమ ఉన్నది మానవత ఉన్నది. అతడు జన్మించిన కాలము, ప్రాంతము అతనిలో మితిమీరిన సంవేదనశీలతను కలిగించాయి. అది అతని కథల్లో కనిపిస్తుంది" (సదాశివ, 2013: 334).

అంతే కాదు రఘోత్తం పూర్వం గడిపిన జీవితాన్ని తరచి తరచి చూస్తూ అయా జీవితాలు అలా ఉండడానికి కారణాలు ఏమిటో వెతుక్కోనే క్రమంలో ఆయన హృదయం పూర్తి సంఘర్షణలకు లోనైంది. ఆయన చుట్టు వున్న ప్రపంచంలో జీవితాల గురించి తీవ్రంగా మదనపడేవారు. వాటి ములాల అన్వేషణకై ఆలోచనలో పడేవారు. బొగ్గుగనుల్లో తన తోటివారి కష్టాలను, బాధలను, అవస్థలను కథల్లోకి ఎక్కించి గనికార్మికుల బాధలను సమాజానికి తెలియజేసిన మహోన్నత రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి. "ఫ్యూడల్ ఉత్పత్తి సంబంధాలలోని, భావజాలంలోని ఇమడని అనేక మంది గ్రామీణ యువకుల్లాగే రఘోత్తం కార్మిక ప్రాంతానికి వలస వచ్చాడు. ఇక్కడ తను కోరుకుంటున్న అచ్ఛమైన, సృజనాత్మకమైన, కళాత్మకమైన జీవితం కోసం, మనుషుల కోసం, విలువల కోసం పరితపించాడు. ఈ తీవ్రమైన అన్వేషణ మూలకంగా అనేక యుద్ధాల్లోకి నెట్టబడినాడు" (రాజయ్య, 2013: 342).

బొగ్గుగనుల్లో కార్మిక సమస్యలను ఎదురించడానికి ఎన్నో ఉద్యమాల్లో స్వయంగా పాల్గొన్నారు. ఎంతో మంది బొగ్గుగని మిత్రులతో పనిచేసి వారి స్నేహాలను పొందారు. అంతేకాకుండా కార్మికులు, అధికారుల జులుంలో వారి బానిస బతుకులు, అసౌకర్య పరిస్థితులు, బొగ్గుగని కార్మికుల కనీస అవసరాలైన ఇళ్లు, నీళ్ళ కోసం చేసిన పోరాటాలను, గనికాలరీలోని వాతావరణాన్ని, గనుల్లో గరిమి (వేడి) జీవితాన్ని అలా తాను చూసిన ప్రతి అంశాన్ని చూసినది చూసినట్టుగా వర్ణించి పాఠకులకు కథను దృశ్యరూపంలో అందించారు. "విప్లవకథ మూలతత్వాన్ని, దానిలో మెళుకువలని బాగా

ఆకళింపు చేసుకున్న రఘోత్తం గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. జీవితంలోని ఒత్తిడి, రాపిడి రఘోత్తమ్ స్వానుభవంలోనివి. మానవ సంబంధాల్లో వుండే సంఘర్షణ, సంక్లిష్టత అతనికి కొట్టిన పిండి. కార్మికుల బతుకుల్ని కళ్ళకు కట్టినట్టు చిత్రించగలడు. వాళ్ల అంతరంగాల్లో పెనవేసుకు పోయిన చిక్కుముడుల్ని ఒడుపుగా విప్పగలడు. కొన్ని కథల్లో అతను చేసిన విశ్లేషణ నిశితంగా పరిశీలిస్తే ఇది అతనికి మాత్రమే సాధ్యం అనిపిస్తుంది" (కృష్ణబాయి, 2013: 327 ).

రఘోత్తం తన పరిధిలో వున్న జీవితాల గురించి స్పష్టమైన అవగాహన వున్నవారు. అందుకే ఆయన జీవితాల్లో స్వచ్ఛమైన ప్రేమ, ఆప్యాయతలను, మానవ సంబంధాలను ఆశించారు. దోపిడి వ్యవస్థ నుండి విముక్తి కావడానికి కావాల్సిన చైతన్యాన్ని అందించారు. "జీవితంపైన ప్రేమ, విచ్ఛిన్నమైపోతున్న మానవ సంబంధాన్ని గురించి ఆవేదన, జాలి, తపన, సహానుభూతి జీవితాన్ని గురించి పూర్తి అవగాహన ఉంటే తప్ప రచయిత కలం నుండి ఇటువంటి కథలు రావడం కష్టం. స్వభావరీత్యా బిడియస్తుడనిపించే రఘోత్తమరెడ్డి రచయితగా గొప్ప ధైర్యవంతుడు, పోరాట గాథల్ని సైతం కంటనీరు తెప్పించేంత ఆర్ధ్రంగా రాసిన మృదు స్వభావి" (వరలక్ష్మి, 2013: 370).

గనుల్లో చిద్రమవుతున్న జీవితాల గురించి సానుభూతితో మాట్లాడే రఘోత్తం రాత విషయానికొస్తే పోరాట, ఉద్యమాల ఆవశ్యకతను తెలిపాడు. తక్కువ కథల ద్వారా ఎంతో మంది సాహిత్య అభిమానుల్ని సంపాదించిన రఘోత్తం అవార్డులకి, బహుమతులకు అమడంత దూరంలో ఉంటారు. సత్యాన్ని వాస్తవికంగా చెప్పాలనుకోవడమే రఘోత్తం ఆకాంక్ష. "రఘోత్తం ఏది చెప్పినా అబద్ధం చెప్పడు. అతనికి చేతకాదు. అతనికి కీర్తి కాంక్షలేదంటే సరిపోదు, కీర్తికి దూరంగా పారిపోతాడు. ఎవరో అన్నట్లు, ఎవరో చెప్పినట్లు అతడు చప్పట్లు కొట్టించుకోనే వ్యామోహంలో ఏదీ రాయడు" (సదాశివుడు, 2013: 334). అభూత కల్పనలతో కథలు రాసి పాఠకులను మభ్యపెట్టడం కన్నా, వాస్తవిక సంఘటనలను కథలుగా రాసి సామాజిక బాధ్యత గల రచయితగా నిలవడం రఘోత్తం లక్ష్యం.

## 1.12 తుమ్మేటి రచనా దృక్పథం

తుమ్మేటి తన జీవిత దశల్లోని జరిగిన వాటినే ఒక్కొక్క కథగా రాశారు. వాటిని అనుసరిస్తూనే అతని రచనా దృక్పథం తెలుసుకోవచ్చు. తుమ్మేటి మొదటగా రైతు జీవితాన్ని, ఆ తర్వాత గనికార్మిక జీవితాన్ని అనుభవించారు. తన అనుభవంలోని విషయాలకు రూపమే ఆయన సాహిత్యం. భౌతికాంశాలను వాస్తవిక దృష్టితో చూసి శాస్త్రీయ దృక్పథంతో రచనా సాహిత్యాన్ని సృజించారు. మొదటిగా రాసిన రచనల్లో సామాన్య ప్రజానీకాలపైన, పేద ప్రజలపైన ప్రభుత్వ పరిపాలన విధానంలో చితికి పోతున్న రైతుల పరిస్థితిని వివరిస్తూ కథలు రాసారు. అటు తర్వాత బొగ్గు గనికార్మికులుగా గోదావరిఖనికి వలస వెళ్ళి అనుభవించిన జీవితాల్ని కథల్లో చిత్రించారు. బొగ్గు గనుల్లో అనూకులంగా లేని పరిస్థితులు, అక్కడ గని అధికారుల నిరంకుశ పోకడలు, వలస వచ్చిన బొగ్గు గని కార్మికులు తమ కనీస అవసరాల కోసం చేసే పోరాటం, కార్మికుల కుటుంబాల్లో కలతలు, అపోహలు, విచ్ఛిన్నం అవుతున్న మానవ సంబంధాలు ఇలా తనకు ఎదురైన ప్రతి సంఘటనను కథలుగా రాశారు. 1990–97ల మధ్య తుమ్మేటి రాసిన కథల విషయానికొస్తే, పరిణితి చెందిన రచయితగా కనిపిస్తారు. తుమ్మేటి రచనా దృక్పథం గురించి వల్లంపాటి ఈవిధంగా అన్నారు. "రఘోత్తమరెడ్డి తొలి కథలు (1981 – 86 మధ్య కాలంలో రాసినవి) చదివి నాకు ఎంతో సంతోషమూ, విచారమూ ఒకేసారి కలిగాయి. ఆశ్చర్యకరమైన రచనాశక్తి, తాను చిత్రిస్తున్న జీవితాన్ని గురించి లోతైన అవగాహన, దానికి తగిన పురోగామి దృక్పథమూ రచయితకు ఉండడం నాకు ఎంతో సంతోషాన్ని కలిగించింది. కొ.కు, చా.సో, రావి శాస్త్రి, కా.రా. ల నుంచి కొత్త కథల్ని ఆశించే అవకాశాన్ని పోగొట్టుకొని దిగులుగా ఉన్న నాలాంటి కథాభిమానుల్లో ఆశ రగిలించిన ఆనాటి కొద్దిమంది యువ రచయితల్లో రఘోత్తమరెడ్డి ముఖ్యుడు" (వెంకటసుబ్బయ్య, 2013: 335)

రచయితగా తుమ్మేటి జీవితంపై కలిగిన అవగాహన విస్తృతిని హరగోపాల్ గారి మాటల్లో "రఘోత్తమరెడ్డి తానుకథ రాద్దామనుకున్న దాన్ని చాలా లోతుగా చూస్తాడని, మానవ సంబంధాల్లో, విలువల్లో ఉద్యమాలు తీసుకువస్తున్న ఘర్షణను సంక్లిష్టంగా, ప్రతిభావంతంగా చిత్రిస్తాడని ఈ కథలు

చదివితే ఎవరికైనా తెలుస్తుంది" (హరగోపాల్, 2013: 325). రఘోత్తం తన చుట్టూ వున్న జీవితాలను గమనిస్తూ వాటిలో ఏదైతే విలక్షణంగా తన మానసిక ప్రపంచాన్ని కుదిపేసేలా ఆలోచింపచేస్తుందో వాటికి మాత్రమే పరిమితమై కథలు రాసారు. సాధారణ జీవితాలకు ప్రలోభాలకు గురి కాకుండా విశిష్టమైన అంశాలని చిత్రించడానికి ప్రయత్నం చేసారని 17 వ సంవత్సరాల పాటు రాసిన 22 కథల్లో ఏ కథను చూసినా అర్ధమవుతుంది. "తన చుట్టూ విస్తరించి ఉన్న జీవితం పట్ల, తన జీవితం గురించి, తను ఏర్పరుచుకున్న దృక్పథం గురించి రఘోత్తమ్‌కు భ్రమలు లేవు. వ్యక్తుల వ్యక్తిగత ప్రవర్తన అనే సూక్ష్మ దర్శిని ద్వారా సామాజిక జీవితాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేసాడు. తన నేపథ్యంలో వివరించినట్లుగా సాధారణ జీవితానికి భిన్నంగా వ్యక్తమయ్యే ప్రతి విశేషం అతన్ని ఆలోచింపచేసాయి" (రాజయ్య, 2013: 342). రఘోత్తమరెడ్డికి మానవ జీవితాలని మాత్రమే కాదు. ఏ అంశాలనైనా తీవ్రమైన నిశిత దృష్టితో పరిశీలించే తీక్షణ స్వభావి. ప్రపంచీకరణ, సామ్రాజ్యవాదం, పెట్టుబడులు అవి అందించే ఫలితాలు కరువై పోతున్న ప్రజల చైతన్యం, సమిష్టి పోరాటాలు వల్ల సాధించే ఫలితాలు ఇవన్ని ఆయా భౌతిక దృక్పథం ఆయా కాలాలనుసరించి సాహిత్యంలోకి ఎక్కించారు. కరువు వల్ల రైతులు గనుల్లో కార్మికులుగా చేరవల్సి రావడం, పచ్చని పొలాల నుంచి గరిమి గనుల్లోకి విస్తరించిన వారి జీవితాల నేపథ్యాలను చూసి రఘోత్తం కథలుగా రాసారు. "భూగర్భంలో పొరలు పొరలుగా అల్లుకున్న బొగ్గు గుట్టలను చెమ్మసుతో తోడినట్టే, మానవ సంబంధాలలో పొరలు పొరలుగా విస్తరించే అనేక ఉద్వేగాలను నువ్వు కలంతో తవ్వి కథలు కుప్పలు పోసినట్టు అనిపిస్తుంది" (వేణుగోపాల్, 2013: 350). వేణుగోపాల్ అన్నట్లు బొగ్గు గనుల్లోనే నలిగి పోతున్న కార్మిక జీవితాలను, వారి సమస్యలను సాహిత్యానికి, ప్రజానీకానికి తెలియజేయడం కాక తాను ఆశించిన ఫలితం కార్మికుల ఉద్యమాల్లో చోటు చేసుకోవడం జరిగింది. ఏ కథలు సాధించని ఫలితాలు ఈ కథలు సాధించడం రఘోత్తంను ఒక మంచి కథకుడిగా నిలబెట్టాయి. రఘోత్తం ఒక్కో కథల్లో ఒక్కో కథాసంవిధానంతో తనదైన దృక్పథాన్ని వెల్లడించారు. దోపిడి వ్యవస్థ తిరస్కరణను సారని పాత్ర ద్వారా, దొరలకు ఎదురు తిరగడాన్ని బాలయ్య పాత్ర ద్వారా, మానవ సంబంధాల ఐక్యతను

ఆశిస్తూ రాజవ్వ పాత్ర ద్వారా, గనిఅధికారుల జులుం ఎదురుకోవడాన్ని మల్లేశం పాత్ర ద్వారా, కార్మికులను సంఘటిత పరిచడాన్ని మల్లేశును పాత్ర ద్వారా వ్యక్తీకరించాడు. ఇలా ప్రతి కథలో తనదైన దృక్పథాన్ని కలిగి వుండి పాఠకులు ఆశించే విధంగా కథాలక్ష్యాన్ని సాధించారని చెప్పాలి. "రఘోత్తం రచనాధోరణిని గమనిస్తే ఒక విషయం బోధపడుతుంది. తన అనుభవంలోకి ప్రత్యక్షంగా కాని, పరోక్షంగా కాని రాని విషయాలను అతను కథీకరించడు. స్వీయ అనుభవాలని, సహానుభూతిని ప్రదర్శించగల విషయాన్ని కథలుగా మలచాడు" (స్వామి, 2013: 101).

## 1.13 తెలంగాణ కథా సాహిత్యంలో తుమ్మేటి స్థానం

రఘోత్తం సాహిత్యరంగంలో అడుగు పెట్టేనాటికి సమాజంలో ఎన్నో వైషమ్యాలు, అన్యాయాలు, అధర్మాలు, అవినీతి స్పష్టంగా ఆయన కళ్ళముందు కనిపించినవి. వాటిని సృజించడం ఆ కాలంనాటి రచయితలకున్న సామాజిక బాధ్యత. అలా సహజంగా పుట్టి పెరిగిన వాతావరణం తుమ్మేటిని సాహిత్య రచనకు ప్రేరేపించాయి. అప్పట్లో ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఎన్నో భయంకర ఉద్యమాలు లేవనెత్తిన కాలం. అరసం, విరసం కవులు, రచయితలు విపరీతంగా సాహిత్య రచన చేసేవారు. అలాంటి రచయితలను మనం చూసినట్లయితే కా.రా, వరవరరావు, శివారెడ్డి, జ్వాలాముఖి, శివసాగర్, అల్లం రాజయ్య, బి. యస్. రాములు మొదలగు కవులు, రచయితలు సమాజంలో గల వైరుధ్యాలను తమ కలాలతో ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని నిలిపే ప్రయత్నం చేశారు. అలా వారి ప్రభావం వల్ల కొంత, తన జీవన స్థితిగతుల నుండి కొంత ప్రేరణ పొంది సామాజిక బాధ్యత కలిగిన వాస్తవిక రచయితగా ఎదిగిన వారు తుమ్మేటి రఘోత్తమరెడ్డి.

నాటి తెలంగాణ సమాజాన్ని, రాజకీయ రంగాన్ని మాత్రమే కాదు. రైతు, కార్మిక జీవితాలను వారి కష్టనష్టాలను, ఉద్యమ ఫలితాలను, కుటుంబ సంబంధాలను కళ్ళకు కట్టించేలా కథలు రాసారు. తుమ్మేటిని ఒక వ్యక్తిగా నిలబెట్టినవి ఆయన కథలే అని చెప్పాలి. తుమ్మేటి కథాసృజన కారుడే కాదు. మంచి పఠన ప్రియుడు కూడా ప్రాచ్య, పాశ్చాత్య కథా రచయిత లెందరో ఆయనకు పఠనం ద్వారా

పరిచయం. వాళ్ళ రచనల్లోని సారాన్ని బాగా ఆకళింపు చేసుకున్నారు. వారిలో టాలిస్టాయ్ ఒకరు. ఎన్నో పాశ్చాత్య రచయిత రచనలు చదివి వాటిలోని నైపుణ్యతను పట్టుకున్నారు. అందుకే ఆయన కథల్లో కథాకథన మార్గం అసామాన్యమైంది. రఘోత్తం ఒక్కో కథ రాయడానికి ఎంతో వ్యవధిని తీసుకునేవారు. తుమ్మేటిది ఏ రచయితలో ఇమడని నూతన కథన పద్దతి అని చెప్పాలి. దీనికి అతని కథల్లో వర్ణనలు తార్కాణాలు. సామాజిక, రాజకీయ, వైయక్తిక స్థితిగతుల అవగాహనతో సమకాలీన జనజీవితాల వంటి ఇతివృత్తాలు ఎన్నుకొని సజీవమైన పాత్రల్ని సృష్టించి, సజీవమైన భాషతో పలికిస్తూ కథన శిల్పంలో అనేక మెళుకువలు చూపిస్తూ సుమారు 2 దశాబ్దాలు కథాసాహిత్యరంగంలో కేవలం 22 కథలతో ఎక్కువ పేరును, కీర్తిని గడించారు. అంటే వారి కథల్లో సారమేమిటో, గాఢతెంతో మనకు అవగతమవుతుంది. తెలంగాణ కథాసాహిత్యంలో అల్లం రాజయ్య కుడిభుజం లాంటి వారైతే, తుమ్మేటి రఘోత్తమరెడ్డి ఎడమ భుజం లాంటివారని ఎమ్. రామశంకర్ అభిప్రాయం. వీరిరువురు ఆనాటి తెలంగాణ చరిత్ర, పరిస్థితులను తమ కథల్లో సమగ్రంగా చిత్రించారనడం సత్యదూరం కాదు. జీవితాన్ని అర్థం చేసుకునే క్రమంలో మానవ జీవనాడిని పట్టుకొని వాస్తవికతకు దూరంగా వెళ్ళకుండా సమకాలీన సామాజిక సమస్యలనే కథా వస్తువుగా ఎన్నుకొని, భాషలోనూ, భావంలోనూ, తెలంగాణ మాండలిక శక్తిని యుక్తితో ప్రయోగిస్తూ తెలంగాణ కథాసాహిత్యంలో గొప్ప కథలు అందించిన వాస్తవిక కథా రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి.

# అధ్యాయం – ౨

# తుమ్మేటి రఘోత్తమ రెడ్డి కథలు – వస్తువైవిధ్యం

తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన కథల్లో వస్తు వైవిధ్యం పుష్కలంగా ఉంది. ఆయన జీవిత పరిణామాల్లోని సంఘటనలే కథలుగా రూపొందిన క్రమానికి, ఆయా కథల్లోని కథావస్తువులకు ఎంతో గాఢమైన సంబంధం కలదని వస్తు విశ్లేషణ వల్ల తెలుస్తుంది. 1980–90 దశాబ్దానికి తెలంగాణ ప్రాంత ప్రజల జీవన స్థితులను, సింగరేణి కార్మిక జీవితాలను ఎంతో సమర్ధవంతంగా తుమ్మేటి కథల్లోకి చిత్రించారని తెలుస్తుంది. అలాంటి కథలను, కథల్లో ఉన్న వస్తువును వర్గీకరించి, విశ్లేషించి, విపులంగా చర్చించడం ఈ ఆధ్యాయం ముఖ్యోద్దేశం.

## 2 పరిశోధనకు స్వీకరించిన కథలు

తుమ్మేటి రాసిన కథల్లో విషయ పరిధి, కాల పరిమితి దృష్ట్యా 1980–90ల మధ్య వచ్చిన కథలను మాత్రమే నేను పరిశోధనకు స్వీకరించాను. కింది పట్టికలో వాటిని ఇచ్చాను.

| **కథలు** | **ప్రచురణ పత్రిక, సంకలనం, కాలం** |
|---|---|
| ధిక్కారం | సృజన, మే (1981) |
| సవారీ – 1 | సృజన, నవంబర్ (1981) |
| ఒక్కటైతే.. ? | సృజన, డిసెంబర్ (1981) |
| నీళ్ళతగువు | సృజన, (1982) |
| పగలూ రేయి శ్రమ పడుతున్నా.. | ప్రజాసాహితి, జూన్. జూలై (1984) |
| సవారీ – 1 | సృజన, అక్టోబర్ (1984) |
| ఇల్లు | సృజన, (1984) |

| | |
|---|---|
| ఓ మెరుపు మెరిసింది | స్వాతి, అగస్టు (1985) |
| ఈ భూమి ఎవరిచ్చిను | అరుణతార. నవంబర్ (1985) |
| పురుడు | నల్లకలువలు, సెప్టెంబర్ (1988) |
| పెండ్లి | నల్లకలువలు, సెప్టెంబర్ (1988) |
| పట్టు | నల్లకలువలు, సెప్టెంబర్ (1988) |
| శత్రువు | నల్లకలువలు, సెప్టెంబర్ (1988) |
| వాల్‌పోస్టర్ | సృజన, (1990) |
| నా పాత స్నేహితుడు | సృజన, (1990) రచన – 1985లో |
| వేటగాడి చూపులు | సృజన, మార్చి(1991) రచన – 1985లో |

## ౨.1 వస్తువు

ఆయన కథలను పరిశీలించే ముందు సాహిత్యంలో వస్తువు అంటే నిర్వచనాలు తెలుసుకోవడం మంచిదని కింద ఇవ్వడం జరిగింది.

"నిగూఢ బీజస్థితి నుంచి వెలికి వచ్చిన విషయాంకురం కథావస్తువు" (దక్షిణమూర్తి, 1988:239). రచయిత సమాజంలో తాను జీవించిన పరిస్థితుల్లో ఏదో విలక్షణమైన కొన్ని సంఘటనలు చూసినపుడు ప్రతిస్పందించిపోయి వాటికి ఒక రూపాన్ని ఇవ్వాలనుకుంటాడు. వాటి మూలాలను అన్వేషించి సృజనాత్మకంగా, కళాత్మకంగా చిత్రించే ప్రయత్నం చేస్తాడు. అలా రచయిత చిత్రిస్తున్న సంఘటనల మూల రూపమే వస్తువు అవుతుంది. "ఒకానొక దృగ్విషయంలో ప్రత్యేకంగా, నియమబద్ధంగా ఉన్న మూలకాలు, క్రమ విధానాల మొత్తమే వస్తువు. మనిషి, మానవ సంబంధాలు, సామాజిక జీవితం. దానిలోని సమస్త వైరుధ్యాలు వీటన్నిటి యొక్క కళాత్మక ప్రతిఫలనం సాహిత్యంలో వస్తువు అవుతుంది" (లక్ష్మీకాంతం, 1986: 39). ఏ రచయితైనా తాను ఎన్నుకునే వస్తువు తనకు

బాగా తెలిసిన జీవితంగాని, సంఘటన గాని అయి ఉండాలి. తెలియని జీవితాన్ని చిత్రించడం కన్నా తెలిసిన జీవితాన్ని చిత్రించటంలో ఎంతో ప్రతిభను, సమర్థతని సాధిస్తాడు రచయిత. ఆ రచయిత సృజియించిన సాహిత్యం సమాజానికి ఎంతో సన్నిహితంగా ఉండి మానవ జాతి సమకాలీన వ్యవస్థని, చరిత్రని నిర్మించేలా చేస్తుంది. అంతే కాకుండా రచయితకున్న సామాజిక స్పృహా, సామాజిక బాధ్యత వ్యక్తమౌతుంది. “మనిషి మానవ సంబంధాలు, సామాజిక జీవితం, దానిలోని సమస్త వైరుధ్యాలు వీటన్నింటిని యొక్క కళాత్మక ప్రతిఫలనం సాహిత్య వస్తువు” అవుతుంది (శివశంకర్, 1996: 78). పై నిర్వచనాల ద్వారా వస్తువు అంటే అవగాహన ఏర్పడుతుంది. రచయిత ఏదైనా సమస్యను చిత్రించడానికి ఎన్నుకున్న అంశమే వస్తువుగా చెప్పవచ్చు.

తెలంగాణ జన జీవనాన్ని 1970 – 90 ల మధ్య సామాజిక వ్యవస్థను, దొరల దోపిడిని, వెట్టి చాకిరిని, ఫ్యూడల్ దుర్మార్గాలను, షావుకారుల చేతిలో మోసపోయిన రైతుల జీవితాలను, బొగ్గు గని కార్మిక కష్టాలను, వారి కనీస అవసరాల కోసం చేసిన పోరాటాలను, విచ్ఛినమవుతున్న మానవ సంబంధాలను ఇలా ఎన్నో రకాల సంఘటనలను భిన్నపార్శ్వాల నుండి చూసి తన జీవితంలో ఎదురైన సంఘటనలనే కథలుగా రాసి వందమంది విమర్శకులచే మన్ననలందుకొన్నవారు తుమ్మేటి. “ప్రాణాంతకమైన పనిస్థలాలు, తరచూ జరిగే ప్రమాదాలు, యాజమాన్యం వేధింపులు నడుమ నలిగిపోతూనే రగిలిపోతున్న సహకార్మికుల జీవితాలను, ఆరార్ అతిజాగ్రత్తగా చూశారు. సంక్షుభితంగానూ, వీరోచితంగానూ ఉండే వాళ్ళ విస్తారమైన జీవన క్షేత్రాలను నిశితంగా, నిబద్ధంగా పరిశీలించారు. నీళ్ళ కోసం, నివాసాల కోసం వాళ్ళు చేసిన పోరాటాలు, భద్రత కోసం వాళ్ళు పడ్డ ఆరాటాలు అతనికి కథావస్తువులయ్యాయి” (సదాశివుడు, 2013: 104). తుమ్మేటి రఘోత్తమరెడ్డి 27 సంవత్సరాలు బొగ్గు గనుల్లో పనిచేశారు. తన స్వీయానుభవంలో ఎదురైన కష్టాలను, తోటి కార్మికుల బాధలను గమనించి వాటిని కథలుగా రాశారు. కాబట్టి బొగ్గుగని కార్మిక సాహిత్య నేపథ్యాన్ని, బొగ్గు గని కార్మిక జీవితాల్లోని సమస్యలను తెలుసుకోవడం అవసరమని స్థూలంగా ఇక్కడ పరిచయం చేస్తున్నాను.

## 2.2 బొగ్గుగని కార్మిక సాహిత్య నేపథ్యం

1974 నాటికే కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభమైన రైతు కూలీల సంఘాల నాయకత్వంలో ప్రజలందరు ఐక్యం అయినారు. వాళ్ళ జీవిక, జీవనం కొరకు భూమి కేంద్రంగా వాళ్ళ పోరాట చైతన్యం ఉధృతమైంది. అది ప్రజల రాజకీయ చైతన్యాన్ని పెంచింది. ఫలితంగా 1975 సెప్టెంబర్ 9వ తేదిన నలభై వేలమంది జనం రైతుకూలీ సంఘం నాయకత్వంలో సమీకృతులై జగిత్యాలలో పెద్ద ఊరేగింపు చేశారు. జగిత్యాల జైత్రయాత్రగా ఇది ఉత్తర తెలంగాణ విప్లవోద్యమ చరిత్రలో గుర్తుంచుకోవలిసిన ఘటన అయింది. దీనిని ఎదుర్కోవటానికే ప్రభుత్వం కరీంనగర్ జిల్లా సిరిసిల్ల, జగిత్యాల తాలుకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించింది.

కరీంనగర్ జిల్లాకు ప్రకటించిన కల్లోలిత ప్రాంతం మొత్తం తెలంగాణ విస్తరించిన సంక్షోభకాలం అది. ఈ కాలంలోనే విప్లవోద్యమ చైతన్యం సింగరేణి బొగ్గుగనులకు విస్తరించింది. బొగ్గుగని కార్మికుల నుండే జీవితానుభవాలను సాహిత్యంగా మలిచే సృజన శక్తులు ఎదిగాయి. ఇటు మైదాన ప్రాంతాల సాహిత్యం, అటు గిరిజన ప్రాంతాల సాహిత్యం, మరోవైపు బొగ్గుగని కార్మిక సాహిత్యం మూడు పాయలుగా సాగి ఒక విద్యుత్తును సృష్టించే మహా ప్రవాహ శక్తితో విస్తరించిన కాలం అది. తెలుగు కథకు భిన్న జీవన వర్గాల జీవితాలు వస్తువులుగా మారాయి. "1978 నాటి సిరిసిల్ల, జగిత్యాల రైతుకూలీల పోరాటాల పరోక్షప్రభావం అతనికి రచనాశక్తి ఉత్తేజ పరిచింది. ఆ నేపథ్యంలో ఆరార్ మొదటిసారిగా 'నిరసన' అనే కథ రాశాడు" (సదాశివుడు, 2013: 104).

రఘోత్తమరెడ్డి సృజన కాలానికి ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అస్తవ్యస్తమైన పరిస్థితులతో సామాన్యుల జీవితాలు ఉపాధి లేక కొట్టుమిట్టాడుతున్నాయి. ఆ కాలంలో జన్మించిన అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి కాల పరిస్థితుల్లో ఉక్కిరి బిక్కిరైన రచయితలు. ఆనాటి సామాజిక పరిణామాలను జాగ్రత్తగా గమనించి సృజనకారులు ప్రేరేపితమై సాహిత్యశక్తులుగా ఎదిగారు. గిరిజన, ఆదివాసీల పోరాటాలను సాహిత్యంగా రాజయ్య రాస్తే, రైతుల గిరిజనుల ఉద్యమాల తాకిడికి ఉవ్వెత్తున ఎగిసిన బొగ్గుగని కార్మిక సమైక్యతను, పోరాటాలను రఘోత్తం తన కథల్లో చొప్పించారు. "రఘోత్తం

కథారచనలో ప్రవేశించే నాటికి తెలంగాణలో విస్తారమైన మూడు సామాజిక సమూహాలు వర్గ పోరాటంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నాయి. ఎమర్జెన్సీ నాటికే కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో ప్రత్యామ్నాయ ప్రజాపంథాను ముందుకు తీసుకు వచ్చాయి. రైతాంగ పోరాటాల విస్తృతిలో ఆదివాసీ ఉద్యమాలు, సింగరేణి కార్మిక ఉద్యమాలు రఘోత్తంలోని రచయితకు ఆలోచనాపరుడికి ప్రేరణనిచ్చాయి" (పినాక పాణి, 2013: 108).

## 2.3 భూస్వామ్య వ్యవస్థపై నిరసనకు సంబంధించిన కథలు

ప్రజాస్వామీకరణ దేశమైన భారతదేశంలో అనాది నుండి రెండు వర్గాలుగా సంఘర్షణకు గురవుతూనే ఉన్నాయి. అవి నేటికి, రేపటికి కొనసాగుతూనే ఉంటాయి. అమాయకపు పీడిత వర్గాన్ని, అన్ని రకాలుగా బలీయమైన పాలక వర్గం దోచుకోవడం జరుగుతూనే ఉంది. అణచివేతకు, అవమానాలకు, వివక్షకు అనునిత్యం బలైన సామాన్య జనాన్ని అన్ని రంగాల్లో అదిమి పెట్టి తొక్కుతూనే ఉంది. ఇలా సమాజంలో రెండు వర్గాల సంఘర్షణ నిరంతరం మనకు కనబడతుంది. అలాంటి విరుద్ధమైన వర్గసంఘర్షణను రచయితలు సామాజిక వాస్తవిక దృష్టికోణం నుంచి పరిశీలించి కథలుగా రాస్తున్నారు. ఆధునిక సమాజంలోని వర్గదోపిడి, అణచివేత, అవమానాలు మొదలైన అన్ని రకాల దోపిడి చేస్తున్న పాలక వర్గాన్ని ఎదురిస్తూ వచ్చిన కథలు తెలుగు విప్లవోద్యమ సాహిత్యంలో ఎన్నో కనిపిస్తుంటాయి. ముఖ్యంగా తెలంగాణలో వున్న వెట్టి చాకిరి, భూస్వామ్య వ్యవస్థ, దొరల పెత్తనం, రజాకార్ల అరాచకాలు మిగతా రాష్ట్రాలలో వున్న జీవిత పరిస్థతుల కంటే దారుణమైన పరిస్థితులు కనిపిస్తాయి. తెలంగాణ భూస్వాములు ఎంత దోచుకొనేవారో, పేద రెతులను ఏ విధంగా అవమాన పరిచేవారో చిత్రించడమే కాక, వాటిని ఆ రైతులు ఏవిధంగా ప్రతిఘటించడానికి ప్రయత్నించారో కూడా చిత్రించారు.

### 2.3.1 ధిక్కారం

తెలంగాణ గ్రామాల్లో భూస్వాముల దౌర్జన్యాలకు బలైపోయిన పీడితుల, బలహీన వర్గాల వారు తమ అస్థిత్వాన్ని, ఉనికిని కోల్పోతున్నప్పుడు అవమానాలకు తట్టుకోలేక ఎదురు తిరిగి ఆవేదన వ్యక్తం చేయడమే 'ధిక్కారం' కథావస్తువు.

ధిక్కారం కథలోని రాయమల్లి ఒక హరిజన స్త్రీ. దొరసాని దగ్గర ముందటి సంవత్సరం తీసుకున్న వడ్లను తిరిగి ఇవ్వడానికి వెళుతుంది. తన కొడుకు మిత్రుడైన రాజెల్లని సహాయంతో దొరసానికి ఇవ్వలసిన వడ్ల మూటలను ఎడ్ల బండి మీద వేసుకొని దొరసాని ఇంటికి చేరుతుంది. కచ్చీరులో కూర్చున్న నర్సింహరామయ్య దొరసానికి ఇవ్వవలసిన వడ్లను, వాటికైన పెచ్చులను (వడ్డీ) కలిపి లెక్కలేసి మొత్తం నాలుగు గిద్దెలయినాయని చెప్తాడు. ఆ మాటలిన్న రాయమల్లి ఖంగుతిని తాను ఇవ్వవల్సినవి రెండు గిద్దెలే కదా అని అడుగుతుంది. దొర్సాని అంతకుముందు రాయమల్లి కొడుకు పెళ్ళికిచ్చిన వడ్లను కూడా ఇవ్వమని మొత్తం లెక్క చెపుతుంది. దానికి ఏమి చేయాలో తోచక రాయమల్లి తీసుకుచ్చిన వడ్లను ఇస్తూ, ఇంకా రెండు గిద్దెల వడ్లకు ఎక్కడ పోవాలని విచారిస్తుంటుంది. ముందటి సంవత్సరం పంటలు పండక వడ్లకు పెచ్చులు తీసుకోని ఆ ఊరికి చెందిన రామిరెడ్డి దొర గురించి చెపుతుంది. ఇక అంతే అసలే వడ్లకు పెచ్చులు కట్టలేదని కోపం ఒకవైపు, పాలేరుగా తన కొడుకు సమ్మడిని ఉంచలేదని ద్వేషం మరోవైపు కూడి దొరసాని రాయమల్లిని నానా మాటలు అంటుంది. బొగ్గు బావిలోకి పని కోసం కావల్సిన లంచాన్ని సిద్ధం చేయడానికి వేరే దొర దగ్గర పాలేరుగా చేరాడు సమ్మడు. తన కొడుకు పాలేరుగా ఉండకపోవటంలో తన తప్పేమి లేదని చెపుతుంది. అయినా వినిపించుకోకుండా "సంసారివైతివి గివన్ని నీకెందుకెరుక వాన్ని మాకుండకుంట చేసింది. నువ్వు కాదెలంజె" (రఘోత్తమరెడ్డి, 2006: 7) అని బూతులతో తిడుతుంది. ఆ మాటలిన్న రాయమల్లి తన ఆత్మగౌరవాన్ని చంపుకోలేక నీకు రావల్సిన డబ్బును ఎలానైనా వసూలు చేసుకో కాని తిట్టద్దని ఎదురించి మాట్లాడుతుంది. ఈ తతంగాన్నంతా లోపలి నుండి విన్న దొరసాని కొడుకు జగదీశ్వర్రావుకు తన తల్లికి ఒక నిమ్నకులస్థురాలు ఎదురు తిరిగి సమాధానం ఇస్తుందాఅని

అధికారంతో, అహంకారంతో వచ్చి రాయమల్లిని చితకబాదుతాడు. రాయమల్లి ఏడూస్తూ ఇంటి ముఖం వైపు పయనం అవుతుంది. ఆ సమయంలో జగదీశ్వర్రావు భార్య కచ్చీరులోకి వచ్చి పాలేర్లను కొడితె ఏం సంభవిస్తూందో సూచనలిస్తుంది. తన తల్లిని ఒంటరిదాన్ని చేసి కొట్టిన దొరసాని, దొరసాని కొడుకు దిక్కు చూసి రాయమల్లి కొడుకు సారడు ప్రతీకారంగా ''విల్లులా వెనక్కి వంగి, వంకరగా చిమ్మే ఫౌంటెన్ లాగ మూత్రం పొయ్యడం'' (రఘోత్తమరెడ్డి, 2013: 8) ద్వారా తన నిరసనను తెలిపాడు

ఈ కథకు మొదట 'నిరసన' అనే పేరును రఘోత్తం నిర్ణయించారు. కాని వరవరరావు ఆ కథకు 'ధిక్కారం' అనే పేరుతో 'సృజన' మాస పత్రికలో ప్రచురించారు. ఇందులో ప్రధానంగా నిరసననే కనిపిస్తుందని చెప్పవచ్చు. పై విధంగా 'ధిక్కారం' కథలో తెలంగాణ రాష్టంలో ఉన్న దొరల పాలనా వ్యవస్థను, అక్రమాలను, మోసాలను, ఆరాచకాన్ని ఎదురించే ప్రయత్నం చేసినట్లు ఇందులో రచయిత చిత్రించాడు. దొరల పాలన అంతరించిపోయే సమయం ఆసన్నమైనట్లు ఈ కథ ద్వారా ఒక సూచికను అందజేశాడు రచయిత. లెక్కలు మార్చి సామాన్య జనాలను మోసం చేసే నర్సింహరామయ్య లాంటి పాత్ర చిత్రించడం ద్వారా చదువు సంధ్యలు లేని ప్రజలు దొరల చేతిలో ఎలా మోసపోయేవారో తెలుస్తుంది. దొరసాని దగ్గర అప్పులు ఉన్నప్పటికి తన ఆత్మగౌరవానికి ప్రాధాన్యమిస్తూ దొరసానికి, దొరసాని కొడుక్కి ఎదురుతిరిగిన రాయమల్లి పాత్రను చాలా చక్కగా చిత్రికరించారు. అధికారమదంతో, అహంకార చేష్టలతో ఒక హరిజన స్త్రీని చితకబాదిన జగదీశ్వర్రావు లాంటి దుర్మార్గులను నిమ్నకులాల వారిపై దొరలకున్న చిన్న చూపును చిత్రించారు. తన తల్లిని కొట్టినవాడి మీద కసిగా ప్రతీకారం తీర్చుకోవడం కోసం అన్నట్లు సారడు మూత్రం పోయడం ఈ కథకు మంచి ముగింపు.''ఈ బడిబత్త పోరెడి 'ధిక్కారం' శ్యామ్ బెనెగల్ 'అంకుర్' సినిమా చివరన ఇంతే పోరడు జమీందారీ దౌష్ట్యం వైపు రాయి విసిరికొట్టిన దృశ్యాన్ని మన కళ్ళకు గుర్తు చేస్తుంది. దొర్సాని, దొర్సాని కొడుకు, శ్రామిక స్త్రీ, ఆమె కొడుకు మధ్యన ఉన్న ప్రేమల్లో మొదటిది కలుషితం, రెండోది సహజాతం ఈ పర్యవసానం కథలోని ఉప-ఉత్పత్తి'' (వేణుగోపాల్, 2013: 92). తెలిసో తెలియకో సారడు

కూడా దొరల దోపిడిని ధిక్కారంతో ఎదురించాడు అనడం సమంజసమే. చిన్నపిల్ల వాడైనా ఆ మనుషుల స్వభావాన్ని ప్రతిఘటించినట్లు రచయిత చిత్రించారు.

### 2.3.2 ఈ భూమి ఎవరిచ్చిన్రు..?

ఒక సామాన్య ముసలిరైతు గతంలో తన తల్లిదండ్రులు సంపాదించి ఇచ్చిన భూమిని, లాక్కోవడానికి వచ్చిన భూస్వాములకు, దొరలకు ఎదురు తిరిగి చేసిన పోరాటమే 'ఈ భూమి ఎవరిచ్చిన్రు..?' కథావస్తువు.

'భూమి ఎవరిచ్చిన్రు' కథలో బాలయ్య అనే ముసలివాడు ముఖ్యపాత్ర. కథంతా బాలయ్య చుట్టూ తిరుగుతూ ఉంటుంది. ముసలివాడికి పొలం తప్ప వేరే ధ్యాస లేకుండా నిరంతరం కష్టపడే తత్త్వం కలవాడు. పొలాల చుట్టూ ఉన్న ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ తన పొలం దగ్గరే ఉండి కాలాన్ని గడిపేవాడు. శ్రమని నమ్ముకొని బ్రతికేవాడు. వర్షం రాకను గుర్తించి ఆనందంతో గంతులు వేస్తూ తరువాత పండిచాల్సిన పొలాన్ని గురించి ముందుగా ఎరువు తయారు చేసుకోవడానికి పిడికెకున్నెలను, పచ్చిపెండ ఏరుకుంటూ పొలంవైపు వెళతాడు. అది అసలే వేసవికాలం ఎండ విపరీతంగా మండుతూ చుక్క నీరు కూడా దొరకని సమయం. ఎండిన చెట్లను చూస్తూ విస్తుపోయి నడుస్తుంటాడు. ఆ పరిసరాల్లో ఉన్న గొల్లబోయనితో అగో చూడు మనువడా వర్షం వచ్చెటు ఉందని చెప్తాడు. అలా వర్షం వస్తుందని పంట పండించాలని గోరంత ఆశ పడతాడు. చినుకులు పడగానే సంబరంగా ఇంటికి చేరి నాగలి తీసుకొని తన పొలాన్ని దున్ని జొన్న పంట వేస్తాడు. సహజమైన వర్షపు తడికి వచ్చే కమ్మటి వాసనలు పీల్చుకుంటూ పరవశించిపోయే వేళ ఒక దుర్ఘటన ఎదురై ముసలివాని ఆశలను అడియాశలు చేస్తుంది. పోలిసులు, దొర వచ్చి ముసలివాన్ని తన కొడుకు ఆచూకీ అడుగుతారు. అంతేకాదు భూమిని ఎందుకు దున్నుతున్నావని అమీన్ దొర ప్రశ్నిస్తాడు. ముసలివాడు సమాధానం నిర్లక్ష్యంగా చెప్పే సరికి పోలిసులు కోపంతో అతన్ని బాగా కొడతారు. వాళ్ళకు ఈ భూమి నాది అంటూ

ధైర్యంగా చెప్పి తన వైఖరి తెలియజేస్తాడు. ఇక అంతే దొర, పోలీసులు ముసలోని ప్రాణం పోయేలాగా, జీవం నశించేట్లు కొడతారు. ఎంత కొట్టినా ముసలివాడు ఒకే ఒక సమాధానంతో "యిది నా భూమి, నాకెవళు తెలువది, నా కెవళు చెప్పలేదు" అంటూ కన్న తల్లిలాంటి భూమిలో సోమ్మసిల్లిపోతాడు (రఘోత్తమరెడ్డి, 2006: 26). సంధ్యవేళ చీకటిలో ఎవరు వచ్చి, ఎక్కడ విధ్వంసం సృష్టిస్తారో అని దొర, పోలీసులు అక్కడ నుండి ప్రయాణం అవుతారు. శరీరంలో సత్తువ నశించిన ముసలివాడు తన భూమిని చూసుకుంటూ తల్లిదండ్రి ఆ భూమి కోసం పడిన పాట్లను స్మరించుకుంటూ బాధపడతాడు. ముసలివాడికి ఉన్న ఒక్కానొక్క కొడుకు దొరల దౌష్టాన్ని, క్రూరత్వాన్ని ఎదురించడానికి అన్నల్లో కలిసిపోతాడు. కొద్ది సమయంలోనే ఆ ఊరి జనం, సమూహంగా వచ్చి ముసలివాడిని చూసి నిర్ఘాంతపోతారు. పోలీసులు ఎంత కొట్టినా తమ గురించి చెప్పని ముసలివాని గుండెదైర్యానికి ఆశ్చర్యపోతారు. కొంత సమయానికి స్పృహ నుండి తెలివిలోకి వచ్చిన బాలయ్య భూమి గురించి కలవరిస్తాడు. అది చూసి ముసలివాడికి భూమ్మీద ఉన్న మమకారానికి, భూమికోసం చేసిన తెగింపుకు వాళ్ళ మనస్సుల్లో మార్పు వస్తుంది. చైతన్యవంతులై మన భూములను మనమే రక్షించుకోవాలని అంటూ ఏకమై పోరాటానికి సిద్ధమవుతారు. వాళ్ళ అతారెలే (పనిముట్లు) ఆయుధాలుగా మారి కామ్రేడ్స్ ఏకం కండి మన భూములను ఎలానైనా దక్కించుకోవాలని నినాదాలతో బయలుదేరతారు.

ఈ కథలో రైతుకు, భూమికి ఉన్న సహజసంబంధాన్ని 'బాలయ్య' (ముసలివాని) పాత్ర ద్వారా రచయిత వ్యక్తం చేశారు. ఒంటరిజీవితాన్ని అనుభవిస్తూ తన పొలాన్ని పండించు కుంటున్న ముసలివాడి ఆశలను చిన్నాభిన్నం చేసిన దొరలను ఎదురించినవాడిగా నిలిచిపోతాడు. ఎన్నో రాత్రులు, పగలు కష్టపడి సాగుచేసి పండించిన పంటను గద్దొచ్చి కోడిపిల్ల అన్నట్లు  దొరలు హింసాపూరిత దౌర్జాన్యాలతో లాక్కోవడం, వాటిని ఎదురించి పోరాటం చేయాల్సిన ఆవశ్యకతని గుర్తించి ప్రజలు చైతన్యవంతులుగా మారడం ఈ కథ అందించిన ప్రధాన ప్రయోజనం. "పోలీసులు లాఠీలతో సూది పొడిచే సందులేకుండా దొర్లిచ్చి దొర్లిచ్చి కొట్టినా, ప్రపంచంలో ఏ ఇతర సంబంధం కన్నా ప్రియాతిప్రియమైన చెమట ఇంకిన తన పంటభూమిలోనే రక్తం చిందించి, బహుశా ఉనికిని

చాటుకోవడానికి ఊపిరిని శాసించి చేస్తాడు. ఇది యుద్ధంలో గెలవడమే! దొర దుర్మార్గం, రాజ్యహింస శరీరంలో గోరెడు మాంసంలేని ముసలోని ముందు బలాదూర్, ఈ భూమి ఎవరిచ్చిండ్రు (1985) కథలోని ముసలోడిలాగా చరిత్రలోని కథానాయకులంతా అనామకులే" (వేణుగోపాల్, 2013: 91). తెలంగాణ గ్రామీణ వ్యవస్థలో సామాన్య రైతులు తమ శ్రమను ధారపోసి పండించిన పంట చేతికి రాగానే దౌర్జన్యంగా లాక్కొనే దొరల స్వభావమేంటో అర్థమవుతుంది. "కొడుకు ఉద్యమంలో చేరి దూరమై పోగా తనకంటూ ఎవరూ లేని ఒక వృద్ధుడు వొంట్లో ఓపిక లేకపోయినా భూమి కోసం, అందులో పండిన జొన్న పంట కోసం చేసిన పోరాటం 'భూమి ఎవరిచ్చిన్రు' కథావస్తువు.ఇదే వస్తువుని తీసుకొని ఎందరో రాసిన కథల కన్నా ఈ కథ ఎందుకంత సహజంగా ఉందో గమనించాలి" (వరలక్ష్మి, 2013: 367). రచయిత నిర్మించిన స్థల, కాలాల నేపథ్యాన్ని సమర్థవంతంగా చిత్రించడం వల్ల ఈ కథలొ అంత సహజరూపాన్ని పొందిందని చెప్పాలి. అంతేగాకుండా ఈ కథలో బాలయ్య పాత్ర హావభావాలను, అనుభవాలను రచయిత సందర్భా నుసారంగా వ్యాఖ్యానించడం కూడా మరో కారణం అవుతుంది.

## 2.4 వెట్టిచాకిరీకి సంబంధించిన కథలు

వ్యవసాయ కార్మికులు తమ పేదరికం వల్ల, అజ్ఞానం వల్ల తాము చేసిన అప్పుకు ప్రతిఫలంగా తమ శ్రమను స్వల్పమైన మొత్తానికి అమ్ముకోవడమో, తాకట్టు పెట్టుకోవడమో చేస్తారు. కొన్ని సందర్భాలలో సంప్రదాయం పేరున కూడా దోపిడి జరుగుతుంది. ఈ రకమైన ఆర్థిక, శారీరక దోపిడినే వెట్టిచాకిరీ అవుతుంది. ఈ వెట్టిచాకిరీని ఎదురించడానికి అనేక సంఘాలు, సభలు బయలుదేరినవి. వాటి స్ఫూర్తితో ఎందరో ప్రజలు మేల్కొని వెట్టిచాకిరిని ఎదురించే ప్రయత్నం చేశారు. ఇలాంటి సమస్యనే రఘోత్తం 'సవారీ-1', 'సవారీ-2' కథల్లో చిత్రించారు.

### 2.4.1 సవారీ –I

దొరల అధికారాన్ని పీడిత జనాలపై చూపిస్తూ, తమ అవసరాలకు అనుగుణంగా వాడుకుంటూ వెట్టిచాకిరీ చేయించుకొనే విధానాన్ని, సంఘటిత ప్రజల శక్తిని జీర్ణించుకోలేక నిస్సహాయస్థితిలో పడే దొర స్థితిని తెలియజెయడమే ఈ కథావస్తువు.

ప్రతాప్ రావు ఆ గ్రామానికి దొర. నారాయణ అనే తపాలాబంట్రోతు ఇచ్చిన ఉత్తరం ద్వారా తన బావమరిదికి ఏదో అత్యవసర పని ఉందని ఊరికి రమ్మని కబురు వస్తుంది. దాంతో తన ప్రయాణానికి సిద్ధం అవటానికి ఎండ్ల బండి వెనుకాలో, ముందో పరుగెత్తడానికి చాకలి వాన్ని సిద్ధం చేయమని సుంకరోన్ని ఆదేశిస్తాడు. తండ్రి బాధ్యతను మీదేసుకొని ఓదెలు అనే కుర్రవాడు బండి వెనుక పరుగెత్తడానికి వస్తాడు. దొర బండి వెనుక పరుగులు తీస్తాడు. పరుగెత్తి పరుగెత్తి ఓదెలు అలసిపోతాడే కాని దొరకు మాత్రం జాలి కలుగదు. తన చుట్టూ వున్న వాతావరణం, ప్రకృతిని గమనించకుండా తన గమ్యమే దిశగా పరుగులు తీస్తాడు. మార్గమధ్యంలో బండికున్న కోడెపగ్గాలు తెగిపోవడం, దాన్ని సవరించే క్రమంలో తలకు దెబ్బ తగలడం, చెప్పుల గూడ తెగడం జరుగుతుంది. హీనమైన పరిస్థితిలో వున్న ఓదెలుని దొర పట్టించుకోడు. అదే సమయంలో ఊరి చివరన ఏదో సమావేశంతో కూడిన విప్లవ గీతం వినిపిస్తూంటుంది. అది గమనించి గౌడు ద్వారా సంఘపోళ్ళ మీటింగు అని తెలుసుకుంటాడు దొర. ఒక్కసారిగా దొర హావభావాలు మారిపోయి కోపం, ఉద్వేగం చుట్టుముడుతాయి. ఇదంతా ఏమి పట్టించుకోని స్థితిలో వున్న ఓదెలుని ఒకసారి చూసి సంఘంవాళ్ళ మధ్యలో నుంచి బండి వెనుక పరుగెడుతున్న ఓదెలుని చూస్తే ఏమి జరుగుతుందోననే భయంతో దొర బండెక్కుమని బెదిరిస్తాడు. దాంతో బండెక్కి కూర్చుంటాడు ఓదెలు. ఈవిధంగా వెట్టిచాకిరీ, అవమానాలు, దోపిడిల నుండి విముక్తి పొంది స్వేచ్ఛగా బతకడానికి ఏకమైన రైతాంగసభను చూసి దొర భయపడి ఓదెలుని బండి ఎక్కించుకోవడం ఈ కథా ఇతివృత్తం.

దొరల అవసరాల నిమిత్తం అమాయక ప్రజానీకాన్ని నిత్యం వాడుకుంటూ పీడిత ప్రజలను అవమానించడం ఈ కథలో కనిపిస్తుంది. అంతేగాకుండా బాలలను సైతం దొరలకు బానిసలుగా

మార్చిన వైనాన్ని చిత్రించిన కథ సవారీ. దొరల పాలనలో దొరల దౌష్ట్యం వల్ల ఒకచాకలి పిల్లవాడు పడే కష్టాలను, బాధలను కథావస్తువుగా స్వీకరించి రచయిత చిత్రించారు. పై కథలో దొరకి ఎదురైన కమ్యూనిస్టు సభ వల్ల దొర ఆలోచనలో మార్పు కలుగుతుంది. ఆ సభ మధ్యగుండా వెళితే జరుగబోయే పరిణామాన్ని ప్రతాప్ దొర ముందుగానే పసి కట్టి తప్పించుకుంటాడు. పరుగెత్తి అలసిపోయిన ఓదెలుపై కాస్తనైనా జాలి చూపని దొర తన కాడికి వచ్చేసరికి ఎంతటి స్థాయికి దిగజారుతాడో రచయిత సహజంగా చూపించారు. ఇట్లా తెలంగాణ దొరల నిరంకుశ పాలనలో వృద్ధులను, స్త్రీలను, చివరికి పిల్లలను కూడా బానిసత్వానికి గురిచేసిన వాస్తవికాంశాన్ని రచయిత కథగా మలిచారని తెలుస్తుంది.

### 2.4.2 సవారీ–II

దొరల వద్ద వెట్టిచాకిరితో బానిస బతుకులు ఈడుస్తున్న జీవితాలకు విముక్తి మార్గాన్ని ఆకాంక్షించే ఉద్యమ సభను చూసి, ఒక బాలుడు అప్రయత్నంగానే చైతన్యం తెచ్చుకొని దొరకే ఎదురుతిరిగే వైనం ఈ కథా వస్తువు.

'సవారీ–I' కథ కొనసాగింపుగా 'సవారీ–II' కథ వచ్చింది. 'సవారీ' కథలోని బండి వెనుక పరుగెత్తిన ఓదెలుకు బహిరంగ కమ్యూనిస్టు సభకనిపించిందా? లేదా? అని సందేహం వస్తుంది. ఆ కుర్రాడు సభను గమనించి వుంటే ఎలాంటి నిర్ణయం తీసుకునే వాడనే సందిగ్ధత కలుగుతుంది. ఈ విషయం గురించి రచయిత ఆలోచించి 'సవారీ-2' అనే కథ రాశారు. మొదటి కథలో సవారీ మొదలైతుంది అప్పటి నుండి రెండో కథ అరంభమవుతుంది. దొర చెప్పగానే భయంతో కూర్చోన్న ఓదెలు అయాసంతో అలసిపోవడం వల్ల తన చుట్టూ ఉన్న పరిసరాలను పట్టించుకోడు. దొర బండిలో బిక్కు బిక్కుమంటూ కూర్చొని ఎందుకు ఎక్కించుకున్నాడని ఆలోచనలో పడతాడు. ఎన్ని గ్రామాలు దాటినా పరుగెత్తి అలసిపోయినా బండి ఎక్కించుకోని ప్రతాప్‌దొర ఆకస్మికంగా బండి ఎక్కమనేసరికి కారణాలను అన్వేషిస్తూ ఉంటాడు.ఆ క్రమంలో ఎర్రజెండాలతో, పాటలు పాడుతూ చప్పట్లు

కొట్టుకుంటూ సంతోషంతో సభకెళ్ళి పరుగులు తీస్తున్న జనాన్ని చూస్తున్న ఓదెలుకు మనసులో ఏదో ఆశ కలుగుతుంది. వారితో రోజు పాడుకునే ఆ పాటలతో మమేకవ్వాలని అనుకుంటాడు. కాని తండ్రి చెప్పిన బాధ్యత గుర్తొచ్చి విరమించుకుంటాడు. దొర పరిస్థితి దీనికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. తమ అధికారాన్ని అణచివేయడానికి అన్నట్లు ఎదురుగా వస్తున్న జనాన్ని చూస్తూ చీదరించుకుంటాడు. పాలేర్లు, జీతగాళ్ళు, రైతులంతా ఒక్కసారిగా మూకుమ్మడిగా దొరలను అంతం చేయడానికి వస్తున్నట్లు ఆందోళనకు గురైతాడు. బండి మీద పాలేరుని ఎక్కించుకు పోతున్న దొరని చూస్తూ, ఆ సభ వద్ద వున్న జనం ఆశ్చర్యపోయి దొరను హేళను చేస్తూ దొరతనం అంతరించపోతున్న విషయం గూర్చి సంభాషించుకుంటారు. అదంతా విన్న దొర కోపాన్ని దిగమింగుకొని నిస్సహాయడిగా అహాన్ని చంపుకొని సభ దాటగానే ఓదెలుని బండి దిగమని ఆజ్ఞాపిస్తాడు. అప్పటికి దాకా దొర తత్వాన్ని అర్థం చేసుకోని ఓదెలు ఆందోళన చెంది కోపంతో ‘నా లొట్ట గాడత్త’డని సభ వైపు పరుగుతీస్తాడు.

తెలంగాణ నాటి కాలంలో (1980కి ముందు) వున్న వెట్టిచాకిరీ వ్యవస్థను నిరసిస్తున్న వాళ్ళను గమనించి కథ రాసినట్లు ఉంటుంది. మొదటి కథకు కొనసాగింపుగా ఉండి రచయిత నిశిత చూపును, పరిణితిని తెలుపుతుంది. ఈ కథ నాటి సమాజానికి దొరల పాలన అంతం త్వరలోనే అన్న భవిష్యత్తు సూచన అందించినట్టు తెలుస్తుంది. అంతేగాకుండా సామూహిక సభను చూసిన ప్రతాప్‌దొర వాళ్ళ ఐక్యతను జీర్ణించుకోలేక పడే భావావేశాన్ని రచయితగా సహజంగా, స్వాభావికంగా చిత్రించారు. సామాన్యుల జీవితంలో మార్పును ఆశించిన రచయిత దొర వైపు నుండి, ఓదెలు వైపు నుండి చిత్రించిన వారి ఆలోచనధార సంఘర్షణ భరితంగా ఉంటుంది. బానిస బతుకులుగా ఉన్న తమ జీవితాలను మార్చుకోనే అవకాశం ఒకటి వుందని తెలుసుకున్నాక ప్రజల్లో కలిగే ధైర్యాన్ని చూసిన ప్రతాప్‌దొరకు నిస్సహాయత మిగులుతుంది. మౌనమే తప్ప మాట మూగబోతుంది. ప్రజాసంఘం ఇచ్చిన చైతన్యంతో ఓదెలు దొరనే ఎదురించి తన వాళ్ళకేసి పరుగెత్తడం ఈ కథ మంచి ముగింపు. చివరకు దొర దౌర్జన్యాన్ని ఎదురించి తన ఆత్మగౌరవాన్ని కాపాడుకున్న పాత్రగా ఓదెలు నిలిచిపోతాడు. ఇలా మొదటి కథ కంటే రెండో కథ అధిక ప్రయోజనం అందిస్తుందని చెప్పాలి. “మొదటి విడత కంటె రెండవ విడత

రాసిన కథకు ప్రజల కోణం ఎక్కువగా ఉంది. ప్రయోజన పరిపూర్తి ఉంది. మూడేళ్ళ కాల వ్యవధి ఒకే అంశాన్ని ఉద్యమ అవసరాలరీత్యా, ప్రజాప్రయోజనాల రీత్యా కోణం మార్చి ఎంత సమర్ధవంతమైన కథ చేయవచ్చో రఘోత్తమరెడ్డి చూపించాడు" (కాత్యాయని విద్మహే, 2013: 141).

## 2.5 రైతులకు సంబంధించిన కథలు

తెలంగాణ రైతు జీవితాలకు, ఇతర ప్రాంతాల రైతుల జీవితాలకు సారూప్యం లేని కాలం అది. భారత దేశ ఆర్థిక వ్యవస్థలో కొత్త ఆర్థిక ప్రణాళికల వల్ల, హరిత విప్లవ ప్రభావం వల్ల సామాన్య రైతుల జీవితాల్లో ఏర్పడ్డ సంక్షోభం అంత ఇంత కాదు. వ్యవసాయాన్ని తమ జీవన ఆధారంగా చేసుకొని బతికే రైతుల పరిస్థితి దుర్భరంగా సాగేది. చిన్నకారు వ్యవసాయదారులు ఎన్నో రాత్రుల్లూ, పగల్లూ కష్టపడి సాగుచేసి పండిన పంటలకు సరైన ధరలు లేక, మార్కెట్ షావుకార్ల దోపిడికి హద్దు లేక అగమ్యగోచరంగామారింది వారి స్థితి. అంతేగాకుండా, ప్రజా ఉద్యమాల ఫలితాల వల్ల దొరలు, భూస్వాములు వలసబాట ఎంచుకున్న వారు కొందరైతే, స్థానిక ప్రాంతాలని వదలలేని పరిస్థితిలో చితికిపోయిన భూస్వాములుగా నిలిచిన వారు మరికొందరు. పై రెండు రకాల జీవితాలను స్వయంగా అనుభవించిన రఘోత్తమరెడ్డి 'ఒక్కటైతే..?', 'పగలూరేయీశ్రమ పడుతున్నా' అనే కథలను వాస్తవిక దృక్పథంతో రాశారు. "సస్య విప్లవ ఫలితాలు సన్నకారు రైతులను, దుర్భర జీవన పరిస్థితులను పేద యువకులను ఒకే రకంగా బొగ్గుగనుల వైపు నెడుతుంటె వలసల తీవ్రత ఎక్కువై వేలాది రూపాయలు లంచాలిస్తె తప్ప బొగ్గుగనుల్లో పనులు దొరకడం కూడా కష్టమైన పరిస్థితులలో తెలంగాణ జనజీవనం సంక్షోభం తనను కదిలించగా రఘోత్తమరెడ్డి ఈ కథ (పగలూరేయీ శ్రమ పడుతున్నా) వ్రాసాడు (కాత్యాయని విద్మహే, 2013: 141).

### 2.5.1 ఒక్కటైతే..?

శ్రమనే పెట్టుబడిగా బతుకుతూ, పంట భూముల్లో నిరంతరం శ్రమ చేసే రైతులకు తినడానికి తిండి లేకుండా పండిన పంటను దళారీలు, పెట్టుబడిదారులు దోపిడి చేసే విధానాన్ని ప్రతిఘటించిన కూలీ, కార్మికుల సాహసాన్ని చూసి రైతులంతా ఏకమవ్వాలనే అకాంక్షించడం, ఆశపడటమే ఈ కథావస్తువు.

రంగారెడ్డి-కాంతమ్మ భార్యభర్తలు. వీరి కొడుకు చంద్రారెడ్డి. వీరిది వ్యవసాయ ఆధారిత కుటుంబం. భార్యభర్తలిద్దరు పొలం పనులను చూసుకుంటూ ఉండేవారు. రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితిలో కాలాన్ని వెల్లదీసుకుంటూ ఒక్కగానొక్క కొడుకుని చదివించు కుంటున్నారు. తరువాత పంటను పండించటానికి దమ్మిడి ఆదాయం లేక ముందటి సంవత్సరం పండించిన వడ్లను మార్కెట్లో అమ్మడానికి సిద్ధపడతాడు. కాని మార్కెట్‌కు వెళ్ళడానికి సరిపడ డబ్బులు లేకపోవడం వల్ల కోమటి లింగయ్య దగ్గర నాలుగు వందలు అప్పుగా తీసుకొని కొడుకు చంద్రారెడ్డితో బయలుదేరతాడు.డబ్బులేని సమయంలో కొడుకు పుస్తకాల కోసం చేసే మారాం, ఇంట్లో సరిపడు చిల్లర సామానులు లేకపోవడం, చినిగిన జాకెట్ వేసుకొన్న భార్య ఇవన్నీ చూసి రంగారెడ్డి విచారంలో పడతాడు. ఇక మార్కెట్‌కు వెళ్ళగానే అడ్తీల (దళారీలు, వడ్లను అమ్మే మధ్యవర్తకులు) ఆందోళనలు. రంగారెడ్డి లేని సమయంలో ఎప్పటిలాగే రంగారెడ్డి తెచ్చిన వడ్లను అమ్ముకునే అడ్తీ వచ్చి వడ్లకు ధర నిర్ణయిస్తాడు. పండించినవాడి ప్రమేయం లేకుండా షావుకారులు నిర్ణయించిన ధరలకు అమ్ముకోవాల్సి రావడం వల్ల రైతులకు గిట్టుబాటులు ధరలు రావు. రంగారెడ్డి తెచ్చిన 5కిలోలు తక్కువ 100క్వింటాల వడ్లను అందరు పంచుకుపోగా చివరికి బండెడువడ్లకు 20రూపాయలు మిగులుతాయి. ఇలాగైతే వ్యవసాయాన్నే నమ్ముకొని కష్టపడే రైతుల జీవితాలు ఎప్పుడూ బాగుపడతాయని విచారిస్తుంటాడు రంగారెడ్డి. ఇల్లు గడవడం, కొడుకుని చదివించడం, పంటకు కావల్సిన పెట్టుబడులు ఇవన్నీ ఎలా తేగలను అనుకుంటున్న సమయంలో ఆదే మార్కెట్లో ఒక సంఘటన చోటు చేసుకుంటుంది. కూలీలు, హామాలీలు, గంపస్త్రీలు మొదలైన శ్రామిక పనివారు సంఘటితమై పోరాటానికి సిద్దపడి ధర్నా

చేస్తుంటారు. అది చూసిన రంగారెడ్డి తన మనస్సులో "గిట్ల మా ఎగుసాయదార్లంత ఒక్కటైతే!" (రఘోత్తమరెడ్డి, 2013: 41) అని ఆశపడతాడు.

పప్పు, ఉప్పు దగ్గర నుండి ప్రతిదీ మోసం, దగా, ధనవంతుడు పేదవాన్ని, బలవంతుడు బలహీనున్ని ఇలా దోపిడి చెయ్యడం వల్ల ఏవిధంగానైనా బలైది సామాన్యుడే. ఈ దేశానికి వెన్నెముక రైతులు అంటూ రాజకీయ ప్రసంగాల్లో చెప్పడం తప్ప రైతుల పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించని ప్రభుత్వాలను నిలదీయాల్సిన అవసరం ఉంది. రైతులు వారి పొట్టకూటి కోసం పండించుకున్న పంటను కూడా దోపిడిదారులు, దళారీలు నామరూపాలు లేకుండా దోచుకుతింటున్నారన్న రైతుల ఆత్మఘోషను రచయిత వివరించారు. రైతులు తమకు సరైన వసతులు, సౌకర్యాలు లేకపోయినా, ఎంతో డబ్బును పొలం మీద ఎరువుల కోసమని, విత్తనాల కోసమని వెచ్చిస్తారు. పంటలు పండకపోతే తమ రెక్కల కష్టం, శ్రమ ఒక్కసారిగా ఆవిరైతే రైతులు పడే యాతనలను రచయిత ఈ కథలో వివరించారు. ఈ కథలో పేద రైతులు పడే నానా యాతనలను స్పర్శిస్తూ, షావుకార్లు, దళారీల చేతిలో బలైతున్న రైతులను గురించి సహజంగా చిత్రించారు. రంగారెడ్డి లాంటి సామాన్య రైతు కుటుంబాలు అడుగడుగునా మోసపోతూ చిన్న చిన్న కోరికలను కూడా తీర్చుకోలేక, నిత్యావసరాలు కూడా అందని ద్రాక్షగా మిగిలిపోయే పరిస్థితిని రచయిత వివరించారు. పై అధికారుల దౌర్జన్యాలను సహించలేక కూలీలు, హమాలీలు ఏకమై తమ హక్కుల కోసం పోరాడిన తరుణం రంగారెడ్డిలో వినూత్నమైన ఆలోచనలను రేకెత్తిస్తుంది. రైతులంతా సంఘటితమై షావుకారుల మోసాలను అరికడితే ఎంత బాగుండుననే ఆశ రేకేత్తించేలా చేస్తారు రచయిత. "అమ్మబోతే అడవి–కొనబోతే కొరివిగా ఉన్న రైతుల పరిస్థితిని కళ్లకు కట్టిన కథ 'ఒక్కటైతే'. కూలీలు, హమాలీలు ఒక్కటై సాధించే విజయాన్నిచూసి, ఉత్తేజం పొంది "గిట్ల మా ఎగుసాయదార్లంత ఒక్కటైతే!"అని ఆలోచించే కథ ఇది" (వరలక్ష్మి, 2013: 367). ఈ కథ దాని ప్రయోజనాన్ని నెరవేర్చినట్లు 1990–91లో వరంగల్, జమ్మికుంట వ్యాపారుల మీద రైతుల పోరాటం, తిరుగుబాటు నిజం చేసింది.

### 2.5.2 పగలూ రేయీూ శ్రమ పడుతున్నా

1965-80ల నాటి కాలంలో భారతదేశంలో కొత్తగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థికవిధానాలు, పారిశ్రామీకరణ వల్ల రైతు కుటుంబాల్లో ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభాన్ని, లోపాన్ని దాని మూలంగా బతుకు దెరువు కోసం రైతులు వలసలకు పయనమవడం ఈ కథలో వస్తువు.

రాంరెడ్డి ఆ ఊరు భూస్వామి. ఓదెమ్మ, సాయిలు అన్నా చెల్లెల్లు. ఓదెమ్మ కొడుకు మల్లేశు ఈ కథలోని  పాత్రలు. చదువు సంధ్య లేక సంగమంటూ ఉద్యమాల్లో స్నేహితులతో బలాదూర్‌గా తిరిగి కాలాన్ని వృధా చేస్తున్నాడని ఓదెమ్మ ఆలోచించి తన అన్న సాయిలుతో పాటు బొగ్గుగనికి పంపిచాలని అనుకుంటుంది. ఆ విషయం గురించి సాయిలు బొగ్గుగని జీవితం గూర్చి చెప్పగా ఇంకా వయస్సు ముదురాలె, దొరల తలదన్నే బాయి దొరల గురించి విడమర్చి చెప్తాడు. ఇక లాభం లేదనుకొని రాంరెడ్డి దొర దగ్గరే పాలేరుగా ఉంచడానికి వెళతారు. దొర వద్దకు వెళ్ళిన సాయిలుని ఉద్దేశించి తన 20 ఏళ్ళ జీవితంలో చొరచూడని అదృష్టానికి సహించుకోలేక, సామాన్యుల జీవితాల్లో మార్పును గ్రహించిన రామిరెడ్డి దొర "నీకేందిర సాయిలూ మా రాజు వైనవ్" (రఘోత్తమరెడ్డి, 2006: 48) అని అంటాడు.

ఇలా సంభాషణలతో సాగుతూ రాయమల్లి తీసుకెళ్ళని మిరపకాయలపై దృష్టి పడుతుంది. అది కాస్త చూసిన దొర రాయమల్లి జీవితం మారిందని తానే మిరపకాయలు పెట్టే స్థాయిలో ఉందని దొర వెటకారంగా మాట్లాడుతాడు. ఇన్నేళ్ళుగా తాను, తన కొడుకు కష్టపడి పని చేసినందుకు తగిన ఫలితాన్ని కోరుతుంది. దొర ఆవేశానికి గురై ఇరవై యేళ్ళ జీవితంలో తానేమి సంపాదించుకున్ననో చెప్పమని నిలదీసి అడుగుతాడు. పాలేరుని సరిగా చూడలేక, కొడుకును చదివించలేక, పెళ్ళానికి నగనట్ర చేయించకుండా, ప్రజల మీద దొరతనాన్ని చలాయించలేక. సాటి రైతులకు అప్పులివ్వలేక తానేమి కూడపెట్టుకున్ననో తెలుపమని సాయిలు సమక్షంలో ఓదెమ్మని అడుగుతాడు దొర. అంతేగాక కాలంతో పాటు మారిన గ్రామీణ జీవితాల్ని, పారిశ్రామీకరణను గుర్తు చేస్తూ మారుతున్న ప్రపంచానికి తగ్గట్టు వ్యవసాయం రంగంలో ప్రవేశపెట్టిన ఎరువుల వాడకాలు, పండిన పంటలకు తగిన ధరలు రాకపోవడం, పంటలు పండించాలంటే కావల్సిన పెట్టుబడులు, వాటికోసం చేసిన అప్పులు, ఆ

అప్పులకు స్వంత ఇంటి వారితో కలిగిన వైరం ఇలా రైతు జీవితాల్లో చోటుచేసుకున్న విభిన్న రకాల విధ్వంసాలను తట్టుకొని నిలబెడుతున్న వైనాన్ని రచయిత ఈ కథలో వివరించారు. రాంరెడ్డి మాటలు వింటున్న సాయిలూ అదంతా నిజమే అన్నట్లు గనికార్మిక జీవితాల్లో ఎదురైన కాపుకార్మికుల స్థితిని మననం చేసుకుంటాడు. వ్యవసాయం సరిగ్గా లేని పరిస్థితుల్లో అనేక మంది భూస్వాముల కుటుంబాల నుంచి యువకులు కార్మిక జీవితాల్లోకి వలస రావడం జరిగింది.

ఓదెమ్మ తనకొడుకు మల్లేశుని పాలేరుగా ఉంచుకొమ్మని రాంరెడ్డిని కోరగానే దొర సమాధానంగా–తనకున్న పాటి వ్యవసాయ భూమిని తానే పండించుకుంటానని మిగిలినదంతా బీడుభూమిగా వదులుతానని కాని పాలేర్లను మాత్రం ఉంచుకోవడం లేదన్నట్లు చెప్తాడు. అంతేగాకుండా మల్లేశు పాలేరుగా పనికి రాలేదని సంఘం అంటూ ఊరురా తిరిగి బందువెట్టించే కార్యక్రమంలో, ప్రజలకు సేవలందించే పనుల్లో క్షణం తీరిక లేకుండా ఉన్నాడనీ దొరల ఎదురించడమే తన పని కాబట్టి పాలేరుగా పని చేయలేడని తేల్చిపారేస్తాడు దొర.విప్లవ జండాలలో పీడిత జనాల వైపు ఉంటూ తాను చేయావల్సిన పనుల గూర్చి దొర తెలుపగా మల్లేశు ప్రాణం ఆగలేక “కడుపు నొచ్చెటోడు వోమ బుక్కుతుడని మీరే అంటరు. నేను పురెక్కితే వాళ్ళు ఎక్కుతరా? ఎవల కడుపు తిప్పలు వాళ్ళు పడ్తరు” (రఘోత్తమరెడ్డి, 2006: 48). అని దొరకి తనదైన విధానంతో సమాధానం ఇస్తాడు.

విప్లవ పోరాటాలతో తిరిగే సంఘం వాళ్ళు దొరల సమస్యలను పట్టించుకోవడం లేదని తమ లాంటి చితికిపోతున్న రైతుల కుటుంబాల గురించి పోరాడితేనే ఇటు రైతులు, అటు పాలేర్ల జీవితాల్లో మార్పు చూడొచ్చునని దొర ఆశిస్తాడు. దొరలకు వ్యతిరేకంగా జీతాలు పెంచమని ఉద్యమాలు, బందులు చేసే బదులుగా షావుకార్ల దౌర్జన్యాల, మోసాల నుండి మాలాంటి కాపుదనపు దొరల్ని రక్షించాలని వాపోతాడు. తమ కోసం పోరాడితే పాలేర్ల జీవితాల్లో మార్పు చవిచూడవచ్చునని ఎర్రజండాలతో నినదించే ఉద్యమకారులను ఉద్దేశించి దొర పలకగా, మల్లేశు అందుకొని దొరల జీవితంలో ఏర్పడ్డ ఆర్థిక లోపాలకు, పీడిత జనంపై సాగుతున్న నిరంతర దోపిడిలకు గల తేడాను వివరిస్తూ వాళ్ళ కడుపాకలి దొరలకు ఏ మాత్రం లేదని వెల్లడిచేస్తాడు. ఎవరి ఆకలి వారిదే ఎవరి

జీవితాల సంఘర్షణకు వాళ్ళే బాధ్యులు. మీ కష్టాలను మీరే సరిదిద్దుకోవాలి. కాబట్టి కాపుదనపు వాళ్ళ గురించి మీరే మేల్కొని, ఉద్యమాల వైపు దృష్టి సారించి కావల్సిన లక్ష్యాన్ని ఛేదించండి అంటూ భవిష్యత్తు ఆచరణకు సూచనలిస్తాడు. ఎంత చేసినా షావుకార్ల చేతిలో మోసపోయిన దొరలకు తిండికి కొదువలేదు. కాబట్టి నిశ్చయంగా ఉన్నారంటూ వెల్లడి చేస్తాడు.

జీతాల విషయంలో పాలేర్లు పోరాడితే గాని వారి గురించి ఎప్పుడూ పట్టించుకోని రైతుల గురించి మల్లేశువివరిస్తాడు. వారి సంభాషణలకు సమాధానాలు చెప్పలేని రాంరెడ్డి దగ్గరకు బొగ్గుగని బావి పనికి బయలుదేరిన తన కొడుకువచ్చి వెలుతున్నాని చెప్తాడు. ఆ మాట వినేసరికి రాంరెడ్డి దొర నిట్టూర్చిపోయి తన తాతల అందించిన ఆస్తులకు, తానేమి సంపాదించాడో బేరిజు వేసుకుంటూ తరిగిపోయిన అస్తులకు చింతిస్తాడు. తానేమి సంపాదించ లేని స్థితియే, తన కొడుకును వలస మార్గంలోకి నెట్టివేసిందని ఆలోచనలో పడతాడు. తనలాగే ఓదెమ్మ కొడుకు మల్లేశుకు కూడా ఉపాధి కోసం బొగ్గుగని బావే శరణ్యం అయ్యేలా ఉందని బాధపడుతుంది.

రైతుల జీవితాల్లో సంభవించిన మార్పును హేతుబద్ధంగా సంభాషణలతో నడిపించిన కథ 'పగలూ రేయీ శ్రమ పడుతున్నా'. రచయిత ప్రతిభ, స్వానుభవం రెండు ఈ కథలో ప్రస్పుటంగా కనిపిస్తాయి. తెలంగాణ పీడిత ప్రజల పోరాటాల ఉధృతిని భరించలేక ఊర్లు వదిలివెళ్ళిన వారు కొందరైతే, వలస వెళ్ళక వాళ్ళ స్వంత ఊళ్ళల్లోనే వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవించేవారు మరికొందరు. కొత్తగా వచ్చిన ఆర్థిక ప్రణాళికలు, పారిశ్రామికశక్తుల వల్ల పెట్టుబడులు పెట్టలేక తీవ్ర ఆర్థిక సంక్షోభానికి గురై అసమర్థులుగా జీవనం సాగించే తరుణంలో దొరల పరిస్థితి వివరిస్తూ వారి తరువాత తరాల బతుకు కోసం వలసబాటని ఎంచుకొన్న దొరల సంతానానికి, పాలేరు సంతానానికి ఎదురైన సమ కష్టాన్ని వివరించిన కథ 'పగలూ రేయీ శ్రమ పడుతున్నా'. "పటేళ్ళ నుంచి పాలికాపు వరకు వ్యవసాయం గిట్టుబాటుకాక బతుకు దెరువుల కొరకు గ్రామాలు వదలి సింగరేణి బొగ్గుబావులకు వలస బయలుదేరుతున్న వారి దు:ఖాన్ని చిత్రిస్తూ రఘోత్తమరెడ్డి రాసిన 'పగలూరేయీ శ్రమ

పడుతున్నా' కథ కూడ తెలంగాణ గ్రామీణ జీవన వాస్తవికతలోని మరోకోణాన్ని చక్కగా ప్రతిఫలింపస్తుంది" (కాత్యాయని విద్మహే, 2013: 141).

తెలంగాణలో సామాన్య ప్రజల జీవన విధానానికి భిన్నంగా జీవించే దొరల కుటుంబాల్లో ఏర్పడ్డ ఆర్థిక లోపాల వల్ల వారు నిరాశ్రయులుగా మారిన తీరును ఈ కథలో వాస్తనికంగా ఎత్తిచూపారు రచయిత. "పగలూరేయీ శ్రమ పడుతున్నా' కథలో ఇటూ ఊళ్ళలో భూస్వాముల జీవితాలు మేలుగా వున్నాయని 'సాయిలు' భావిస్తే, బొగ్గుబావిలో పనిచేసే సాయిలు జీవితమే మేలుగా వుందని భూస్వామి అనుకుంటాడు. చివరికి పాలేరు 'బావి'పనికి వెళ్ళాల్సి ఉంటుంది. భూస్వామి కొడుకు కూడా బావి పనికి బయలుదేరుతాడు. ఈ వ్యవస్థలోని ఆర్థికలోపాన్ని, అద్భుతంగా ఎత్తిచూపిన కథ ఇది" (వరలక్ష్మి, 2013: 367). అంతేగాకుండా ప్రభుత్వ ఆర్థికవిధానాల వల్ల పంటలు పండని పరిస్థితిలో ఉపాధి కొరత ఏర్పడుతుంది. తప్పని పరిస్థితుల్లో వడ్డీలకు అప్పులు తెచ్చుకొని పెట్టుబడులు పెట్టి పంటను పండిస్తే షావుకార్ల మోసాలకు బలైపోయేవారు. ఆ తరుణంలో షావుకార్ల మోసాలను ఎదురించలేక చేసిన కుప్పల కుప్పల అప్పులకు పెరిగిన వడ్డీలను చెల్లించలేక తమ భూములను అమ్ముకొని బొగ్గుగనుల్లోకి వలస వెళ్ళి తట్టమోసే కార్మిక ఉద్యోగానికి సంసిద్ధమైన విషయాన్ని రచయిత ఈ కథలో చెప్పారు. "పగలూరేయీ శ్రమ పడినా వ్యవసాయంలో ఫలితం దక్కక, అయిష్టమైనా, బొగ్గుపనికి పోయిన రామిరెడ్డి పటేలు కొడుకు కథ 'పగలూ రేయీ శ్రమ పడుతున్నా'. ఇది స్వీయ చరిత్రలోని శకలం " (శ్రీనివాసమూర్తి, 2013: 355).

తెలంగాణలో సామాన్య ప్రజల పోరాటానికి ఫ్యూడల్‌వ్యవస్థ ఒక్కసారిగా కుప్పకూలి పోయింది. అప్పటి వరకున్న సామ్రాజ్యవ్యవస్థ స్తంభించిపోయింది. అలాంటి తరుణంలో దొరల జీవనస్థితులను, సామాజిక వ్యవస్థలోని మార్పును రాంరెడ్డి కుటుంబ నేపథ్యంలో నుంచి రచయిత చూసిదాని దృశ్యరూపాన్ని ఈ కథ ద్వారా మనకు అందించాడు.

## 2.6 వివాహానికి సంబంధించిన కథలు

మానవజీవితంలో, సంబంధాలలో వివాహవ్యవస్థ ముఖ్యమైంది. ఈ వివాహావ్యవస్థ వారి వారి సంప్రదాయాలను, ఆచారాలను అనుసరించి ఉంటుంది. స్త్రీ, పురుషులిద్దరు కలిసి చేసే సహాజీవవాన్ని ఏర్పరిచేది వివాహబంధం. కాని ఆ బంధం కలుషితంగా లేకుండా నిర్మలంగా ఉన్నపుడు మాత్రమే వారి జీవితాలు సుఖమయం అవుతాయి. రెండు మనసులు ఒకటై, కుటుంబవ్యవస్థ, సామాజిక జీవితం, ధర్మం, నీతినియమాలు అన్నీ కూడా ఈ వివాహ వ్యవస్థను నడిపిస్తాయి. వీటిలో ఏవీ లోపించినా ఆ జీవితాలు సంఘర్షణకు గురికాక తప్పదు. మన వివాహావ్యవస్థలో వరకట్నాలు, లాంఛనాల పేరున జరుగుతున్న దోపిడి చాలా కాలం నుండి వస్తూనే ఉంది. అంతేగాక ఇరు కుటుంబాలలో పురుషుడి వైపు ఉన్న కుటుంబం కొంత అధికారికంగా ఉండి, స్త్రీ వైపు ఉన్న కుటుంబాల వారిని నిత్యం దోచుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. ఎన్నో అభాండాలను, అపార్థాలను వేసి అవమానాలకు గురిచేసి దౌర్జన్యాన్ని చేస్తుంటాయి. ఇది సహజంగా సమాజంలో జరుగుతున్న వాస్తవికాంశం. ఏ మతాలలోనైనా ఇద్దరు వ్యక్తుల మధ్య పరస్పర అవగాహన లేకుండా జరిగే విహహాల విషయంలో స్త్రీల జీవితాలు మరింత జటిలంగా తయారవుతున్నాయి. ఈవిధమైన అంశాలను కథావస్తువుగా గ్రహించి తుమ్మేటి కథలుగా రాశారు. వాటిని కింద పరిశీలించాను.

### 2.6.1 పెండ్లి

చిన్నప్పటి నుండి అల్లారు ముద్దుగా పెంచుకున్న తన చెల్లెలు పెళ్ళి చేసుకొని అత్తగారింటికి వెళుతున్న సమయంలో ఒక తండ్రి, అన్న పడే బాధను వివరిస్తున్న కథ 'పెండ్లి'.

చింతల రాజెం ఒక మధ్యతరగతి కుటుంబానికి చెందినవాడు. బొగ్గుగనిలో కోల్‌ఫిల్లర్‌గా పనిచేసి రిటైరైనాడు. అతనికి ముగ్గురు కొడుకులు, ఒక కూతురు. ఒక కొడుకు బొగ్గుబావిలో పడి చనిపోతాడు. రెండోవాడు పెళ్ళి చేసుకొని వేరే కాపురం పెడతాడు, మూడోవాడు ఆఖరివాడు ఆనందం బదిలీఫిల్లర్‌గా చేస్తున్నాడు. చిన్నప్పటి నుండి మోటుకష్టం చేసేవాడు. బొగ్గుగనిలో కోల్‌ఫిల్లర్‌గా

పనిచేస్తూ కూడబెట్టిన డబ్బులతో ఒక్కానొక కూతురు పెళ్ళి చేయాలని ఆశ పడతాడు. రాజెం తమ్ముడు పిచ్చి వీరయ్య. ఆ వీరయ్య కూడా కోల్‌ఫిల్లర్‌గా పనిచేస్తున్న సందర్భంలో బొగ్గుగనిలో జరిగిన ప్రమాదం వల్ల కాళ్ళు నుజ్జు నుజ్జు అయి ఉద్యోగం నుండి తీసివేయబడతారు. దాంతో అతని భార్య కంపెనీ వాచ్‌మేన్‌తో లేచిపోతుంది. ఆ మానసిక వ్యధను తట్టుకోలేక సమాజంపై తనకున్న వైఖరిని మార్చుకుని పిచ్చివాడిగా ప్రవర్తిస్తాడు. రాజెం తన కూతూరు పెళ్ళి చేయాలని నిశ్చయించుకొని కష్టపడి సంపాదించిన డబ్బుతో పెళ్ళి చేస్తాడు. కాని పెళ్ళి కొడుకు తల్లి పెద్దగయ్యాళి గంగమ్మ లాంటిది. డబ్బుల మీద ఆశే తప్ప మానవత్వమే లేని మనిషి. పెళ్ళి చేసి బాధలో ఉన్న రాజెంను సరైన లాంఛనాలు పెట్టలేదని ఇష్టం వచ్చినట్లు తిడుతూ అవమాన పరుస్తుంది. సూటిపోటి మాటలతో పెండ్లికూతురి వైపు వారిని దూషించడం తప్ప ఆత్మీయతఅనుబంధాలకు ప్రాధాన్యమివ్వని మనిషి. పెళ్ళి అయిన తరువాత తన కూతురు అత్తగారి గురించి తెలుసుకొని అన్న ఆనందం బాధపడతాడు. అత్త విషయం అలా ఉన్నా తన చెల్లెలుకు భర్త కాబోయే వ్యక్తైనా సరైన వాడు అని అనుకుంటే అదీ లేదు. కూరగాయాల వ్యాపారం చేస్తున్నాడంటే ఇచ్చారే కాని గుండా అని తరువాత తెలుస్తుంది. ఇక అన్నివైపుల దారులు మూసుకొని చిక్కుకున్న అమాయకురాలైన తన చెల్లెలు జీవితం గురించి విచారిస్తుంటారు. తండ్రి మనసు చెప్పలేనంతగా విలవిల లాడిపోతుంది. పెళ్ళయ్యాక అత్తగారింటికి బయలు దేరుతూంటే అన్న ఆనందం తన చెల్లెలు భవిష్యత్తు తలుచుకుంటూ బాధపడతాడు.

ఆ సమయంలో పిచ్చివీరయ్య వచ్చి ఆనందంకు చెప్పిన మాటలు ఆ కథను తారస్థాయికి తీసుకెళతాయి. “సెల్లెను నోట కరచుకొని జంగపిల్లోలిగె బావ ఎత్తుకు పోతాండని నీకు గూడ అనిపిత్తాన్నాదిరా? వారీ ఆనందా! నీకు సెల్లెను సూత్తేనే గట్ల అనిపిత్తాందిరా? నన్ను సూత్తె ఏమనిపిత్తదిరా వారీ? ఇగో నా రెండు కాళ్ళు కరకర నమిలి తిన్నరు. ఇగో నాతలకాయల మెదడుకూడ గోలిచ్చుక తిన్నరు. మీ అయ్యను సీకేసిన బొక్క తీరుగచేసి పారేసింద్రు, అయినా వానికి సోయిలేదు. అయ్యో! సెల్లీ అని ఏడుత్తానవ్. ఊకోర గాడ్ది! ఏవిట్లకు ఏం జూత్తివి” (రఘోత్తమరెడ్డి, 2006: 111).

లోకం తీరును, సమాజంలోమానవ సంబంధాలను బలవంతుడు బలహీనున్ని ఏవిధంగా దోచుకుంటునాడోరచయిత వీరయ్య పాత్ర ద్వారా వివరించారు.

ఈ కథ ద్వారా రచయిత, పెళ్ళి అనే ఉచ్చులో బలైపోతున్న అమాయకపు స్త్రీల గురించీ, మధ్యతరగతి కుటుంబాలలో పిల్లల కోసం తల్లిదండ్రులు పడే బాధ గురించీ వివరించాడు. ముఖ్యంగా రాజెం లాంటి సున్నిత స్వభావుడిని వియ్యపురాలు వేధిస్తున్న తీరును బట్టి స్త్రీ, పురుష వర్గ స్వభావాన్ని ఏవిధంగా నిర్ణయించిబడిందో తెలుస్తుంది. ఎంతో కష్టపడి పోగుచేసిన ధనాన్ని, చిన్నప్పటి నుండి అనురాగంతో పెంచిన కూతురును ఒక్కసారిగా తీసుకెళుతుంటే ఒక తండ్రికి కలిగే బాధ రాజెం పాత్ర ద్వారా తెలుస్తుంది.

పెళ్ళి చేసుకొని వెళుతున్న కూతురిని ఆపలేని పరిస్థితిలో, నిస్సహాయుడిగా మిగిలిపోవాల్సి వస్తుంది తప్ప విధిని ఎదురించలేడు. ఎందుకంటే మనది పురుషాధిపత్య సమాజం. ఈ సమాజం నిర్ణయించిన సామాజిక రుగ్మతలను దాటలేని స్థితిలో ఆనందం, రాజెం నిస్సహాయులుగా మారిపోతారు. వాళ్ళు గయ్యాళి అత్త చేసే అవమానాలకు ఎదురుతిరగక మౌనంగా ఉంటారు. ఆగ్రహం వచ్చినా ఎదురించలేరు.పెళ్ళిలో స్త్రీకి సంబంధించిన వాళ్ళు కాబట్టి అణిగిమణిగి ఉండాల్సి వస్తుంది. “ఈకథలో పెళ్ళి ఒక దోపిడి, పీడన రూపంగా ఎలా పరిణమించిందో చిత్రితమైనప్పటికీ, మనషుల ఆగ్రహం అనాదిగా వస్తున్న కట్న, కానుకలనే పీడక సాంప్రదాయాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టలేదు. ఆ ఆగ్రహం మనష్యుల మధ్య ఎలా బదలాయింపబడి రూపం మార్చుకొని రాజీమార్గం పడతుందో ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది” (రవీందర్, 2013: 122).

చివరికి వీరయ్యపాత్ర ద్వారా చెప్పించిన మాటలు కఠోరసత్యాలు.“అదెరా లంజకొడుకులార రోజూ మనుషులను పీక్కుతినేటోళ్ళు ఇయ్యాల సంసార్ల తీరుగ అన్నం దింటంట్లేందిరా” అని పిచ్చివాడు ఓ ప్రశ్న బాంబు పేలుస్తాడు. మనుషులు, మనుషుల్ని పీక్కుతినే మనందరి సమూహాన్ని వ్యవస్థను ఈ పిచ్చివాడి ప్రశ్న సవాల్ చేసినట్లు వుంటుంది” (నారాయణ, 2013: 78). కుటుంబాల

మధ్య ఉండే హింస అవమానాల కన్నా వర్గపరమైన, వ్యవస్థపరమైన రాజ్యహింస అత్యంత దుర్భరమైనవని తెలియజేశారు రచయిత.

### 2.6.2 వేటగాడి చూపులు

ఒకరి జీవితాలతో మరొకరికి కనీస అవగాహన లేకుండా ఏర్పరచుకొనే వివాహ బంధాల్లో నలిగి పోయే స్త్రీల జీవితాలను, వారి స్వేచ్ఛను హరిస్తున్న పురుషాస్వామిక సమాజాన్ని నిలదీసిన కథ 'వేటగాడి చూపులు'.

సమీర సమద్ స్నేహితురాలు. సమద్‌ను ప్రేమించిన అమ్మాయి. అతని కోరికపై సమద్ చెల్లెలు తస్లీమ్ పెళ్ళి చూడటానికి వస్తుంది. సమద్‌కు ఇద్దరు చెల్లెలు. వీరిది సాధారణ మధ్యతరగతి కుటుంబం. పెళ్ళికి వచ్చిన సమీర సమద్ మీద వున్న ప్రేమతో సమద్‌కు సంబంధించిన ప్రతిదీ ఆరాధనీయ భావంతో, సానుభూతితో చూస్తుంది. సమద్ పెళ్ళి పనుల్లో ఉంటాడు. సమీర పెళ్ళి వాతావరణాన్ని పరిసరాలను గమనిస్తుంటుంది. సమద్తండ్రి మగపెళ్ళి వారికి ఎటువంటి ఆటంకం రాకుండా జాగ్రత్తపడే ఆరాటాన్ని పరిశీలిస్తుంది. అయినప్పటికీ తస్లీమ్ అత్తగారి పెత్తనం, అంతులేని కోరికలకు, సమద్ తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతారు. తస్లీమ్ మౌనాన్ని, అత్తగారి గయ్యాళితనాన్ని చూసి ఆలోచనలో పడుతుంది. అమాయకురాలైన తస్లీమ్ తన జీవితం ఎలా ఉండబోతుందో అని విచారంలో పడుతుంది. అత్తగారి అహంకారాన్ని, అధికారాన్ని, అగాడాలను ఆపితే ఎక్కడ తన కూతురి జీవితం మీద ప్రభావం పడుతుందేమోనని భయం. బలమైన పురుష సంబంధం వల్ల తానేమి అన్న అడిగే వారు లేరనుకొనే  అత్తగారి మీతిమిరిన స్వేచ్ఛ. ఆడపిల్ల తరపున వున్నవాళ్ళు కనుక సమద్ తల్లిదండ్రులు మౌనాన్ని వహించక తప్పని పరిస్థితి. ఇలా పెళ్ళి కాస్త అయిపోతుంది.

కుల, మతాల సామాజిక రుగ్మతల వల్ల సమాజం ఏంటో తెలుసుకోలేని దు:స్థితిలో పెరిగిన తస్లీమ్ జీవితం అత్తగారింట్లో ఎలా ఉండబోతుందో ఊహించుకుంటూ బాధపడతుంది సమీర. తస్లీమ్‌కు ఒక్కతే కాదు ఇలాంటి జీవితాల్ని ఎదిరిస్తూ గడుపుతున్న స్త్రీలెందరో అని ఆలోచనలో

పడుతుంది. ఇక తస్లీమ్‌ను జీవితాంతం తోడునీడగా ఉండే భర్తని చూసి ప్రేమే ప్రాతిపదిక లేని ఇరు జీవితాలు ఎలా గడుస్తాయని విస్తూపోతుంది. తస్లీమ్ భర్త ముఖంలో తస్లీమపై ఎలాంటి ప్రేమానురాగాలు కనిపించవు. వాటి స్థానంలో అసహనం, వాంఛ ఉన్నాయన్నట్లు సమీర మనస్సు నిట్టూరుస్తు. ఎంతమంది తరాలుగా, యుగాలుగా సంప్రదాయ వివాహ చట్రంలో కృత్రిమ సంబంధాలలో మగ్గిపోయిన, మగ్గిపోతున్న తల్లులు, వారి తల్లులు ఇలా బలైపోగా ఇప్పుడు తస్లీమ వంతు అని అనుకొని సమీర తీవ్ర మదనానికి గురైపోయి సొమ్మసిల్లిపోతుంది. “కథ చివరి భాగంలో మృగ్యమైపోతున్న ప్రేమ పట్ల, స్వేచ్ఛా రాహిత్యం పట్ల, ధ్వంసమౌతున్న మానవ విలువల పట్ల సమీర ఆక్రోశించడం కనిపిస్తుంది” (రవీందర్. 2013: 123). అందుకే సహజమైన ప్రేమ, ఆప్యాయత అనురాగాలకు దూరమై విధి వైపరీత్యంలా భావించి కర్మ సిద్ధాంతాన్ని వల్లెవేస్తున్న బానిస బతుకులను సాగిస్తున్న స్త్రీలెందరినో ఈకథ కుదిపేస్తుంది, ఆలోచింపింప చేస్తుంది. ఈ పురుషాధిక్య సామ్రాజ్యాన్ని ప్రశ్నింపజేస్తుంది.

సంప్రదాయ వివాహవ్యవస్థలో తమకంటూ ఓ వ్యక్తిత్వాన్ని నిర్మించుకోలేక పురుష శక్తులు కట్టిపడివేసిన ఉచ్చులో అనాదిగా స్త్రీ అణచివేయబడుతూనే ఉంది. స్త్రీకి స్వేచ్ఛ లేకుండా చేసిన ఈ సమాజం స్త్రీ నిరంతరం ఒకరి ఆధీనంలో మగ్గిపోయి ఉండేవిధంగా చేసి, బొమ్మలాటలా ఆడిస్తూనే ఉంది. ఏ కుల, మతాలతో సంబంధం లేకుండా స్త్రీ స్థానాన్ని ముందుగానే నిర్ణయించిపెట్టినట్లు ఆచారాలు, సంప్రదాయాలు నిర్మింపబడ్డాయి. “‘వేటగాడి చూపులు’ కథలో పెళ్ళి అనే బంధానికి బలయిపోయి, భయవిహ్వాలలై, భర్తకు నీడ కాబోతూ, సంప్రదాయమనే ఛాందసాల పళ్ళచక్రంలో ఇరుక్కుని, అత్తవారింటికి తరలి పోతున్న ఒక ముస్లీం యువతి మూగ వేదనని అద్భుతంగా చిత్రించాడు. రచయిత కథంతా సమీర అనే పెళ్ళి కూతురి స్నేహితురాలి దృక్కోణం నుంచీ నడుస్తుంది” (విహారి, 2013: 374). ఆ విధంగా తస్లీమ భర్త ఎలాంటి వాడైనా తలవంచుకొని తాళి కట్టించు కోవడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో అత్తగారింటికి వెళ్ళాల్సిందేనని తెలుస్తుంది. తనతో పాక్షిక పరిచయం లేకుండా, పరస్పర అవగాహన రాహిత్యంతో వెళుతున్న తల్లిదండ్రుల బాధ్యత

తీర్చినట్లు పయనం అవుతుంది. "అసలు ప్రేమనేది తెలియకుండా భార్యాభర్తలు జీవితాంతం కలిసి ఎలా బతుకుతారోనని విస్తుపోతుంది. అనుక్షణం రాజీపడుతూ ఒకే ఇంట్లో వేర్వేరు అంతరంగిక ప్రపంచాలతో కలిసి బతకడం స్త్రీల పాలిట ఎంత హింసాపూరితమౌనని విచారిస్తుంది. యధాస్థితిని నిర్విమర్శగా స్వీకరిస్తూ ఉన్నదాంతో తృప్తి చెందే మానవలక్షణం సామాజిక మార్పుకు ఆటంకమని గుర్తిస్తుంది. పెళ్ళి అనేది ఒక అవసరంగా కాకుండా స్త్రీల పురుషులిరువురికీ ఐచ్ఛికంగా ఒకరిలో ఒకరు లీనం కావాలనే తపన ఉండటం ముఖ్యమని భావిస్తుంది. ఇందుకు అనాదిగా సాంప్రదాయం విధించే కృత్రిమ బంధాలను ధిక్కరించి ప్రేమ ప్రాతిపదికగా వివాహం చేసుకోబోయే స్త్రీ, పురుషులు ఒక్కటై మనసా, వాచా, కర్మణా సహచరులుగా వుండాలని సమీర అభిప్రాయపడుతుంది" (రవీందర్. 2013: 123). పుట్టినప్పటి నుండి ఇంటికి భారంగా ఉందని భావించిన తల్లిదండ్రులకు విముక్తి కలిగిస్తూ కన్నవారికి దూరంగా కష్టాల అలజడిలో చిక్కుకుపోయే తస్లీమ జీవితం ఎందరో స్త్రీల అంతర్లీన సంఘర్షణను, మౌనవేదనని చిత్రించిన కథ 'వేటగాడి చూపులు'."ఆడపిల్లకు పెళ్ళి చేయ్యడం అనేది పెద్ద భారమై కూర్చుంటోంది. పెళ్ళికూతురి పుట్టింటిని దోపిడి విధానంతో పీల్చి పిప్పి చేసే వివాహా విధానాన్ని కళ్లకు కట్టించాడు రచయిత. ఇక్కడ పిటీ ఏమిటంటే నలుగురిలో బైటికి కన్పించేవి. అత్తాగారు, ఆడబిడ్డల నోటి దురుసుతనాలు. అమ్మాయిని గుండెల్లో పెట్టుకుని చూసుకోవాల్సిన వరుడు ఈ తతంగాల్తో తనకేమీ ప్రమేయం లేనట్టు మౌనం వెనుక దాక్కోవడం దానికంతటికీ తెరవెనుక కారకుడు అతడే అని చెప్పక చెప్పడం" (వరలక్ష్మి, 20103: 368).

ఈ విధంగా పైరెండు కథల్లో రచయిత వివాహబంధంలో ఉన్న లొసుగులను, ఒడిదుడుకులను, కష్టనష్టాలను విప్పి చెప్పడమే కాక వివాహం పేరుతో అంతర్గతంగా జరుగుతున్న ఒకవైపు వర్గ స్వభావుల మీద మరో వర్గస్వభావులు జరిపే దోపిడిని చూపించారు. "పితృస్వామిక కుటుంబ వ్యవస్థల్లో స్త్రీ, పురుషుల కంటే వారి వారి సంబంధ స్థానాలే వారి చైతన్యాన్ని నిర్ణయిస్తున్నాయని ఈ కథ ద్వారా మనకు తెలుస్తుంది" (రవీందర్. 2013: 123).

## 2.7 మానవ సంబంధాలు

మనుషుల మధ్య ఉన్న సంబంధమే మానవ సంబంధం. మనిషి తాను జన్మించిన క్రమం నుండి అప్రయత్నంగానే ప్రకృతితో, జంతువులతో, తన తోటి వ్యకులతో అనుబంధాన్ని ఏర్పరచుకుంటాడు. అలా తనకంటూ వ్యక్తిత్వం నిలుపుకుంటూ తోటివారి వ్యక్తిత్వంతో మమేకం చెందుతాడు. సమాజంలో భిన్న వ్యక్తిత్వాలు కలిగిన వారుంటారు. వారు జీవించిన పరిస్థితుల వల్ల వారికంటూ ఒక దృక్పథం ఉంటుంది. ఆ దృక్పథానికి చేరువలో ఉన్న వారితో మాత్రమే సంబంధాన్ని బలపరుచుకుంటారు. మిగిలిన వారితో పరిచయాలున్నా ఆత్మీయత లోపించి స్వల్పమైన సంబంధాన్ని కొనసాగిస్తారు. ఎందుకంటే తన చుట్టూ వున్న సామాజిక రుగ్మతలు, సంస్కృతులు తనని అలా రూపొందింపచేస్తాయి. కాని ఆధునిక కాలంలో కృత్రిమంగా ఏర్పడే మానవసంబంధాలే తరుచుగా కనిపిస్తాయి. రఘోత్తమరెడ్డి గనుల్లో పనిచేసి అక్కడ పరిశీలించిన మానవ జీవితాలను కథలుగా రాశారు. బొగ్గుగనుల్లో రేయింబగల్లు కష్టపడి ఇంటికి వచ్చి సొమ్మసిల్లిన జీవితాల్లో భార్యలతో పోరు, అనుమానాలు, కుటుంబకలతలు, బాల్య నుండి వున్న స్నేహితుల మధ్య ఆలోచనలో కలిగే మార్పును, తండ్రికి పిల్లలపై వున్న బాధ్యతను, భద్రతను స్పర్శిస్తూ రాసిన కథలను కింద పరిశీలించాను.

### 2.7.1 ఓ మెరుపు మెరిసింది

పొలం పని కోసం వెళ్ళిన తన కొడుకు భయకరమైన తుఫానులో చిక్కుకోగా ఒక వృద్ధ తండ్రి పడే ఆరాటం, తపన, పుత్ర వాత్సల్యమే 'ఓ మెరుపు మెరిసింది' కథావస్తువు.

నరసయ్య ఒక సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన ముసలివాడు. వయస్సు ముదిరి కాలు జారి కింద పడటంతో మంచాన పడి వృద్ధాప్యంలో ఉంటాడు. అతని ఒక్కగానొక్క కొడుకు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఒకరోజు సాయంత్రం పొలానికి వెళ్ళిన కొడుకు తీవ్రమైన వర్షం వల్ల ఎంత సేపటికి ఇంటికి రాడు. కొడుకు ఇంటికి రాకపోవడంతో నరసయ్య ఆందోళనకు గురైతాడు. ఆత్రుత, ఆరాటం ఇంకా ఎక్కువై, చదువుకుంటున్న తన కొడుకు కొడుకైన మనవన్ని తన తండ్రి కోసం

టార్చిలైటు ఇచ్చి అంతటి వర్షంలో పంపిస్తాడు. దాన్ని బట్టి ఆ తండ్రికి కొడుకు మీద ప్రేమ, ఆరాటం ఎంతుందో గమనించాలి. ఇక తన కొడుకు, మనవడు ఎప్పుడెప్పుడు వస్తాడని వేయికన్నులతో ఎదురుచూస్తున్న తరుణంలో భార్య కొమురమ్మ గోల భార్యది. తమ కొడుకును క్షణం తీరిక లేకుండా కష్టపెడుతున్నావని సాధింపు. జీవితంలో ఒడిదుడుకులను బాగా ఆకళింపు చేసుకొన్న నరసయ్య పొలం అంటే తల్లితో సమానమని, సాగుచేయడం అంటే మాటలు కాదని, దాన్ని కంటికి రెప్పలా చూసుకోవాలని, అసలే కాలం మంచిది కాదని కుక్కలా కాచుకు కూర్చున్న దొరలు ఏ క్షణాన భూమిని లాక్కెళుతారో చెప్పలేమని, దొరల దౌర్జన్యాలకు ఎందరో బలైనారని తన గత జీవితానుభవాన్ని తన భార్యకి చెప్తాడు. ఎంతో కష్టపడి దక్కించుకొన్న ఈ కాస్త పొలాన్ని చూసుకోకపోతే తమకు తిండి ఎక్కడ నుండి వస్తుందని అడుగుతాడు. ఈ లోపు కొడుకు, మనవడు ఇంటికి రాగానే నర్సయ్య కళ్ళలో మెరుపు, ముఖంలో ఆనందం వెలుగుతాయి. ఇంత వర్షంలో తన కొడుకును పంపించినందుకు నర్సయ్య కొడుకు తండ్రిని కోప్పడతాడు. “గింత గాలివానల గీపోరన్నితోల్తవా? తల్కాయలేని మనిషి!” (రఘోత్తమరెడ్డి, 2006: 57). దాంతో తండ్రి నర్సయ్య నేరస్థుడిలా నిలబడి తర్వాత తాను చేసిన పనికి చిరునవ్వుతో సమాధానం చెప్తాడు. తన కొడుకు మీద తనకెంత ప్రేమ ఉందో, అంతే స్థాయిలో తన మనవడి మీద తన కొడుక్కు ఉంటుందని గ్రహిస్తాడు నర్సయ్య.

‘ఓ మెరుపు మెరిసింది’ కథ స్వాతి పత్రికలో మొదటి బహుమతి పొందింది. నర్సయ్య పాత్ర ద్వారా అసలు సిసలైన మానవ మనస్తత్వాన్ని, మానవ సంబంధాన్ని చిత్రించారు. ఒక తండ్రికి కొడుకు మీద ఉండే ప్రేమ, ఆప్యాయత, మమకారం, కన్నతీపి ఎటువంటిదో వివరిస్తూ, దొరల కాలంలో దౌర్జన్యాన్ని, దోపిడి దారులు అరాచకత్వం వల్ల ఎంతోమంది రైతులు భూములు లేని నిస్సహాయులుగా మిగిలిపోయిన విషయాన్ని రచయిత ఈ కథ ద్వారా తెలియజేశాడు. అంతేగాకుండా నర్సయ్య లాంటి తండ్రులకు కొడుకు మీద వున్న బాధ్యతను, కొడుకు భవిష్యత్తు గురించి జాగ్రత్త పడ్డ తీరును సూచించాడు. తమ బిడ్డలకు చిన్న కష్టం వచ్చిన తట్టుకోలేని తల్లిదండ్రులు ఒక బీభత్సమైన వర్షపు తుఫానులో చిక్కుకున్నప్పుడు ఏవిధంగా ఆందోళనకు గురైతాడో ప్రకృతి సృష్టించే ప్రళయాన్ని నర్సయ్య

గుండెల్లో రగిలించాడు రచయిత."రఘోత్తమరెడ్డి కథల్లో మానవసంబంధాల్లోని మమకారాన్ని కళ్లకు కట్టిన కథ ఓ మెరుపు మెరిసింది కళ్లు బైర్లు కమ్మేట్టుగా ప్రారంభమైన ఈ కథలో బైట గాలివాన బీభత్సానికి సరిజోడుగా–బైట కెళ్ళిన కొడుకు కోసం నర్సయ్య మనసులో చెలరేగిన తుఫానును వర్ణిస్తూ పాఠకున్ని ఆ బీభత్సంలో ముంచి తేల్చి చివరికి హమ్మయ్య అని మనసు తేలిక పడేట్టు ముగించిన కథ ఇది" (వరలక్ష్మి, 2006: 367). అంతేగాకుండా, ఒక తరం మరో తరానికి అందించాల్సిన ఆస్తిగాని, సంపదగాని సంక్రమించాల్సిన విషయంలో అవాంతరం ఏర్పడినప్పుడు పిల్లల కోసం పడే తాపత్రయం, వారి భవిష్యత్తు కోసం ఆ ఆస్తులను ఏలా రక్షించుకోవాలో అనే విషయాలను తక్కున సంభాషణలతో అందించాడు. సందు దొరికితే సవాల్ చేసి మరీ దోచుకోవడానికి సిద్ధంగా వున్న దొరల మనస్తత్వాన్ని నర్సయ్య మాటలచేత చెప్పిస్తాడు. "వూళ్లె గద్దలసోంటిదొరలున్నారు. వాళ్ళకు, ఎక్కడి భూములు పక్కనేసుకున్నా చాలుతనయా? లేదు. ఎక్కడెవన్ని ఏ చిక్కుల్ల యిరికించుడు.ఎట్ల అప్పుల పాలు చేసుడు. అప్పుల కిందికి భూమినెట్ల–బేదకల్ చేసుడు... ఎన్ని వుపాయాలు పన్నుతరు" (రఘోత్తమరెడ్డి, 2006: 55). ఇలా సమాజంలో ఉన్న దుర్భర పరిస్థితుల నుండి తమ బిడ్డలను ఎలా రక్షించుకోవాలో అనే విషయాన్నికూడా ఈ కథలో చర్చించారు.

### 2.7.2 పట్టు

బొగ్గుగని కార్మికవాడ కుటుంబాలలో, ఇతర కుటుంబాలలో వచ్చే చిన్న చిన్న కష్టాలకు, కలతలకు ఓర్పు, సహనం కోల్పోకుండా ధైర్యంగా నిలబడి ఎదుర్కోవాలని చెప్పటం కథావస్తువు.

గోపయ్య–కొమురమ్మ భార్యభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. గోపయ్యకు చిన్నదుకాణం ఉంది. దాన్ని చూసుకోవడమే తలకి మించిన భారంగా ఉండి ఇంట్లో విషయాలను పట్టించుకోడు. చుట్టూ పక్కల వారికి సహాయం చేసే స్వభావం కలవాడు. భార్య కొమురమ్మకు ఆరోగ్యం బాగుండదు. భర్త గోపయ్య అస్తమానం దుకాణంతో సతమతమవుతుండడం వల్ల ఇంటికి రాలేకపోతాడు. భర్త ప్రవర్తన చూసి కొమురమ్మ తన అన్న పోశెట్టికి కబురు చేస్తుంది. ఎన్నో కష్టాల చిక్కులతో వున్న పోశెట్టికి

కొమురమ్మ బాధ తోడైతుంది. కొమరమ్మ పోశెట్టితో పుట్టింటికి వస్తానని అంటుంది. అతనికి ఇప్పటికి ఇంటి మీద వున్న ఇద్దరు చెల్లెలు గుర్తొచ్చి కొమురమ్మ కూడా తన మీద భారమైతుందేమోనని విచారిస్తుంటాడు. అది గమనించిన కొమురమ్మ నీ ఇంటికి రానని సవాల్ చేసినట్లు మాట్లాడుతుంది. వారి సంభాషణ సాగుతూండగానే ఎదురింట్లో వున్న రాజవ్వ కూతురు విజయ వస్తుంది. విజయను రెండు సంవత్సరాల నుండి ఇంటి మీదనే ఉంచిన తన భర్త గురించి, వారం రోజులు పనిచేసి వారం తప్పతాగి తిరిగే తండ్రిని గురించి అన్న పోశెట్టికి కొమురమ్మ చెప్పుకొస్తుంది. తర్వాత కొమురమ్మ తన బావ గోపయ్య ఎప్పుడూ దుకాణంలో ఉంటున్నాడని, ఎవరడిగిన లేదనకుండా సహాయాలు చేస్తాడని, ఇతరుల విషయాల్లోని జోక్యం చేసుకోవడం వల్ల జరిగే ఫలితాల గురించి చెప్పుకొస్తుంది. రాజవ్వ కొడుకుల్లో ఒకడు కమ్యూనిస్టుగా మారి జైలుకి పోతే తనని రక్షించడానికి చిక్కుల్లో పడ్డ గోపయ్య బావ వల్ల తనకు తన పిల్లలకు ఏదో జరుగుతుందని ఆందోళన చెంది తన బాధను పోశెట్టికి చెప్పుకొని ఏడుస్తుంది. అదంతా విని బావను మందలించడానికి బయలుదేరతాడు పోశెట్టి. రోడ్డు విస్తరించే క్రమంలో తన దుకాణాన్ని లోపలికి జరిపే పనిలో వున్న గోపయ్య పోశెట్టిని చూసి విషయాన్ని గ్రహిస్తాడు. ఇతరులకు సహాయం చేస్తున్న గోపయ్యను చూసి ఇతరుల విషయాల గురించి మనకెందుకన్నట్లు మాట్లాడుతాడు. దానికి సమాధానంగా గోపయ్య ఇతరులకు సహయం చేస్తేనే తమకు ఇతరులు అవసరమైనప్పుడు సహాయం చేస్తారని చెప్తాడు. రాజవ్వ కొడుకు విషయంలో తలదూర్చిన గోపయ్యను మందలించే ప్రయత్నం చేస్తాడు. దానికి ఇరుగుపొరుగు వాళ్ళకు సహాయం చేయకపోతే తను ఆపదలో ఉన్నప్పుడు ఎవరు ఆదుకుంటారని, తన చెల్లెలుతో చేసే గొడవలు, సవాసం గురించి చెప్పి తనతో కావటం లేదని పోశెట్టితో తన చెల్లెలుని పుట్టింటికి తీసుకుపొమ్మని చెప్తాడు. పోశెట్టి ఇరుపక్షాల్లో ఎటువైపు మాట్లడాలో తెలియక అయోమయ స్థితిలో పడతాడు. ఆ క్షణాన రాజవ్వ తన కూతుర్ని రెండు సంవత్సరాల తర్వాత వచ్చి తీసుకుపోతనన్న అల్లుని గురించి చెపుతుంది. గోపయ్య రాజవతో "ఎవళ పిల్ల వాల్లింటికి పోనియ్యే రాజక్క–నీకు ఉన్న బాధలు సాలయా?" అని అంటాడు. ఆ మాటలకు రాజవ్వ "ఏంది తమ్మి – బాధలున్నయని – కన్నోల్లను బాయిల దొబ్బుతమా?

ఇగో నారెక్కల సల్లగుండాలెగని–గిసోంటి నాలెముచ్చోళ్లను పదిమందిని సాదుకత్త” అని ఆత్మవిశ్వాసంతో చెపుతుంది. ఆ మాటకు పోశెట్టి, గోపయ్య బిత్తరపోయి వాళ్లిద్దరికి కష్టాల్లో ఉన్నపుడు కొండంత ధైర్యంతో, గుండెనిబ్బరంతో ఉండాలని హితోపదేశం చేసివెళుతున్నట్లు అనిపిస్తుంది.

కుటుంబాల్లోని కలతలు అనేవి సహజంగా వస్తాయి. వాటిని ఎదుర్కోవటానికి మనిషి చేసే సంఘర్షణ అంతా ఇంతా కాదు. ఎవరైతే కష్టాలకు లొంగక ధైర్యంగా ఎదిరిస్తారో వారే చివరికీ విజేతగా నిలుస్తారని ఈ కథ ద్వారా తెలుస్తుంది. మార్గదర్శక పాత్రగా రాజవ్వ, గోపయ్య, పోశెట్టిల మధ్య ఒక ఆలోచనాత్మక ఆచరణను నిలబెట్టడానికి ప్రయత్నించినట్లుగా చిత్రించబడింది. అంతేగాదు పాఠకుల్లో తమలోని లోటుపాటులను, మితిమీరిపోయిన ఆవేశానికిగురయ్యే వారిని ప్రశ్నించుకునేలా చేస్తుంది. సమాజంలో కుటుంబంలోని వారితో మాత్రమే కాక ఇతరులతో కూడా స్నేహబాంధవ్యాలను నిలబెట్టు కోవడానికి మనిషి ఎంత ప్రయత్నిస్తే అంత ఉన్నతుడుగా తీర్చిదిద్దబడతాడు. స్వార్థం, ఈర్ష్య లాంటి స్వప్రయోజనాలు మాని ఇతరుల కష్టాలలో పాల్గొని తోడుగా నిలిచిన పాత్రగా గోపయ్య కనిపిస్తాడు. గోపయ్య ఇతరుల విషయాల్లో తలదూర్చి తానెక్కడ కష్టాలను తెచ్చిపెడతాడోనని కొమురమ్మ వాపోతుంది. ఇలా వారి స్వభావం వారిద్దరి మధ్య మనస్పర్ధలకు, కలతలకు కారణమవుతాయి.చెల్లెలు జీవితాన్ని సంస్కరించడానికి, సర్ధిచెప్పడానికి  పోశెట్టి పాత్ర ప్రవేశపెడతాడు. సమాజంలో ఉన్న భిన్న మనస్తత్వాలను అర్థం చేసుకోలేక గందరగోళానికి గురైతాడు పోశెట్టి. ఎవరి సమస్యలను వారు పరిష్కరించుకోవడం లేదా సర్దుబాటు చేసుకోవడం తప్ప చిన్న చిన్న విషయాలకు మానవ సంబంధాలను దూరం చేసుకోవడం సరికాదని రాజవ్వ పాత్ర ద్వారా తెలుస్తుంది. భార్య, భర్తల మధ్య ఏర్పడ్డ గొడవలకు తీర్పును పాఠకుడే  ఆశించే విధంగా కథ సాగుతుంది. ఎందుకంటే ఈ కథలో తప్పు అనేది ఒకరి పక్షం నుండి కాక ఇరు  పక్షాల నుండి, సమాజపరిస్థితుల నుండి జరుగుతుందని చిత్రించబడుతుంది. “సింగరేణి జనజీవన సంబంధాలలో వస్తున్న పరిణామాలపైన ఈదశకంలో రఘోత్తమరెడ్డి వ్రాసిన కథలు చెప్పుకోదగినవి. ఆర్థిక సమస్యలు వీటన్నింటిని లంగరందక సతమతమయ్యే మనుషుల వ్యధను భార్యభర్తల సంఘర్షణను ఈ పక్షం ఒప్పు, ఆ పక్షం తప్పు అన్న

తీర్పు లేకుండా వాస్తవికంగా ప్రతిఫలిస్తూ 'కట్టాలల్ల సెదురక నిలబడ్డోళ్ళే మనషులు' అని ధైర్యాన్ని ప్రబోధిస్తూ 'పట్టు' లాంటి కథలు వ్రాశారు" (కాత్యాయని విద్మహే, 2013: 143). సింగరేణిలో జరుగుతున్న ఉద్యమాల ప్రభావం ఆ సమాజంలో నివసిస్తున్న కుటుంబాల మీద ఏవిధంగా పడింది అనే విషయాన్ని ఈ కథలో అంతర్గతంగా చూస్తే తెలుస్తుంది. నిరంతరం గనుల్లో కష్టపడి శ్రమను మరిచిపోవడానికి తాగి బానిసలుగా మారి కుటుంబాల మధ్య చెలరెగే గొడవలకు కారణమైన వారు ఎవరనేది ఈ కథను లోతుగా చూస్తే అర్థమవుతుంది. గనికార్మికుల పోరాటాల్లో తిరిగే రాజవ్వ కొడుకును తీసుకెళ్లిన పోలిసుల నుండి విడిపించడానికి వెళ్ళిన గోపయ్య లాంటి వారి న్యాయమైన ఉద్యమానికి సామాజికవ్యవస్థ కూడా సహాయంగా ఎల్లప్పుడు ఉంటుందని చెప్పాలి. దీని వల్ల బొగ్గుగని కార్మిక వాడల్లో కుటుంబాలు ఏవిధంగా మారుతున్నాయో కూడా తెలుస్తుంది.

### 2.7.3 శత్రువు

బొగ్గుగని బావుల్లో నిరంతరం శారీరక శ్రమ చేసినా పనికి తగిన ప్రతిఫలం లభించకపోవటం, మానసికంగా, శారీరకంగా బొగ్గుగని కార్మికులు ఏవిధంగా కృషించి పోతున్నారు. భార్యభర్తల మధ్య ఉండే ప్రేమానుబంధాలు ఏవిధంగా దెబ్బతింటున్నయో చెప్పే కథ 'శత్రువు'.

లింగయ్య బొగ్గుబావిలో పనిచేసే బదిలీఫిల్లర్. లింగయ్య భార్య సుగుణ. ఇతని స్నేహితుడు రాజిరెడ్డి ఇద్దరు ఒకే బావిలో జంటగా (ఫైలు) పనిచేసేవాళ్ళు. బొగ్గుబావిలో పనిచేసే కోల్‌ఫిల్లర్‌లు త్రీ-ఏ సీముకు(మూడో నెంబరు బొగుపొర) పనికి మేం వెళ్లం అని బదిలీఫిల్లర్‌లను పంపించమని అధికారులతో చెప్పి తప్పించుకుంటారు. ఎప్పుడు పని ఉంటుందో ఉండదో తెలియని బదిలీఫిల్లర్‌లకు తప్పక చేసుకొవల్సిన పరిస్థితి వస్తుంది. ఇక లింగయ్య, రాజిరెడ్డిలను కూడా త్రీ-ఏ సీముకు పనికి తరలిస్తారు. త్రీ-ఏ సీముల్లో పని పరిస్థితులు తెలిసికూడ పైఅధికారుల ఆదేశం వల్ల తప్పక పని చేసుకోవల్సిన స్థితి బదిలీఫిల్లర్‌లది. పనికి బావిలోకి దిగినవారికి బ్లాస్టింగ్ వల్ల చుట్టూ అలుముకున్న పొగలో గాలి పీల్చుకోవడమే చాలా కష్టంగా ఉంటుంది. గనిలోపల పనికి అనూకులమైన వాతవరణ

పరిస్థితులు కల్పించకపోవడం వల్ల, గాలి పంపులు సరిగా పంపకపోవడం ఊపిరి పిల్చుకోలేకకొందరు స్పృహ తప్పినట్లు పడిపోతారు. గని పనిస్థలాల్లో మెట్లు ఎత్తుగా ఉండడటం వల్ల తట్టలు మోసి మోసి కార్మికులు అలిసిపోతారు. లింగయ్య, రాజిరెడ్డి తదితర కార్మికులు బొగ్గుని తట్టల్లో ఎత్తుకోని టబ్బులను నింపడానికి పడే అగచాట్లు సామాన్యమైనవి కావు. మధ్యలో వచ్చిపోయే సూపర్‌వైజరులు రెండు టబ్బులు నింపుతేగాని రోజు ఇచ్చే జీతం ఇవ్వమంటూ బెదిరింపులు. ఇట్టి పరిస్థితుల్లో పనిని పూర్తిచేసుకొని ఇంటిమార్గం పడతారు లింగయ్య, రాజిరెడ్డిలు. లింగయ్య ఇంటికి చేరేలోగా తన భర్తరాక కోసం పరిపరి విధాలు చూసి అంతకుముందు అనుభవించిన పల్లె వాతావరణాన్ని, గత స్మృతులను తలుచుకుంటూ నిద్రపోతుంది సుగుణ. ఇంటికి వచ్చిన లింగయ్య వాడిపోయిన ముఖంతో, నిర్జీవమైన శరీరంతో పడిపోయి భార్యతో మాట్లాడక మౌనంగా ఉంటాడు. లింగయ్య వ్యవసాయపనుల్లో ఎంతో జోరుగా, హుషారుగా పనిచేసేవాడనీ, గనిపనికి వచ్చినప్పడి నుండి తనతో సఖ్యతగా ఉండట్లేదనీ వాపోతూ విచారణలో పడుతుంది. ఎవరో తనను బలవంతంగా గుంజిపట్టినట్లు తన పని తానే చేసుకుంటాడు కాని తననే నమ్మికోని ఉన్న భార్యను పట్టించుకోలేకపోతాడు. దాంతో భార్య సుగుణ అసహనానికీ, అసంతృప్తికీ లోనవుపోతుంది. లింగయ్య అన్నం తిని నిద్రలోకి జారుకుంటాడు. కొద్ది సమయం తరువాత లింగయ్యకు మెళుకువ వస్తుంది. సుగుణ కన్పించకపోయేసరికి బయటికి వచ్చి చూస్తాడు. ఆ సమయంలో తన గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటుంది. ఒకరికొకరు కష్టసుఖాల్లో తోడు ఉండి అన్యోన్యంగా ఉండేవారు. “తాను గడక రుద్ది తొక్కునూరేలోగ లింగయ్య ఎడ్లపెండ తీసి దొడ్డి పూడ్చటం. మోటబొక్కెన నెత్తిన పెట్టుకొని ఎడ్లముందేసుకొని లింగయ్య. లింగయ్యవెనుకే సద్ధి మూట గట్టుకొని సుగుణ. చంకలు లేవనీయని చలిలో హాయిగా ఒకరి వెనుక ఒకరు పెరడి కాడికి పోవడం” (రఘోత్తమరెడ్డి, 2006: 272). ఈవిధంగా  జ్ఞాపకాల్లో మునిగిపోతుంది. అప్పటికే పని భారం వల్ల ఓపిక నశించి వున్న లింగయ్య ఈ సమయంలో ఇంటి ముందు కూర్చున్న సుగుణను చూసి అనుమానంతో ఎందుకిక్కడ కూర్చున్నావ్ అని అడుగుతాడు. సుగుణ లింగయ్య ఎంత అడిగిన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యం చేసే సరికి లింగయ్యకు కోపం మరింత ఎక్కువైతుంది. దాంతో

సుగుణను హద్దు అదుపు లేకుండా కొడతాడు. అన్యాయంగా తనని కొడుతున్నాడని సుగుణ బాధపడుతుంది. ఇలా ఏ కారణం లేకుండా ఒకరికొకరు మనస్పర్థలకు గురై శత్రువులుగా మిగిలిపోతారు. వారి శత్రువు ప్రధాన కారణం వారికే తెలియని చుట్టు పక్కల సామాజిక పరిసరాలు, ఆర్థిక పరిస్థితులు, గని కార్మిక జీవితాల్లోని సంఘర్షణలు, భర్తని అర్థంచేసుకోలేని సుగుణ అమాయకత్వం, లింగయ్య అనాలోచిత ఆవేశం ఇలా అన్నిరకాల ప్రభావం వల్ల ఒకరికొకరు శత్రువులుగా మారి భార్యభర్తల మధ్య వున్న అనుబంధాలను తెంచుకుంటారు.

బొగ్గుగనుల్లో పనిచేసిన వారి జీవితాలు, సంసారాల్లో చిచ్చులను ఎత్తిచూపించే కథ ‘శత్రువు’. లింగయ్య లాంటి ఎందరో వలస కార్మికుల జీవితాలు కార్మిక కాష్టంలో కోల్పోతున్న మానవ, కుటుంబ సంబంధాలను రచయిత ఈ కథలో సహజంగా చూపించారు. ముఖ్యంగా కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని వ్యవసాయదారులు దొరల, భూస్వాముల పెత్తందార్ల దోపిడిని నుండి విముక్తిని పోందడానికి వలస వచ్చి సుఖంగా బతుకుదామని అనుకున్న ఎందరెందరో గ్రామీణ ప్రాంత అమాయకపు జనాలచేత గనుల్లో పనులు చేయించుకొని వారి శ్రామికశక్తిని దోచుకున్నారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకోవడానికి వచ్చిన వారిని ఇంకా ఆర్థిక లోటుకు గురి చేసేవిధంగా చిన్నాభిన్నం చేశారు. పరోక్షంగా కుటుంబాలలో చిచ్చుపెట్టినవారయ్యారు. దాని ఫలితమే లింగయ్య, సుగుణ అకారణ వైరం. వ్యవసాయజీవితంలో ఉన్నపుడు కలగని వైరం ఇప్పుడు ఎందుకు వచ్చిందని తరచి చూస్తే తెలుస్తుంది. వ్యవసాయ జీవితంలో లింగయ్య, సుగుణలు కలిసి పని పంచుకోగా వారి శ్రమ ఒకరికి భారంగా ఉండేది కాదు. గని జీవితానికి వచ్చే సరికి గనుల్లో శక్తికిమించిన పని ఒత్తిడి ఒకవైపు, భార్యకు ఎలాంటి పనిలేకుండా భర్తమీదనే అధిక పనిభారం పడుతుంది. దీనితో తన శ్రమంతా ఎవరో దోచుకుంటూరని అనే మానసిక ఒత్తిడి వల్ల అయోమయంలో పడి అమాయకంగా ఉన్న భార్యను కొట్టడం జరుగుతుంది. “కార్మికుని అసంతృప్తిని, భయంకరమైన శూన్యాన్ని, మెల్లమెల్లగా ప్రవేశ పెడుతుంది. రాను రాను కార్మికునిలోని ప్రేమను, సున్నితత్వాన్ని దెబ్బతీస్తుంది. ఈ డోలాయమాన స్థితిలో కార్మికుడు తీవ్ర అసంతృప్తితో పెనుగలాడుతాడు” (రాజయ్య, 2013: 75). అలా లింగయ్యకు

పల్లెలో భార్యమీద వున్న సహజమైనప్రేమ కార్మికజీవితంలో వచ్చేసరికి మృగ్యమై పోయి ద్వేషం, కోపం వచ్చి వారిద్దరిని శత్రువులుగా మారుతారు. అలా మారడానికి కారణాలను మాత్రం ఏ కార్మికుడు అన్వేషించలేడు. వారి మధ్య చేరిన శత్రువు గురించి గ్రహించినా తమ చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితుల వల్ల ఒకరినొకరు అర్థం చేసుకోలేకపోతారు. “ఒకరికేమో ఎడతెగని పనిభారం. అమ్మాయికేమో అసలే పని లేని తనం. చిరాకులు, పరాకులు, చివరికి ఒకరంటే ఒకరికి అసహ్యం, ద్వేషం, కొట్లాట, భర్త కనుక భార్యను తంతాడు. ఎందుకిలా జరుగుతున్నది. దీనికి కారణమేమిటి? అని సుగుణ లింగయ్యలకు ఆలోచనైతే వస్తుంది కానీ, విడమరచి చూసుకునే చైతన్యం ఎక్కడుందీ? సుగుణ, లింగయ్యలను శతృవులుగా చేసిన అసలు శతృవు వికృత స్వరూపం వాళ్ళకి ఎవరు తెలియజెప్పాలి? అదే సమస్య” (నారాయణ, 2013: 78, 79). ఖచ్చితంగా చేయాల్సినపని, గనిలో అసౌకర్యాలు, అననుకూల వాతవరణంలో రెండెండు షిఫ్టులంటూ అధికారుల ఒత్తుడులు, ఉక్కపోతలో ఉడికిపోయే జీవమాంసం, శారీరక శ్రమ, మానసిక వ్యధ ఇలా అన్ని వైపుల కార్మికులు అనుభవిస్తూ ఇంటికి చేరిన తరువాత భార్యలతో అసాంగత్యంగా గడపడం, కుటుంబ ఆర్థికపరిస్థితులు, ఇరుకు సందుల్లో మురికివాడల వల్ల రోజు రోజు క్షీణించే ఆరోగ్యం, సమస్త కష్టాల కడలిలో కొట్టుకుపోతున్న గనికార్మిక హృదయ ఆవేదనను మొదలైనఅంశాలను సంపూర్ణంగా స్పర్శించింది ‘శత్రువు’ కథ. తుమ్మేటి రఘోత్తమరెడ్డి స్వయంగా బొగ్గుగని కార్మికుడు కాబట్టి గనుల్లో ఉండే దుర్భర పరిస్థితులను వాస్తవికంగా కళ్లకు కట్టినట్లు చిత్రించారు. భార్య, భర్తల నేపథ్యంలో వచ్చిన ఈ కథ లింగయ్య, సుగుణ లాంటి దంపతులదే కాదు. యావత్తు గనికార్మిక జీవితాన్ని అనుభవిస్తున్న వారందరిది.

### 2.7.4 నా పాత స్నేహితుడు

కథకుడు తన రేండెళ్ల పూర్వ జీవిత పరిణామాన్ని, మారిన సామాజిక పరిస్థితులను, స్నేహసంబంధాల్లో కలిగిన వైరుధ్యాలను తన అనుభవపూర్వకంగా చెప్పడం ఈ కథావస్తువు.

బొగ్గుగనుల్లో రెండు సంవత్సరాలుగా పని చేసి తిరిగి తన స్వంత ఊరు వెళుతున్నా కథకుడికి చిన్నప్పటి నుండి కలిసి పెరిగి మధ్యలో విడిపోయిన స్నేహితుడి కలయిక వల్ల కలిగే పునరుత్సాహం, ఆనందం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకునేలా చేస్తుంది. ఒక సామాన్య కుటుంబంలో జన్మించి ఆర్థిక పరిస్థితుల్లో ఏర్పడ్డ సంక్షోభం వల్ల బతుకులు వలస బాట పట్టాల్సివస్తుంది. తానేమి కోల్పోయినాడో చూసుకుంటాడు. పల్లె ప్రకృతి అందాలను, వ్యవసాయిక పనులను, ఆత్మీయాను బంధాలను ఇలా అనేకాంశాలను కథకుడి పాత్ర ద్వారా రచయిత వివరిస్తారు. తన స్వంత జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా ఈ కథలోని పాత్ర జీవనం సాగుతుంది. రైలులో కూర్చొన్న కథకుడికి తన బాల్య స్నేహితుడైన నిరంజన్ కనిపిస్తాడు. అంతటితో తన గతం వెంటాడి మరి ఆలోచింపజేస్తుంది. కలిసి ఆడిపాడిన రోజులు, చిన్నతనంలోవారు చేసిన అల్లరులు, చిల్లర పనులు ఇలా తన మదిలో మెదలడం ప్రారంభమై తాను గడిపిన జీవితానికి, గడుపుతున్న జీవితానికి మధ్య పరిణామాన్ని గుర్తు చేసుకోవడం జరుగుతుంది. వాళ్ళిద్దరి స్నేహం గురించి రచయిత “రెండెళ్ళ కింది దాక అతడు నా ఏకైక మిత్రుడు-రహస్యాలంటూ మా ఇద్దరి మధ్య ఏమి ఉండేవి కావు. ఒకే వాడ ఎదురెదురిళ్ళు వాడెక్కడుంటే నేనక్కడ నేనెక్కడుంటే వాడక్కడ” (రఘోత్తమరెడ్డి, 2006: 244). వీటి వల్ల వారిద్దరు ఎంతగా కలిసి జీవించారో అమాయక బాల్యపు స్నేహం వారినెంత ప్రభావితం చేసిందో తెలుస్తుంది. ఆలోచనలో సాన్నిహిత్యంగా ఉండే రెండు జీవితాలు ఎంత మమేకం చెందుతాయో ఈ కథలో రచయిత వివరిస్తారు. చిన్ననాటి నుండి వ్యవసాయపనుల్లో కలిసి తిరిగి వ్యవసాయం మీద వున్న మక్కువ వల్ల చదువును నిర్లక్ష్యం చేసారు. చదువు అవగానే వ్యవసాయం కలిసిరాక రెండు జీవితాల మధ్య అగాధం ఏర్పడుతుంది. కథకుడికి వ్యవసాయంలో ప్రవేశించడానికి ముందే వారి కుటుంబంలో అనేక ఆర్థికపరమైన ఇబ్బందులతో ‘అరుకోసి మూడు అతుకుడు’ గా కుటుంబ పరిస్థితి ఉండేది. ఎంతో కష్టపడి పంటవేసి కావలి ఉండి పంట చేతికి వచ్చే సమయానికి మార్కెట్లో షావుకార్ల మోసాల వల్ల సరైన గిట్టుబాటు ధరలు రాకపోవడం వల్ల రైతుల బతుకులు అధ్వాన్నంగా ఉండేవి. అప్పులు తెచ్చి వేరే పంటలు వేయడం ఆ పండిన పంట కూడా అమ్మకంకాక చివరికి రైతులు ఎన్ని విధాలుగా నష్టాల్లో

కూరుకుపోయేవాళ్ళో  కథకుడు తన అనుభవ సారంలోంచి చెప్పినట్లు సాగుతుంది కథ. అంతేగాదు పొలాల్లో పనిచేసే కూలీలు, వెట్టిచాకిరీ చేసే వాళ్ళు వాటిని నిరసిస్తూ ఉద్యమాలు, బందులు చేయడం, తన స్వంత భూములను దొరల దగ్గర నుండి స్వంతం చేసుకోవడం ఇలా కాలంతో పాటు మారిన గ్రామాన్ని రైతుల దీనస్థితిని వెల్లడిచేస్తాడు. దొరలు, భూస్వాములు, చితికిపోయిన రైతుల కుటుంబాలు ప్రజల ఉద్యమాల ఫలితాల వల్ల నాగేటిచాళ్ళలోంచి బొగుగనుల్లోకి ఈడ్చబడ్డ జీవితాలు వలస బతుకులుగా మారడం, అందులో తాను ఒక్కడు కావడం జరుగుతుంది. కుటుంబంలో ఉన్న ఆర్థిక ఇబ్బందుల వల్ల వ్యవసాయానికి పెట్టుబడులు అందించాలనే ఆలోచనతో, ఆశతో గనుల్లోకి వెళ్ళిన విషయాన్ని గురించి తెలియచేస్తాడు. బొగ్గుగనుల్లో అధికారులతో పడే గొడవలు, అననకూల వాతవరణ పరిస్థితుల్లో పనుల భారం, ఆరోగ్య చెడిపోవడం, కార్మికులతో ఉద్యమాల్లో పొందిన నిర్మలమైన స్నేహాలు, ఇలా ఎదుగుతున్న జీవితంలో మలుపులను చవిచూడటాన్ని వాస్తవికంగా చిత్రించాడు రచయిత. “ఈ సమస్త భూగోళాన్ని చిన్న గోళికాయంగా చేసుకొని నా అరచేతిలో పెట్టుకుని దాని బహిరంగాన్ని దాని అంతరంగాన్ని, దాని గతాన్ని, గమనాన్ని ఆగమనంతో సహా అన్నింటిని అణువణువునూ శోధించడం నేను ఇక్కడ నేర్చుకున్నాను” (రఘోత్తమరెడ్డి, 2006: 249). ఈవిధంగా కథకుడు బొగ్గుగనుల్లో కలిగే మార్పులకు తగినట్టుగా తన మనస్తత్వాన్ని మార్చుకోవడానికి అలవాటు పడతాడు. “స్వయంగా వ్యవసాయం చేసుకుంటూ రైతు దశ నుంచి కేవలం రెక్కలకష్టాన్ని అయిన కాడికి తెగనమ్ముకొనే కార్మికుడి స్థితిలోకి నేను మారడం అన్నింటికి మూలమని నేను తరువాత తరువాత తెలుసుకున్నాను” (రఘోత్తమరెడ్డి, 2006: 249). ఈవిధంగా తన జీవితంలో జరిగిన మలుపులు సంఘటనలు గుర్తు చేసుకొని కారణాలను వెతుక్కుంటాడు. ఇంతలో రైలులో ఉన్న కథకుడి దగ్గరకి తన మిత్రుడు నిరంజన్ వచ్చి కలుస్తాడు. ఇద్దరూ కలిసి వెళ్తూ వారిద్దరి పరస్పర బేధాలను ఒకరినొకరు అన్వేషించుకుంటారు. నిరంజన్ వైఖరిని గూర్చి ఎవరిని అడిగినా అతని వింత ప్రవర్తనకు అందరు వెలివేసినట్లు మాట్లాడుతారు, తన బాల్య మిత్రుడైన నిరంజన్‌ను అందరూ విమర్శిస్తు ఉండటంతో అయోమయంలో పడతాడు కథకుడు. నిరంజన్ నిమ్నకులానికి చెందిన బాలుడు

పాలేరుగా పనికి రానందుకు కొట్టినప్పుడు అక్కడ ఆ పిల్లవాడి జనం గుమికూడి నిరంజన్‌ను కోడుతున్న విషయం కథకుడికి తెలుస్తుంది. ఎవరిని ఆపాలో తెలియక సందిగ్ధంలో పడతాడు. కథకుడు దెబ్బలు తాకిన తన స్నేహితున్ని పరామర్శించడానికి వెంటనే బయలుదేరతాడు. కాని కథకుడికి నిరంజన్ ఇచ్చిన ఘాటైన సమాధానమే మిగులుతుంది. "నీది నీకే మంచి నాది నాకే మంచి" (రఘోత్తమరెడ్డి, 2006: 252) అని కథకుడితో నిరంజన్ అంటాడు. ఆ మాటలకు కథకుని మనస్సు వికలమైపోతుంది. బాధకు గురైతాడు. ఏ స్నేహితుల మధ్య తొంగి చూడని అగాథం ఏర్పడుతుంది. విడిపోని స్నేహ సంబంధాలను సైతం విడిపోయేలా చేసింది. ఇప్పటి కాల పరిస్థితులు భిన్నకాలాల్లో వైయుక్తిక స్వభావాన్ని ఇచ్చే ప్రాధాన్యతను, ఆలోచనల్లో కలిగే మార్పును వివరించింది వారి వియోగం.

రచయిత స్వీయ జీవితానుభవంలోని సంఘటనే 'నా పాత స్నేహితుడు' గా కథ రూపొందింది. అన్ని కథల కన్నా ఎక్కువగా రచయితకు ప్రాతినిధ్యం వహించే కథ ఇది. సాక్షికమైన రెండు జీవితాల్ని కాలం ఎలా నిర్దేశించిందో తెలుస్తుంది. సామాజిక మార్పును అనుసరించి రైతుల కుటుంబాల్లో కలిగిన ఆర్థికలోటు వల్ల వలస వెళ్ళి అక్కడ వారెదురుకునే సమస్యలు, అనుభవించిన కష్టాలు కథకుడు ఈ కథలో వివరిస్తారు. ఊరిలో ఉన్న నిరంజన్ లాంటి యువరైతులు క్షీణించిపోయిన ఆర్థిక ఒత్తుడులకు తట్టుకోలేక తమ కోపాన్ని ఎవరి మీద చూపించాలో తెలియక అనువుగా ఉన్న అణగారిన జాతుల మీద చూపిస్తారు. కాని కాల పరిస్థితుల వల్ల, అప్పటికే అణగారిన జాతుల వారు చైతన్యం పొందుతున్న విషయం గమనించుకోక వారు చేసిన పనికి శిక్ష అనుభవించక తప్పదు. "రైతు, కడుపులో కుతకుతా ఉడుకుతున్న లావా కోపాన్ని ఎవరి మీదా చూపించలేని నిస్సహయత పాలేరుని రెండు కొడితే వాళ్ళ కులపువాళ్ళు అందరూ ఏకమై చావచితక బాదే పరిస్థితి ఎవర్ని వద్దనాలో, ఎందుకు జరుగుతుందో తోచలేదు అంటాడు. సాధారణంగా కన్పిస్తున్న ఈ ఇతివృత్తాన్ని అంతరాంతరాలలోని వైరుధ్యాల ప్రాతిపదికల మీంచి కథలోకి తేవడాన్ని రఘోత్తమరెడ్డి అలవోకగా చేసాడు" (వరలక్ష్మి, 2013: 367). 'నా పాత స్నేహితుడు' అనే కథలో కథకుడు స్నేహితుని కలయిక వల్ల తన వ్యక్తిగత జీవితాన్ని, ఆ జీవితంలోని ఆకస్మికమైన మార్పులను, మలుపులను స్మరించుకొని బాధపడతాడు. కథ చివరిలో

స్నేహితుల మధ్య అనుకోని విభేధం చోటుచేసుకోవడం విషాదమైన సంఘటన. ఆ సంఘటనకు కారణం వారు నిలుచున్న న్యాయ, అన్యాయల ప్రతిపాదికే. సామాజిక పరిస్థితులు మారాయి అని తెలుసుకోకుండా, హరిజన వాడల్లో పాలేరుని అధికార స్వభావంతో కొట్టిన నిరంజన్‌కు స్నేహభావంతో బుద్ధిమాట చెప్పపోయిన కథకుడికి చేదు అనుభవం ఎదురవుతుంది. ఆ చేదు అనుభవం ఎంతటి గాఢమైన స్నేహానుబంధంలోనైనా కూడ ఎదురయ్యే అవకాశం ఉందని ఈ కథ ద్వారా తెలుస్తుంది. "మనుషులు పీడక పీడిత వర్గాలలో ఎవరి పక్షాన నిలబడి ఉన్నారన్న విలువ ఒక్కటే వాళ్ళమధ్య స్నేహ, శత్రు సంబంధాలను నిర్ణయిస్తుందని 'నా పాత స్నేహితుడు' వంటి కథలలో సూచించాడు" (కాత్యాయని విద్మహే, 2013: 143). ఈ కథ ప్రతి వారికి విడిపోయిన స్నేహితులను తలుచుకునేలా చేస్తుంది. అలా విడిపోవటానికి కారణాలను వెతుక్కునేలా చేస్తుంది. స్నేహితుల మధ్య గాఢమైన అనుబంధానికి కావల్సిన మూలాలను మార్చుకునేలా చేస్తుంది. "స్థల, కాలాలతో నిమిత్తం లేని స్నేహం ఉండదనీ, అట్లాగని పూర్తి యాంత్రికంగా పరిస్థితులపై నెట్టియలేమని ఈ రెండు కథలు చదివితే తెలుస్తుంది. వైయుక్తిక స్వభావాలు భిన్న పరిస్థితుల్లో ఎట్లా ప్రవరిస్తాయో అర్థమవుతుంది"(ప్రశాంత్, 2013: 379).

## 2.8 బొగ్గుగని కార్మిక సమస్యలకు సంబంధించిన కథలు

బొగ్గుగనిలో నిరంతరం కష్టపడే కార్మికులు శ్రమదోపిడితో పాటు అనేక సమస్యలను ఎదుర్కొంటారు. గని మురికి పరిసరాల్లో ఇచ్చిన క్వార్టరులో నివాసముంటున్న కార్మికులకు వాతావరణం అనుకూలించక పోవడం, నీటిసదుపాయాలు లేక పడే అవస్థలు, ఇళ్ళ వసతుల కొరత ఇలా అనేక ఇబ్బందులకు గురవుతుంటారు. ఇటువంటి సమస్యలను రఘోత్తమరెడ్డి కథావస్తువులుగా తీసుకొని రాశారు. "బొగ్గుగని కార్మికుల పరిస్థితుల హైన్యాన్ని, వాళ్ళెదుర్కొనే ఆపదలను, ప్రాణాలకే ముప్పు ఉన్న పరిస్థితులలో పని చేస్తున్నవారికి, ఇళ్లలోనూ ఉండే ఎడతెరిపిలేని సమస్యలను, నీళ్ళు

లేకపోవడం నుండి ఇల్లు లేకపోవడం వరకు అన్నింటిని రఘోత్తమరెడ్డి తన కథావస్తువులుగా మలుచుకున్నాడు" (కాత్యాయని విద్మహే, 2013: 142).

సామాన్య జీవితానికి భిన్నంగా ఉన్న బొగ్గుగని జీవితాలను రచయిత కథలుగా రాయడమే కాదు. స్వయంగా బొగ్గుగని కార్మిక జీవితాన్ని అనుభవించినవారు. కాబట్టి సహజంగా బొగ్గుగని కార్మిక జీవితాల్లోని పనుల భారాన్ని, గనిలోపల ఉన్న అననుకూల పరిస్థితులను, వాటి వల్ల పాడయిపోయే ఆరోగ్యాలను, అవి కుటుంబం మీద చూపించే ప్రభావాలను, సరైన ఉపాధిలేక వ్యసనాలకు గురై జీవితాలను పాడుచేసుకుంటున్న యువకార్మికులను తన కథలో చిత్రించారు రచయిత. అంతేగాకుండా గని అధికారుల అధికారం, దాష్టికం, అహంకారం తోడై పని పరిస్థితుల్లో పెట్టె హింసలు, ఇబ్బందులు ఎదుర్కోలేకపోతుంటారు. "బొగ్గు బావుల్లో పని చేయడం చాలా కష్టమైన విషయం. అందులో ముఖ్యంగా కోల్ ఫిల్లర్స్, బదిలీ ఫిల్లర్స్ విషయంలో బ్లాస్ట్ చేసిన బొగ్గును, తట్టలలో నింపి ట్రాక్ మీదున్న టబ్బులలో పోసి, ఆ టబ్ లను హాలర్ తాడుకు అందించడానికి ట్రాక్‌కు చేర్చటం వీళ్ళ పని. బొగ్గు ఉన్న ప్రాంతం నుంచి, తట్టలను టబ్‌ల వరకు మోసుకుపోయినందుకు, కొంత అలవెన్స్‌ను, టబ్‌లను, నెట్టుకుంటూ హాలర్ తాడుకు అనుసంధించినందుకుగాను కొంత అలవెన్సును చెల్లిస్తారు. వీరికిచ్చే వేతనం వారు నింపిన టబ్‌లను బట్టి నిర్ణయిస్తారు. అంటే piece rated wages. ప్రతి మేనేజరు వీళ్ళను అతి జాగ్రత్తగా గమనిస్తుంటారు. వీళ్ళు అంత కష్టమైన పని చేయలేక కొన్ని సార్లు చాలా స్వల్ప విషయాలకు కూడా మెరుపు సమ్మెకు దిగుతుండటం వల్ల మేనేజరుకు వీళ్ళతో ఎప్పుడూ తలనొప్పే. ఒక్కోసారి రూఫ్ (roof) ఎత్తులేక మూలన వీపున తట్ట మోయల్సి పరిస్థితి. Exhaust fans ద్వారా లోపలి వేడిగాలి బయటికి పంపితే గాని, లోపల చల్ల గాలి ఉండదు. కొన్ని సార్లు ఆ వేడి భరించలేక వీళ్ళు సోమ్మసిల్లి పోవటం కూడా జరుగుతుంది. ఆదంతా ఎందుకు రాస్తున్నానంటే వాళ్ళ పని, పరిస్థితులు తెలియకుంటే ఆ కథలను అర్థం చేసుకోలేం. అతి శయోక్తులుగా అనిపించొచ్చు. ఈ కాయ కష్టాన్ని మరిచిపోవటానికి, సాయంత్రం మస్తుగా తాగేది వీళ్ళే. అప్పుల

పాలయ్యేది. అమానుషమైన వడ్డీలకు తలొగ్గేది వీళ్ళే. మస్టర్ పని కోసం, అధికారుల అడుగులకు మడుగులొత్తేది వీళ్ళే" (శ్రీనివాస మూర్తి, 2013: 354).

### 2.8.1 నీళ్ళతగువు

బొగ్గుగని కార్మికుల స్త్రీలు గనిఅధికారులను ఎదురించి నీళ్ల కోసం పోరాటం చేసి సాధించుకున్న వైనం 'నీళ్ల తగువు' కథావస్తువు.

బొగ్గుగని కార్మికునిగా పనిచేసే వ్యక్తికి భార్య సమ్మక్క. భర్త పనికి వెళడానికి సమ్మక్క సర్వం సిద్ధం చేసి ఉంచాలి. వారు నివసించే ప్రాంతంలో సరైన వసతులు లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడతారు. తెల్లారి లేచి వండి పెట్టడం, దూరంగా ఉన్న నీళ్ళను మోసుకోవడం, పిల్లలను సవరించడానికే సమయం సరిపోతుంది. రోజుల్లాగా నీళ్ళకోసం నీళ్ళకుండీ తీసుకొని బయలుదేరుతుంది.దూరంగా వెళ్ళి తీసుకొస్తే తన భర్తకు ఎక్కడ అలస్యమైతుందోనని దగ్గరగా ఉన్న భగవాన్‌రావు క్వార్టరుకు చేరుకుంటుంది. కాని, అక్కడ నీళ్ళు పట్టుకోవడం చూసిన భగవాన్‌రావు కొడుకు అజమాయిషిని చలాయించడం వల్ల గొడవ మొదలవుతుంది. భగవాన్‌రావు సమ్మక్కను దౌర్జన్యంగా దూషిస్తూ జుట్టుపట్టుకొని బయటకు లాక్కెళతాడు. ఆ కాస్త లొల్లి పెద్దగా పెరిగి అందరూ చూట్టూ గుమిగూడతారు. ఇక్కడ పంపు నుండి నీళ్ళను కూడ తీసుకుపోనియని గని అధికారుడు భగవాన్‌రావు అహంకారం, స్వార్థం తెలిసి కార్మిక కుటుంబాలలోని స్త్రీలందరు ఏకమైతారు. వారి భర్తల కష్టానికి ఫలితం లేకపోగా వారికి కనీస అవసరాలను కూర్చని అధికారుల మీద కోపం పెరిగి స్త్రీలందరు నీళ్ళసమస్యను పరిష్కారించు కోవాలనుకుని సిద్ధమవుతారు. వెంటనే వారి ఇండ్లల్లోని బిందెలను రోడ్ల మీదికి ఎక్కిచ్చి ధర్నా చేపడతారు. వారి దెబ్బకు దిగివచ్చిన గని అధికారులు వాళ్ల సమస్యేంటో తెలుసుకుంటారు. గత రెండు సంవత్సరాలుగా నీళ్ళు ఇప్పిస్తామని మాటల గారడితో మెప్పించిన అధికారులందరినీ కార్మిక స్త్రీల ఉద్యమం భయాందోళనకు గురి చేస్తుంది. ఇక తప్పదనుకొని నీళ్ళను ఇప్పిస్తామని వాగ్దానం చేసి వెళ్ళి రెండు రోజులు గడువకుండానే నీళ్ళ పంపులు మంజూరు చేస్తారు.

దాంతో కార్మిక స్త్రీలందరు నీళ్ళను సాధించుకున్నందుకు సంతోష పడతారు. ఈవిధంగా కార్మిక స్త్రీలు సంఘటితమై నీళ్ళను సాధించు కుంటారు.

బొగ్గు గనుల్లో కార్మికులు అలుపెరగక పని చేసి శారీరకంగా అలిసిపోయి, మానసికంగా కృంగిపోయి ఇంటికి వస్తారు, మురికి వాడల్లో వాళ్లకిచ్చిన ఇరుకుసందుల్లో రేకుల షెడ్డులు వేసుకొని జీవితాలను గడపాలి. గనిఅధికారులు అనుభవించే జీవితాలకు పూర్తి భిన్నంగా సాగుతున్న వారి జీవితాలను ఈ కథలో చిత్రించారు. సింగరేణి కార్మికుల కష్టానికి తగిన ఫలితం ఎలాగూ ఇవ్వకపోయినా కనీస అవసరాలైన నీళ్ళకొరతను కూడా పట్టించుకోని సంస్థల వైఖరిని ఎత్తిచూపిస్తుంది ఈ కథ. గని అధికారులను ఎదురించిన సమ్మక్క లాంటి స్త్రీల వల్ల వారి భర్తలకు కూడా పోరాటానికి కావల్సిన చైతన్యాన్నీ అందిపుచ్చుకోవాలని తెలుస్తుంది. "ఈ బొగ్గుగని కార్మికుల కథల్లో 'నీళ్ళతగువు', 'ఇల్లు' అనేవి సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న కనీస అవసరాలకు సంబంధించినవి. ఈ రెండు కథలు కూడా నిరసన/ధిక్కార స్వర సూచికలే. పొట్టచేత పట్టుకుని బావిపనిలోకి వచ్చిన వాళ్ళకు, ఉండటానికి ఇళ్లులేక, తాగటానికి సరైన నీళ్ళులేక పోగా, పట్టించుకోని అధికారులను తమదైన శైలిలో ఎదుర్కొని గెలిచిన వైనం ఈ కథల్లో మనకు కన్పిస్తుంది" (శ్రీనివాసమూర్తి, 2013: 354). తుమ్మేటి రాసిన మొత్తం కథల్లో ధిక్కార స్వరం పాక్షికంగానైనా ఉండకమానదు. రఘోత్తం నివసించిన ప్రాంత పరిస్థితుల ప్రభావం ఒకవైపు, రచయితగా ఆయనకు కార్మికుల మీద ఉన్న సానుభూతి దృక్పథం మరోవైపుఆయన చేత ఈ కథలు రాయించాయి.. రైతులు కార్మికులుగా మారిన తరువాత కూడ వదలని ఆర్థిక సమస్యలను, కనీస అవసరాలకు పడే కష్టాలను, దుర్భర జీవితాలను కథలుగా రాసి లోకానికి వారి బాధలను తెలియజేశారు.

### 2.8.2 ఇల్లు

పల్లె వాతవరణం నుండి బొగ్గుగనుల్లోకి వలస వచ్చి బతుకుతున్న గనికార్మికులకు ఉండడటానికి సరైన ఇల్లు లేక మదనపడేవారు. కొత్తగా పెళ్ళిలు చేసుకొన్న గనియువకార్మికులు

భార్యలతో సంసారాల చేయడానికి నివాసాల్లేని పరిస్థితుల్లో గని అధికారులతో పోరాడి ఇల్లును దక్కించుకోనే ప్రయత్నం చేయడమే 'ఇల్లు' కథావస్తువు

వీరయ్య, సూర్యమ్మ భార్యభర్తలు. వీరికి ఒక్కగానొక్క కొడుకు నారాయణ. వీరయ్య కోల్‌ఫిల్లర్ నారాయణ బదిలీఫిల్లర్‌గా గనుల్లో పనిచేస్తుంటారు. నారాయణకు వారి వీధి చివరన ఉన్న సుజాత అనే అమ్మాయితో వివాహం జరుగుతుంది. కాని వారిద్దరికి కలిసి ఉండటానికి సరైన ఇల్లు లేక సుజాత తన తల్లిగారింట్లో ఉంటుంది. కొత్తగా పెళ్ళి చేసుకున్న నారాయణ భార్యా వియోగం వల్ల విచారంతో, నిరుత్సాహంగా ఉంటాడు. తన కొడుకు వైఖరిని గమనించిన తల్లి సూర్యమ్మ భర్త వీరయ్య అసమర్ధతను ఎత్తిచూపుతుంది. ఎప్పుడో ఇల్లు కడతానని చెప్పి. భర్త ఇంకా ఇల్లు కట్టకపోవడాన్ని నిలదీస్తుంది. బేలగా మంచంలో పడివున్న తన కొడుకును చూసి వీరయ్య ఆలోచనలో పడతాడు. నారాయణను భార్యను తీసుకొచ్చుకొమ్మని చెప్తాడు. కాని "తీసుకచ్చుకొని ఎవల మంచం కింద పండవెట్టాలె" (రఘోత్తమరెడ్డి, 2006: 93) అని నారాయణ అసలు విషయాన్ని వ్యక్తం చేస్తాడు. కొడుకు పరిస్థితిని అర్థం చేసుకొని ఏదొ ఒక పని చేసి ఇల్లు కట్టించాలని ఆలోచించి చింతల లక్ష్మిరాజెంను సంప్రదిస్తాడు. బొగ్గుగని కార్మికుల అందరి పరిస్థితి ఇలాగే ఉంటుంది. ఇక అందరు కలిసి ఉపాయం ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు. బొగ్గుగని కంపెనీ  ఖాళీ స్థలంలోనే యువకార్మికులందరు తడికెలతో ఇళ్ళను నిర్మించుకుంటారు. రెండు రోజులు గడుస్తుంది. ఎందరో యువజంటలు చిలుక గోరింకల్లా సంతోషంగా గడుపుతారు. ఈ అశాశ్వతమైన ఆనందం స్వల్పకాలమే ఉంటుంది. ఇల్లు కట్టుకున్న విషయం గనిఅధికారులకు తెలియగానే సహించలేక దౌర్జన్యంగా ఇళ్ళను పీకేయిస్తారు. ఇళ్ళను నిర్మించుకున్న కొందరిని బందీస్తారు. మరికొందరిని కొడతారు. ఇదంతా చేసిన గని అధికారులకు బుద్ధిచెప్పాలని కార్మికులంతా ఏకమై మూకుమ్మడిగా నిర్ణయం తీసుకుంటారు. తెల్లవారగానే గని కార్యాలయం చుట్టూ ఉన్న పరిసరాల్లో భార్య పిల్లలతో సంసారాలను దించుతారు. అలా వారి నిరసనను తెలియజేస్తారు. అక్కడికి వచ్చిపోయే అధికారులంతా చూసి వారు చేసిన అంతర్గత అరాచకత్వం గుర్తొచ్చి పరిష్కార మార్గం ఆలోచిస్తారు.

మొదటగా ఈ కథ 'నీడకోసం' అనే శీర్షికతో 'కార్మిక' అనే కలం పేరుతో వచ్చింది. బొగ్గుగని కార్మికులు ప్రాథమిక అవసరాలకు కూడా నోచుకోలేని పరిస్థితిని 'ఇల్లు' కథ చిత్రించింది. ఇలాంటి సామూహిక సమస్యను లక్ష్మీరాజెం సహాయంతో గని స్థలాల్లో ఇళ్ళను నిర్మించుకోవడం జరుగుతుంది. దాన్ని జీర్ణించుకోలేని గని అధికారదళం ఇళ్ళను పీకేయించిన వాళ్ళ అసలైన నిజ స్వరూపాన్ని, గని అధికారుల అక్రమాలు, అరాచకాలు, అణచివేత, దౌర్జన్యాన్ని ఈ కథ ద్వారా వ్యక్తం చేశాడు రచయిత.ఇక లాభం లేదన్నట్లు సమిష్టి పోరాటమే తథ్యమన్నట్లు గని కార్మికులంతా ఏకమై గని కార్యాలయాల్లో బైటాయించి వాళ్ళ ప్రతిఘటనను, నిరసనను తెలుపుతారు. వారి జీవితాల్లోని కష్టాలను స్వయంగా వాళ్లే నిర్మూలించుకొనే ప్రయత్నం చేస్తారు. ఈవిధంగా 'ఇల్లు' కథలో గని అధికారుల దౌష్టికాన్ని కార్మికుల కనీస అవసరాల కోసం ఎదురుతిరిగిన వైనాన్ని, కార్మికుల నిరసనను తెలియజేశారు. "మానవ సంబంధాల మొత్తానికి కీలకమైనవి స్త్రీపురుష సంబంధాలని అంటాడు. యవ్వన సహజమైన ఉద్రేకాలను, ఉద్వేగాలను సంతృప్తి పరుచుకొనడానికి కనీస వసతి కూడా బొగ్గుగని కార్మికుడు నోచుకోనకపోవడంలోని మూగవేదనను పోరాటాల రూపంలో 'ఇల్లు' కథలో ఇచ్చాడు రఘోత్తమరెడ్డి" (కాత్యాయని విద్మహే, 2013: 142). గనికార్మిక స్త్రీ, పురుషసంబంధాల మధ్య ఏర్పడిన వైరం సామూహికంగా ఐక్యమై ఎదురుతిరిగి పోరాటం చేసేదాక తీసుకెళుతుంది. అలా స్త్రీ పురుష సంబంధాలు మొత్తం మానవ సంబంధాన్ని శాసిస్తాయన్న రఘోత్తం సూత్రం సరైనది. గనికార్మికులుగా వలస వెళ్ళిన వారు ఉండటానికి మురికవాడల్లో, బురద గుంటల్లో ఇరుకు ఇరుకు ఇళ్ళ మధ్య బతకాల్సి వచ్చేది. కొందరు గనికార్మికులు ఇల్లు లేని పరిస్థితుల్లో గని ఖాళీ స్థలంలో వేసుకున్న ఇళ్ళను పీకేయించినప్పుడు వారి దీనస్థితిని, దైన్యాన్ని అర్థం చేసుకోని అధికార వర్గం స్వభావాన్ని, నిర్లక్ష్యాన్ని తెలియజేస్తుంది ఈ కథ. గ్రామాల్లో నుంచి గనుల్లోకి ప్రజలు వలస వెళ్ళి బతికే బతుకులను, మురికివాడ కార్మిక జీవనాన్ని ఈ కథ స్పర్శించింది. ఇరుకు ఇళ్ళల్లో ఉండి జీవించే కార్మికులకు, తరువాత తరం వాళ్లు అంటే వారి పిల్లల భవిష్యత్తును నిర్దేశించుకోలేకపోతారు. ప్రతికూలంగా పిల్లలు బయట ఉన్న వ్యసనాలలో చిక్కుకొని పాడై తల్లిదండ్రులకు దు:ఖాన్ని మిగిల్చిన

వారైతారు. పిల్లలకోసం ఏదైనా చేయాలనుకున్నా తల్లిదండ్రులకు చాలీచాలని జీతాలు, పొట్టతిప్పలకు పడే పాట్లు. ఇక ఇళ్ళు నిర్మాణాల మాట అవాస్తవమే. ఇలా గనికార్మిక జీవితాల్లో తీవ్ర అసంతృప్తితో ఉండేవి. కొత్తగా పెండ్లి చేసుకుని భార్యలతో సంతోషంగా బతకాల్సిన సమయంలో చాలినంత ఇళ్ళులేక, వసతి లేక పెళ్ళై కూడా కొత్త జంటలు ఎవరి ఇంట్లో వారుండాల్సిన దు:స్థితి ఏర్పడేది. ఆ వియోగం, విరహం ముంచెత్తి గని పనులకు బందు పెట్టడం, పర్యవసానంగా జీవితాన్ని భారంగా గడపటం, తాగుడు, సినిమాలకు బానిసలుగా మారి తల్లిదండ్రులని శత్రువులుగా చూడటం వంటివి వాస్తవికాంశాలుగా మిగిలిపోతాయి.

### 2.8.3 పురుడు

కాలం, పరిస్థితులు మారినా దౌర్భాగ్యమైన బొగ్గుగని జీవితాల్లో కలగని మార్పుకు ఒక గని కార్మికుడు అనుభవపూర్వకంగా చెందిన ఆవేదనను వ్యక్తం చేసే కథ ‘పురుడు’. తన కొడుకును బాగా చదివించి ఉన్నతుడిని చేయాలని ఎంతో ఆశపడి చివరికి తనలాగే గనికార్మిక జీవితాన్ని అనుభవిస్తున్న కొడుకును చూసి విభిన్న భావాల సంఘర్షణలకు గురి కావడమే ఈ కథావస్తువు.

చంద్రయ్య బొగ్గుబావిలో పనిచేసేవాడు. అతనికి కొడుకు పుట్టడంతో, సంతోషంగా పురుడు ఉత్సవాన్ని చేసుకుంటాడు. ఉత్సవానికి తనతో పనిచేసే సహాకార్మికులందరిని పిలుస్తాడు. సాయంత్రం వేళలో కొంత అలస్యంగానైనా అందరూ హాజరవుతారు. వారి ఆలస్యానికి కారణం అడుగుతాడు చంద్రయ్య. అప్పుడు ఆ రోజు బొగ్గుగనిలో జరిగిన దుస్సంఘటనను గురించి చెపుతారు. ఓదెలు అనే సీనియర్ గనికార్మికుని కొడుకు చంద్రయ్య పనిస్థానంలో బదలీఫిల్లర్‌గా వస్తాడు. అక్కడ తట్ట ఎత్తుకొని నడుస్తూ సొమ్మసిల్లి కింద జారిపడితే కాలు విరిగిందనీ, దారిలో హాస్పిటల్ వెళ్ళి వచ్చేసరికి ఆలస్యం అయిందని జరిగిన విషయాన్ని వచ్చిన గనిమిత్రులలో ఒకరు చెప్పుకొస్తారు. ఆ విషాద సంఘటనకు మొదట చంద్రయ్య చింతించి తరువాత కార్యక్రమాన్ని గుర్తు తెచ్చుకుంటాడు. అందరు భోజనాలు చేసి కూర్చున్నాక చంద్రయ్య తన కొడుకును వాళ్ళ స్నేహితులకిచ్చి ఎదో ఒక మంచి పేరును నిర్ణయించమని

కోరుతాడు. బొగ్గుగని మిత్రులంతా తన స్నేహితుడి కొడుకుని పరాశిక మాడుతూ ఆ పనిని తమలో అందిరి కన్నా సీనియర్ వ్యక్తి, బాగా అనుభవం ఉన్న వ్యక్తి అయిన ఓదెలుకి అప్పజెప్పుతారు. ఓదెలు పేరు నిర్ణయించాలనుకుని పిల్లవాడిని ఎత్తుకున్నాక మదిలో ఏవేవో ఆలోచనలు చుట్టుముడతాయి. తన పూర్వజీవితజ్ఞాపకాలు ఒక్కసారిగా గుర్తొచ్చి బాధపడతూ ఆలోచనల్లోకి, గతంలోకి వెళతాడు. చిన్నపుడు చదువు మీద ఉన్న ఆశ తీరక పాలేరుగా చేరడం, దొర దౌర్జన్యం వల్ల పడ్డ అవమానాలు, వెట్టిచాకిరిని భరించలేక పారిపోయి పడ్డ కష్టాలు, ఒక కాంట్రాక్టు దయ వల్ల దొరికిన ఉపాధి ఇలా తన గతజీవితాన్ని గుర్తు తెచ్చుకుంటాడు. అంతేగాకుండా తనకు పుట్టిన ఒక్కగానొక్క కొడుకు మీద పెట్టుకున్న ఆశలను అడియాశలు చేసిన లోకాన్ని, ఎంతో కష్టపడి చదివించాలనుకొని చదివించేలేని అసమర్ధతను తలుచుకుంటూ, బాధపడుతుంటాడు. తానెలాగా కష్టపడి శ్రమ వొడిచినా ఫలితం లేని గనికార్మిక జీవిత రొంపిలో తన కొడుకు బలికాకుండా చూడాలని అనుకుంటాడు. కాని అది అసాధ్యమై ఏ జీవితదరిని తన కొడుకు జీవితం చేరకూడదని అనుకుంటాడో ఆ జీవితంలోకి వచ్చిన కొడుకును చూసి దు:ఖాందోళనకు గురైతాడు. ఓదెలు కొడుకు రాజుకు చదువు వంటపట్టక, ఏమి చేయలేని నిస్సహాయస్థితిలో బదిలీఫిల్లర్‌గానే పెట్టించాల్సి వస్తుంది. అతనిలాగా గనికార్మికులెందరి జీవితాలో గనిగరిమిలో మాడిమసైపోతున్న విషయం గుర్తు తెచ్చుకుంటూ హృదాయవిదారకంగా మనస్సులో బాధపడతాడు. గనికార్మికుల జీవితాలను దౌర్భగ్యంగా చేసిన ఈ సమాజంపైన కోపం, కసి పెంచుకుంటూ తనలాగే ఎందరో గనికార్మికులు తమ జీవితాలను మెరుగు పరుచుకోలేక తమ ఆశలను దిగమింగుకొని తమ జీవితనౌకను ఈడ్చుతున్న వారిని తలుచుకొని సుప్తచేతనంలోకి వెళుతూ ఓదెలు చంద్రయ్య కొడుకు వారికి పేరు నిర్ణయించలేక యిలా అంటాడు. "నన్ను పేరు పెట్టమన్నరు. కాని.... నేను అబద్ద మాడలేనుర్ర. ఏపేరు పెట్టితేమున్నదిర... "కోల్‌ఫిల్లరోని"కి కొడుకు పుడితె అయ్యేది. "బదిలీఫిల్లరేరా".ఏపేరు పెట్టినా వాడయ్యేది ఆఖరికి బదిలిఫిల్లరేరా"(రఘోత్తమరెడ్డి, 2006: 105). ఈవిధంగా ఏపేరు పెట్టినా చంద్రయ్య లాంటి బొగ్గుగని కార్మికుని కొడుకు చివరికి అయ్యేది గనికార్మికుడేనని ఓదెలు చంద్రయ్యకొడుకు భవిష్యత్తును అంచనా వేసి చెప్తాడు. అలా చెప్పడానికి తన

అనుభవం ఒక్కటే గాదు సామాజిక పరిస్థితులు కూడా అణచివేసేలా చేస్తాయని ఓదెలు కంఠంలో అంతరధ్వని వినిపిస్తుంది.

ప్రతి గనికార్మికుని స్వానుభవం ఓదెలు పాత్ర ద్వారా ఇదేనని ఇందులో తెలియజేశాడు రచయిత. కోల్‌ఫిల్లర్ కొడుకు బదిలీఫిల్లర్ అయితాడనే వాస్తవం ఈ కథలో కనిపిస్తుంది. గనికార్మికులు తమ కొడుకులను చదివించి ఉన్నతమైన స్థానంలో ఉంచాలనుకుంటారు. కాని తమ చుట్టూ ఉన్న సామాజిక పరిస్థితులు, వ్యక్తిగత జీవితాల వల్ల, ఆర్థిక అసమానతల వల్ల సరైన చదువును అందించలేక వారి జీవితాలను మార్చుకొలేక నిరాశ్రయులుగా మిగిలిపోవాల్సిందేనని ఈకథ వల్ల తెలుస్తుంది. “గనిలోపల విపరీతమైన వేడిలో కడుపుల పేగులు నోట్లోకొస్తున్నట్టు, పొగవల్ల దగ్గు, తల దిగవారంగ బొగ్గు నీళ్ళు కారుతూ బలవంతంగా తట్ట ఎత్తుకొని సొలుగుతూ పోతున్న కొడుకును చూసి, అతనితో పనిచేసే తండ్రి ఓదెలు దు:ఖం వర్ణనాతీతం. ఎంత ప్రయత్నించినా కొడుక్కు మంచి చదువు చెప్పించలేకపోవటంతో అసహ్యించుకున్న వారసత్వాన్ని తప్పించలేకపోతాడు” (వేణుగోపాల్, 2013: 94). అంతేగాకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులు కూడా గనికార్మిక జీవితాలను దుర్భరంగా చేస్తున్నాయని తెలుస్తుంది. గనికార్మికుని గుండెలో దాగున్న బాధను, అణిచివేతను, తరతరాలుగా పీడిస్తున్న సామ్రాజ్య వ్యవస్థను, దొరల వెట్టిచాకిరీ వల్ల నిష్ప్రయోజనమైన జీవితాలను, గనికార్మిక జీవితం వారి కొడుకులపై చూపుతున్న ప్రభావాన్ని, రోజు రోజుకి క్షిణిస్తున్న ఆరోగ్య పరిస్థితులను ఇలా గనికార్మికుడు పడుతున్న సమస్తబాధలను అనుభవించి వాటితో నిత్యం పోరాటం చేస్తున్న ఓదెలు లాంటి కార్మికుల ఆవేదనను ఇందులో గుర్తు చేయించాడు తుమ్మేటి. బొగ్గుగని కార్మికుల జీవితంలో ఉండే అంతర్మథనాలు అంతా ఇంతా కాదని ఈ కథ వల్ల మనకు అర్థమైతుంది.

## 2.8.4 వాల్‌పోస్టర్

బొగ్గుగని కార్మికుల శ్రమను దోచుకుని దానికి తగిన ప్రతిఫలం ఇవ్వకుండా చలాయించే గని అధికారుల అక్రమాలను ఎదురించి గని కార్మికులంతా ఏకమై తమ హక్కుల్ని సాధించుకోవడానికి సంఘిటితం కావల్సిన అవశ్యకతను తెలియజేస్తున్న కథ 'వాల్‌పోస్టర్'.

సమ్మిరెడ్డి, మల్లేశం మంచి స్నేహితులు. వీరు గనిలో జతగా(ఫైలు) పనిచేసేవారు. గనుల్లో గనిఅధికారుల జులుంని, ఆరాచకత్వాన్ని ఎదురుకొని కార్మికులను పరిరక్షించటానికి మంచి నాయకుడిలాగా నిలబడి పోరాటం చేసి మరణించిన వ్యక్తి నర్సయ్య. నర్సయ్య ఒక అన్నలాగా కార్మిక ఉద్యమంలో ఉండి సమ్మిరెడ్డి, మల్లేశం మొదలైన ఇతర కార్మికులందరికి బాగా తెలిసిన వ్యక్తి. పోలీసులు, గనిఅధికారులు కలిసి అతన్ని చంపేస్తారు. ఆవిషయం తెలిసినా మల్లేశం, సమ్మిరెడ్డి నిస్సహాయులుగా ఉంటారు. అంతేగాకుండా పనికి కావల్సిన పనిముట్లను ఆలస్యంగా ఇచ్చికూడా ఆ రోజు పని మస్టర్లు (ముద్రలు) వేయమని కంపెనీ అధికారుల తెగేసి చెబుతారు. నర్సయ్య ఉద్యమంలో పని చేసిన ఇద్దరు కార్మికులను పనిలో నుంచి తొలగించటం జరుగుతుంది. ఈ రెండు సంఘటనల వల్ల కార్మికుల సంక్షేమం కోసం పోరాడే ఉద్యమం ఎక్కడ అగిపోతుందోనని సమ్మిరెడ్డి, మల్లేశం ఆందోళనకు గురైతారు. గత కొన్నిరోజులుగా బొగ్గుగనికార్మికులు తమకు పెంచాల్సిన జీతాలను ఇవ్వాలని, చార్జీషీటులను ఇవ్వాలని సమ్మె మొదలుపెడతారు. కాని ఆ సమ్మెను ఏ క్షణాన ఆపుతారోనని కంగారు పడతాడు సమ్మిరెడ్డి. అంతలోకి ఓ గనికార్మికుడు పరుగున వచ్చి సమ్మె ఆపటానికి వస్తున్న మేనేజర్లను, పోలిసులను చూసి ఈవిధంగా అంటాడు. "పులిని పడగొట్టింద్రే నాయిన పులిని పడగొట్టింద్రు–నక్కలు రాజ్యం మీదికచ్చినయి" (రఘోత్తమరెడ్డి, 2006: 200). సమ్మిరెడ్డికి మాత్రం కార్మికులకు జీతాలను కట్టివ్వాలని, తొలగించిన కార్మికులను పనికి పిలుపించుకోవాలి అనుకుంటారు. సమ్మిరెడ్డి సమ్మెను ఎలానైనా కొనసాగించాలని, ఏదోక నిర్ణయం తీసుకోవాలని అనుకుంటాడు. దానికి తన జతపనివాడు. మిత్రుడు అయిన మల్లేశం కోసం వెతుకుతాడు. కార్మికులు సమ్మెని కొనసాగించకుండా పనికి వెళ్ళాలని కొందరు అనుకుంటే, ఏలానైతేనేం సమ్మెను కొనసాగించడం

సరైదని మరికొందరు వాళ్ళ ధోరణిలో ఆలోచించుకుంటారు. సమ్మిరెడ్డి మల్లేశంతో కలిసి పోరాటం కొనసాగిద్దాం అనుకుంటే మల్లేశం జాడ కనిపించదు. కార్మికుల స్థితిని, బాధను చూసి చాలా విచారంలో పడతాడు. పోలీసులు, మేనేజరులు వచ్చి కార్మికులను బెదిరించి పనుల్లోకి దిగమని అంటారు. కార్మికులు అమాయకంగా కూర్చొని ఎవరికి వారే సమాధానాలు చెప్పుకుంటారు. ఇంతలో మల్లేశం వచ్చి సమ్మిరెడ్డిని కలుస్తాడు. ఇద్దరు కలిసి ఇంటిముఖం వైపు వెళతారు. దారిలో బాగా విచారంతో ఉన్న సమ్మిరెడ్డి సొమ్మసిల్లిపోతాడు. మిత్రుని బాధను గమనించిన మల్లేశం అది తట్టుకోలేక కార్మికుల చైతన్యంవల్ల అధికారుల నోరు మూయించాలని అనుకుని రాత్రికిరాత్రే తటాలున వాల్‌పోస్టర్‌ను వేస్తాడు. తెల్లవారే సమాయానికి పనికి వచ్చినకార్మికులు వాల్‌పోస్టర్లను చూసి చాలా సంతోష పడతారు. తమని కాపాడడానికి నర్సయ్య అన్నే వచ్చారన్నట్లు భావిస్తారు. తొత్తుయూనియన్లు తరిమివేయాలనీ, కార్మికులకి మంజూరు చేసిన చార్జ్‌షీట్లను వాపస్ తీసుకోవాలనీ, సమ్మెను కొనసాగించిన కార్మికులకు సమ్మె దినాలకు జీతాలు కట్టివ్వాలని, కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడితేనే అది సాధ్యమని ఆ వాల్‌పోస్టర్లలో ఉంటుంది. మొత్తానికి కార్మికుల తరపున ఉండి గని అధికారులను ఎదిరించి తమ హక్కుల కోసం చేసిన పోరు ప్రయత్నం, వాల్‌పోస్టరు రేపిన సంచలనం అది. రాజకీయ నాయకులు ఓట్ల కోసం వచ్చి వాళ్ళ అవసరం తీరగానే పట్టించు కోకుండా పోయే స్వభావాన్ని కూడా చివరిలో తెలియజేశారు రచయిత. వాల్‌పోస్టర్‌ను చూసిన సమ్మిరెడ్డికి సంతోషం, సందేహం ఒకేసారి కలుగుతాయి. తనకు తెలియకుండా పోస్టర్ ఎవరేసారా అని ఆలోచనలో పడతాడు. సమ్మిరెడ్డి సందిగ్ధాన్ని మల్లేశం త్వరగానే తీరుస్తాడు. "ఎటుచూసినా ఏ దారి కనిపియ్యక పాయె. ఇగ అన్నుంటె ఏంజేసెటోడు అని ఆలోచన చేసిన గంతే! నిన్న పోతపోత బజారుకు పోయి కాయితాలు తెచ్చిరాసి, రాత్రి బదిలికి అచ్చినట్టు అచ్చి అతికిచ్చిపోయిన. తప్పో! ఒప్పో! అన్నలు కలిసినంక 'శెనార్తి' అంట"(రఘోత్తమరెడ్డి, 2006: 205). అని తాను చేసిన పనిని తానే సమ్మిరెడ్డికి చెప్తాడు. ఇలా కార్మికుల్లో నెలకొన్న భిన్న పరిస్థితులను ఎలా పరిష్కరించుకొన్నారో తెలుస్తుంది.

బొగ్గుగనుల్లో నానా కష్టం చేసి తీరా ఊపిరి తీల్చుకోవడానికి పైకి వచ్చిన గని కార్మికులకు గనిఅధికారుల క్రూరత్వం ఎదురవుతుంది. శారీరక, మానసిక ఒత్తిడులకు మధ్య గనిఅధికారుల దౌర్జన్యాన్ని ఎదుర్కోవటానికి చేసే ఉద్యమాలు, పోరాటాలను ఎలా అణచివేయడమో నిర్ణయించేవి. ప్రభుత్వ పోలిసు యంత్రాంగాలు. అవి వారి హక్కులను, స్వేచ్ఛలను హరిస్తూ అధికారుల తోత్తును చేరి కార్మికులను మోసం చేయడం ఈ కథలో వివరిస్తాడు. కార్మిక సంక్షేమ ధ్యేయం అంటూ గని అధికారులతో కలిసే తొత్తుయూనియన్లు చేసే కుట్రను తెలిపారు రచయిత. ప్రజల పక్షాన, గని అధికారుల తరపున ఉద్యమాలను చేసి వారి హక్కులకై పోరాడే ఉద్యమ నాయకులను ఏవిధంగా సంహరించి కార్మిక సంఘటిత శక్తి విచ్ఛినం చేయడానికి ప్రయత్నం చేశారో ఇందులో కనిపిస్తుంది. కార్మికులందరిని ఏకంచేసి వారి హక్కుల సాధనకై చేసే పోరాటాన్ని కూల్చి వేయడానికి ప్రయత్నం చేస్తున్న గని అధికారుల స్వభావాన్నీ. తొత్తుయూనియన్లు కార్మికులకు చేసే దుర్మార్గాన్నీ తెలియజేస్తుంది ఈ కథ. కార్మికుల సమ్మె ఎక్కడ అగిపోతుందోనని, నిలిచిపోతుందోనని భయపడి అందర్నీ గుమిగూడి సమ్మెను కొనసాగించాలనుకొన్న సమ్మిరెడ్డి ఆశను మల్లేశం పరోక్షంగా వాల్‌పోస్టర్ల ద్వారా నిజం చేస్తారు. సమ్మిరెడ్డి, మల్లేశం వల్ల కార్మికుల ఐక్యత ఎంత అవసరమో వెల్లడవుతుంది. కార్మికులందరి బాధను చూసి తట్టుకోలేక రాత్రికిరాత్రికే వాల్‌పోస్టర్లను అంటించిన మల్లేశం ధైర్యం ఇందులో కనిపిస్తుంది. కమ్యూనిస్టులు, అన్నల ప్రభావంతో కార్మికులు వారి హక్కులు, స్వేచ్ఛను పొందటానికి గనిఅధికారులను ఎదుర్కొని తిరగడమే శరణ్యం అవుతుందని గ్రహించి మల్లేశం ఆ పనికి ఒడికడతాడు. దానికి భయపడి గనిఅధికారులు పనివేళలను తగ్గించటం, చార్జీషిట్లను తగ్గించటం, జీతాలను వృద్ధిచేయడం జరుగుతుంది. ఇలా ఈ కథలో కార్మికుల సంఘటిత శక్తి అవశ్యకతను రచయిత తన అనుభవంలోనుంచి వెల్లడించినట్లు అనిపిస్తుంది.

# అధ్యాయం – 3

# తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – పాత్రచిత్రణ

## 3. పాత్రచిత్రణ నిర్వచనాలు -

ఒక్కొక్క వ్యక్తికి ఒక్కొక్క మానసిక స్వభావం, విశిష్టమైన వ్యక్తిత్వం, ఆలోచనాధోరణులు ఉంటాయి. అవి ఎదుటివారికి నచ్చేలా ఉండొచ్చు, ఉండకపోవచ్చు. వారి ప్రవర్తన,ఆలోచనల ఆధారంగా వారి వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తాం. కథల్లో రకరకాల పాత్రలు చిత్రిస్తూంటారు సమాజంలో భిన్న వ్యక్తుల స్వభావాలను చూసి ఆ పాత్రలను కథల్లో ప్రవేశపెడతారు అనిపిస్తుంది. సమకాలీన సమాజాన్ని,అందులోని వ్యక్తుల జీవితాలను కథావస్తువులుగా స్వీకరించినపుడు ఆయా కథల్లోని పాత్రలు అత్యంత సహజంగా, వాస్తవిక జీవితానికి దగ్గరగా వున్నట్లు చిత్రంచబడతాయి. రచయిత చెప్పాల్సిన విషయాన్ని పాత్రలపై ఆరోపించి ఆ పాత్రల ప్రవర్తనల ద్వారా పాఠకునికి చేరవేయడంజరుగదుతుంది. “కథను నడిపించే వారు, కథావస్తువును భరించేవారూ, కథాంశాన్ని సూచించే వారు పాత్రలు” (వెంకటసుబ్బయ్య, 1995: 25)

కథలో రచయిత చెప్పదలచుకున్న విషయాన్ని పాత్రలద్వారా వ్యక్తపరుస్తాడు. కథల్లో పాత్రలు కథాగమనానికి, రచయిత అందిచాల్సిన విషయానికి తగ్గట్టుగా ప్రవర్తిస్తుంటాయి. ఒక సంఘటన, ఒక సన్నివేశంలో పాత్ర ఏయే సంఘర్షణలకు గురికావాలో ఆయా సంఘర్షణలకు గురవుతుంటుంది. సంఘర్షణలకు గురి కాని పాత్రలు, సాధారణ జీవితాన్ని ఆశించే పాత్రలు కథలో ఉండి కూడా లాభం లేనట్లే అవుతుంది. కాబట్టి కథకుడు చెప్పదలచుకున్న విషయానికి అనుగుణమైన పాత్రలుండాలి. ఆ పాత్ర లక్షణాలు, ప్రవర్తనలు కథాంశాన్ని పట్టించేలా వుండాలి. అప్పుడే ఆ కథకు తగ్గ పాత్రను రచయిత ఎన్నుకున్నట్లు అవుతుంది. పాత్రను గురించి పోరంకిదక్షిణామూర్తిగారు కింది విధంగా అన్నారు. “ఒక రచనలో తన స్వాభావిక లక్షణాలను మాటలలోగాని, చేతలలోగాని వ్యక్తం చేయు వ్యక్తిని పాత్ర

అంటారు" (దక్షిణామూర్తి, 2009: 246). రచనలో చిత్రించబడే వ్యక్తి తన భావ ప్రకటనను హావభావాలతో వ్యక్తం చేయాలి. ఆ వ్యక్తి , మాటలు, చేష్టలు అతని లక్షణాన్ని పట్టించే విధంగా రచయిత పాత్రలను చిత్రించాలి.

ఆర్.ఎస్ సుదర్సనంగారు పాత్రచిత్రణ గురించి ఈ విధంగా అన్నారు. "జీవితమంటే సుఖదు:ఖాలు, ఒక మనిషి అవి ఎలా సంప్రాప్తిస్తున్నవి.ఆయా సంధర్భాల్లో ఆ మనిషి ఎలా ప్రవర్తిస్తున్నాడు ఈ రెండు విషయాల్ని బట్టి మనిషిలో వ్యక్తి వైశిష్ట్యం గోచరమవుతుంది. జీవితాన్ని కథగా మలిచే ప్రక్రియైన నవలలో అవినిరూపింపబడే వైశిష్ట్యాన్ని 'పాత్రచిత్రణ' అంటారు" (సుదర్శనం, 2013: 105). సాధారణ జీవితంలో వుండే పాత్రలకు, కథలో సంఘర్షణలతో కూడిన పాత్రలకు వైవిధ్యం ఉంటుంది. జీవితంలో కష్ట సుఖాలు వచ్చినపుడు ఆ మానసిక స్థితిని, శారీరక మార్పులను రచయిత తన రచనలో సమర్ధవంతంగా చిత్రించడమే 'పాత్రచిత్రణ' అవుతుంది. అలాంటి పాత్రలను రచయిత తన కథల్లో చిత్రంచడం, పాఠకులను మెప్పించడం కొంచెం కష్టసాధ్యమైన పని. కొన్ని పాత్రలు మాత్రమే పాఠకులను మారుస్తాయి.అలాంటి పాత్రలు బాగా గుర్తుండిపోతాయి.

రచయిత ఎన్నుకున్న కథావస్తువు పాఠకులకు చేరవేయడానికి సహకరించేవి, ఉపకరించేవి పాత్రలు. ఈ పాత్రలు సాధారణమైన జీవితానికి సంబంధించినవి కాకుండా విలక్షణమైన మానసిక వ్యక్తిత్వం విభిన్నమైన భావాలు కలిగినదృక్పథంతో కూడినవి అయి వుండాలి. అప్పుడే రచయిత వస్తువైవిధ్యాన్ని అనుసరించి పాత్రవైవిధ్యాన్ని ప్రదర్శించగలడు. భిన్నమైన పాత్రలు భిన్న పరిస్థితుల్లో భిన్న రకాలుగా ప్రవర్తించినపుడు పాఠకులకు విభిన్న ఆలోచనలను రేకిత్తిస్తాయి. రచయిత చెప్పదలుచుకున్న విషయాన్ని నేరుగా చెప్పకుండా పాత్రల ద్వారా తన భావాన్ని వ్యక్తపరుస్తాడు. ఇదంతా నిగూఢంగా, కళాత్మకంగా పాత్రల అంతరంగ ప్రపంచం ద్వారా వ్యక్తపరుస్తాడు. పాత్రలు అర్ధరహితంగా కాకుండా అర్ధవంతంగా, పాఠకుడు అర్థం చేసుకొనే రీతిలో పాత్రచిత్రణ ఉండాలి. అలాగని పాత్రల పరిచయాలు, వ్యాఖ్యనాలు కూడా రచయిత చేయటం తగదు.

"రచయిత స్వయంగా పాత్రల మంచిచెడ్డల్ని గురించి చెప్పకూడదు. సాక్షి మాత్రుడిగా కథ చెప్పుకుంటూ పోవాలి. ఆయా ఘట్టాలలో పాత్ర వ్యవహరించే తీరు సహజత్వానికి దగ్గరగా ఉండాలి. అసాంతంగా చదివి ముగించిన మీదట ఆ పాత్ర గుణదోషాలతో సహ బాగా పరిచితుడైన సజీవ వ్యక్తిలో పొడగట్టాలి. అట్టకట్టించి ఫ్రేము తగిలించి అద్దం బిగించి గోడకు వేలాడదీసిన చిత్తరువులా ఆ పాత్ర తన చుట్టాత నెలకొని వున్న దేశ కాల పరిస్థితుల నడుమ ఎబ్బెట్టు లేకుండా యిమిడి పోవాలి" (రాజారాం, 2000: 577). కథ అనేది సంక్షిప్తంగా, క్లుప్తంగా ఉన్న సంఘటన రూపం. అందులోని పాత్రల ప్రవేశం నేరుగా ప్రవర్తనలతో, చేష్టలతో చిత్రించాలి. కాని ఆ పాత్రల పరిచయాన్ని వివరిస్తుంటే కథకుడు సాధారణ విషయన్ని చెప్తున్నట్టు ఉంటుంది. కాబట్టి సంఘటన, సన్నివేశాలు అనుసంధానంగా పాత్రల వైవిధ్యం ఉండాలి.

"కథలో పాత్ర చిత్రణ రచయిత "చెప్పడం", పాఠకుడు "తెలుసుకోవడం" అన్న సూత్రం మీద జరగదు. కథారచయిత సంఘటనను ప్రదర్శిస్తాడు. పాఠకుడు పాత్రను తన ఊహాశక్తితో అర్థం చేసుకుంటాడు. పాత్రను గురించి అన్ని విషయాలనూ తానే చెప్పే కథారచయిత చాలా తక్కువ రకం కళాకారుడు మాత్రమే. కథాంశాన్ని పాఠకుని ఊహాశక్తికి వదలి పెట్టని కథ కూడా చాలా తక్కువ రకం కథే" (వెంకటసుబ్బయ్య, 1995: 27). కథల్లో పాత్రచిత్రణ అనేది ఆ కథలో చిత్రించబడే జీవితానికి సరిపడేలా వుండి పాత్ర సజీవతను నిలబెట్టుకోవాలి. అప్పుడే పాఠకుడికి ఆ కథలోని పాత్రపై వైయుక్తిక ముద్ర ఏర్పచుకుంటాడు.చిరకాలంగా పాఠకుల మనస్సులో మిగిలిపోతుంది.

ఆర్. ఎస్ సుదర్శనం పైన చెప్పిననిర్వచనం నవలకు వర్తిస్తుంది. కథ విషయానికి వస్తే చిన్న సంఘటన ఆధారంగా రూపొందించబడే కథలకు పాత్రచిత్రణ కూడా సంఘర్షణతో ప్రారంభమవ్వాలి. ఆ సంఘర్షణతో పాత్ర ముగియాలి. "ఒక పాత్ర క్రమ వికాసాన్ని నవల చిత్రించినట్లు కథానిక చిత్రించదనే అంశం ముఖ్యమైనది. కథానిక పాత్ర మారడాన్ని చిత్రించవచ్చు కాని క్రమవికాసాన్ని చిత్రంచలేదు. కారణం కథావస్తువు జీవిత శకలమే గాని జీవితంకాకపోవడమే" (చంద్రశేఖరరెడ్డి, 1985:18). జీవితంలో చిన్న సంఘటన ఆధారంగా కథను రాస్తారు. కాని పూర్తి జీవితాన్ని కథలో

ఇమడ్చలేం దాని రూపం పరిమితం. కాబట్టి అందులోని పాత్రలు కూడా ఒక పాత్ర సంఘర్షణలో మారిన విధానాన్ని మాత్రమే చిత్రిస్తుంది.

## 3.1 తుమ్మేటి కథలు పాత్రచిత్రణ -

ఒక వ్యక్తి జీవితంలోని ఏదో ఒక సంఘటనను సహజంగా పాత్రల ద్వారా వ్యక్తం చేయడమే పాత్రచిత్రణ అని తెలుస్తుంది. వస్తు నిర్వహణకు ప్రాణంతెచ్చి జీవం పోసేది పాత్రచిత్రణ. వస్తువుని పాఠకునికి అందించడానికి దోహదం చేసేది పాత్రచిత్రణ. వాస్తవికసంఘటననే కథలుగా రూపొందించిన రఘోత్తం కథల్లో పాత్రల వైవిధ్యంస్పష్టంగా కనిపిస్తుంది. వాస్తవిక జీవితంలోని పాత్రలకు కల్పనలు జోడించి కథలను వాస్తవికంగా, కళాత్మకంగా చిత్రించే ప్రయత్నం చేశారు. ఈయన కథల్లో పాత్రలు రైతుల పాత్రలు, సామాన్యుల జీవిత పాత్రలు, గనికార్మిక పాత్రలు, దొరల పాత్రలు, స్త్రీల పాత్రలు కనిపిస్తాయి. పాత్రలన్నీ సహజంగా, పాత్రోచితమైన భాషా ప్రయోగాల్తో సంఘటనానుకూలంగా చిత్రించబడ్డాయి. ఇందులో పాత్రల మానసిక స్థితిని రచయిత చిత్రించిన తీరుని పరిశీలించడం ఈ అధ్యాయ ముఖ్యోద్దేశం.

రఘోత్తం పాత్రలవైశిష్ట్యం గురించి బి.వి.ఎన్ స్వామిగారు ఈవిధంగా అన్నారు. "రఘోత్తం కథల్లోని పాత్రలను, మార్పులను తెలంగాణ సామాజిక నేపథ్యం నుంచి చూడాలి. ఇక్కడి భూసంబంధాలు మానవ సంబంధాలను నిర్ధేశించాయి. ఆ మేరకు మానసిక సంఘర్షణ రూపంలో కనపడుతుంది. అదొక అనివార్యత. తెలిసిన దాన్ని చూసినట్టుగా చెప్పే కథనరీతి వల్ల, సంక్లిష్టతను సులభంగా అర్థం చేసుకునే వీలు కూడా కథల్లో దాగి వుంది. ప్రతిపాత్ర సొంత గొంతుక కలిగి వుండి ఆచరణలో వైవిధ్యతను సంతరించుకోవడం వల్ల దేనికదే నమూనాగా భాసిస్తుంది. దీనివల్ల వస్తువిస్తృతి పెరిగింది" (స్వామి, 2013: 98, 99). విషయ పరిధి మేరకు తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన కథలలోని పాత్రలను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి:

1. ప్రధానపాత్రలు

2. అప్రధానపాత్రలు

3. కథను మలుపు తిప్పిన పాత్రలు

## 3.2 ప్రధాన పాత్రలు

### 3.2.1 రాయమల్లి

"ధిక్కారం" అనే కథలో 'రాయమల్లి' ప్రధాన పాత్ర. తెలంగాణ దొరల పాలన నాటి కాలంలో దొరల దోపిడికీ అరాచకానికీ గురైన పాత్ర రాయమల్లి. ఈ కథలో దొరల దోపిడి విధానాన్ని వ్యతిరేకించి, నిరసించిన పాత్రగా రాయమల్లిని చిత్రించాడు రచయిత. ముందటి సంవత్సరానికి అప్పుకు తెచ్చుకున్న వడ్లకు పెచ్చులు కట్టడానికి వెళ్ళిన రాయమల్లిని దొరసాని, దొరసాని కొడుకు అవమాన పరిచి కొడతారు. రాయమల్లి తన పెద్దకొడుకైన సమ్మడిని పాలేరుగా తన దగ్గర వుంచలేదని కోపం ఒకవైపు, వడ్లకు పెచ్చులు కట్టలేదని కోపం మరోకవైపు దొరసానికి కోపం తెప్పిస్తాయి. దానితో రాయమల్లిని బూతు మాటలతో తిడుతుంది. బొగ్గు గనిబావిల పనికి వెళుతున్న తన కొడుకు తన మాటలను వినిపించుకోవడం లేదని దొరసానితో చెప్పగా "సంసారివైతివి గివన్ని నీకెందుకెరుక వాన్ని ముకుండకుంట చేసింది నువ్వు కాదె లంజె"(రఘోత్తమరెడ్డి, 2006: 7) అని దొరసాని అంటుంది.ఆ మాటలు విన్న రాయమల్లి తన ఆత్మగౌరవాన్ని చంపుకోలేక దొంగ లెక్కలు వేసి పెచ్చులకు పెచ్చులు కట్టించుకొని మంది సొమ్ములు తినే దొరల నైజాన్ని బయట పెడుతుంది. "పని పాట లేకుంట రోజుకు ముడుసార్లు తిండాయె, బాంచెన్ అదీ మందిని ముంచినాయె ఇగ బలుపు రాకేం జెత్త"(రఘోత్తమరెడ్డి, 2006: 7) అని రాయమల్లి ఎదురు తిరుగుతుంది. ఒక హరిజనస్త్రీ తన తల్లిని తిడుతుందన్న కోపంతో రాయమల్లిని దొరసాని కొడుకు  జగదీశ్వర్రావు బాగా కొడతాడు. ఆ దెబ్బలకు తట్టుకోలేక రాయమల్లి కోపంతో అన్యాయంగా తనను కొడుతున్నందుకు జగదీశ్వర్రావుకు ఎదురు తిరిగి "నీ యింట్ల పీనుగెల్లగదరో, నీ చేతులు పడిపోను గదరో, అన్యాలంగ నన్ను కోడితివి గదరా గాడిద కొడుకా"(రఘోత్తమరెడ్డి, 2006: 7) అని తిడుతూ రాయమల్లి ఇంటిముఖం పడుతుంది. ఈ విధంగా ధిక్కారం కథలో సాధారణమైన నిమ్నవర్గానికి చెందిన స్త్రీ దొరల దౌష్టికాన్ని ఎదురించిన

ధైర్యవంతురాలిగా, చైతన్యవంతురాలిగా చిత్రించారు రచయిత. నిస్సహాయ స్థితిలో ఉండి కూడా దొరల అధికార, అహంకార భావజాలాన్ని నిరసించే పాత్రగా రాయమల్లి మనకు కనిపిస్తుంది. తరతరలుగా వస్తున్నదొరల దోపిడిని, అరాచకాన్నీ రచయిత రాయమల్లి పాత్ర ద్వారా సహేతుకంగా, తార్కికంగా ప్రశ్నింపచేసాడు.

### 3.2.2 ప్రతాప్ దొర

"దొర" పాత్ర 'సవారి-I' కథలో ప్రధాన పాత్ర. ఈ కథలోని తన బావమరిది కోరక మేరకు అతని ఊరికి బయలుదేరతాడు దొర. తనబండి వెనుక పరిగెత్తడానికి ఓదెలు అనే చాకలిపిల్లవాన్ని రమ్మంటాడు. ఓదెలు బండి వెనుక పరిగెత్తుతుండగా సవారి మొదలవుతుంది. ఊరు దాటి వెళుతుండగా మార్గం మధ్యలో ఒక కమ్యూనిస్ట్ బహిరంగ సభ ఎదురవగానే భయపడి బండి వెనుక పరిగెత్తుతున్న ఓదెలును బండి ఎక్కించుకుంటాడు దొర. ఆ బహిరంగ సభ మధ్యలో నుండి వెళితే ఎక్కడ ఏమవుతుందోనని భయపడి సమయస్ఫూర్తితో, సంయమనంతో జాగ్రత్త పడి బండిలోకి ఎక్కించుకుంటాడు. దొర తన ఆత్మరక్షణకై కిందికి దిగజారడానికి వెనుకాడడు. ఒక విధంగా దొర సంఘానికి భయపడ్డాడు అని చెప్పాలి. ఈ కథలోని దొర ఓదెలును చిన్న పిల్లవాడని చూడకుండా పరిగెత్తించడం, ఓదెలు అయాసంతో, తన చెప్పుతెగి పరిగెత్తలేక ఉన్నపుడు దొర చూసి కూడా ఏమి మాట్లాడడు. అధికార అహంతో, ఓదెలును తక్కువవాడిగా భావించి పనులు చేయించుకోవడం కనిపిస్తుంది. ప్రతాప్ దొర వెట్టి చాకరి చేయించుకునేవాడిగా, బాలలను కూడా వదలకుండా పనికి ఉపయోగించుకునేవాడిగా కనిపిస్తాడు.

ఈ కథకు కొనసాగింపుగా సవారి-II కథలో దొర పాత్రను గమనించినట్లయితే కమ్యునిస్టు బహిరంగ సభ మధ్య నుంచి బండి మీద వెళుతున్న దొర గురించి జనం మాట్లాడుకోనే మాటలు వింటూ తీవ్రమైనఆవేశాన్ని అణచుకొని, ఏమిచేయలేని నిస్సహాయస్థితిలో ఉండిపోతాడు. బండిమీద ఎక్కించుకున్న ఓదెలును చూస్తూ,జనాన్ని చుస్తూ 'నీ తల్లి కాలం పెండ్లాం' అంటూ వారి మీద కోపాన్ని

మూగ జీవాలపై చూపిస్తాడు. బహిరంగ సభ మధ్యనుండి వెళుతుంటే బెదిరిపోతాయి ఎడ్లు. బహిరంగ సభలో వున్న జనం దొరను హేళన చేసి మాట్లాడినట్టనిపిస్తుంది. సభ దాటి కొద్ది దూరం వెళ్లాక అప్పటి వరకు అణచుకున్న కోపాన్ని ఓదెలుపై చూపిస్తాడు. ఓదెలుని దిగురా గాడ్డి నడువమంటే సెవులినబడ్త లెవ్వురా అని అజ్ఞాపిస్తాడు. ప్రతాప్ దొర లాంటి దొరల అంతరంగ ప్రపంచాన్ని బట్ట బయలు చేసాడు రచయిత. దొర పాత్ర ద్వారా బానిస రాజ్యాన్ని, దొరల క్రూరత్వాన్ని, దొరల వల్ల సామాన్య ప్రజల జీవితాలు ఏ విధంగా నాశనం అవుతున్నాయో రచయిత చిత్రంచారు. .

### 3.2.3 ఓదెలు

ఓదెలు "సవారి" కథలోని మరో ప్రధాన పాత్ర. ఓదెలు పాత్రకు సంభాషణలు లేకుండా రచయిత ఓదెలు చుట్టు వున్న ప్రపంచాన్ని కథనం చేస్తాడు. ఓదెలు చేష్టల ద్వారా మాత్రమే ఆ పాత్ర వైశిష్ట్యాన్ని అర్థం చేసుకోవాలి. ఓదెలు ఆడుకునే వయస్సు గల బాలుడు.కాని ఓదెలు తండ్రికి పని ఉండటం వల్ల దొర దగ్గర వెట్టిచాకిరిచేయానికి వెళతాడు. తండ్రి బాధ్యతను తన మీద వేసుకొని దొర బండి వెనుకాల పరిగెత్తే బానిస పాత్రగా రచయిత ఓదెలు పాత్రను చిత్రించారు. అలా ఓదెలు తండ్రి ఆజ్ఞ మేరకు దొర బండి వెనుకాల పరిగెత్తడానికి ఒప్పుకుంటాడు. దొర బండి వెనుక పరిగెత్తి పరిగెత్తి అలసి పోతాడు. ఎంత పరిగెత్తినా చేరని తన గమ్యాన్ని చేరాలన్నట్లు "ఆశకి అవధి ఊరికి పొలిమేర"(రఘోత్తమరెడ్డి, 2013: 11). చేసుకొనిపరుగులు తీస్తాడు. అలసిపోయిన తనకు, తనలాగే అలసిపోయి నీళ్ళుతాగుతున్నట్టు నటిస్తున్న ఎద్దులను చూసి నవ్వుకుంటాడు. వాటిది, తనది ఒకేలాంటి పరిస్థితి అని ఓదెలుకు నవ్వు వస్తుంది. కొంచెం దూరం వెళ్లాక  ఒక కమ్యూనిస్ట్ సభ ఎదురవుతుంది. అది తమలాంటి బతుకులున్న వారి కోసమని ఓదెలుకు తెలియదు. ఆ సభను గమనించకుండానే ఓదెలు పరుగులు తీస్తాడు. దొర ఆ సభను గమనించి బండిలో ఎక్కించుకున్న ఓదెలుకు అదేమి అర్థంకాక ఆశ్చర్యపోతాడే తప్ప దొర ఔచిత్యాన్ని గమనించడు. ఈ విధంగా 'సవారీ–I' కథలో ఓదెలు

అమాయకంగా దొర చెప్పిందల్లా చేయడమే తప్ప ధిక్కరించిన వైనం కనిపించదు. రచయిత ఈ కథ ద్వారా దొరల కాలంలో విద్యకు దూరమై వెట్టి చాకిరి చేసే ఎందరో బాలల జీవితాన్ని తెలియజేసాడు.

కాని ఓదెలు పాత్ర 'సవారీ–II' లో పూర్తి భిన్నంగా కనిపిస్తుంది.. అటువైపుగా ఎర్రజెండాలు పట్టుకొని, పాటలు పాడుతూ వస్తున్న సంఘం వాళ్లను చూసి, ఓదెలుకు ఏమి తెలియక సందేహపడతాడు. కాని ఆ బహిరంగ సభ, సభలోని ఆట పాటలు ఓదెలుని ఆశ్చర్యపరచి ఆసక్తుడిని చేస్తాయి. బండిదిగి సభవైపు వెళ్ళాలని కొండంత ఆశ ఉన్నప్పటికి తండ్రి మాట గుర్తొచ్చి తన కోరికను అణచి వేసుకుంటాడు. దొర అసలు తత్వాన్ని గమనించి దొరకెదురు తిరుగుతాడు. తన సభవైపు పరుగులు తీస్తాడు. దొర ఓదెలు ధైర్యాన్ని, ఎదురించటాన్ని చూసి ఆశ్చర్యపోతాడు. అప్పుడప్పుడు ఉద్యమాల వల్ల, సభల వల్ల సంఘటితమవుతున్న ప్రజల చైతన్యాన్ని తమను పీడించే దొరలను ఎదురించే ప్రజలధైర్యాన్ని ఓదెలు పాత్ర ద్వారా మనం అర్థం చేసుకోవచ్చు. బాల్యం నుండి విప్లవ భావాలు కలిగి భూస్వామ్య దోపిడి వ్యవస్థను ధ్వంసం చేసే తరుణం త్వరలోనే ఉన్నట్లు సూచనలిచ్చిన విధంగా ఈ పాత్ర రూపొందుతుంది.

### 3.2.4 బాలయ్య

"ఈ భూమిఎవరిచ్చిన్రు" అనే కథలో ముసలోని పాత్ర ఏకోన్ముఖంగా సాగుతుంది. కథంతా ముసలోని చుట్టే తిరుగుతుంది. ముసలోని బాలయ్య అనే పేరు ఉంది. కాని రచయిత ముసలోడు అనే పేరుతో కథంతా నడిపాడు. ముసలోడు తమ పని తాను చేసుకుపోయేవాడు, అమాయకుడు. పొలాల చుట్టూ వున్న ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ జీవితం గడిపేవాడు. తన జీవితాన్ని పొలానికే అంకితం చేసిన కర్షకుడు. ముసలోనికి భూమి అంటే ఎంతో ఆప్యాయత, మమకారం ఉంటుంది. అంతటి ఆప్యాయతకు కారణం తన తల్లిదండ్రులు. ముసలోని బాల్యంలో అతని తల్లిదండ్రులు భూమికి చేసిన సేవలు, భూమిని దున్ని, ఎంతో శుభ్రం చేసి, రాళ్లురప్పలుఏరి, చెట్టుచేమ కొట్టి భూమిని ఒక రీతిలోకి తెచ్చి పండించటానికి వాళ్లకు కొన్ని సంవత్సరాలు పట్టింది. ఇంతచేస్తే సొమ్ము ఒకడిది సోకు ఒకడిది

అన్నట్లు దొరలు దౌర్జన్యం, చేసి భూమిని లాక్కొంటారు. దీనితో తన తల్లిదండ్రి భూమి ఎప్పుడు తమదైతుందోనని దిగులుతో చనిపోతారు. అందుకే ముసలోడికి ఎలాఅయినా తన తల్లిదండ్రులు సంపాదించిన భూమిని పండించాలని కంకణం కట్టుకుంటాడు. ఆ భూమి కోసం ఎంతో శ్రమ పడతాడు. భూమిని సారవంతంగా ఉంచటం కోసం చెత్త చెదారం సేకరించటం, ఎరువు కోసం పిడకలు ఏరడం, ఎండలోనైనా పొలంకోసం రేయింబవళ్ళు కష్టపడతాడు. వర్షం పడితే సంతోషంతో భూమిని దున్నడానికి సిద్ధం అయి కావల్సిన ఎరువులను తయారు చేసుకుంటాడు. ఎరువు వేసి, నీరుపెట్టి చివరకు పంట చేతికి వచ్చే సమయంలో అసలు సంఘటన మొదలవుతుంది. బాలయ్య పొలం పనిలో మునిగి ఉండగా పోలీసు జీబులో దొర, అమీన్ బాలయ్య పొలం ముందు అగుతారు. తన కొడుకు జాడని, పొలం ఎందుకు దున్నుతున్నావ్ అని నిలదీసి అడిగి బాలయ్యను విపరీతంగా కొడతారు. "నా కెవళు తెలియది నా భూమిల కచ్చి నన్నే కొడుతాండ్రు" (రఘోత్తమరెడ్డి, 2013: 25). ఈ భూమి నాది, నాకు ఎవరు తెలియదు, ఈ భూమి నేను సంపాదించుకున్న,చెట్టుకొట్టిన, పుట్టకొట్టిన, సాపుజేసిన, వాడునడుమ గద్దతీరుగా వచ్చి దోచుకున్నారు అని అంటూ కిందపడిపోతాడు. ఆ విధంగా దొరల దోపిడిని తట్టుకొని భూమిని దక్కించుకొనే ప్రయత్నం చేస్తాడు. ముసలోన్ని చితక బాదినా తన భూమికోసం ఎదురు తిరిగి ధైర్యంగా ఇలాఅంటాడు"యిగకొట్టు! సంపు. కాని నా భూమినుంచి నా పీనుగును మాత్రమే కొంచబోతావు యీ సేతుల్తోని యీ భూమిని సాపు జేసుకున్నం. యియ్యాల ఆ తల్లే నన్ను దాసుకుంటది కొట్టవయ్యా!"(రఘోత్తమరెడ్డి, 2013:26). అంటూ ముసలోడు తన కొడుకు కన్నా ఎక్కువగా భూమిని ప్రేమించి భూమికోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి దొరలకు ఎదురు తిరుగుతాడు. భూమిపై ఒక రైతుకు ఉండే అనుబంధాన్ని రచయిత బాలయ్య పాత్ర ద్వారా సహజంగా చిత్రించారు. భూమికోసం, తన సొంత భూమిని సాధించుకోవటం కోసం ముసలోడు పడిన ఆవేదన, ఆరాటం అక్కడ ప్రజల కళ్ళు తెరిపిస్తుంది. నక్సలైట్ల ప్రభావంతో తమ భూములను సాధించుకోనే పనిలో పడతారు.

బాలయ్య ముసలోని పాత్ర గురించి అమ్మంగి వేణుగోపాల్ గారు ఈ విధంగా అన్నారు "వాగు పక్క చెరువులో ముసలోడు హస్తాల దొప్పలతో నీళ్లు తాగటం, ఎంతో అందమైన ఆది మృదుత్వం! ఏనుగు చెవుంత మబ్బు తునక వటుండైతె 'చాటంతై' వానగా కురిసి ముసలోడి జోస్యాన్ని నిజం చెయ్యటం ఎంత ప్రాకృతికం! ...నగరం నుండి పోలీసుల అండతో మళ్ళీ ఊళ్ళోకి వచ్చిన భూస్వామి, అన్నల్లో కలిసిన కొడుకు జాడ చెప్పమంటే 'నా కెవళు తెలవది' ఈ భూమి నాదంటూ మౌఖిక హక్కు సూత్రాన్ని ముఖాన కొట్టడం ఎంత సాహసం... దొర దుర్మార్గం, రాజ్యహింస శరీరంలో 'గోరెడు' మాంసంలేని ముసలోని ముందు బలాదూర్.'ఈ భూమి ఎవరిచ్చిండ్రు'(1985) కథలోని ముసలోడి లాగా చరిత్రలోని కథానాయకులంతా అనామకులే" (వేణు గోపాల్, 2013:91) ముసలోడు దొరలను ఎదురించిన తీరు ఎందరో రైతులు దొరలను ఎదురించడానికి ప్రేరేపించింది.

### 3.2.5 రంగారెడ్డి

రంగారెడ్డి 'ఒక్కటైతే' కథలో ప్రధాన పాత్ర. వ్యవసాయదారుడు. క్షణం తీరికలేకుండా కష్టంచేసే స్వభావం కలవాడు. పొలానికి ఎరువు కోసం ముందేటేడు పండించిన వడ్లను అమ్మడానికి కోమటి లింగయ్య దగ్గర నాలుగొందలు అప్పుగా తీసికోని కొడుకు చంద్రారెడ్డితో జమ్మికుంట మార్కెట్‌కు వెళతాడు. తన పొలంలో పనిచేసే పాలేరుతో తన భార్యకు చేదోడు వాదోడుగా ఉండమని చెప్పి శాంతమ్మతో "ఎటైతెగటాయె–ఎవతన్న అత్తెనేమో అచ్చింది మూడురూపాయలకు, లేకుంటె నల్గురితోని నేనను,తీస్కపోయి నారు పీకు–ఎటుతిరిగి రేపు అంబటల్లకు నాటుకు అందత్త" (రఘోత్తమరెడ్డి, 2006:36) అని శాంతమ్మను పొలంలోకి వెళ్లమని చెప్పి బయలుదేరతాడు. మార్కెట్‌లోకి వెళతారు. కొడుకు చంద్రారెడ్డికి ఆకలి కావడంతో వడ్లను తాను ఎప్పుడు అమ్మే చోట ఆపి కొడుకుని తీసుకొని తినడానికి వెళతాడు. రంగారెడ్డి తిని వచ్చేలోగా అడ్తీ గుమస్తా రంగారెడ్డి వడ్లకు ధర నిర్ణయిస్తారు. ఇదేంటి అని కారణం రంగారెడ్డి అడగగా "ఆసామి లేకపోతేనేం? అడ్తీదారు ఉంటే చాలదా? అమ్మే వాడిదేం లొట్టపీసు అమ్మించేవాడిదిగాని" (రఘోత్తమరెడ్డి, 2006: 38) అని అడ్తీ

అంటాడు. రంగారెడ్డి చేసేది ఏమి లేక డబ్బులుతీసుకోవడానికి లింగశెట్టి గిర్నికి వస్తాడు. కొనుగొలుదారు, కూలీలు, అడ్తీలు అందరు పంచుకోగా రంగారెడ్డికి మిగిలింది 20 రూపాయలు మాత్రమే. వాటిని చంద్రారెడ్డి పుస్తకాలకోసం ఇస్తాడు. రంగారెడ్డి మనస్సు భారంగా అయిపోతుంది. "బండెడు వడ్లకు మూడు బస్తాలా? నీ తల్లి ఎగుసాయం పెండ్లం ముండమెయ్య ఏం ఎగుసాయం?"(రఘోత్తమరెడ్డి, 2006:40)అని రంగారెడ్డి ఆవేదన చెందుతూ ఇంటిముఖం పడతాడు. అతనికి తన భార్య మాటలు జ్ఞాపకం వచ్చి తనకి ఒక రైకముక్కైనా కొనలేదు. రంగారెడ్డిని చేసుకొని తన భార్య ఏమి సుఖపడలేదు అని మనస్సు అంతా అల్లకల్లోలమై బాధగా ఇంటికి వెళుతున్న సమయంలో మార్కెట్లో పనిచేసే ఎందరో హమాలీలు, గంపస్త్రీలు, బండ్లవాళ్లు ఐక్యమై తమ శ్రమను దోచుకొని, తగిన ఫలితం ఇవ్వకుండా తమను ఇబ్బందులకు గురిచేసే పై అధికారులు మీద నిరసనగా బంద్‌లు, ధర్నాలు అందరు సమైక్యమై చేయాలనుకుంటారు. ఆ మాటలు రంగారెడ్డికి నూతన ఉత్తేజాన్ని,చైతన్యాన్ని రగుల్చుతాయి. ఇక్కడ వున్న ఎందరో కూలీలాగారైతులంతా ఒక్కటై ఉద్యమం చేస్తే ఎంత బాగుటుందనిఆలోచనలో పడతాడు. ఈవిధంగా ఎలా మధ్యవర్తులు, దళారీలు, అటు వ్యవసాయదారుల్ని,ఇటు కూలీలను ఏవిధంగా దోచుకుంటారో రంగారెడ్డి పాత్ర ద్వారా తెలిపారు.అందుకే దోచుకోబడేవాళ్ళంతా ఒక్కటై తమహక్కులను సాధించుకోవాలని రచయిత ఈ కథ ద్వారా సుచించారు.

### 3.2.6 రాంరెడ్డి

'పగలూ రేయీ శ్రమ పడుతున్నా' కథలోని రాంరెడ్డిది పటేలు దొర పాత్ర. పటేల్ దొర అనగానే పీడించే దుర్మార్గపు పాత్రగా కాక చిద్రమవుతున్న చితికిపోతున్న దొర పాత్రగా చిత్రించాడు రచయిత. ఈ పాత్రకు వున్న వైశిష్ట్యమే అది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాల దాడికి దేశాలకు వలసపోయిన వారు కొందరు, ఊరులోనే నిలిచిపోయిన వారు కొందరు వారి జీవన వైవిధ్యంలో ఏర్పడ్డ పరిస్థితులను వివరించటానికి రాంరెడ్డి పాత్రను సృష్టించాడు రచయిత. రాంరెడ్డి ఇంటికి వచ్చిన

సాయిలు, ఓదెమ్మ, మల్లేశంల సంభాషణలతో ఈ కథ సాగుతుంది. పెట్టుబడులు కుప్పకూలిపోయిన భూస్వామ్యవర్గ జీవితాల్లో ఏర్పడే సంక్షోభాన్ని రామిరెడ్డి పాత్ర ద్వారా వ్యక్తం పరుస్తాడు రచయిత. పాలేర్లు పనికి బందులు పెట్టడం ప్రభుత్వ ఆర్థిక విధానాలు సరిగ్గాలేక, తానేమి సంపాదించుకోలేక పోనుపోను కుటుంబపోషణ కష్టతరమై బొగ్గుగనుల్లో పనికి పయనం కావడం ఇదంతా ఈ పాత్ర ద్వారా రచయిత చెప్పిస్తాడు. ఓదెమ్మ తమ శ్రమకు తగిన జీతాన్ని ఇవ్వమని కోరినప్పుడు గతంలో తానేమి సంపాదించుకున్నాడో ఓదెమ్మకి, సాయిలుకి వివరిస్తాడు. "అవునే పండినెదు నువ్ రెక్కలకట్టానికె కాదు. మీదికెల్లి వెయిలకు వెయిలు పెట్టుబడికి మునిగిన దానికేమంటావు" (రఘోత్తమరెడ్డి, 2006:46) అని రాంరెడ్డి ఓదెమ్మని నిలదీసి అడుగుతాడు. పై ప్రశ్నలకు ఏ పాలేరు సమాధానం చెప్పలేడని చెప్పాలి. అంతేకాదు ఇరవై ఏళ్ళు ఏమి సంపాదించుకోలేని ఆస్తులు గురించి, సంతోషంగా గడపలేని జీవితం గురించి చెప్తాడు. రైతుల దగ్గర పాలేర్లు బందుపెట్టి జీతాలకోసం ఉద్యమాలు చేసే సంఘపోళ్లను, ఎర్ర జెండా పట్టుకొని తిరిగే ప్రజాపక్ష నాయకులను రైతుల గూర్చి పట్టించుకోక పోవడన్ని గురించి ఈ విధంగా ప్రశ్నిస్తాడు. "మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు జీతాలు పెంచమనుడు, కైకిళ్ళు పెంచమనుడు తప్ప మా కాపుదనపోళ్ళ గురించి పట్టించుకోరేందిరా?.... ఆ?" (రఘోత్తమరెడ్డి, 2006: 49) అని సమాజంలో బతికి చితికిపోతున్న కాపుదనపు కుటుంబాల గురించి తనదైన కోణం నుంచి వెల్లడి చేశారు. షావుకార్ల చేతిలో మోసపోతూ పంటలు పండక, వాటికి సరైన గిట్టుబాటు ధర లేక, కాపుదనపు కుటుంబాల్లో ఏర్పడే సంక్షోభం వల్ల తరువాత తరం పిల్లలకు నిరుద్యోగం ఏర్పడి, బొగ్గుగని కార్మికులుగా గని ప్రాంతాలకు వలస వెళ్లడం జరుగుతుంది. ఈ నేపథ్యంలో రామిరెడ్డి పాత్ర ద్వారా రైతులు పగలూ రేయీ శ్రమ పడినా లాభంరాని వైనాన్ని చిత్రించారు.

## 3.2.7 నర్సయ్య

'ఓ మెరుపు మెరిసింది' కథలోనర్సయ్య ప్రధాన పాత్ర. ఒక తండ్రిగా, ఒక భర్తగా, ఒక తాతగా అతని పాత్ర నడుస్తుంది. ఒక తండ్రికి కొడుకు మీద వుండే అనిర్వచనీయమైన ప్రేమ ఆప్యాయతలు నర్సయ్యకు తన కొడుకు మీద ఉంటాయి. నర్సయ్య ద్వారానే రచయిత కథంతా నడిపాడు. రచయిత ఒక తండ్రికి, కొడుకుకి వుండాల్సిన మానవ సంబంధాలు, అనురాగఆప్యాయతల్ని నర్సయ్య పాత్ర ద్వారా వ్యక్తపరిచారు. పొలంపని కోసం వెళ్లిన నర్సయ్య కొడుకు బోరున కురిసే వర్షంలో చిక్కుకుంటాడు. కొడుకు ఇంకా ఇంటికి రాలేదని ఎదురుచూస్తూ నర్సయ్య విలవిల లాడతాడు.ఒకవైపు బీభత్సమైన వర్షం, మరొకవైపు చిమ్మచీకటి వీటి మధ్య చిక్కుకున్న తన కొడుకు. ఆ రెండింటి మధ్య తనకొడుకు జాడకోసం సున్నితమైన నర్సయ్య హృదయం బిక్కుబిక్కుమంటూ ఎదురుచూస్తుంది. పేగుబంధం, కన్నతీపి వల్ల నర్సయ్యకు మనవడి కంటే తన కొడుకే ఎక్కువ అవుతాడు.అందుకే కొడుకు జాడ కోసం మనవడిని వర్షంలో పంపిస్తాడు. నర్సయ్య తన కొడుకుని పొలానికి పంపిన విషయం తెలుసుకున్న నర్సయ్య భార్య కనకమ్మ "ఎంతసేపు పొలమో పొలమని ఏడుస్తవేంది పోరనికి గడియ పుర్సత్ లేకుండా చేస్తావేంది"(రఘోత్తమరెడ్డి, 2006:54)అని అడుగుతుంది. అసలే తన కొడుకు ఇంటికి చేరని కోపంమీద వున్న నర్సయ్యకు పుండు మీద కారం చల్లినట్లై పోలం అంటే మాటలు కాదని పోలం పండివ్వాలంటే ఎంత మోటు కష్టమో తన భార్యకు వివరిస్తాడు. "ఆటకోయిల తనంతో అయిద్దా ఎగుసం? ఎగుసమంటే ఏంది? సంసారం కంటే బహుకష్టమైంది.అసలు సంసారమంటేనే ఎగుసం జేసుడు!"(రఘోత్తమరెడ్డి, 2006: 55).

అంతేకాదు తనకున్న భూముల గూర్చి,తాతలకాలం నుంచి సంపాదించినఆస్తిల గురించి వివరిస్తాడు. "కడుపు గట్టుకొని కాలుచేయి విరుచుకుంటేగాని యిపాటి కొంద్ర దక్కలేదు.అసలు తన తాతలకాలంల ఎంతుండెభూమి! తండ్రికెంతుండె భూమి?"(రఘోత్తమరెడ్డి, 2006:56). అంటూ ఇప్పుడు తనకున్న భూమితో పోల్చుకుంటాడు.తరతరలుగా తరిగిపోతున్న ఆస్తికి కారణాన్ని అన్వేషించేలా నర్సయ్య పాత్రను సృష్టించాడు. ఎంతచేసినా దోపిడి దారుల వలకు చిక్కినట్లు

"అయిపోయిందా యీడికి? మనం జేసేది మనం జేస్తం.మనది దోబ్బల్నని యింకొకడు చూస్తడు వూళ్ళె గద్దసోంటి దొరలున్నారు" (రఘోత్తమరెడ్డి,2006:55). అని నర్సయ్య పాత్ర ద్వారా చెప్పిస్తాడు.ఈ విధంగా దోచుకునే స్వభావం వున్న వారి నుండి భూమినీ, ఆస్తులనూ రక్షించుకోవడం ఆషామాషీ కాదని తెలిపాడు.

### 3.2.8 సమ్మక్క

"నీళ్ళ తగువు" అనే కథలో సమ్మక్క ముఖ్యపాత్ర. రోజులాగా తెల్లవారు జామున లేచి గనికి పనికోసం బయలుదేరే భర్తకు వంట వండిపెట్టాలనుకుంటుంది. కాని మాదిగోనికి చెప్పు కరువు అన్నట్టు బాయి పనోనికి నీళ్ళ కరువులాగా మంచినీళ్లు లేకపోయేసరికి, కొద్దిదూరంలో వున్న భగవాన్ రావు అనే హెడ్ ఓవర్మ్యాన్ క్వార్టరు దగ్గర వున్న పంపు దగ్గర నీరు నింపుకుంటుండగా భగవాన్రావు, కొడుకు, భార్యతో సమ్మక్కకు గొడవ జరుగుతుంది. నీళ్లు తీసుకున్నందుకు తనని అంతలేసి మాటలన్న వాళ్ళను ధైర్యంగా ఎదురించి సమాధానమిస్తుంది. దొరగారి బిడ్డ దొర అన్నట్టు దొరల భావజాలం, అహంకారంతో దొర కొడుకు సమ్మక్క పట్ల అహంకారంతో,అసహ్యంగా మాట్లాడతాడు. కొంచెంకొంచెంగా గొడవ పెరిగి క్వార్టర్ ఆడవాళ్లు ఒకవైపు, లేబర్ గని కార్మికులు ఒకవైపు గుమికూడతారు. ఇలా సమ్మక్క నీళ్ళకోసం చేసిన తగువు అనేది లేబర్ కార్మికుల స్త్రీలనంతా ఏకం చేసి నీళ్ళు సాధించుకునే స్థాయి దాకా తీసుకెళుతుంది. నీళ్లకోసం జరిగిన పోరాటంలోని సమ్మక్కతో ప్రేరణ పొందిన మిగతా కార్మికస్త్రీలు తమ కాలనీలలో నీళ్ల పంపులను సాధించుకుంటారు. ఈ విధంగా గని కార్మికుడి భార్య ఐనా గడుసుదనంతో ఉండి అధికారులను ఎదిరించి కార్మిక స్త్రీలను బలోపేతం చేసి నీళ్లు సాధించుకోనేలా చేసింది సమ్మక్కపాత్ర. సామాన్య కార్మికుల స్త్రీలకు, దొరల స్త్రీలకు వైరుధ్యం ఇందులో చక్కగా చెప్పబడింది. ఏదిఏమైనప్పటికి సామాన్యుల మీద రాజ్యహింస, ఆర్థిక శక్తులు నిరంతరం దోపిడి చేస్తాయని, అవమానాలకు, అటుపోట్లకు గురిచేస్తాయని ధైర్యంగా నిలబడే స్త్రీలే వాటిని ఎదుర్కోగలరనే సత్యాన్ని రఘోత్తమరెడ్డి ఈ కథ ద్వారా తెలియచేసారు.

### 3.2.9 ఓదెలు

'పురుడు' కథలో ఓదెలు ప్రధానపాత్ర. చంద్రయ్య కొడుకు పురుడు కార్యక్రమానికి వచ్చిన వారిలో ఓదెలు ఒకడు. ఆ రోజు చంద్రయ్య గనిపనికి రాకపోవడంతో తన కొడుకు రాజును బదిలిఫిల్లర్‌గా తీసుకెళతాడు. అక్కడ తట్టమోయలేక కింద జారిపడి కాలు బెణుకుతుంది. ఓదెలు తన కొడుకుకు జరిగిన సంఘటనతో కాస్త దిగులుగా కూర్చుంటాడు. చంద్రయ్య తన కొడుకుకి పేరు పెట్టమని స్నేహితులని అడుగుతాడు. కాని వారిలో ఓదెలు సినియర్ మోస్ట్ కాబట్టి చంద్రయ్య కొడుకు పేరు పెట్టడానికి అక్కడ వున్న పదిమంది ఓదెలుని కోరుతారు. ఓదెలు చంద్రయ్య కొడుకుని తీసుకొని తన గత జీవితాన్ని, తన కొడుకు జీవితాన్ని నెమరువేసుకుంటాడు. చదువుకునే రోజుల్లో పాలేరుగా పనిచేసి ఊరు వదిలొచ్చి ఒకరిచేత ఆదరింపబడి గనుల్లో చేరతాడు. గనుల్లో గరిమి తట్టుకొని ఎంతో శ్రమ చేసి తన కొడుకును చదివించాలనుకుంటాడు. కాని అతని ఆశ నిరాశగానే మిగిలిపోతుంది బొగ్గుగని జీవితం మారదనుకుంటూ తన కొడుకు పేరు పెట్టమన్న చంద్రయ్యతో"నన్ను పేరు పెట్టమన్నారు.కాని నేను అబద్ధమాడలేనుర. ఏ పేరు పెడితేమున్నదిర.కోల్ ఫిల్లరోనికి కొడుక పుడితె బదిలి ఫిల్లరేరా ఏ పేరు పెట్టినా వాడయ్యేది ఆఖరికి బదిలి ఫిల్లరేరా"(రఘోత్తమరెడ్డి, 2006:105).అని బాధ పడుతూ ఇంటిముఖం పడతాడు. ఈ విధంగా రాజ్యహింస, పేదరికం ములంగా తన కొడుకుని చదివించలేక, తాను చదవలేక మారని బొగ్గుగని జీవితం గూర్చి వాపోయే పాత్రగా రచయిత ఓదెలుని చిత్రించారు.

### 3.2.10 పోశెట్టి

కొమురమ్మ అన్న పోశెట్టి. ఇతనిది మధ్య తరగతి కుటుంబం. ఇతనికి ముగ్గురు చెల్లెలు. ఇద్దరు పెళ్లై అయినా కాని పుట్టింట్లోనే ఉంటారు. కొమురమ్మ సంసారాల చిచ్చును సరిచెయ్యడానికి చెల్లి పిలుపుతో ఆమె ఇంటికి వెళతాడు. తన భర్తతో వేగలేనని తను కూడా పుట్టింటికి వస్తానటుంది. పొశెట్టి గుండెలో గుదిబండ పడినట్టు ఉంటుంది. ఏమిచెప్పాలో, చెల్లి కి ఎలా నచ్చచెప్పాలో తెలియక

అయోమయ స్థితిలో ఉంటాడు. కొమురమ్మ తన భర్త దుకాణం నుంచి ఇంటికి రావడం లేదనీ, కుటుంబం గురించి పట్టించుకోవడం లేదనీ, ఎంత చెప్పినా ఇతరుల గురించి పట్టించుకోకుండా ఉండలేడనీ ఎంతో నిస్సహాయతతో చెప్తుంది. పొశెట్టికి తన చెల్లె సంసారాన్ని ఎలా సరిదిద్దాలో అర్థంకాదు. గోపయ్యతో కూడా మాట్లాడదామని దుకాణానికి వెళతాడు. అక్కడ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంటుంది. అక్కడ రోడ్లను విస్తరించే క్రమంలో షాపును వెనుకకు జరుపుతూ ఉంటాడు బావ గోపయ్య.బావ ఇంటికి రాకపోవడంతోచెల్లెలు చెప్పిన బావ ప్రవర్తన నిజమోనని అనుకుంటాడు. అటు చెల్లెలికి చెప్పలేక ఇటు తన బావకు చెప్పలేక సతమతమయ్యే పాత్రగా, మధ్య తరగతి జీవితాలు ఇంతే అనే అసంతృప్తితో ఉండే పాత్రగా పోశెట్టిని రచయిత చిత్రించాడు. బొగ్గుగని వాడల్లో ఉన్న ప్రజల కుటుంబాలు కలతల వల్ల విచ్చినమవుతున్న సంబంధాల గురించి పోశెట్టి పాత్ర ద్వారా తెలియజేశాడు రచయిత. ఒక చెల్లెలి జీవితాన్ని సరిదిద్దడానికి అన్న పడే మానసిక సంఘర్షణ, ఇబ్బందులను వివరిస్తుంది ఈ కథలో పోశెట్టి పాత్ర.

### 3.2.11 మల్లేశం

సమ్మిరెడ్డికి మల్లేశం ప్రియమైన స్నేహితుడు. వీరిద్దరు బొగ్గుగనిలో పనిచేసే కార్మికులు. కార్మికుల్ని గనిలో పై అధికారులు ఏ విధంగా పీడించుకుతింటున్నారో అతనికి తెలుసు. బొగ్గు గనిలో ఉండే అధికారులు టబ్బులు అదనంగా నింపమని కార్మికులకు ఆంక్షలు పెడతారు. కాని కార్మికులు తమ న్యాయమైన హక్కులు రక్షించుకోవటం కోసం గనిలో సమ్మె చేస్తారు. ఈ సమ్మెకు నర్సయ్య న్యాయకత్వం వహించేవాడు. ఇతని అనుచరులుగా సమ్మిరెడ్డి, మల్లేశం ఉంటారు. నర్సయ్య ధైర్యాన్ని తెగువని తట్టుకోలేక నర్సయ్యను చంపేస్తారు. నర్సయ్య మరణం సమ్మిరెడ్డిని బాగా కృంగదీస్తుంది. ఒకవైపు కార్మికులు సమ్మెను నిలిపివేయడానికి ప్రయత్నిస్తుంటారు. సమ్మెను నిలుపుదల చేస్తే తమ కనీస అవసరాలు తీరక, వెట్టిచాకిరి చేయాల్సివస్తుందని చాలామంది కార్మికులు బాధపడతారు. దీనికి ఏదైనా పరిష్కారం చేయాలని అనుకున్నదే తడువుగా ఒకరోజు  రాత్రి మల్లేశంపోస్టరు అంటిస్తాడు. ఆ

పోస్టర్ కార్మికుల్లో పెద్ద సంచలనం కలిగిస్తుంది. ఆ పోస్టర్లో సమ్మెను కొనసాగించాలనీ, సమ్మెకాలానికి కూడా వేతనం చెల్లించాలనీ, చార్జీషీట్లు వాపసు తీసుకోవాలని ఉంటుంది. దానితో చాలా మంది కార్మికులు ఇది మంచి ఆలోచన అని ఊపిరి పీల్చుకుంటారు. కాని సమ్మిరెడ్డి ఇది ఎవరి పని అని ఆలోచనలో పడగా మల్లేశం తన స్నేహితుడితో ఈ విధంగా అంటాడు. "ఎటు చూసినా ఏ దారి కనిపియ్యకపాయె.ఇగ అన్నుంటె ఏం జేసేటోడు అని ఆలోచన చేసిన గంతే! నిన్న పోతపోత బజారుకు పోయి కాయితాలు తెచ్చి రాసి, రాత్రి బదిలికిఅచ్చినట్టుఅచ్చి అతికిచ్చిపోయిన" (రఘోత్తమరెడ్డి, 2006: 207) అని సమ్మిరెడ్డితో చెప్తాడు. ఈ విధంగా మల్లేశం తన స్నేహితుడి బాధ చూడలేక, తోటి కార్మికుల క్షేమం కోసం ఎంతో తెగువతో, ధైర్యంతో ముందడుగు వేసి కార్మికుల ఆశలు నెరవేర్చే ప్రయత్నం చేస్తాడు.మల్లేశం ముందుచూపుతో అధికారుల దౌర్జన్యాలను, అధికారులకు తొత్తులుగా వున్న వాళ్లందరికి చెంప పెట్టుగా తాను చేసిన పని న్యాయమైనదిగా రచయిత చిత్రించాడు. గని అధికారులను ఎదుర్కోవటానికి కావలసిన కార్మికుల ఐక్యతను గుర్తు చేసే పాత్రగా మల్లేశం పాత్ర నిర్మితమైంది.

### 3.2.12 సమీర

'వేటగాడి చూపులు' కథలో సమీర ముఖ్య పాత్ర. ఆమె దృక్కోణం నుంచి కథ నడుస్తుంది. తన స్నేహితుడు సమద్ కోరికపై సమద్ చెల్లెలి పెళ్ళి చూడటానికి వెళ్తుంది. అయితే సమీర తస్లీమ్ పెళ్లిని చూసి ఎన్నో విషయాలను తెలుసుకుంటుంది. అక్కడి వివాహతంతును, వారి ఆచారసంప్రదాయాలను చూసి నివ్వెరపోతుంది. సమద్‌కు సంబంధించిన ప్రతి వస్తువు సమీరకు ప్రీతిపాత్రంగా అనిపిస్తుంది. ఈ రకమైన ధోరణి వల్ల సమీరకు సమద్ పట్ల వున్న ఇష్టాన్ని రచయిత తెలియచేసాడు. తస్లీమ్ పెళ్ళిలో ఆమె అత్తగారి చేష్టలను చూసి విస్తుపోతుంది. ఒక స్త్రీ, సాటి స్త్రీని ఎందుకంత వేధిస్తుందని ఆలోచిస్తుంది. తస్లీమ్ అత్త వల్ల తను ఎన్ని బాధలు పడుతుందో అని అనుకుంటుంది. సమీర ద్వారా తరతరాల వివాహ జాడ్యాన్ని, ఒక వర్గం ఇంకొక వర్గాన్ని వేధించటం, తమ అధికారాన్ని చూపించటం,

ఇష్టం వున్నా లేకపోయినా తనకి ఏ మాత్రం పరిచయం లేని ఒక వ్యక్తితో జీవితాంతం భర్తగా తోడుగా ఉండడం, తమ మానసిక, శారీరక అవసరాలు తీర్చుకోవడం కోసం వివాహం అనే సంప్రదాయ ఉచ్చులో మతంతో సంబంధం లేకుండా స్త్రీ అన్ని రకాలుగా బలైపోతున్నదని సమీర ఆలోచనల ద్వారా రచయిత అంతర్గతంగా పాఠకులు ఆలోచించేటట్లు వివరించాడు. తస్లీమ్‌ను సాగనంపుతున్నపుడు ఆమె ఏడవటం చూసి దాదాపు అందరూ ఆడవాళ్లు ఏడుస్తుంటారు. కాని సమీర అత్త తరపు వాళ్లు మాత్రం అది తమకు సంబంధించిన విషయం కాదని అలానే చూస్తుంటారు. సాగనంపడం అనేది తరతరాలుగా జరుగుతునే ఉందని "తమను సాగనంపిన రోజున తమతమ తల్లులు ఇలాగే గుండెలు చెరువులు చేసుకొని ఏడ్చారు. తమ తల్లుల్ని సాగనంపేటప్పుడు తమ అమ్మమ్మలు అలాగే..." (రఘోత్తమరెడ్డి, 2006: 260) అని రచయిత సమీర పాత్ర ద్వారా చెప్పించాడు. సమీర ఒక స్త్రీ, ఆమె జీవితం గురించి ఎన్నో విధాలుగా ఆలోచిస్తుంది. పెళ్లి అనేది ఒక అవసరమేనా, ప్రేమ, దయ, కారుణ్యం ఉండవు, ధ్వంసమైపోతున్న మానవ సంబంధాల గురించి ఇలా సమీర ఎడతెరిపిలేని ఆలోచనలతో ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ఎంతోమంది మదిలో ఇలాంటి ప్రశ్నలు ఆందోళనలను రేకెత్తించి ఆలోచించేలా చేస్తుంది. సమీర మదిలో పురుషాధిక్య సమాజంలో కోటానుకోట్ల స్త్రీ మూర్తులు భయంతో వణికి పోతున్నట్టు కనిపించారు. "ఆ స్థానంలో హఠాత్తుగా తన అక్క కనిపించింది. అటుపైన తన తల్లి...కోటానుకోట్ల స్త్రీ మూర్తులంతా, భయవిహ్వాలులై పరిగెత్తుతున్నట్టుగా..." (రఘోత్తమరెడ్డి, 2006: 262). ఇలా ఒక్క క్షణంలో సమీరకు యావత్తు ప్రపంచంలో స్త్రీలందరి పరిస్థితిని ఊహించుకుంటూ భయందోళనతో విస్తుపోయే పాత్రగా రూపొందించాడు రచయిత.

### 3.2.13 లింగయ్య

'శత్రువు' అనే కథలో లింగయ్య ఒక సాధారణ బొగ్గుగని కార్మికుడు. బొగ్గుగనిలో బదిలి ఫిల్లర్ గా పనిచేస్తుంటాడు. నిరంతరం బొగ్గుబావిలో శ్రమించాల్సి ఉంటుంది. ఈ కథలో లింగయ్యకు తోడుగా, సహాయకుడిగా పనిచేసే వ్యక్తి రాజిరెడ్డి. అతనితో కలిసి లింగయ్య ఐదుఫీట్ల ఎత్తుగల త్రీ.ఏ

సీములో పనిచేస్తాడు. గాలిలేక ఊపిరి ఆడటమే కష్టంగా వున్నచోట పనిచేసి తీవ్రంగా అలసిపోతారు. పై నుంచి కిందిదాకా మోయడం వల్ల కృంగిపోయి నీరసపడిపోతాడు. అతని శరీరం తట్టలు మోయడం వల్ల రాపిడికి గురైయి మండుతుంది. "వంగి వీపుమీద తట్ట మోయడం వల్ల చర్మం వూడి మంట లేస్తోంది. నడుం, కాళ్ళు చేతులు ఎక్కడికక్కడికి గూటాలు తీసుకొని మెత్తగా నలుగ గొట్టినట్టు సలుపుతున్నాయ్." (రఘోత్తమరెడ్డి, 2006: 270). లింగయ్యకు ఇంటికి వెళ్ళడమే కష్టంగా ఉంటుంది. ఇక్కడ రచయిత ఒక్క లింగయ్య పాత్ర ద్వారా ఎందరో గని కార్మికుల ఇబ్బందులను బాధలను తెలిపాడు. పంటలు పండక, గత్యంతరం లేక ఈ గనిలో చేరడానికి కారణాలు వివరించాడు. పని పరిస్థితుల వల్ల అలసిపోయిన లింగయ్య ఇంటికి చేరి మౌనంగా తనపని తాను చూసుకొని పడుకుంటాడు. ఎప్పటి నుండో భర్త రాకకోసం ఎదురుచూస్తున్న సుగుణతో ప్రేమగా మాట్లాడక పోయేసరికి బాధపడుతుంది. సుగుణ తన గత జ్ఞాపకాలను గుర్తుచేసుకొని బాధపడుతుంది. భార్య వింత ప్రవర్తనకు లింగయ్య భార్యమీద అనుమానం పెంచుకుంటాడు. ఆమె మీద కోపంతో ఆమెను విపరీతంగా కొట్టడంతో అన్యోన్యంగా ఉన్న జంట, కాల పరిస్థతుల వల్ల ఏ విధంగా శత్రువులుగా మారారు అనేది రచయిత లింగయ్య పాత్ర ద్వారా చక్కగా వివరించారు. లింగయ్య పాత్ర సాధారణంగా, సహజంగా ఉంటుంది. తాను చేసే పనికి నిమిత్తమాత్రుడనని, జీవితాన్ని అప్రయత్నంగా ఎవరో నడిపిస్తున్నట్లు బిగుసుకుపోయిన పక్షిలా నడచుకుంటాడు. కాలం మార్చిన దుర్భర పరిస్థితులకు బలైన పాత్రగా లింగయ్య కనిపిస్తాడు. పల్లెటూరు జీవితాల్లో భార్యభర్తల మధ్య వున్న సహజమైన ప్రేమనురాగాలకు అతీతంగా డబ్బు సంపాదన ఆశ ఒకవైపు, పంట పొలాల్లో గిట్టుబాటు ధరలు లేక గనుల్లో ప్రవేశించి వారివారి జీవితాలను ఏవిధమైన ప్రేమానుబంధాలు లేక, జీవితాలను నడిపిస్తున్న అప్రయత్న, అనూహ్య, నిగూఢ శక్తులేంటో తెలియని స్థితిల్లో, ఏర్పడ్డ అగాధాలను లింగయ్య పాత్ర ద్వారా వెల్లడించారు. పొలం పనుల్లో ఎంత శ్రమ చేసినా అలసిపోని ఉల్లాసంగా వున్న లింగయ్యకు, గనిపని చేసి నీరసించిపోయి ఇంటికి వచ్చిన లింగయ్యకూ గల తేడాను రచయిత సుగుణ ద్వారా చెప్పించాడు.

### 3.2.14 కథకుడు

ఈ కథలో కథకుడు ప్రధాన పాత్రగా ఉండి కథను నడిపిస్తాడు. ఒక విధంగా ఈ కథ రచయిత స్వానుభవంలోనిది అని చెప్పవచ్చు. బొగ్గు బావిలో పనిచేసి రెండు సంవత్సరాల తర్వాత ఇంటికి పయనం అవుతాడు కథకుడు. రైల్లో ప్రయాణిస్తూ చుట్టూ పరిసరాలు, అక్కడి మనుషుల స్వభావాలు గమనిస్తుంటాడు. ఇలా చూస్తున్న క్రమంలో కథకుడికి తన చిన్ననాటి స్నేహితుడు నిరంజన్ రైలు ప్రయాణంలో కనిపిస్తాడు. కథకుడికి తన చిన్ననాటి స్నేహితుడు కనిపించడంతో మనస్సులో ఏదో ఆనందం, ఉత్సాహం తొణికిసలాడుతాయి. ఒక్కసారిగా అతనికి తన బాల్య జీవితపు గత జ్ఞాపకాలు మంచులా కమ్ముకుంటాయి. చిన్నపుడు తాను నిరంజన్ కలిసి ఆడి, పాడి, అల్లరి చేయడం, పంట పొలాల్లో కాల్వ గట్టుల్లో, చెరువులో ఇత కొట్టడం చేసేవారు. చదువు అబ్బక చివరకు వ్యవసాయంలో అడుగు పెడతారు. కాని అప్పటికే రైతుల పరిస్థితి "ఆరుకోసి మూడు అతుకుడుగా ఉంది" (రఘోత్తమరెడ్డి, 2006: 245). రైతుల పంటలను మార్కెట్లో అడ్డగోలు ధరలకు తీసుకోవడం, పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకపోవడం, దీనితో రైతులు పంటలు పండించలేక ఆత్మహత్యలకు పాల్పడతారు. కథకుడి కుటుంబ పరిస్థితి కూడా అత్యంత దయనీయంగా ఉంటుంది. ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో వాళ్ల బాబాయి ప్రోత్సాహంతో బొగ్గుబావిలో తట్టమోసే పనికి వెళతాడు. మళ్లీ రెండు సంవత్సరాల తరువాత తన స్వంత ఊరులో, ఎన్నో మధురమైన జ్ఞాపకాలతో అడుగు పెడతాడు. అతనికి తన చిన్ననాటి స్నేహితుడు కనిపించడంతో అత్యంత ఆనందంగా ఉంటుంది. ఎప్పుడెప్పుడు తన మిత్రున్ని కలుసుకోవాలా అనే ఉబలాటంతో ఉంటాడు. తన ఇంటికి వచ్చి భోజనం చేసి, తల్లిదండ్రులతో మాట్లాడి, తన మిత్రులు బొగ్గుగని విశేషాలు అడగగా చెప్తాడు. నిరంజన్ గురించి ఎవర్ని అడిగినా అతని పద్ధతి బాగాలేదని పూర్తిగా మారిపోయాడు అని చెప్తారు. కాల పరిస్థితులకు తగ్గట్టు మారలేదని ఇంకా అలానే ఉన్నాడని తెలుస్తుంది. నిరంజన్‌కు దెబ్బలు తగలటంతో అతని ఇంటికి వెళతాడు. ఆ సమయంలో నిరంజన్ పడుకొని ఉంటాడు. మెళుకువ వచ్చి చూస్తాడు. కథకుడు "ఏమిటిది? పూర్తిగా మంచి చెడు తెలియని వాని తీరుగ అయిపొయినావు ఏమిటి నిరంజన్?" (రఘోత్తమరెడ్డి, 2006:

253) అంటాడు. నిరంజన్ మనస్సుకి ఏదో బోధపడినట్టునిపించి, తనను కించపరుస్తున్నాడనే భావంతో "నీది నీకే మంచి నాది నాకే మంచి" (రఘోత్తమరెడ్డి, 2006: 253) అంటాడు. ఆ మాటలతో కథకుడు స్థాణువై పోతాడు. అతన్ని ఎవరో పాతాళంలోకి నెట్టినట్టునపిస్తుంది. ఆ క్షణంలో కథకుడు అతని ముందు నిలవడానికి ఎంతో మదన పడతాడు. వారిద్దరి మధ్య ఏదో తెలియని దూరం ఏర్పడుతుంది. వెళ్లి వస్తాను అని చెప్పి అక్కడ నుంచి బయటకు వస్తాడు. రచయిత ఈ కథ ద్వారా మారిన పరిస్థితులు స్నేహితుల మధ్య ఉన్న భావజాలాన్ని ఏవిధంగా మార్చుతున్నాయో తెలుపుతూ కాలానికిబలైన కథకుడిని పాత్రగా చిత్రించారు.

## 3.3 అప్రధాన పాత్రలు

### 3.3.1 నర్సింహరామయ్య

నర్సింహరామయ్య దొరసాని దగ్గర గుమస్తాగా పనిచేస్తుంటాడు.దొరల మోచేతి నీరు తాగుతూ తొత్తుగా పనిచేసే కపటుడు.దొరల అధికారాన్ని, అణచివేతను ప్రోత్సహించే పాత్రగా కనిపిస్తాడు. దొరసాని మాటలు వింటూ లెక్కలకు దొంగలెక్కలు వేసి, వడ్డీలకు చక్రవడ్డీలు కట్టి, సామాన్య ప్రజానీకాన్ని మోసం చేసే పాత్రగా, దొరల దోపిడితనాన్ని సమర్థించే పాత్రగా నరసింహరామయ్య కనిపిస్తాడు. రాయమల్లి దొరసానికి ఇవ్వాల్సిన వడ్లు తెచ్చినప్పుడు, నాలుగు గిద్దెలు అయినవి అంటాడు. దానికి రాయమల్లి అంతధాన్యం తన దగ్గర లేవటుంది. దానికి నర్సింహరామయ్య "ఆఁ....కొలిసినంక పోరగాండ్లు కోఁవటింటికి, మొగుడు గౌండ్లంటికో పోసుకపోయ్యి ఉంటారు అందుకే తక్కువ వచ్చినయ్" (రఘోత్తమరెడ్డి, 2006: 6) అని చమత్కారంగా కిటుకు తెలిసిన వాడిలా అంటాడు. అలానే దొరసాని తన కొడుకు పెళ్ళికి ఇచ్చిన డబ్బులుకూడా కట్టమంటుంది. రాయమల్లి ఆ ఒడ్లు కట్టలేక అయోమయ స్థితిలో ఉంటే రామయ్య "కంచంల పోసినయ్ తప్పుతాయ్ గాని, కుంచంల పోసినయ్ తప్పతాయ్" (రఘోత్తమరెడ్డి, 2006: 06) అని దొరసాని మాటలకు వత్తాసు పలకడం, దొరసాని దగ్గర మంచి పేరు తెచ్చుకోవడానికి ప్రయత్నించటం మొదలైనవి చేస్తుంటాడు

నర్సింహరామయ్య. రాయమల్లి సంఘర్షణను మరింత పెంచి కథను రసవత్తరంగా చేయటానికి దోహదపడే పాత్ర ఇతనిది.

### 3.3.2 గోపయ్య

గోపయ్య కొమురమ్మ భర్త. ఇతనికి ఇద్దరి పిల్లలు. భార్య రోగాల పుట్ట. గోపయ్య అందరికి సహాయం చేసే స్వభావం కలవాడు. గోపయ్య ఇంటిముందర వున్న దురగయ్య–రాజవ్వల పెద్ద కొడుకును పోలీసులు అరెస్టు చేసిన విషయంలో సహాయం చేయగా భార్య రాద్ధాంతం చేస్తుంది. బజారులో దుకాణం తనలాంటి నలుగురితో కలివిడిగా లేనప్పుడు తనకెవరు సహాయం చేస్తారని ఆలోచించేవాడు. గోపయ్య సానుభూతిపరుడు కాబట్టి తన ఇంటి ముందు రాజవ్వ కొడుకు విషయంలో జైలుకు  వెళ్ళడానికి కూడా వెనుకాడడు. కొమరమ్మ అన్న పోశెట్టి వచ్చి తనను సముదాయించినపుడు కూడా తన వైఖరిని మార్చుకోక ధృడనిశ్చయంతో నలుగురికి సహాయం చేయడం తప్పుదన్నట్లు మాట్లాడతాడు. పోశెట్టి మనకు రోజులు బాగాలేవు అన్నప్పుడు "ఏదో బుక్కడంత తిని కాళ్ళు కడుపులకు తన్నుకోని పండాలని ఉన్నది" (రఘోత్తమరెడ్డి, 2006: 196). అనవసరమైన విషయాల్లో తనకు జోక్యం చేసుకోవడం ఇష్టం లేదని తేటతెల్లం చేస్తాడు. సాయంత్రం వేళలో దుకాణం వెనుకకు జరిపే పనిలో ఉంటాడు. రాజవ్వ అయినవాళ్లను దూరం చేసుకోవద్దు అన్నప్పుడు అయోమయంలో పడతాడు. ఇలా గోపయ్య సాధారణ మానవునిలా జీవనం గడిపే పాత్రలా ఉండిపోయాడు. రాజవ్వ చెప్పిన విషయం గురించి ఆలోచిస్తూ రాజవ్వ గుండెధైర్యానికి ప్రేరేపితుడై తన వ్యక్తిత్వంలో మార్పు తెచ్చుకునే పాత్రగా కనిపిస్తాడు.

### 3.3.3 కొమురమ్మ

కొమురమ్మ ఒక సాధారణ గృహిణి. గోపయ్య భార్య. వీరిది మధ్యతరగతి కుటుబం. భర్త పనిభారం వల్ల కుటుంబాన్ని పట్టించుకోకపోవడం, చిన్నపిల్లలు ఇంట్లో ఉండడం, తనకు ఆరోగ్యం

సహకరించకపోవడం వల్ల కుటుంబ భారం మోయలేక దిగులుతో, అసహనంతో బాధపడే పాత్రగా ఈమెను చిత్రించాడు. కొమరమ్మ తన భర్త ప్రవర్తన గూర్చి చెబుతూ "నవ్వే ఆడదాన్ని ఏడిసే మొగోన్ని నమ్మద్దట–మీ బావ నేనంత మెత్తుకుంటున్న గదేనవ్వు–గా నవ్వు కొంపల ముంచే నవ్వు నవ్వుత నవ్వుత నా కొంపలు ముంచే నవ్వు" (రఘోత్తమరెడ్డి, 2006: 190) అని తన భర్త సహజ మనస్తత్వాన్ని చెబుతుంది. గోపయ్య కుటుంబాన్ని పట్టించుకోకుండా అందరికి సంఘసేవ చేస్తున్నాడని తన అన్న పోశెట్టికి తనదైన ధోరణిలో చెబుతుంది. "చెంగలిచ్చుకుంట ఉరికె–ఉరికితె ఉరికిందు–అన్ని మునిగి పోయె పనులె–నేను నోరు తెరిసిన్నోలేదో–అగోసూడు బంగరమసోంటి అద్దం పలుగ్గొట్టిందు" (రఘోత్తమరెడ్డి, 2006: 192). చుట్టు పక్కల వారి పనులకి మాత్రం ఏంతో ఉత్సాహంగా వెళతాడని చెబుతుంది. సంసారం పట్ల మగవాడికి లేని బాధ్యత ఆడదానికి ఎంతకని ఉంటుందని తన అన్న పోశెట్టితో చెప్తూ బాధ పడుతుంది. కుటుంబ వ్యవహారాన్ని ఇద్దరూ పంచుకోవాలని కొమురమ్మ పాత్ర ద్వారా రచయిత వ్యక్తపరిచాడు. ఈ కాలంలో సమాజం గురించి పట్టించుకోకూడదని హితవు చెబుతుంది. ఇలా తన స్వంత ఇంటి వరకు స్వప్రయోజనాలతో తప్ప ఇతరుల గురించి పట్టించుకోవడం వల్ల ఎలాంటి కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని భయపడుతుంది. ఒక విధంగా సంకుచితత్వంలో మునిగిపోయే పాత్రగా మనకు కొమురమ్మ కనిపిస్తుంది.

### 3.3.4 సమ్మిరెడ్డి

సమ్మిరెడ్డి బొగ్గుగనిలో పనిచేసే ఒక కార్మికుడు. బొగ్గుగనుల్లో కార్మికుల్ని ఏవిధంగా పీడించుకుతింటున్నారో తెలిసిన వ్యక్తిగా కనిపిస్తాడు. గనుల్లో పగలు రేయి శ్రమ పడిన వారికిచ్చే జీవనభృతి(ఆదాయం) చాలా తక్కువ. శ్రమకు తగ్గ ఫలితం లేనిచోట దిక్కులేని పరిస్థితిలో పనిచేయాల్సిరావడం, ఆ ఘోరమైన కష్టాన్ని తలచుకుంటూ ఉద్యమాల వల్ల ఫలితం ఆశించే పాత్రగా కనిపిస్తాడు. పై అధికారుల దౌర్జన్యంతో కార్మికులను మాములు పని సమయాల కంటే, ఇంకా అదనపు పని సమయాలు కేటాయించి వారితో ఎంతో వెట్టిచాకిరి చేయించుకోవడం గుర్తెరిగినవాడు. సమ్మిరెడ్డి

తమ హక్కులను కాపాడుకోవడం కోసం నర్సయ్యతో పాటు ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నవాడు. నర్సయ్య సహాయంతో అధికారులను ఎదురించి ప్రజల పక్షాన నిలబడినవాడు. కాని, నర్సయ్య మరణంతో ఒక్కసారిగా కుప్పకూలిపోతాడు. సమ్మిరెడ్డి మానసిక వ్యధ వల్ల ఉద్యమాల్లో చురుకుగా పాల్గొనలేకపోతాడు. అవసరాల నిమిత్తం మళ్లీ ఎలాగైనా సమ్మెను కొనసాగించాలని తపన పడేవాడు. సంఘిటితకార్మిక శక్తితో అధికారుల అహంకారాన్ని అణచివేయాలని ఆలోచించి అందరిని సమయాత్తం చేయాలనుకుంటాడు. దీనికోసం తన ఫైలు మల్లేశం జాడకై వెతుకుతాడు. సమ్మిరెడ్డి అధికారుల చేతుల్లో బొగ్గుగని కార్మికుల శ్రామిక విలువ దోపిడికి గురవుతుందని తీవ్రంగా మదనపడేవాడు. చివరకు మల్లేశం వేసిన వాల్‌పోస్టర్ వల్ల మళ్ళీ ఊపిరి పీల్చుకుంటాడు. మళ్లీ కార్మిక సమ్మెను కొనసాగించవచ్చని నిరంతరం శ్రామిక దోపిడికి సరైన విలువ కట్టని అధికారులకు ఆడ్డుకట్ట కట్టవచ్చని సంతోషపడతాడు. ఈవిధంగా సమ్మిరెడ్డి ద్వారా కార్మికుల్లో సంఘటితఐక్యతని ఆశిస్తారు రచయిత.

### 3.3.5 సుగుణ

సుగుణ బొగ్గుబావిలో పనిచేసే లింగయ్య భార్య. భర్త చాటు మనిషి. కొత్తగా పెళ్ళయిన అమ్మాయి కనుక అతనితో ఎన్నో ఊసులు–బాసలు చెప్పాలని కలలు కంటుంది. భర్తప్రేమ నిరంతరం కావాలనుకొనే సాధారణ మధ్యతరగతి అమ్మాయి. కాని లింగయ్య బొగ్గు బావిలో పనిచేయటం వల్ల ఒంట్లో ఓపిక లేక సుగుణతో మాట్లాడకుండా పడుకుంటాడు. దీనితో సుగుణలో ఎంతో అసంతృప్తి, వెలితి పేర్కొంటాయి. "రాత్రి ఎంతైందో కూడా గమనించే స్థితిలో లేదు సుగుణ.ఆమె మనసు నిండ చెప్పలేని వెళితి, తీర్చలేని అసంతృప్తి" (రఘోత్తమరెడ్డి, 2006: 271).సుగుణ పలువిధాల తన మనసులో ఒకప్పటి తమ అందమైన జీవితాన్ని ఊహించుకుంటుంది. ఇద్దరు చేరొకపనిచేసుకొని చాలా ఆనందంగా ఉండేవారు. ఆ జ్ఞాపకాలతో ఎంతో మురిసిపోతుంది. కాని ఇప్పుడు ఒక మాటలేదు మంతిలేదు. ఎలా ఉండేవాల్లం ఎలాఅయిపోయాంఅనుకుంటుంది. "ఈ పాలిస్టర్ పేగుల కోసమా

ఇందాక వచ్చింది. ఎటువంటి మనిషి ఎట్లాఅయ్యడు.మాటందం లేదు.ముచ్చటందంలేదు.కష్టంసుఖం చెప్పుకొనేది లేదు.ఏందో అంత వడ్లు పెరుగు కలిపినట్టు శెరలవడ్డట్టు" (రఘోత్తమరెడ్డి, 2006: 272) అని బాధపడుతుంది. సుగుణ భర్త లింగయ్య మనస్ఫూర్తిగా మాట్లాడకపోయేసరికి నిద్రపట్టక బయటకు వచ్చి కూర్చుంటుంది. ఈ వేళలో భార్య కనిపించకపోయేసరికి లింగయ్య అనుమానంతో సుగుణను కసితీర కొడతాడు. తన తప్పులేకపోయిన అన్యాయంగా తనను కొడుతున్నాడు అని బాధపడుతుంది తప్ప, భర్తకు అసలు కారణం చెప్పకుండా బేలగా ఉండే అమ్మాయిగా సుగుణను చిత్రించాడు రచయిత.

### 3.3.6 సమద్

'వేటగాడి చూపులు' సమద్ అప్రధాన పాత్ర. సమద్‌కు నలుగురు చెల్లెళ్ళు. వీరిది సాధారణ మధ్య తరగతి కుటుంబం. ఇద్దరుచెల్లెళ్ళకు పెళ్లి చేస్తారు. ఇంకొక చెల్లి (తస్లీమ్)ని మంచి కుటుంబానికి ఇచ్చి చేయాలనుకుంటాడు.అందుకోసం ఒక అన్నగా పగలనక రాత్రనక కష్టపడి చదువుకొనే వయసులోనే తన సుఖ, సంతోషాలను, విలాసాలను వదులుకొని డబ్బులను కూడపెడతాడు. కాని తస్లీమ్ అత్తగారి గొంతెమ్మ కోరికలు తీర్చలేక లోలోపల కోపం, అసహనం, ఏమి సమాధానం చెప్పలేని పాత్రగా సమద్ మానసికంగా నలిగిపోయే పాత్రగా తన చెల్లెలి జీవితం ఏమవుతుందోనని కుమిలిపోయి, ఆవేదన పడే పాత్రగా కనిపిస్తాడు.

## 3.4 కథను మలుపుతిప్పే పాత్రలు

### 3.4.1 జగదీశ్వరరావు

దొరసాని కొడుకుగా జగదీశ్వరరావు. రచయిత కథ చివరలో మంచి ముగింపు కోసం కథాక్రమాన్ని మలుపుతిప్పే పాత్రగా జగదీశ్వ్రరావును చిత్రించాడు. రాయమల్లి పైచేయి చేసుకొని విషమస్థితిని సృష్టించి ముగింపు స్థాయికి తీసుకెళతాడు. జగదీశ్వరరావు పాత్ర ద్వారానే

అణగిమణగివున్న రాయమల్లి పాత్రలో చైతన్యాన్ని, ఎదురుతిరిగే ధైర్యాన్ని చిత్రించాడు రచయిత. జగదీశ్వరరావు తన తల్లికి ఎదురు తిరిగి మాట్లాడిన ఒక హరిజన స్త్రీ మాటలను సహించుకోలేక తనలో ఏ మూలనో దాక్కున్న అధిపత్య భావజాలన్ని ప్రయోగించి, ఒక్కసారిగా దూషణలాడుతూ రాయమల్లిపై చేయి చేసుకుంటాడు. జగదీశ్వరరావు పాత్ర కథ విషమ స్థితిలో వచ్చి ముగింపుకు దారి చూపించే పాత్రగా ఇందులో చిత్రించబడింది. ఒక్కసారిగా రాయమల్లిపై చేయి చేసుకోవడంతో కథ మలుపు తిరుగుతుంది. రచయిత ఆశించిన ప్రయోజనమల్లా రాయమల్లిలో చైతన్యాన్ని కలిగించడం జగదీశ్వర్రావు పాత్రను పురిగోల్పాడు.

### 3.4.2 అత్తగారు

"వేటగాడి చూపులు" ఈ కథలో తస్లీమ్ అత్తగారికి రచయిత పేరు పెట్టలేదు. 'అత్తగారు' అనే పేరుతోనే పరిచయం చేసాడు. ఆమె దురుసు మనిషి. అందరి మీద పెత్తనం చెలాయించే గడుసు మనిషిగా చిత్రించాడు. ఆమెకు తగ్గట్టు ఒంటికి దిగేసుకున్న నగలను గలగలలాడిస్తూ అటుఇటు విసవిసలాడుతూ వెళ్ళటం ఆమె అత్త అనటానికి నిదర్శనాలుగా ఉన్నాయి. అందర్నీ హడలగొడుతూ ఉంటుంది. పెళ్ళికూతురు సామానును పరిశీలిస్తూ అది తక్కువది, ఇది తక్కువది అని అంతులేని కోరికలు కొరుతుంది. ఆమె కోరికలకు కల్లెం లేకుండా పోతుంది. తస్లీమ్‌కు సంబంధించిన ప్రతి సామాను పరీక్షిస్తూ "సంబంధం మంచిదంటె ఒప్పుకున్నం.ఇచ్చేవన్నీ ఘనంగా ఇస్తారంటే ఒప్పుకున్నం.ఏం ఖదర్? ఏం ఖాందాన్? ఆఁ చూస్తుంటే చెక్కరస్తాంది బేటా"(రఘోత్తమరెడ్డి, 2006:258) అని వాపోతుంది.అక్కడ ప్రతి సామానును పట్టిపట్టి చూస్తూ వంకలు పెడుతుంది. తస్లీమ్ అమ్మగారు సాగనంపేటప్పుడు ఏడుస్తుంటే, అది తమకు పట్టనివారిలా ఉంటారు. అత్తగారు కరువుగా తొందరగా పంపిచండి అని అహంకారంతో అంటుంది. ఈవిధంగా అహంకార దర్పం, పొగరు కలగలిసిన పాత్రగా అత్తపాత్రను చిత్రించాడు రచయిత.

### 3.4.3 రాజవ్వ

'పట్టు' కథలో 'రాజవ్వ'ని ధైర్యం, ఆత్మవిశ్వాసం గల పాత్రగా చిత్రించాడు రచయిత. రాజవ్వ గోపయ్య ఎదురింటిలో వుండే ఆమె. ఈమెకు ముగ్గురు పిల్లలు పెద్దవాడు బొగ్గుబావిలో పనిచేస్తున్నాడు. చిన్నవాడు చదువు, పని అబ్బక బలాదూర్‌గా తిరుగుతున్నాడు. ఒక కూతురును పెళ్లి చేసి అత్తగారి ఇంటికి పంపిస్తే భర్త బొగ్గుబావిలో పనిచేసుకుంటా తప్పతాగి భార్యను అస్తమానం కొట్టడం, వేధించడం ఇవి తట్టుకోలేక రాజవ్వ కూతురు పుట్టింటికి వచ్చింది. రాజవ్వ భర్త కూడా బొగ్గుబావిలో పనిచేస్తూ తాగటం వల్ల మంచాన పడ్డాడు. దీనితో కుటుంబభారం రాజవ్వ మీద పడుతుంది.రాజవ్వ కూతురు బతుకును ఎలాగైనా చక్కదిద్దాలనే ఆలోచనతో కూతురు భర్త తాగి వచ్చి కూతుర్ని తన కళ్లముందే కొడుతుంటే తట్టుకొలేక, తన కూతురిని తీసుకపోవటానికి వచ్చిన అల్లుని గురించి గోపయ్యకు చెప్పగా"ఎవళ పిల్ల వాళ్లంటికి పోనియ్యే రాజక్క నీకు వున్న బాధలుసాలయా" (రఘోత్తమరెడ్డి, 2006:197)అని అంటాడు. అప్పుడు రాజవ్వ "ఏంది తమ్మి!–బాదలున్నయని–కన్నోల్లను బాయిలదొబ్బుతమా? ఇగొ నారెక్కల సల్లగుండాలెగని–గిసోంటి నాలె ముచ్చోళ్లను పదిమందిని సాదుకత్త"(రఘోత్తమరెడ్డి, 2006:197) అంటుంది.ఈ రాజవ్వ మాటలు కన్నవాళ్లను దూరం చేసుకుంటున్న వాళ్లందరకు చెంపపెట్టుగా రచయిత రాజవ్వ ద్వారా ఈమాటల్ని అనిపించాడు. ఈ మాటలు మధ్య తరగతి వారికి బాధలు, కష్టాలున్నాయని కుమిలి పోయే ప్రతి కుటుంబానికి ధైర్యం చెడకుండా జీవించాలని మనోధైర్యాన్ని ఇస్తాయి. గోపయ్య, పోశెట్టిలలో కూడా మార్పును తెస్తాయి. మితిమీరిన కష్టాల్లో కూడా గుండెనిబ్బరం, ఆత్మస్థైర్యం కోల్పోని పాత్రగా రాజవ్వ పాత్ర చిత్రించబడింది.

### 3.4.4 పిచ్చివీరయ్య

'పెండ్లి' కథలో వీరయ్య ఒక విలక్షణమైన పాత్ర. వీరయ్య చింతల రాజెం తమ్ముడు. బొగ్గగనిలో కోల్‌ఫిల్లర్‌గా పనిచేస్తున్నప్పుడు జరిగిన ప్రమాదం వల్ల రెండు కాళ్ళు పోగొట్టుకొని అవిటివాడు అవుతాడు. ఆ అవిటితనమే తనకు మానవ మనస్తత్వాలను అర్థం చేసుకోనే అవకాశం

కల్పిస్తుంది. అతని అవిటితనం చూసి అతని భార్య ఒక వాచ్‌మెన్‌తో కలిసి లేచిపోతుంది. దానితో వీరయ్యకు మతి భ్రమిస్తుంది. నిజానికి వీరయ్య పిచ్చివాడు కాదు. అతను మనిషి అసలు తత్త్వాన్ని, మనిషి నిజమైన నైజాన్ని బయటపెడతాడు. అందుకే అతని మాటలను చూసి సమాజం అతనికి పిచ్చివీరయ్య అని పేరు పెట్టింది. వీరయ్యకు సమాజం పట్ల ఒక రకమైన ఏవగింపు ఉన్నట్లు మనకు స్పష్టంగా కనిపిస్తుంది "అదేరా లంజకోడుకులార రోజు మనుషుల పీక్కు తినేటోల్లు ఇయ్యాల సంసార్ల తీరుగ అన్నం దింటర్లేందిరా"(రఘోత్తమరెడ్డి, 2006: 107)అంటాడు. అతనికి సమాజం పైన, మనుషులపైన ఎంతటి ఏహ్యాభావం ఉందో దీనిని బట్టి తెలుస్తుంది. దోచుకుతినే స్వార్థసమాజాన్ని వీరయ్య మాటల ద్వారా బట్టబయలు చేసాడు రచయిత. ప్రస్తుతం సమకాలీన సమాజాన్ని, సమాజంలో అంతరించిపోతున్న మానవ విలువలను, దోపిడిదారులను వీరయ్య పాత్ర ద్వారా రచయిత తెలిపారు. అంతేగాదు ఈ కథలో ఆనందం, చెల్లెలి వియోగంతో ఏడుస్తున్న సమయంలో వచ్చి వియ్యంకురాల్ని గురించీ, దోపిడివ్యవస్థను గురించి ఇలా చెప్పిస్తాడు. "వారీ ఆనందా! నీకు సెల్లెను సూత్తెనే గట్ల అనిపిత్తాందిరా? నన్ను సూత్తె ఏమని పిత్తందిరా వారీ? ఇగో నా రొండు కాళ్లు కరకర నమిలితిన్నారు? ఇగో నాతలకాయల మెదడుకూడా గోలిచ్చుకు తిన్నారు మీ అయ్యను సీకేసిన బొక్క తీరుగ చేసి పారేసింద్రు. అయినా వానికి సోయి లేదు. ఊకోరా గాడ్డి! ఏవిట్లకు ఏం జేత్తివి?"(రఘోత్తమరెడ్డి, 2006:111) ముందుముందు ఎదురయ్యే అనుభవాలను వీరయ్య చెప్తాడు. వీరయ్య తన అన్న కొడుకు ఆనందం భవిష్యత్‌ను కూడా నిర్దేశించి వెళతాడు. "అరె కొడుకా! గట్లనే నువ్వుగూడ అందరి తీరుగ మనుషుల పీక్కుతిను అఁ!" (రఘోత్తమరెడ్డి, 2006: 111) అంటూ వీరయ్య సమాజంలో ఎలా బ్రతకాలో, అలా బ్రతికితే గాని నిలకడగా వున్న జీవితాన్ని పొందలేమని వీరయ్య పాత్ర ద్వారా రచయిత చిత్రించాడు.

### 3.4.5 మల్లేశు

'పగలూ రేయీ శ్రమ పడుతున్నా' కథలోని మల్లేశు పాత్ర కథకుని కంఠస్వరం ప్రతిధ్వనించే మొత్తం కథని మలుపు తిప్పే పాత్రగా చెప్పాలి. వయస్సులో చిన్నవాడైన మల్లేశు నేటి సమాజానికి కావల్సిన చైతన్యవంతమైన ఆలోచనలతో ముందున్నవాడు. మల్లేశు ఓదెమ్మ కొడుకు. దోపిడివ్యవస్థను నిర్మూలించే క్రమంలో పోరాడుతున్నవాడు. పీడితులైన తమలాంటి వారికోసం ఉద్యమబాటలో నడుస్తున్నవాడు. పాలేరుగా ఉంచుకోవాలని రాంరెడ్డి అనుకోగా ఆనాటి కాలపరిస్థితుల నుండి బయటపడేలా సందేశాన్ని ఇచ్చిన పాత్రగా రచయిత చిత్రించారు.మల్లేశు పాలేరుగా పనికిరాడని సంఘంవాళ్ల చేత బందు పెట్టించడానికి వున్నాడని రామిరెడ్డి అన్నపుడు "కడుపు నొచ్చెటోడు వోమ బుక్కుతడని మీరే అంటారు. నేను పురెక్కితే వాళ్లు ఎక్కుతారా ఎవళు కడుపు తిప్పలు వాళ్లు పడ్తారు" (రఘోత్తమరెడ్డి, 2006: 48) అని తిరిగి సమాధానం ఇస్తాడు. రాంరెడ్డి షావుకార్ల చేతిలోమోసపోయి చితికి పోతున్న తనలాంటి కాపుదనపు రైతుల గూరించి పట్టించుకోని సంఘంవాళ్లనుద్దేశించి ప్రశ్నిస్తాడు ఆ సమయంలో షావుకార్ల చేతిలో మోసపోయిన రాంరెడ్డి దొర లాంటి వారికీ, చేతికి ముద్ద దొరకని కడు పేద జనానికీ, వైవిధ్యాన్ని వివరించి తిన్న పూటన్నసరిగ, తిండి లేని మాకూ మీకూ పొంతన ఎక్కడిదయో పటేలా అనే వాదంతో రాంరెడ్డిని ప్రశ్నించిన పాత్ర మల్లేశుది. ఎంత తీసుకున్న తిండికి ఢోకాలేని దొరల జీవనానికీ, తిండిలేని సామాన్య బతుకులకూ పోలికలేదని దొరవాదనను సైతం తిరస్కరించిన పాత్రగా, చైతన్యవంతమైన, విప్లవ భావాలతో ఉన్న పాత్రగా మల్లేశు పాత్రను చిత్రించారు రచయిత.అంతేకాకుండా ఇలా ఎంతకాలమని నిరాశ్రయులుగా, నిస్సహాయులుగా పోరాటం చేస్తారనీ, సమయానికి తగిన విధంగా బలోపేతమై దొంగ వ్యాపారుల మీదికి ఉద్యమ దశను సాగించాలనీ, కాపుదనపు రైతులకు భవిష్యత్ ప్రణాళిక నిర్దేశించే పాత్ర మల్లేశుది. దొరలకే సవాల్ విసిరిన పాత్రగా మల్లేశునుచిత్రించారు. ఈ కథలోని మల్లేశు ద్వారా రైతుల బాధ్యతను గుర్తెరిగేలా రచయిత చేశారని చెప్పవచ్చు. ఇది రచయిత సామాజికబాధ్యతను పట్టిస్తున్నది.

# అధ్యాయం – 4

# తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – రచనాశిల్పం

## 4. శిల్పం పరిచయం

ప్రాచీన కావ్యం నుండి నేటి కథ, నవల, నాటకం లాంటి ఆధునిక వచన ప్రక్రియల వరకు చక్కని పాత్ర పోషిస్తున్న సాహిత్యాంశం 'శిల్పం' (Technique).సాహిత్య సంబంధమైన రచనా నిర్మాణంలో శిల్పం అధిక ప్రాధాన్యతను కలిగి ఉంటుంది. మిగతాప్రక్రియల కన్నా కథలను రాసేటప్పుడు శిల్ప ప్రాముఖ్యత మరింత ఎక్కువగానే కనిపిస్తుంది. కథల్లో ఉన్న శిల్ప బట్టే ఆ కథ రాసిన రచయిత ప్రతిభ, నైపుణ్యాలను అంచనావేస్తారు. పాఠకులను విపరీతంగా ఆ కథ అద్యంతం చదివేలా చేయడానికి శిల్పం పరోక్షంగా దోహదపడుతుందని చెప్పాలి. ఎంతటి కథావస్తువుకైనా సరైన శిల్పనిర్మాణం లేకపోతే ఆ కథ అంతగా రాణించదని నిస్సంశయంగా చెప్పవచ్చు. ఆధునిక కథాసాహిత్యంలో శిల్పానికి ఉన్నప్రాధాన్యం ప్రస్ఫుటంగా వ్యక్తం అవుతుంది. సామాజికస్పృహతో, వస్తున్న కథానికల్లో రచయిత జీవితంలోని సంఘర్షణను కొత్త శిల్పరీతులతో చూపించి ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకోవడానికి ప్రయత్నం చేస్తుంటాడు. రచయిత తన అనుభవంలోంచి వచ్చిన కథావస్తువుని ఏక్రమంలో ఎలా నిర్మింపడజేస్తాడో అదే శిల్పం. ఇది అతని రచనానైపుణ్యాన్ని, ప్రతిభను వెల్లడిస్తుంది. ఒక కళాకారుడు బొమ్మను తయారుచేయడానికి ఎంత కష్టపడతాడో రచయిత కూడా రచనను తీర్చిదిద్దడంలో అంత కృషి చేస్తాడు. రచనాశిల్పానికి కొందరు విమర్శకులు ఇచ్చిన నిర్వచనాలు చూసినట్లయితే శిల్పమంటే అవగాహన ఏర్పడుతుంది.

"ఒక రచయిత లేదా కళాకారుడు తన పనిలో కళాకౌశలాలను వినియోగించే రీతి, సామర్థ్యం. ఒక నిర్ధిష్ట రంగంలో వినియోగించే రీతి, సామర్థ్యం" (దక్షిణామూర్తి, 1988: 396). పై సారాన్ని ఒక్క మాటలో చెప్పినట్లయితే ఏపనిలోనైనా ప్రదర్శించే కళానైపుణ్యామే శిల్పమవుతుంది. కథలో సాధించిన

శిల్పం ద్వారా పాఠకులు ఆ కథాంశాన్నీ, కథమూలాన్నీ సరిగా పట్టుకోగలరు. అభూతకల్పనలతో కథాశిల్పాన్ని నిర్మించటం కన్నా సమకాలీన సామాజిక సమస్యలను కళాత్మకంగా చిత్రించడం మేలు."సాహిత్య కళకి చెందిన శిల్పం యొక్క ఆశయం ప్రజలను మాన్యపెట్టడం కాదు. వారి దృష్టిని జీవిత కష్టసుఖాల దగ్గర నుంచిమరల్చి వాటి వెనుక వుండే కారణాల మీదికి మరల్చటంకథాశిల్పానికి సంబంధించిన ఇతర సుత్రాలేమంటే పఠితల రసగ్రహణ శక్తిపై కొంత విశ్వాసం ఉంచాలి. ప్రతి స్వల్ప విషయాన్ని అంతులేకుండా వ్యాఖ్యానం చేసే కథ చెప్పటం చెయ్యకూడదు" (కుటుంబరావు, 1982: 44,45) అని కొ. కు. తెలిపారు.

పాఠకులను తొందరగా ఆకట్టుకుని, కథావస్తువును జీవితమంతా మదిలో నిలిచేలాగా చేసే శిల్పం వైయుక్తిక ముద్ర వేసుకొంటుంది. శిల్పమనేది కొన్ని అంశాల కలయిక వల్ల రూపొందుతుంది. "పాత్రలూ, సన్నివేశాలూ, పరిస్థితులూ, పరిసరాలూ, సంభాషణలూ అన్ని ఒక దానితో ఒకటి సజీవంగా అలకరింబడిప్పుడే కథానిక పాఠకుని హృదయాన్ని తాకుతుంది" (రామచంద్రారెడ్డి, 1982: 159). రాచమల్లు రామచంద్రారెడ్డి గారు చెప్పినట్లు కథాశిల్పంలో విభిన్న అంశాల కలయిక ద్వారా సమర్ధవంతమైన శిల్పనైపుణ్యాన్ని రచయిత సాధిస్తాడు. కథానికలో ప్రదర్శించే వివిధ అంశాల సమాహారమే కథాశిల్ప స్వరూపంగా వ్యక్తమవు తుంది. ఇది కేవలం వివిధాంగాల కూర్పులో నేర్పు చూపించడం కాదు. రచయిత ఎన్నుకున్న వస్తువుపై ఆయనకున్న విలక్షణమైన దృక్పథం, మానవ జీవితతత్వం పట్ల అతడు చేసే వ్యాఖ్యానం. కథావస్తువు కథారచయిత జీవితంలో నుంచి కాని అతని చుట్టు పక్కల వారి జీవితాల్లో నుంచి కాని రూపొందుతుంది. అంతేగాని, రచయిత ఉండే ప్రాంతానికి, సమాజానికి అతీతమైన జీవితాలను అతను చిత్రించలేడు. ఒకవేళ చిత్రించే ప్రయత్నం చేసినా ఆ రచన ప్రయోజనాన్ని నెరవేర్చదు. రచయిత కథావస్తువు ఎన్నుకోవటంలోనూ దాన్ని చిత్రించటంలోనూ అతని భాష, భావ ప్రకటన తప్పనిసరి ప్రతిబింబిస్తుంది. అలా ప్రతిబింబించినప్పుడే సామాజిక స్పృహతో వచ్చిన రచనగా అది పాఠకుల ఆదరానికి లోనవుతుంది. తెలుగు సాహిత్యంలో కథానిక ప్రక్రియపై నిర్ణయాన్ని సమర్ధతతో చిత్రిస్తూ వచ్చిందని చెప్పాలి. "పరిధి చిన్నది కావడం వల్ల, ఏవ్యక్తి అయినా సరే,

ఏవ్యక్తి జీవితంలో ఏ సంఘటన అయినా సరే ఒక కథానిక రూపొందుతుంది. వేగవంతమైన జీవితంలో అల్పకాలంలో అనల్పానుభూతిని కలిగిస్తుంది. కొండంత సమస్యను ప్రదర్శించే గోరంత దీపం కథానిక. కాని కథానిక శక్తి మాత్రం ఒక తుపాకి గుండుకున్నంత" (చంద్రశేఖర్ రెడ్డి, 1985: 17). ఈ విధంగా రచయిత సమాజంలో తనను కదలించిన సమస్యలను తన కోణం నుంచి పరిశీలించి ఒక ప్రత్యేక పద్ధతిలో కథలో చిత్రించి పాఠకుల మన్ననలను పోందదానికి ప్రయత్నిస్తాడు. అంతేగాకుండా పాఠకులను ఆకర్షించి, ఆలోచింపజేసే విధంగా కథను చిత్రిస్తాడు. కథానిర్మాణంలో శిల్పం ప్రాధాన్యతను, అది చూపే ప్రభావాన్ని ముందు చూశాం. ఇప్పుడు శిల్పంలోని అంశాలను విభజించి వాటిని రచయిత పాటించిన తీరును విశ్లేషిస్తాను.

కథను రాసేటప్పుడు రచయిత అనవసరమైన అంశాలను వదలిపెడుతుంటాడు. ప్రతి కథలోనూ అన్ని శిల్పంశాలుఉండాల్సిన అవసరం లేదు. ఆయా కథాంశాన్ని బట్టి, కథావస్తువును బట్టి కథలో శిల్పానికి సంబంధించిన అంశాలు ఉంటాయి. దిన్నే "కథలో వస్తువు నిర్వహణలో వ్యర్థపదాలు, అసందర్భ సన్నివేశాలు లేకుండా ఏవి ఎలా ఉండాలో అలా సహజంగా, స్వాభావికంగా తీర్చిదిద్దడం శిల్పంగా చెప్పవచ్చు" (బలరాం, 2011: 83) అని బలరాం అనే పరిశోధక విద్యార్థి తన సిద్ధాంతవ్యాసంలో తెలిపారు. కథలోని శిల్పం గురించి వివరించాలనుకున్నప్పుడు అందులోని విభిన్న అంశాల విశ్లేషణ అవసరం. ఎందుకంటే వస్తువు, పాత్రచిత్రణ, కథాకథనం, సంఘర్షణ, సన్నివేశాల కల్పన, ఎత్తుగడ, ముగింపు మొదలైన అంశాల కలయిక వల్లనే శిల్పం రూపొందుతుంది. కాబట్టి తుమ్మేటి కథల్లో ఉన్న వివిధాంశాల పరిశీలన వల్ల రచయిత చూపిన శిల్పనైపుణ్యాన్ని అంచనా వేయగలం.కథానిక ప్రక్రియలో రూపగత విభాగమైన ఎత్తుగడ నుంచి ముగింపు వరకు, సంవిధానం విభాగంలోని పాత్ర నుంచి కథనం వరకు ప్రతి అంశం కథానిక శిల్పాన్ని పోషించడంలో ఉపయోగపడతాయనే దక్షిణామూర్తి అభిప్రాయంతో ఏకీభవించి వాటిని తుమ్మేటి కథలకు అన్వయించి పరిశీలించడం ఈ అధ్యాయ ముఖ్యోద్దేశం.

## 4.1 వస్తువు

"రచయిత తానెన్నుకున్న వస్తువులో నుంచి ఒక ప్రణాళికను రూపొందించుకుని, తదనుసారంగా వివిధ అంశాలను పొందుపరచడానికి కథాశరీరానికొక సౌష్ఠవం, సౌందర్యం సంతరించడమే వస్తువిన్యాస శిల్పం" (దక్షిణామూర్తి, 1988:). కథాస్వరూపంలోమొదటి నుండి చివర వరకు ఈ మూలభావాన్ని పోషిస్తుండాలి. కథానికలో వస్తువు ఒక కేంద్రంగా కొనసాగుతూ మొదటి నుండి చివరి వరకు అంతర్గతం చలిస్తూనే ఒక లక్ష్యంతో బయటపడుతుందని చెప్పాలి. దీన్నే రామచంద్రారెడ్డిగారు ఈ విధంగా వ్యక్తం చేశారు. "పాయింట్ అంటే లక్ష్యం. కథానికలో ఒకే ఒక లక్ష్యం ఉండాలి. యెక్కువ లక్ష్యాలుంటే అది యేమౌతుందోగాని, కథానిక మాత్రం కాదు" (రామచంద్రారెడ్డి, 1982: 139, 140) అని తేల్చిపారేశారు.

కథానికలో మూలంలో ఉంటూ పాఠకునికి ఒక సత్యాన్ని, సందేశాన్ని అందిస్తుంది వస్తువు."వస్తువు అంటే పాత్రలు, సన్నివేశాలు, వాటి నడక వీటి వల్ల ఏర్పడుతున్న కథాశరీరం (Plot) కాదు. ఇవన్నీ కలిసి చిత్రిస్తున్న జీవితాంశమే వస్తువు. దీన్ని ఇంగ్లీషులో 'Theme'గా వ్యవహరిస్తున్నారు" (సుబ్బారావు, 1993: 111). ఈవిధంగా రచయిత తీసుకున్న జీవితాంశం లేక సమస్య వస్తువు అని పేర్కోనాలి. వీటిలో రచయిత ప్రదర్శించిన వైవిధ్యాన్ని, అతని జీవితానుభవ విస్తృతిని, భావనవైవిధ్యాన్ని మనం తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. వస్తువైవిధ్యాన్ని బట్టి రచయిత వస్తువు ఎంపికలో చూపిన ప్రతిభా నైపుణ్యం తెలుసుకోగలం. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలలో వస్తువైవిధ్యాన్ని పరిశీలించడమంటే అతని జీవితాన్ని పున:పరిశీలించడమే అవుతుంది. ఎందుకంటే తుమ్మేటి తన జీవితంలో ఎదిగిన క్రమంలో రూపొందిన వస్తువులను వాస్తవికంగా కథలుగా చిత్రించాడని పరిశీలిస్తే తెలుస్తుంది. అతని తొలి కథ 'ధిక్కారం' నుండి 'హంతకులు' వరకు గమనించినట్లయితే ఈ విషయం మనకు స్పష్టమవుతుంది.రఘోత్తం మొదట వ్యవసాయ రంగంలో పని చేసి తదుపరి ఉపాధి దిక్కులేని పరిస్థితిలో బొగ్గుగని కార్మిక జీవితానికి ఉద్యోగం కోసం వలస బాట పట్టారు. అలా అతని జీవితంలో జరిగిన, అతన్ని కదిలించిన ముఖ్యమైన సంఘటనలనే కథలుగా

రూపొందించే పనిచేశారు. మిగతా రచయితలలాగా కాకుండా అతని జీవిత నేపథ్యం నుండి ఆయన కథలని అర్థం చేసుకున్నప్పుడే ఆయన కథల్లోని వస్తువైవిధ్యాన్ని గుర్తించగలం.

తెలంగాణలో1970-80కి ముందున్న రైతుల దైన్య జీవితాలను, దుర్భర పరిస్థితులను, దొరల దోపిడిని, అధికారమదాన్ని, వెట్టిచాకిరీ వ్యవస్థను, రైతుల చైతన్యాన్ని, కార్మిక జీవితంలో ఉన్న శ్రమ దోపిడిని, గని అధికారుల దాష్టికాన్ని, మానవ సంబంధాలను, ఆ సంబంధాలు విచ్ఛినం కావడానికి వెనుక ఉన్న ఆర్థిక అసమానతలను, అవి నడిపిస్తున్న తీరును, బొగ్గుగనికార్మికులు తమ కనీసఅవసరాల నిమిత్తం చేసే పోరాటాలను మొదలైన అనేకాంశాలను వస్తువుగా స్వీకరించి కథలుగా మలిచారు తుమ్మేటి రఘోత్తమరెడ్డి. ఈయన కథల్లో ముఖ్యంగా గ్రహించాల్సిన అంశం ఒకటి ఉంది. ఆయన కథలు అనేక అంశాలను భిన్న పార్శ్వాల నుండి చూపిస్తూ వాటికి ప్రశ్నలను లేవనెత్తి నిలదీసి అడిగినట్లు ధిక్కార స్వరంతో ఉంటాయి. అందుకు ఉదాహరణగా'పట్టు', 'పగలూ రేయీ శ్రమ పడుతున్నా' కథలను చెప్పుకోవచ్చు. 'పగలూ రేయీ శ్రమ పడుతున్నా' కథలో సామాన్య బతుకుల నుండి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న సాయిలూ జీవితాలకు, పంటలు సరిగా పండక దొరలుగా బతికిన జీవితంలో ఒక్కసారిగా ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభం వల్ల బొగ్గుగని ఉద్యోగానికి ప్రయాణమైన దొర కుటుంబంలోని యువతరం, అదే కథలో దొరల రైతు కార్మికుల కష్టాలు తీరే మార్గాన్ని సూచించి తాను కూడా గని జీవితానికి వెళ్ళాల్సి వస్తుందని బాధ పడ్డ ఓదెమ్మకు ఇలా భిన్న రకాల జీవితాల సంఘర్షణను గురి చేసే కథలను రాశారు. సామాజిక సమస్యలనే కథావస్తువులుగా స్వీకరించి రచయిత గల ప్రాపంచిక దృక్పథాన్ని, తాత్విక చింతను పట్టించే విధంగా ఆయన కథలుగా రూపొందుకున్నాయి. ఈ విషయంలో ఏ కథను చూసినా మనకు స్పష్టమవుతుంది.

## 4.2 పాత్రచిత్రణా శిల్పం

రచయిత ఎన్నుకున్న వస్తువును బట్టి తగిన పాత్రలను ఎన్నుకుంటాడు. రచయిత పాత్రచిత్రణలో చూపిన నైపుణ్యాన్ని 'పాత్రచిత్రణ శిల్పం' అంటారు. రచయిత తాను చెప్పదలచిన సూచనలను,

విషయాన్ని పాత్రల సంభాషణల ద్వారా, చేష్టల ద్వారా వ్యక్తపరుస్తాడు. "నిత్యజీవితంలో ఒక్కొక్క వ్యక్తికున్న వైయుక్తిక మూర్తిమత్వంలాగే, రచయిత చూపే పాత్రచిత్రణ శిల్పంతో, సాహితీగతమైన పాత్ర కూడా మనస్సులో నిలిచిపోతుంది" (దక్షిణామూర్తి, 1988: 403). పాఠకుడిపై వైయుక్తిక ముద్ర వెయ్యడానికి పాత్రలు కూడా సహకరిస్తాయి. రచయిత పాత్రను ప్రవేశపెట్టినప్పుడు దానికి తగిన భాషాశైలిని, సంఘర్షణను చిత్రించినప్పుడే ఆ కథ చక్కగా రూపొందుతుంది.పాత్రకంటూ వ్యక్తిగత గుణాలు ప్రయుక్తమైనప్పుడు మనకు కథలో పాత్ర అందించిన విషయాన్ని తొందరగా అర్థంచేసుకోవడానికి అవకాశం ఉంటుంది. "తెలివి, చాకచక్యం, సాత్విక, రాజస, తామస గుణాలు, హృదయసౌకుమార్యం, తిరుగులేని తెగువ మొదలైన లక్షణాలు ఆయా పాత్రల్లో తీరుతీరుగా వ్యక్తమౌతుంటాయి. చైతన్యంతో జీవిస్తూ ఉంటాయి. (దక్షిణామూర్తి, 1988:404). పాత్రచిత్రణ చేసేటప్పుడు రచయిత అనవసరమైన సంభాషణలకు దూరంగా చక్కని కథాకథన నైపుణ్యంతో ముందు సాగే విధంగా పాత్రల సంవాదాన్ని నిర్మించాలి. మాములుగా ఒక రకమైన స్వభావానికి చెందిన పాత్ర చిత్రించడం గాక మానసిక సంఘర్షణలు ప్రతిబింబించే సంక్లిష్ట పాత్రలు చిత్రించడానికి మంచి జీవితానుభవం ఉండాలి. వైవిధ్యం, వైలక్ష్యణ్యం ప్రదర్శించే పాత్రలు చిత్రించడం వల్ల కథల్లో సంభాషణలు సన్నివేశానికి తగ్గట్టు ప్రభావవంతంగా చిత్రించబడతాయి.

తుమ్మేటి కథల్లో పాత్రలు ఎంతో వైవిధ్యభరితంగా సజీవంగా చిత్రించబడ్డాయి. రచయిత తన చూట్టూ జీవించి సంఘర్షణలకు లోనై ఉన్న మనుషులను పాత్రలుగా కథలో చిత్రించారు. కాబట్టి పాత్రలు సహజత్వానికి దగ్గరగా, సజీవంగా ఉన్నాయి. రచయిత తన జీవితంలో ఎదురైన విలక్షణమైన వ్యక్తుల వ్యక్తిత్వాలను, వైఖరులను చిత్రిస్తూ కథల్లో వాటిని గురించి అక్కడక్కడ వ్యాఖ్యానించిన తీరు వల్ల ఆ పాత్రల వైశిష్ట్యం తెలుస్తుంది. ('శత్రువు' కథలోని లింగయ్య, సుగుణ పాత్రలను గమనించినప్పుడు తెలుస్తుంది)"కథలోని పాత్రలు తమ స్థాయికి తగ్గట్టుగా తమ వాతావరణానికి అనుకూలంగా ప్రవర్తిస్థాయి. అందుకు తగిన భాష, చిత్రణ కథల్లో ఉన్నాయి. వీరి పాత్రోచిత సంభాషణలు కనిపిస్తాయి. అవసరమున్నచోట వ్యవహారికం, మాండలికం తారసపడుతాయి. కథను

రక్తి కట్టించడానికి, పాఠకుల ఆసక్తిని పెంచడానికి వర్ణనలు, అలంకారాలను ఉపయోగించారు" (స్వామి, 2013: 99).

'ధిక్కారం' కథలో అణగారిన కులానికి చెందిన 'రాయమల్లి'ని అవమానించడం ద్వారా దొరసానికీ, దొరసానికొడుకు జగదీశ్వర్రావుకూ ఎదురుతిరిగినిరసనను తెలిపిన పాత్రగా చిత్రించాడు రచయిత. దొర ఆగడాలను, జిత్తులను కనిపెట్టి తమ లాంటి వారి అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని చంపుకోలేక వెట్టిచాకిరీ నుండి విముక్తి పొందేందుకుదొరకే ఎదురుతిరిగిన వైనం 'ఓదెలు' పాత్ర ద్వారా తెలుస్తుంది. పొలం పని మీద బయటకెళ్ళి వర్షంలో చిక్కిన కొడుకు రాక కోసం ఆరాటపడే 'నర్సయ్య' పాత్ర 'ఓ మెరుపు మెరిసింది' అనే కథలో, జీవితంలో కష్టసుఖాలు సర్వసాధారణమని కష్టాల చిక్కుల వల్ల కుటుంబ సంబంధ బాంధవ్యాలను తెంచుకోవడం సబబుకాదని చెప్పే'రాజవ్వ' పాత్ర'పట్టు' కథలో కనిపిస్తుంది. బొగ్గుగని కార్మికుని ఇంట్లో తన కొడుక్కు పేరు పెట్టడానికి వచ్చిన ఓదెలు పడిన దు:ఖం ప్రతి బొగ్గుగని కార్మికుని ఇంట్లో అనుభవిస్తున్న వ్యధ లాంటిది. తన కొడుక్కు పేరు నిర్ణయించమని ఓదెలుని అడిగినప్పుడు పలికిన పలుకులు గని కార్మికుల కొడుకుల జీవితాలను, కార్మిక కుటుంబాలు పడే సంఘర్షణను తెలియజేస్తాయి. "నన్ను పేరు పెట్టమన్నరు. కాని నేను అబద్దమాడలేనుర, ఏ పేరు పెడితె మున్నదిర. కోల్‌ఫిల్లరోనికి కొడుకు పుడితె బదిలీఫిల్లరేరా ఏపేరు పెట్టినా వాడయ్యేది ఆఖరికి బదిలీఫిల్లరేరా"(రఘోత్తమరెడ్డి, 2006: 105).

పై కథల్లోనే కాకుండా ప్రతి కథలోనూ వాస్తవిక జీవితంలో ఎదురైన వ్యక్తులనే పాత్రలుగా తన కథల్లో చిత్రించడానికి రచయిత ప్రయత్నించినట్లు తెలుస్తుంది.

## 4.3 కథాకథనం

రచయిత ఎంచుకున్న కథావస్తువును ఏక సూత్రత అంతర్గతంగా ఉంచుతూ, కథను నడిపించటానికి ఒక పద్దతిని ఎంపిక చేసుకుంటాడు. అలా రచయిత కథను నడిపిన తీరును 'కథాకథనం' అంటారు. కథనం అంటే చెప్పే పద్ధతి. ''ఇతివృత్తాన్ని వివరించేందుకు రచయిత

స్వీకరించే దృష్టికోణమే కథాకథనం'' (లక్ష్మీనారాయణ, 1989: 222). కథలోనిసంఘటనలను పేర్చేటప్పుడు వాటి మధ్య కార్యకారణ సంబంధం ఉండేలా చూసుకొని రచయిత చెప్పదలుచుకున్న విషయాలను కథనం ద్వారా వాచ్యంగానైనా, వ్యంగానైనా చెప్తాడు. ప్రాచీనకథా స్వరూపానికి, ఆధునిక కథానిర్మాణానికి వుండే వ్యత్యాసం ఇక్కడ స్పష్టమవుతుంది. ప్రాచీన కథానిర్మాణంలో కథకుసంబంధించిన విషయాలు పాఠకులకు తెలియనివిగా ఉంటాయి. కాని ఆధునిక కథన పద్ధతుల్లో పాఠకులకు తెలియని విషయాలను తెలుసుకోవడమేకాకుండా రచయిత కథనపద్ధతి ద్వారా రచయిత దృక్పథం అతను ఆశించిన అంశాల గురించి ఆలోచించే విధంగా ఉంటాయి. రచయితలు అనుసరించే కథన పద్ధతి ఆ రచయితకు సాహిత్యంలో గల ప్రత్యేక స్థానాన్ని సైతం నిర్ణయిస్తుంది.

రచయిత ఎన్నుకున్న వస్తువును బట్టి కథాకథనం అనేది రూపొందుతుంది. రఘోత్తం కథాకథనం గురించి పలువురు విమర్శకులు కింది విధంగా అన్నారు. "ఆజానుబాహుడైన విలుకాడు, బిగువుతో సంధించిన బాణాన్ని ఆకర్ణాంతము లాగి వదిలినట్లు ఇతని కథనం సూటిగా వెళ్ళి, పాఠకుని బుద్ధిని తాకుతుంది" (స్వామి, 2013: 98)."కథనానికి సంబంధించి రఘోత్తమరెడ్డి ఎలాంటి పటాటోపాలకి పోడు. సరాసరి కథ చెప్పటం మొదలెట్టి. సన్నివేశాల్ని నడిపించి, పాత్రల్ని తమ నడకా, నడవడికా తమవిగా నడవనిచ్చి, కథని తానాశించిన ప్రయోజనం ఒడ్డుకు చేర్చి ముగిస్తాడు'' (విహారి, 2013: 375). "శిల్పరీత్యా కథలన్నీ ఒకేలా ఉండకపోయి ఉండచ్చు. కథావస్తువును బట్టి కథనరీతి ఉండక తప్పదు కాని, ఎంత సరళమైన వస్తువునైనా దానిలోని బహుముఖీనతను భద్రంగా కాపాడుతూ సరళంగా కథను నడపడం, పాత్రల ఉద్విగ్నత రచయితను తాకకుండా జాగ్రత్త పడడం కథాకథనంలో రచయిత సాధించిన పరిపూర్ణతకు నిదర్శనం'' (వరలక్ష్మి, 2013: 370). ఈవిధంగా కథను పాఠకుడికి సూటిగా చేరవేయడం తప్ప అనవసరమైన విషయాలను వ్యాఖ్యానించే పని రఘోత్తం చేయలేదని పై వ్యాఖ్యాల ఆధారంగా తెలుస్తుంది. ఆధునిక కథాకథనపద్ధతుల ఆధారంగా,రఘోత్తం కథల్లో కథాకథన పద్ధతులను పరిశీలించాను.

### 4.3.1 ఉత్తమ పురుష కథాకథనం

రచయిత తాను చెప్పదలచిన విషయాలను తన రచనలోని పాత్ర ద్వారా వ్యక్తపరుస్తాడు. కథలో రచయిత స్వయంగా జోక్యం చేసుకుని, లేకపోతేఎన్నుకున్న పాత్ర ద్వారా పరిమితికి లోబడిన విషయాలను తన కోణం నుంచి వ్యాఖ్యానిస్తాడు. ఈ సందర్భంలో రచయిత పాత్రలో మమేకమై నిలుస్తాడు. పాత్రలో కలసిపోయి విషయాన్ని తన స్వంత అనుభవాన్ని ఉన్నది ఉన్నట్లుగా వాస్తవికంగా చెప్పటానికి ప్రయత్నిస్తాడు. "కథను పాత్ర ద్వారా చెప్పించినప్పుడు ఆ 'పాత్ర' ఆ కథలో ముఖ్యపాత్ర అవటం కానీ, లేక అది తన కథే కావడం కాని జరుగుతుంది. అప్పుడు ఆ పాత్ర నేను అంటూ దిగుతుంది రంగంలోకి అటువంటి కథలను ఉత్తమ పురుష కథలనవచ్చు" (సుబ్బారావు, 1993: 168). రచయిత అనుభూతులను పాఠకునితో పంచుకోవటానికి అనువైన పద్ధతిగా గోచరిస్తుంది. నేను, మేము పదాలతో కథలోకి దిగి విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వివరిస్తున్నట్లు అనిపిస్తుంది. ఇందులో 'నేను' అనేది పూర్తిగా రచయిత గుర్తింపు కాదు. రచయిత 'నేను' అనే పాత్రతో కలిసి కథను మనకు చెప్తాడు. అంతేగాని 'నేను' అనేది రచయితే ప్రత్యక్షంగా చెపుతున్నట్లు గ్రహించకూడదని గమనించాల్సిన విషయం. అప్రధానపాత్రగా కూడా 'నేను' అంటూ వ్యవహరించేలా చిత్రించే అవకాశం లేకపోలేదు. ఉత్తమ పురుష కథన పద్ధతి అనేది రచయిత పట్ల పాఠకునికి పూర్తి నమ్మకాన్ని కలిగిస్తుంది. ఎందుకంటే తన సొంత అనుభవమే ప్రధానపాత్ర ద్వారా వ్యక్తపరిచి పూర్తిగా నమ్మకాన్ని కలిగే విధంగా చిత్రిస్తాడు. తెలియనీ విషయాల జోలికి పోకుండా తనకు తెలిసిన వాటిని, అనుభవంలో ఉన్న వాటిని చెప్పి తెలియని వాటిని పాఠకుడి ఊహాశక్తికి వదలిపెడతాడు.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల్లో ఉత్తమ పురుష కథనంలో ఒకటి, రెండు కథలు మాత్రమే సాగాయి. వాటిలో'నా పాత స్నేహితుడు' అనే కథ రచయిత ప్రాతినిధ్యం వహించి రాసిన కథ. కాబట్టి రచయిత, కథకుడి చేత అతని జీవితంలోని సంఘటనలను కథలో చిత్రించాడు. "నేను మా ఊరికి వెళదామని రామగుండం స్టేషన్లో కొచ్చేసరికి రైలు వచ్చి సిద్ధంగానే వుంది. గబ గబ టికెట్ తీసుకుని వచ్చి రైలులో కూర్చున్నాను" (రఘోత్తమరెడ్డి, 2006: 241). అంటూ 'నా పాత స్నేహితుడు' కథలో

కథాప్రారంభమే ఉత్తమ పురుష కథనంతో సాగుతుంది. రచయిత కథను ఉత్తమపురుషలో సాగిస్తూ చెప్పడం అది తన జీవిత నేపథ్యంలోని సంఘటనను వాస్తవికంగా ఒక కథగా మలచడం ఇందులోని శిల్పం. ఉత్తమ పురుష కథనం చేయటంలో రచయిత ఇతరుల జీవితాల్లోని అనుభవాలను చూసి చిత్రించటంలో లేని వెసులుబాటు ఇందులో ఉంటుంది.ఇలా రచయిత జీవితానుభవంలో ఎదురైన సంఘటనలను సమర్ధవంతంగా చిత్రించడంలోఉత్తమ పురుష కథనం చాలా వరకు అనుకూలంగా ఉంటుంది. "కాని నేను చదివిన చదువుకు ఏ నౌఖరి దొరుకుతుంది? ఎప్పటి మాటో? కాలరీ మీదున్న మా చిన్నాయనింటికి పోతే ఆయన బలవంతం మీద ఎంప్లాయిమెంట్ ఆఫీసులో పేరు నమోదు చేయించుకుని వచ్చిన. నా మటుకు నాకు ఏ నౌఖరీ దొరుకుతుందన్న నమ్మకం లేకుండేది" (రఘోత్తమరెడ్డి, 2006: 247). అనేసన్నివేశం 'నా పాత స్నేహితుడు' కథలో తుమ్మేటి (కథకుని) ఉద్యోగ అన్వేషణను తెలుపుతుంది.పైవిధంగా తుమ్మేటి రఘోత్తమరెడ్డి గడిపిన జీవితాన్ని గురించి పున:స్మరించుకొని మరీ 'నా పాత స్నేహితుడు' కథనం చేసిన తీరు రచయిత జీవితాన్ని, జీవితంలో ఉన్న సంక్లిష్టతను పట్టిస్తున్నాయిఅని తెలుస్తుంది. నేను పరిశోధనకుతీసుకున్న కథల్లోని 'నా పాత స్నేహితుడు' అనే కథ మాత్రం పూర్తిగా ఉత్తమ పురుష కథనంలో సాగింది. మిగతావన్నీ ఇతర కథనాల్లో సాగాయి.

### 4.3.2 ప్రథమ పురుష కథనం

ఇందులో కథకుడు కథలో చెపుతున్న విషయాలు తనవిగాక, వేరొకరికి సంబంధించినవిగా చెప్తాడు. కథలోని పాత్రలకు లేదా సంఘటనలకు సంబంధించి తనకు తెలిసిన విషయాలను ఎవరికో (పాఠకులకు)చెప్పినట్లు కథ నడుస్తుంది. ఈ కథనం కథకు సంబంధించిన అన్ని అంశాలకు రచయిత సర్వసాక్షిభూతుడుగా ఉంటాడు. "కథలో ప్రత్యక్ష ప్రమేయం లేకుండా కేవలం సాక్షీభూతుడుగా నిల్చి కథకుడు చెప్పేది ప్రథమ పురుష కథనం" (దక్షిణామూర్తి, 1988: 360). అమె, అది, వారు వంటి పదాలను ఉపయోగించి కథను రచయిత చెపుతాడు. రచయిత కథలో ప్రత్యక్షంగా పాల్గొనకుండా

పాత్రల ద్వారా కథ నడపడం జరుగుతుంది. ఈ పద్ధతిలో రచయిత చిత్రించాల్సిన సంఘటనలను తన కోణం నుంచి పరిశీలించి పాత్రల ద్వారా వ్యక్తపరుస్తాడు. కాని కథకుడు మాత్రం కథాంశానికి, కథావస్తువుకు దూరంగా ఉండి కథనం  చేసినట్లు మనకు స్పష్టమవుతుంది. ప్రథమ పురుష కథనం అనేది రచయిత సర్వసాక్షి దృష్టికోణం.ఇందులో రచయితకు చిత్రించాల్సిన అంశాల గురించి వెసులుబాటు ఎక్కువ ఉంటుంది. "కథాంగాలైన కథావస్తువు, కథాంశం, పాత్రలూ మొదలైన అన్నింటిని గురించి కథ చెబుతున్న రచయితకు తెలుసు" (దక్షిణామూర్తి, 1988: 361). పై అభిప్రాయాలను బట్టి రచయితకు ఈ పద్ధతిని అనుకూలంగా ఉంటుంది. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు ఎక్కువగా ప్రథమ పురుష కథనంలోనే సాగాయి. 'ధిక్కారం', 'సవారీ-II', 'ఈ భూమి ఎవరిచ్చిన్రు?', 'పురుడు', 'ఇల్లు', 'బొగ్గుపొరల్లో...'మొదలైన కథలు ప్రథమ పురుష కథనంలో సాగుతాయి.

'సవారీ -II' అనే కథలో దొర బండికి ఎదురుగా ఎర్ర జండాలు పట్టుకొని వచ్చే జనాన్ని చూస్తూ రచయిత ఈవిధంగా కథనం చేస్తాడు. "అచ్చే జనాన్ని సూసుకుంట దొర అగ్గిమీద గుగ్గిలం అయితాండు. 'నీ తల్లి కాలం పెండ్లాం..' అని పెదుముల కొరికి వారు కట్టెతోని వలుపటి దాన్నో దాపటి దాన్నో దెబ్బ ఏసిండు. తోక మట్టలు వూపుకుంట వురుకుతానయ్ ఎద్దు.... ఒక్కొక్క పాట యింటాంటె దొరకు పెయినిండ కాట్లు పెట్టి కారం అద్దినట్టు అయితాంది. ఏ జేసేటట్టున్నది ఒకళాయిద్దరా ఎగిడిసినట్టు వెయిలకు వెయిల జనం వూళ్ళకు వూళ్ళు కదల్చినట్టు వుసికపోత్తె రాలకుంట"(రఘోత్తమరెడ్డి, 2006: 14)అని రచయిత ప్రథమ పురుష కథనం చేస్తాడు.

అలాగే 'ఒక్కటైతే' అనే కథలో మార్కెట్‌లో షావుకారుల, అడ్తీల చేతిలో మోసపోయి చిల్లి గవ్వ లేక నిట్టూర్చి పోయి చూస్తున్న రంగారెడ్డికి రైతు స్త్రీలా వచ్చి రచయిత చేసే కథనం ఈవిధంగా ఉంటుంది. "అమ్మవోతె అడివి-కొనవోతెకొరివి-ఈ కలీగం పాడువడ-మునిగిపోయేందుకే ఉన్నట్టున్నది. వానింట్ల పీనుగెల్ల గుత్తికాయకేఁవో కింటలు మూడువందలైతే, నూనె కిల పదారట! కాలుకదిలియ్యకుంట దోసుకోవట్టిరి-అడ్డులేదయె అయిపులేదాయె. అద్దన్నోడు దోసుకతిన్నట్టు, బీట్లె

వాని నోటికచ్చిందే పుణ్యం–దుకాండ్ల వాళ్ళ నోటికచ్చిందే పాపం" (రఘోత్తమరెడ్డి, 2006: 41). పైవాక్యాలలో దీనస్థితిలో ఉన్న రైతుల పరిస్థితిని, లోకం తీరును ప్రథమ పురుషలో వ్యాఖ్యానించాడు రచయిత.

### 4.3.3 సంభాషణాత్మక కథనం

సంభాషణాత్మక కథనాన్నే 'నాటకీయ దృష్టికోణం'గా పిలుస్తారు. కథలో పాత్రల సంభాషణల ద్వారా సాగే కథనాన్ని 'సంభాషణాత్మక కథనం' అంటారు. కథ అద్యంతం సంభాషణలు జరిగినా అంతర్గతంగా వస్తువు ఏకసూత్రతను పాటిస్తుంది. రెండు పాత్రలు గానీ, అంతకన్నా ఎక్కువ పాత్రలు గానీ సంభాషించుకుంటూ కథలోని సంఘటనల్ని వివరించటం వల్ల పాఠకుడికి దృశ్యరూపం కనులముందు ఆడిన అనుభూతి కలుగుతుంది."నాటకీయ దృష్టికోణంలో రచయిత చాలా విషయాన్ని పాఠకుని ఊహాశక్తికే వదిలేస్తాడు. దేన్ని వాచ్యం చెయ్యడు. ఈ శిల్ప రీతిలో ఎక్కువగా వర్ణనలుండవు. పాత్రలు యేం చేస్తున్నారో, యేం మాట్లాడుతున్నారో, రచయిత చూపిస్తూ వెళ్తాడు" (విజయ్ కుమార్, 2006: 89) అని నవీన్ అభిప్రాయాన్ని విజయ్‌కుమార్ తన సిద్ధాంత వ్యాసంలో తెలిపారు.రచయిత పాత్రల చేష్టలను, ప్రవర్తనను చిత్రించాక పాఠకులు వాటిననుసరించి ఆ కథను, కథాంశాన్ని అవగతం చేసుకోవాల్సి ఉంటుంది. దీని వల్ల పాత్రల అంతర్ సంఘర్షణకీ, బాహ్య ప్రవర్తనకి గల అంతర్యం తెలిసి పాత్రచిత్రణలో రచయిత చూపిన శిల్ప నైపుణ్యం వెల్లడవుతుంది.

ఈ పద్ధతిలో కథంతా సంభాషణలతో సాగుతుంది లేదా సందర్భానుసారంగా సంభాషణలు సాగుతాయి. మొత్తానికి ఎక్కువ భాగం సంభాషణలతో కథనం సాగుతుంది. పాఠకుడు కథల్లోని పాత్రల సంభాషణల ద్వారానే కథను అర్థం చేసుకొనే అవకాశం కలుగుతుంది. అంతేగాకుండా సంభాషణాత్మక కథనం ద్వారా పాత్రల స్వరూపాన్ని, వ్యక్తిత్వాన్ని తెలుసుకొనే అవకాశం ఉంటుంది. పాత్రలు పాఠకుడి మదిలో నిలిచిపోవడానికి అవకాశం ఉంటుంది.

ప్రతి కథలో పాత్రల సంభాషణలు సందర్భానుసరించి ఉంటూనే ఉంటాయి. ఏ కథలోనైతే పాత్రల సంభాషణకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సంభాషణల ద్వారానే కథనం ఎక్కువగా సాగుతుందో ఆ కథలో సంభాషణాత్మక కథనం ఉన్నట్లు భావించాలి. తుమ్మేటి కథల విషయానికస్తే ప్రతి కథలో పాత్రల సంవాదం జరుగుతుంది. కాబట్టి ఆయా కథల్లోని సంఘటన చిత్రించే సమయంలో పాత్రల చేత మాట్లాడించి రచయిత వ్యక్తపరుచాలనుకున్న విషయాన్ని సంభాషణల ద్వారా పాఠకుడికి అందిస్తాడు. 'ధిక్కారం'కథ మొదలు నేను పరిశోధనకు తీసుకున్న 'శత్రువు' కథల వరకు (అందులోని 'ఓ మెరుపు మెరిసింది', 'వేటగాడి చూపులు', 'నా పాత స్నేహితుడు' కథలు మినహాయిస్తే) ప్రతి కథలోనూ సంభాషణలతో కథనం సాగింది. నామాలు లేనివి, చిన్న చితక పాత్రలు కూడా కథా అవసరాన్ని బట్టిసంభాషిస్తాయి. ప్రధాన విషయాన్ని అతి ప్రధానంగా చూడటానికన్నట్లు రచయితనే సంభాషించడం జరుగుతుంది. "ఎక్కడెవడు లేక అక్క మొగుడు దిక్కైనట్టు– మా అసోంటోని కంటె గతిలేక అచ్చుడు కావట్టె, మరి నీకేం వైందయా? బంగారంవోలిగే ఎగుసం జేసుక బతుకక" (రఘోత్తమరెడ్డి, 2006: 62). అని నర్సయ్య పాత్రతో ఎల్లరెడ్డికి రచయితే చెప్పించినట్లు ప్రధాన విషయాన్ని స్ఫురించేలా వొత్తి మరి చెప్పిస్తాడు.

'పగలూ రేయీ శ్రమ పడుతున్నా'అనే కథలో కథాప్రారంభమే సంభాషణలతో మొదలవుతుంది. ఓదెమ్మ తన కొడుకు మల్లేశు పని పాటలు చేయక కాలాయాపన చేస్తున్నాడని తన అన్న సాయిలు పనిచేసే బొగ్గుగనిలోకి పంపిస్తాననుకొని సాయిలుకు చెపుతుంది. అప్పుడు దానికి బదులుగా సాయిలు బొగ్గుగని కార్మిక వ్యవస్థ గురించి, ఆ ప్రాంతంలో ఉన్న దౌర్భగ్యం గురించి ఈవిధంగా అంటాడు. "బాయి పనంటె మాటాల్గదె సెల్లె! లేటైతె లేటాయెగని–కసరెక్క ముదురాలె... ఈడి కంటె ఆడ కొద్దిగ పరుకుంటదనుకో! అదీ సంపాదన్లనే–దాని మందం కట్టం ఉంటదనుకో! ఇగాడ దొరల్దాతల తలదన్నే బాయిదొరలుంటరు–ఇసోంటోడు ఈదున్నా ఏదున్నా ఊకోడే. వాని తత్త్వంవే అంత!"(రఘోత్తమరెడ్డి, 2006: 42). పై వాక్యాలలో దొరలు పెట్టే బాధలైనా భరించగలం

కాని బొగ్గుగని ప్రాంతం అధికారుల ఆహంకారానికి, శ్రమ దోపిడి, పనిభారానికి తట్టుకోలేమని అనుభవపూర్వకంగా చెప్పిస్తాడు రచయిత.

బొగ్గుగని బావిలో పడే కష్టాల గురించి బాగా తెలిసిన రచయిత 'బొగ్గుపొరల్లో' కథలో ప్రధానంగా డిఫిల్లరింగ్ డిస్ట్రిక్ అనే పనిస్థలంలో పని చేయడం ప్రమాదకరంగా ఉందని, అందులో పనికెళ్ళే వారి పరిస్థితి విషమంగా ఉంటుందని తెలుస్తుంది. నైట్ షిఫ్టు పూర్తి చేసుకొని డిఫిల్లరింగు డిస్ట్రిక్ నుండి గని పైకి వస్తున్న కార్మికులను వారు పని చేసిన బావి పరిస్థితిని నర్సయ్య, లింగయ్య, మల్లయ్య, చంద్రయ్య మరికొందరు కార్మికులు అడిగి తెలుసుకుంటారు. వారి సంభాషణలు కింది విధంగా ఉంటాయి.

"కొంద చిలువ చప్పరించి, బయటకు నాలుకతో తోసినట్టు నైటు షిఫ్ట్ టింబర్‌మెన్, టెంపరరీ మజ్దూర్సు, వెనకాలె. డీఫిల్లరింగు సర్ధారు (సూపర్‌వైజరు) పైకి వచ్చిందు". వారి రాకను గమనించి బావిలోపలి ఉన్న గోఫ్(గని లోపలి పిల్లర్లు లేని స్థలం) పరిస్థితిని అడిగి తెలుసుకోవడానికి లింగయ్య, నర్సయ్య, ఎల్లరెడ్డి ఇలా అడుగుతారు.

"డిఫిల్లరింగు ఎట్లున్నది?" అని ఒకరంటె

"గోఫ్ కూలిందా లేదా?"అని మరొకరు

"మా షిఫ్ట్ మంచిగ నడుత్తదా?" అని వేరొకరు

ప్రశ్న మీద ప్రశ్న వేస్తుంటె నర్సయ్య కసురుకుంటూ

"నసరాదుర.... మీద పడ్డట్టు ఏందా అడుగుడు?" అని అక్కడే ఉన్న బాలన్న అనే కార్మికున్ని లోపలి గోఫ్ గురించి అడిగి తెలుసుకుంటాడు. అప్పుడు బాలయ్య ఈ విధంగా చెప్తాడు.

మూడ్రోజుల్నుంచి ఎట్లున్నదో గట్లనే వున్నది. ఒకటే సిటపట పైన మీద ఎక్కినో టాపు పట్టు వదిల్నట్టు 'గుప్కు.... గుప్కు...' మని ఒకటే సపుడు. పెద్దపులి నోట్లెకు పోయి అచ్చినట్టు బయం బయంగ లోపలికి ఓ తట్టెత్తుతరో లేదో, యాన్నో 'పటా పటా' నెటాల్లకు, పన్జేసేటోళ్ళు 'గెబగెబాని' ఒకటె వురికచ్చుడు నర్సన్నా నాకైతె బాంచెన్ పి.... లు వొయి కపాలం బట్టినయి తాపకోసారి" అని బాలయ్య

అనగానే అక్కడ కార్మికులందరికి గుబులు పుట్టింది. "జెర్రయితె మేం అందరం వొడిసెటోళ్ళమె లోపల కొంచెం కూలిసప్పుడు మా కొంకులు తొక్కినట్టె అచ్చింది"అంటూ మరో కార్మికుడు గోఫ్ గురించి అప్రయత్నంగా ముందుకు వచ్చి చెప్తాడు. (రఘోత్తమరెడ్డి, 2006: 66). ఈ కథని రచయిత అనుభవంలో చూసి చిత్రించిన విధంగా సహజంగా కనిపిస్తుంది. ఎంతో పాటి అనుభవం లేకపోతే ఇలాంటి సహజ సంభాషణలను చిత్రించడం రచయితకు సాధ్యం కాదనే విషయం తెలుస్తుంది. ఈ కథనే కాకుండా ఏ కథలోనైనా తుమ్మేటి వాస్తవికతతో దృశ్యరూపం దాల్చే విధంగా సంభాషణలను ఆపాదించాడనే చెప్పాలి.

### 4.3.4 ప్లాష్‌బ్యాక్ కథనం

కథను చెపుతున్న రచయిత కథలో సందర్భాన్ని బట్టి పూర్వం జరిగిన విషయాలను చెప్పవలసి వచ్చినపుడు వాటిని వివరిస్తాడు. గతాన్ని చెప్పాలని రచయిత నిశ్చయించుకుంటే గాని, గతంలోకి వెళితే కాని ప్రస్తుత కథకు సమన్వయం కుదరదన్న పరిస్థితిని ఏర్పడ్డపుడు గాని రచయిత తప్పనిసరిగా కథకున్న వెనుక భాగాన్ని స్మరించుకొని ప్రస్తుతం తాను వివరిస్తున్న కథకు అన్వయం చేస్తాడు. "గతంలో జరిగిన సంఘటనను ప్రస్తుతం నడుస్తున్న కథతో అన్వయించి ఆ సంఘటన మన కళ్ళ ముందు జరిగినట్లు కథను కొనసాగిస్తే ఇలాంటి కథనాన్ని 'ప్లాష్‌బ్యాక్ కథనం' అంటారు" (సుబ్బారావు, 2006: 89). ఆధునిక కథన పద్ధతుల్లో ప్లాష్‌బ్యాక్ కథనాన్ని విశేషామైన వైవిధ్యంతో కూడిన పద్ధతిగా చెప్పాలి. ప్లాష్‌బ్యాక్ అనే పదం అంగ్ల పదం (Flashback) గతాన్ని స్మరించి కథ కొనసాగించడం వల్ల పాఠకులకు తెలుసుకోవాలనే ఆసక్తినీ, కుతుహలాన్నీ ఈ పద్ధతి కలిగిస్తుంది. కొంత వరకు పాఠకుల ఆలోచనలను రేకెత్తించే తావును నిర్ణయిస్తుంది. కథలో గతాన్ని చెపుతున్నప్పుడు ఆనాటి పరిస్థితిని నెమరువేసుకొని ఎన్నో అంశాలను కథ మధ్యలోకి తీసుకురావడం జరుగుతుంది. ఈ పద్ధతిలో కథనం చెయ్యడానికి కథావస్తువుపై రచయితకు సర్వసమగ్రమైన అవగాహన ఉండాలి. పూర్వనుభవం కూడా కొంత అవసరం అవుతుంది. తుమ్మేటి రాసిన కథల్లో ప్లాష్‌బ్యాక్ సాగిన కథలు

‘ధిక్కారం’, ‘సవారీ–II’, ‘ఈ భూమి ఎవరిచ్చిను’, ‘ఓ మెరుపు మెరిసింది’, ‘శత్రువు’, ‘పగలూరేయీ శ్రమ పడుతున్నా’, ‘నా పాత స్నేహితుడు’ మొదలైన కథలలో ఫ్లాష్‌బ్యాక్ కథనం కనిపిస్తుంది.

‘ధిక్కారం’ కథలో దొరసాని ఇంటికి వెళ్ళిన రాయమల్లి దొరల ఇంటి తలుపులు, వాసాలు చూస్తూ అసలు నిజాన్ని మనసులో ఈవిధంగా అనుకుంటుంది. దొరల అక్రమ సంపాదన గుర్తు చేసుకుంటూ ఆ కాలం కనుమరుగైంది. నేడు దొరల పోకడలు చెల్లవని కథలో రాయమల్లి పాత్ర ద్వారా గతానికీ, వర్తమానానికీ ఉన్న తేడాను వ్యక్తం చేయిస్తాడు రచయిత. “వందల మంది కైకిలి లేక పన్జేశింద్రు– గిప్పుడైతెనా? ఎహే... ఒక పురుగ్గూడ పోకపోదురు– పెయినా సంగంపోళ్ళు ఊకోక పోదురు– బరాబరి కైకిలి తీసుకొని యాళ్ళ ప్రకారం పన్జేత్తరు. అంత ఎనుకటి కాలం, ఎర్రికాలం, ఎడ్డికాలం గనుక సెప్పినట్టు సాగింది. గుర్రాన్ని పట్టుకుని గాడిద అంటె, గాడిద అన్నరు, గుర్రంరా అంటె గదే బాంచెన్ అన్నరు–ఇప్పుడు కూడ మాలావు పోకడ పోవన్నని సూత్తరుగని గవన్ని గిప్పుడేం సాగుతయి– ఆ రోజులు ఎన్నడో పెయినయ్” (రఘోత్తమరెడ్డి, 2006:04). దొరల కాలాన్ని, దొరల కాలంలో సామాన్యుల జీవన పరిస్థితిని పై వాక్యాలు తెలుపుతున్నాయి. బానిస బతుకుల నుండి విముక్తి పొందే సమయం వచ్చిందని, దొరల ఆగడాలకు అడ్డుకట్ట వేసే కాలం వస్తుందని రచయిత రాయమల్లి పాత్ర ద్వారా వ్యక్తం చేశాడు.“ఓ మెరుపు మెరిసింది” కథలోని నర్సయ్య భార్య కనకమ్మ తన కొడుకును తుఫానులో పొలానికి పంపించినందుకు నిలదీసి అడుగుతుంది. ఆ సమయంలో నర్సయ్య తన పూర్వజీవితాన్ని నెమరువేసుకుంటాడు. ఎన్నో రాత్రులు కష్టపడితేగాని తనకు ఈ పాటి భూమి దక్కలేదని భార్యతో చెప్తాడు. కొడుకును నిరంతరం పనికి పంపడం తన పనికాదని పని చేసుకుంటే తప్ప మిగలని అస్తుల గూర్చి వాపోతాడు. “కడుపు గట్టుకొని కాలు చేయి విరుచుకుంటే గాని.... యీపాటి కొండ్ర దక్కలేదు. అసలు తన తాతల కాలంల ఎంతుండె భూమి! తండ్రి కెంతుండె భూమి? యివ్వాల, తన దాక వొచ్చేసరికి ఎంత్తుంది? దిన దినం దిగవారేగని ఎగువారున్నదా? కాలాన్ని చూసి మెదులాల్నా వద్దా?” (రఘోత్తమరెడ్డి, 2006:55) అంటూ రచయిత ఫ్లాష్‌బ్యాక్ కథనంలో నర్సయ్య

పూర్వం అస్తుల గురించి, నేటికున్న తరిగిన అస్తుల గురించి చెప్పి ప్రశ్నలతో ఆలోచింపజేస్తాడు.ఈవిధంగా పై రెండు కథల్లో ప్లాష్‌బ్యాక్ కథనం కనిపిస్తుంది.

### 4.3.5 చైతన్య స్రవంతి కథనం

పాత్రల అసాధారణ లేదా అసామాన్య మనస్తత్వాన్ని చిత్రించేందుకు రచయితలుచైతన్యస్రవంతి కథనం అనే ఓ కొత్త శిల్ప పద్ధతిని ఉపయోగించుకుంటున్నారు.వ్యక్తిసమాజంలోసామాజిక రుగ్మతలను భరించలేనప్పుడు సామాన్యుడి కంటే విలక్షణమైన మనస్తత్వం కలిగి ఉంటాడు. ఇటువంటి మనస్తత్వాలు ఆకాలంనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిణామాల ప్రభావాన్ని తెలుపుతాయి. మనిషి మనస్సులోని భావాలకూ, బాహ్యప్రవర్తనకూ మధ్య కొన్ని అంశాలు తీవ్ర మథనానికి గురై అప్రయత్నంగానే ఉద్రిక్తమైన భావాల సరళిని వ్యక్తం చేస్తుంటాడు. చేతన, అచేతన, సుప్తచేతన అనే మూడు రకాల్లో సుప్తచేతనంలోని భావాలు తీవ్ర సంఘర్షణకు లోనై ఉంటాయి. వీటిని కథలో రచయిత పాత్రల ప్రవర్తన ద్వారా వ్యక్తపరుస్తాడు.“హెన్రీ జేమ్స్ అనే రచయిత ‘stream of consciousness’ అనే మాటను తొలుత వాడాడు. దీన్నే శ్రీ శ్రీ చైతన్య స్రవంతి అన్నాడు. పత్రికా రచయిత అయిన రాంభట్ల కృష్ణమూర్తి దీనిని ‘ముక్తానుషంగం’ అన్నారు. ధారా వాహిక జ్ఞానప్రవాహం అనేది ‘stream of consciousness’ తో చక్కగా సంవదిస్తున్నది అని సినారె గారు చెప్పినట్లు వై. రామకృష్ణారావు తన ఎం. ఫిల్ సిద్ధాంత గ్రంథంలో తెలిపారు” (లక్ష్మణరావు, 2013: 28).

చైతన్య స్రవంతి శిల్పానికి నిర్వచనాలు తెలుసుకుందాం. ముందుగా బుచ్చిబాబు గారిచ్చిన నిర్వచనాన్ని చూస్తే “క్షణికమైన ఒక అనుభవాన్ని మొత్తం జీవితానుభవంతో ముడిపెట్టి ఈ రెండింటి తారతమ్యాలకు విభజన లేకుండా ఉన్నది ఉన్నట్లుగా చిత్రించడమే చైతన్య స్రవంతి” అని తెలిపారు. నవీన్ గారు ఇచ్చిన నిర్వచనం ప్రకారం “మనిషికి మన ప్రపంచంలో చెలరేగే విభిన్నమైన, విరుద్ధమైన భావాలను సాధ్యమైనంత యధార్థ రూపంగా అక్షరరూపం ఇవ్వడమే చైతన్యస్రవంతి రచనా విధానమని తెలుస్తున్నది” (లక్ష్మణరావు, 2013: 28).చైతన్యస్రవంతి శిల్పం మాత్రమే అనుకోకూడదని కొత్త

వస్తువును అందించినది అని నవీన్ మాటలను ఉటంకించిన విజయ్‌కుమార్ సిద్ధాంతవ్యాసంలో నుంచీ… “చైతన్య స్రవంతి అన్నది కేవలం ఒక నూతన శిల్పం మాత్రమే కాదు. అంటే ఒక విషయాన్ని చెప్పే పద్ధతిలో కనుగొన్న మార్పు మాత్రమే కాదు. ఈ ధోరణి మనకొక కొత్త వస్తువును కూడా ప్రవేశపెట్టింది. అదే మానవుడి చేతన, అచేతనను కథాకేంద్రంగా తీసుకోవడం అనేక పద్ధతుల ద్వారా ఈ చేతన పోందే వివిధ గతుల్ని చిత్రించడం చైతన్య స్రవంతి సాహిత్యంలో జరుగుతుంది”(విజయ్‌కుమార్, 2006: 60).ఈ విధంగా రెండు విధాలుగా చైతన్యస్రవంతి సాహిత్యంలో కొత్తకోణంలో ప్రవేశించిందని తెలుస్తుంది.

తుమ్మేటి రాసిన కథల్లో చైతన్య స్రవంతి కథలు తక్కువే కనిపిస్తాయి. ఎందుకంటే రఘోత్తమరెడ్డి రాసే కాలానికి చైతన్యస్రవంతి అనే కథన పద్ధతిని ఎక్కువ మంది రచయితలు వాడకపోవడమో, దానికి ప్రాచుర్యం లేకపోవడమో అయి ఉంటుంది. ‘శత్రువు’ అనే కథలో సుగుణ భర్త లింగయ్య బొగ్గు తట్ట నెత్తిమీద మోసి మోసి అలసిపోయే శరీరం అంతా నొప్పి లేసేలా శ్రమించి ఇంటికి చేరుకుంటాడు. ఇంట్లో తన కోసం ఎదురుచూస్తున్న భార్యతో ఏమి మాట్లాడలేనంతా పని భారంతో అలసిపోయి నిద్రపోతాడు. ఆ సమయంలో అప్పటిదాకా తన కోసం వేచిచూసిన సుగుణకు నిద్రరాదు. ఆ వయస్సులో తీరాల్సిన కోరిక ఒకవైపు, భర్త గ్రామీణ వ్యవసాయజీవితంలో ఉన్నంత ప్రేమగా, ఆప్యాయంగా చూసుకోవడంలేదనే చింత మరోవైపు గుమిగూడి తీవ్రమైన ఆలోచనలతో నిద్రరాక ఇంటి బయటకి వచ్చి కూర్చుంటుంది. నిద్రలోకి జారుకున్న లింగయ్యకు మెలకువ వచ్చే సరికి మంచం మీద సుగుణ లేదు. ఈ రాత్రి సమయంలో తన భార్య ఎటువెళుతుందోనని ఇన్నాళ్లుగా ఉన్న అనుమానబీజాలుమొలకెత్తి బయటికి వచ్చి అరుగు మీద కూర్చున్న సుగుణను అడుగుతాడు. సుగుణ ఎంతకీ సమాధానం చెప్పకపోయే సరికి “బాంచోత్! గీ రాత్రి ఎందుకు ఇవుతల కూసున్నవంటే సప్పుడు జెయ్యవ్”(రఘోత్తమరెడ్డి, 2006: 273) అని అంటాడు. అయినా సుగుణ వైపు నుండి సమాధానం రాదు. ఇదేదో వ్యవహారం చేయి దాటి పోయినట్టు సుగుణను ఇష్టం వచ్చినట్లు కొడతాడు. “దరిద్రపు ముండ ఇవుతల ఎందుకు కుసున్నావంటెసప్పుడు జెయ్యవ్” (రఘోత్తమరెడ్డి, 2006: 273) అంటూ

మరింత బాదుతాడు. తనకేమి సంబంధం లేని విషయంలో సుగుణ దెబ్బలకు బలైపోతుంది. లింగయ్య గనిలో రెండు షిఫ్టులు చేసి అలసిపోయి వచ్చి తనను ఎవరో హింసిస్తున్నట్లు చిరాకుగురైతాడు. లింగయ్య చుట్టూ ఉన్న సామాజిక రుగ్మతలకు, తన శారీరక శ్రమను ఎవరో లాక్కెళుతున్నట్లు ఫీలై అభంశుభం తెలియని సుగుణపై చేయిచేసుకుంటాడు. లింగయ్య చేసిన పని తాను కావాలని చేయడానికి అకాశం లేదు. పరిస్థితుల ప్రభావం, సక్రమంగా లేని తన మానసిక ఆలోచనలే తన దుష్ప్రవర్తనకుదారితీసాయి."తన సకల కష్టాలకు కారణం సుగుణేనని భావిస్తూ తీవ్రంగా ద్వేషిస్తున్నడు లింగయ్య. అన్యాయంగా తనను దెబ్బల పాలు జేస్తున్నందుకు ఎంతో అసహ్యించుకోంటోంది" (రఘోత్తమరెడ్డి, 2006: 273). సుగుణపై ఎంతో ప్రేమ ఉన్న లింగయ్య తన సుప్తచేతనంలోని భావాల కారణంగా, సుగుణపై అకారణంగా చేయి చేసుకుంటాడు. బాహ్య ప్రవర్తనకు, అంతర్ ఆలోచనకు కుదురనపుడు మనిషిలో కలిగే వింత ప్రవర్తననే లింగయ్యను చైతన్య స్రవంతిలోకి వెళ్ళేలా చేసింది. వారిద్దరికి తెలియని శత్రువు వెంటాడుతూ వారిని హింసించడం ఇందులోని శిల్ప రహస్యం. లింగయ్య పాత్ర చేష్టల ద్వారా, రచయిత వ్యాఖ్యానం వల్ల కథ కొంత చైతన్యస్రవంతి కథనంలో సాగింది.

### 4.3.6 వాస్తవిక కథనం

మానవ జీవితంలోఉన్న సంఘటనల్నేవాస్తవిక దృక్కోణంతో పరిశీలించి కళాత్మకంగా సాహిత్యంలో కథలుగా రాస్తారు. సామాజిక జీవితంలో అనేక సంఘర్షణలకు లోనవుతున్న మానవ సమాజాన్ని ఉన్నది ఉన్నట్లుగా సాహిత్యంలో ప్రతిఫలించడానికి కథాప్రక్రియ సమర్థవంతమైనది. నేటి కథలు వాస్తవ జీవితాలను ఆధారంగా చేసుకొని వాస్తవిక కథనంతో వస్తున్నాయి. వీటి వల్ల రచయితలకున్న సామాజికబాధ్యత, సామాజికస్పృహ, వ్యక్తిగతచైతన్యం తెలుస్తాయి. వెంకటసుబ్బయ్య గారు కథాశిల్పంలో వాస్తవిక కథనానికి ఇచ్చిన నిర్వచనం. "కథలోని జీవితానికి ప్రాతినిధ్యం వహించగల పాత్రలని అదే జీవితానికి ప్రాతినిధ్యం వహించగలిగిన సంఘటనల్లో పెట్టి వాటి అంతరంగ, బహిరంగ జీవితాలనూ వాటి మధ్య ఉన్నసంబంధాన్నీ లేదా వైరుధ్యాన్నీ చిత్రించటమే

వాస్తవిక కథనం"అంటారు. (వెంకటసుబ్బయ్య, 1995: 54). ఆయన మరోచోట"పాత్ర మానసిక జీవితానికీ, భౌతిక జీవితానికీ మధ్య ఉన్న సంబంధాన్నీ లేదా వైరుధ్యాన్నీ చిత్రించుటమే నిజమైన వాస్తవికతా వాదం"(వెంకటసుబ్బయ్య, 1995: 54)అనిఅన్నారు. ఈ విధంగా మానవ జీవితాల్లోని బాహ్య, అంతరంగ సంఘర్షణను వాస్తవికంగా కథలో రాయడమే వాస్తవిక కథనం.వాస్తవిక కథనం గురించి బి. వి. ఎస్. స్వామి గారి అభిప్రాయం "కథాసాహిత్యంలో మానవుని భౌతిక జీవితాన్ని, పక్షపాత దృష్టి లేకుండా ఉన్నది ఉన్నట్లుగా చిత్రించాలన్న కోరికతో వాస్తవిక వాదం ప్రారంభమైంది. పాత్ర మానసిక జీవితానికి భౌతిక జీవితానికి మధ్య ఉన్న సంబంధాన్ని లేదా వైరుధ్యాన్ని చిత్రించటం కూడా వాస్తవికత వాదంలో భాగం" (స్వామి, 2013: 54).ఈవిధంగా వాస్తవిక కథనం ఒక శిల్ప పద్ధతే కాకుండా మానవ జీవితాన్ని ప్రతిబింబించేఅంశంగా చెప్పాలి. వాస్తవిక దృష్టితో కథలు రాయడానికి రచయితకు సునిశిత పరిశీలన దృష్టి, చిత్తవృత్తి అనేవి ఉండాలి. అప్పుడే సమాజ వైరుధ్యాలను కథల్లో వాస్తవికంగా ఎక్కించగలరు.

వాస్తవిక జీవితాన్ని, సంఘటనల్ని కథలుగా మలిచిన వారిలో తుమ్మేటి రఘోత్తమరెడ్డి ఒకరు. రచయిత తానెదిగే క్రమంలో మొదట రైతు జీవిత కథలు, తరువాత బొగ్గుగని కార్మిక కథలు, మానవీయ సంబంధాల కథలు రాశారు. 'పగలూరేయీ శ్రమపడతున్నా', 'సవారీ –I', 'బొగ్గుపొరల్లో', 'నీళ్ళతగువు', 'నాపాత స్నేహితుడు', 'వాల్‌పోస్టర్' మొదలైన కథలు వాస్తవిక కథనంలో సాగాయి. పై వాటిలో పూర్తిగా వాస్తవిక కథనంలో సాగిన కథలు 'నా పాత స్నేహితుడు', 'పగలూ రేయీ శ్రమ పడుతున్నా' మొదలైనవి. 'నా పాత స్నేహితుడు' కథలో రచయిత కథకుడిగా ఉండి తన పూర్వ జీవితంలోని మిత్రవియోగాన్ని వివరిస్తారు. 'నిరంజన్' అనే మిత్రునితోతనకు ఉన్న గాఢ సంబంధాన్ని తెలుపుతూ కాలక్రమంలో, భిన్న పరిస్థితుల్లో మారిన మిత్రుల భావజాల దృక్పథాన్ని తెలిపారు. నిరంజన్ అనే మిత్రునితో ఏర్పడ్డ వైరుధ్యాన్ని స్మరిస్తూ తన రెండేళ్ల గత జీవిత సంఘర్షణను, జీవిత పరిణామాన్ని తెలియజేస్తాడు కథకుడు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, పచ్చని పొలాల మధ్య పెరిగి,  వ్యవసాయం మీద ఉన్న ఆసక్తితో చదువును నిర్లక్ష్యం చేసి, కాలం నిర్ణయించిన పరిస్థితుల్లో

ఆర్థిక లోపాన్ని పూరించడానికి వలస మార్గాన్ని పట్టి, అక్కడ ఎదుర్కొన్న సమస్త కష్టాలను వివరిస్తుంది ఈ కథ. ఈ సంఘర్షణ క్రమంలో భిన్నంగా ఎదిగిన నిరంజన్ మిత్రుడికి కష్టం కలగడంతో పరామర్శించడానికి వెళ్ళాడు. స్నేహభావంతో వెళ్ళిన కథకుడితో“నీది నీకే మంచి–నాది నాకే మంచి”(రఘోత్తమరెడ్డి, 2006: 253) అని శాశ్వత వియోగ వరమే లభిస్తుంది. వారి వియోగ సంఘర్షణను ఈ విధంగా కథనం చేస్తాడు రచయిత. “ఏమి తెలియని అమాయకపు కాలంలో ఇద్దరం ఒకటే అనుకున్నాం. కాని, నిజానికి బతుకులోకి వచ్చేసరికి, ఆలోచనలోకి వచ్చే సరికి ఇద్దరి మధ్య ఎంత అఖాతం. ఇంత కాలానికి గాని ఒకరి మంచి కాకుండా పోయింది” (రఘోత్తమరెడ్డి, 2006: 253). ‘నా పాత స్నేహితుడు’ కథలో ఇద్దరి స్నేహితుల సంఘర్షణకువాస్తవిక దృశ్యరూపాన్ని ఇచ్చాడు రచయిత.

‘పగలూ రేయీ శ్రమపడుతున్నా’ అనే కథలో పారిశ్రామీకీకరణ, ప్రపంచీకరణ, ప్రభుత్వ ఆర్థిక విధానాల వల్ల కుప్పకూలిపోయిన రైతుల, భూస్వాముల జీవితసంఘర్షణను రచయిత స్వానుభవంలో నుంచి చూసి వాస్తవికంగా చిత్రించారు. ఈ కథలో రామిరెడ్డి దొర పడే సంఘర్షణ స్వంత ఊరులో చితికిపోయిన దొరలందరి జీవితాలను తెలియజేస్తుంది. 1960–80 నాటి తెలంగాణ రైతుల దు:స్థితినివివరించిన కథ ఇది. వ్యవసాయానికి తగిన పెట్టుబడులు లేక, పండిన పంటకు సరైన ధరలు రాక, మార్కెట్‌లో షావుకార్ల చేతిలో మోసపోతున్న రైతుల పరిస్థితులు తెలియజేసేలా చిత్రించారు రచయిత. “పాలేర్కు వెట్టక పసులోన్కి వెట్టక, బిచ్చగానికి వెట్టక అచ్చగానికి వెట్టక ఈ ఎగుసాయం జేసి నేనేం ఎనకేస్తున్ననో నీకెర్కలేదా? అవ్వ అయ్య పంచిచ్చిన భూంవి జాగల్నుంచి అయిదెకరాల్నిఅమ్మి అడివోర గండ్ల పెండ్లిజ్జేసినగని రెక్కల మీదెల్ల దియ్యకపోతిని! ఇద్దరు మొగపోరంగాడ్లయితే అయిదో పదో సదివి అగో నీ కొడుకోల్గె ఎద్దుముడ్డి పొడువ వట్టిరి! నిన్నుగానక వాళ్ళనేం పెద్ద సదుపుల్జదివిపిచ్చిన?” (రఘోత్తమరెడ్డి, 2006:46). పై వాక్యాల్ని రాంరెడ్డి దొర పాలేరు ఓదెమ్మతో అంటాడు. రాంరెడ్డి లాంటి రైతుల ఆర్థిక పరిస్థితి ఏవిధంగా ధ్వంసమయిందో రచయిత వివరించాడు.

## 4.4 సంఘటనాఘటనా శిల్పం

కథలో ఒక సంఘటన గాని, అనేక సంఘటనలు గాని చిత్రించగలరు. కాని ఒక కథ అన్నప్పుడు ప్రధానంగా జీవితంలో ఒక సంఘటనను మాత్రమే తీసుకొని రాయడం జరుగుతుంది. అది ప్రధానకథగా రూపొందుతుంది. అయితే ప్రధానకథకు ఉపకరిస్తూ కొన్ని సంఘటనలు సందర్భానుసారంగా చిత్రంచబడతాయి. ప్రధాన సంఘటనను సమర్థవంతంగా చిత్రించడానికి చిన్న చిన్న సంఘటనలు ఎంతో ప్రాధాన్యతను వహిస్తాయి. ఈ సంఘటనలకు మధ్య కార్యకారణ సంబంధాలతో కూడి ప్రధాన సంఘటన ప్రతిభావంతంగా చిత్రించబడే విధంగా ఉండాలి. "కథాశరీరంలో ఆకర్షణకు కేంద్రంగా భాసించేవి. బాహ్యాంతరస్థితులను ప్రభావితం చేసేది. వాటిలో మార్పు తెచ్చేది. కథాగమనాన్ని మలుపు తిప్పేది సంఘటన" (దక్షిణమూర్తి, 1998: 351). అని పోరంకి దక్షిణమూర్తి గారిచ్చిన నిర్వచనం. కథానిర్మాణంలో కథాగమనానికి కావల్సిన విధంగా కథాలక్ష్యాన్ని అందివ్వడానికన్నట్లు సంఘటనలు సరిగ్గా కుదరాలి. అలా కుదిరినప్పుడు పాఠకునికి కథాప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది. కొన్ని మలుపుతిప్పే సంఘటనల ద్వారా కథలోని పాత్రల సంఘర్షణ మొదలవుతుంది. దీని వల్ల పాఠకులు హేతుబద్ధంగా ఆలోచించే విధానాన్ని ఏర్పడి కథ ఆసాంతం రసవత్తంగా మారుతుంది. "కథ కాలక్రమంలో ఉన్న సంఘటనల వరసైతే కథాసంవిధానం కథ యొక్క పథకం కథలోని సంఘటనల మధ్య ఉన్న సంబంధాన్ని, కార్యకారణ సంబంధాన్ని సంవిధానం తెలియజేస్తుంది, ఏ సంఘటనకు ఏ సంఘటన కారణమో తెలియజేయడమే కథాసంవిధానం యొక్క ఉద్దేశ్యం లేదా ప్రయోజనం. సంవిధానం తర్క బద్ధంగా లేకపోతే కథాంశానికి అర్థస్ఫూర్తి ఉండదు"(వెంకటసుబ్బయ్య, 1995: 23). పైమాటల వల్ల కథానిర్మాణంలో ఎక్కడ అవాంతరమైన విషయాల కూర్పు ల్లేకుండా జరుగుతున్న సంఘటనలు ఒకదానితో ఒకటి నిరూపబద్ధంగా, కార్యకారణ సంబంధంతో పొదిగినప్పుడు ఆ కథన చాతుర్యం పాఠకుల్ని తొందరగా లొంగదీసుకుంటుందని చెప్పాలి. కథలో అనేక సంఘటనలున్నా ప్రధాన సంఘటన మాత్రమే కథలో ఏకసూత్రత ఉండి కథను నడిపిస్తుంది. ప్రధాన సంఘటన చుట్టూ అనేక ఉపసంఘటనలు ఉంటాయి.

ప్రధాన కథను విపులీకరించటానికి ఈ సంఘటనలు ఉపయోగపడతాయి. అప్రధాన సంఘటనలు ఒకదానితో ఒకటి అన్వయం పొందినప్పుడు కథాక్రమం అనేది సరిగ్గా పాఠకుడుని చేరి అందించాల్సిన విషయాన్ని ప్రస్ఫుటమయ్యేలా చేస్తుంది.

తుమ్మేటి రాసిన కథల్లో సంఘటనాఘటనా శిల్పం కనిపించే కథలు 'ధిక్కారం', 'సవారీ', 'పగలూరేయీ శ్రమపడుతున్నా', 'ఇల్లు', 'వాల్‌పోస్టర్', 'పట్టు' మొదలైనవి. ఇందులో 'పట్టు'కథలో అనే కథలో గోపయ్య అనే వ్యక్తి చుట్టు ప్రక్కల ఉన్న వారి వ్యవహారంలో తలదూర్చుతున్నాడనీ,తనతో గొడవపడి దుకాణం నుండి ఇంటికి రావడంలేదని కొమురమ్మ తన అన్న పోశెట్టితో చెపుతుంది. పోశెట్టి తన బావను మందలించి చెల్లెల సంసారాన్ని చక్కబరచడానికి గోపయ్యను కలసి మాట్లాడుతాడు. దుకాణం మార్పిడి పని వల్ల అనేక చిక్కులతో ఉన్న గోపయ్యకు తన చెల్లెల బాధను గురించి విన్నవించుకుంటాడు. పై రెండు సంఘటనలకు దగ్గర సంబంధం ఉన్న మరో సంఘటన కలిసి ఈ కథను, కథాంశాన్ని మనకు ప్రస్ఫుటంగా అర్థమయ్యేలా చేస్తుంది. ఆ మరో సంఘటన రాజవ్వ కుటుంబవ్యవహారంలో ఉన్న కూతురు–అల్లుడు చిక్కులను తెంచుతూ గోపయ్య, పోశెట్టిల ఆలోచనలో మార్పు కలిగిస్తుంది. గోపయ్య ఇంటికెదురుగా ఉన్న రాజవ్వ కూతురు జీవితంపై బాధపడుతూ వారిని పోషించగల సామర్థ్యం తనదేనని ధైర్యంగా గోపయ్యకు చెప్పిన మాటలు.... "ఎవళ పిల్ల వాళ్ళింటికి పోనియె రాజక్క నీకు ఉన్న బాధలు సాలయా?"అని గోపయ్య అనగానే.."ఏంది తమ్మి–బాధలున్నయని–కన్నోల్లను బాయిల దొబ్బుతమా? ఇగో నారెక్కలు సల్లగుండాలెగని–గీసోంటినాలె ముచ్చోళ్ళను పదిమందిని సాదుకత్త" (రఘోత్తమరెడ్డి, 2006: 197) అని అంటుంది. రచయిత ఈ మూడు సంఘటనలను పోశెట్టి–చెల్లె కొమురమ్మకష్టాలను, గోపయ్య–పోశెట్టిల సంభాషణలను,రాజవ్వ– పోశెట్టి, గోపయ్య, కొమురమ్మల సంభాషణలు ఒకదానితో ఒకటి అన్వయంచెంది అసలైన కథావిషయాన్ని, కథాత్మను పట్టిస్తాయి. రెండు సంవత్సరాలుగా తన కూతురిని తీసుకపోని అల్లుడిని ఉద్దేశించి అన్న మాటలు గొడవపడి దూరమైతున్న పొశెట్టి, గోపయ్య–

కొమురమ్మలకు బుద్ధి చెప్పి వారి దృక్పథాలను మార్చేసే పనిచేస్తాయి. అలా రాజవ్వ పాత్రను, సంఘటనను ప్రవేశపెట్టి రచయిత ఈ కథను అమాంతం ఉన్నత స్థాయికి తీసుకెళ్ళారు.

## 4.5 సంఘర్షణోత్పాదక శిల్పం

రెండు పరస్పర విరుద్ధశక్తుల మధ్య రాపిడినే 'సంఘర్షణ' అంటాం. కథలోని సంఘర్షణ పాత్రల మధ్యగానీ, సంఘటనల మధ్యగానీ జరుగుతుంది. రచయిత సంఘర్షణను చిత్రించడానికి విరుద్ధాంశాల జోలికిపోవాల్సి ఉంటుంది. మానవ జీవిత సంఘర్షణను కథల్లో వాస్తవికంగా చిత్రంచడానికి సంఘర్షణోత్పాదక శిల్పం ఎంతో దోహదపడుతుంది. ఇది రచయిత జీవితానుభవంపై ఆధారపడి ఉంటుంది. "ఇద్దరు వ్యక్తుల మధ్య, ఒకే వ్యక్తిలో రెండు భావాల మధ్య, రెండు వర్గాల మధ్య, సిద్ధాంతాల మధ్య, రెండు జీవిత దృక్పథాల మధ్య ఇలా ఎన్నిటి మధ్యగానైనా ఉండవచ్చు ఈ రెండింటిలో ఒకటి సంభవమనీ, మరొకటి కష్టమనీ చెప్పటానికి వీల్లేదు. రచయిత తన కథలో ఎన్నుకునే సంఘర్షణ అతని అభిరుచిని బట్టి జీవితానుభవాన్ని బట్టి ఉంటుంది"(వెంకటసుబ్బయ్య, 1995: 15). రచయిత అనుభవించిన జీవితంలో సంఘటనను చిత్రించే సమయంలోనే ఆ సంఘటన అలా జరగటానికి వెనుక ఉన్న కారణాలను అన్వేషిస్తాడు. అతని అన్వేషణమార్గంలో సంఘర్షణ ఎక్కడ స్ఫుటంగా ఉందో గ్రహించి దాన్ని కథలో చిత్రిస్తాడు. ఆ సంఘటన కార్యకారణ సంబంధంలో, హేతుపూర్వకంగా ఉండే విధంగా ఉండాలి. అప్పుడే పాఠకుడుకి కథపై వాస్తవికత దృక్పథాన్ని ఏర్పరచుకుంటాడు. "పాత్రల మనస్సులోగాని, బయటకాని పాత్రకూ ప్రకృతిశక్తికీ మధ్యగాని సంఘర్షణను సార్థకంగా ఉత్పాదన చెయ్యడమన్నది ఒక శిల్పం. దీనికి తోడ్పడేవి సంఘటనలు కావచ్చు. పాత్రల ఆలోచనలు కావచ్చు" (దక్షిణామూర్తి, 1988: 407).మానవుడు సంఘజీవి. కాబట్టి సాంఘికవ్యవస్థలోని సమస్యల వల్ల, సామాజిక రుగ్మత వల్ల మనిషి నిరంతరం సంఘర్షణకు గురవుతూనే ఉంటాడు. ఏ మనిషి జీవిత సంఘర్షణనైనా కథలో చిత్రిస్తున్నప్పుడు వాటి స్వభావాలను, స్వరూపాలను సూచిస్తున్నట్లు తెలుపడం

మంచిది. ఎందుకంటే, పాఠకుల్లో సమస్య పూర్వ, పరాల గురించి ఆలోచించే తత్త్వం పెరుగుతుంది. పాఠకుడు చైతన్యవంతుడై సంఘర్షణ మూలలను అన్వేషించే ప్రయత్నం చేస్తాడు.

తుమ్మేటి రాసిన కథలో ప్రతి కథలో ఏదో రూపంలో పాత్రలు సంఘర్షణకు గురైన కథలే ఉన్నాయి. ప్రధానంగా 'పగలూ రేయీ శ్రమ పడుతున్నా' కథలో కుప్పకూలిపోయే భూస్వాములల్లో తానేమీ సంపాందించుకోలేదని పాలేరుకు విన్నవించుకున్న సందర్భంలో రాంరెడ్డిపాత్ర పడే సంఘర్షణ;'శత్రువు' కథలోకనిపించని శతువేదో తనని వెంటాడి హింసించినట్లు బొగ్గుగనిలో పనిచేసే లింగయ్య, సుగుణతో పడే సంఘర్షణ; 'వాల్‌పోస్టర్' కథలోబొగ్గుగని అధికారులకు, గని కార్మికులకు మధ్య జరిగే భిన్నభావజాలాల ఘర్షణమొదలైనవి కనిపిస్తాయి. 'వేటగాడి చూపులు' అనే కథలోరచయిత సమీర పాత్ర మానసిక సంఘర్షణ ద్వారా తరాల తరాలుగా అణచివేయబడుతున్న స్త్రీ మనోవేదనను, మౌనరోదనను చిత్రించారు. పెళ్ళి అయిన తరువాత సాగనంపే సమయంలో సంప్రదాయాల ఉచ్చులో చిక్కుకొని అత్తగారింటికి పయనమవుతున్న స్త్రీల ఆంతరంగిక బాధను ఇలా వ్యక్తం చేశాడు. "తమను సాగనంపిన రోజున తమ తమ తల్లులు ఇలాగే గుండెలు చెరువులు చేసుకుని ఏడ్చారు. తమ తల్లుల్ని సాగనంపేటప్పుడు తమ అమ్మమ్మలు అలాగే.... అది పరంపరానుగతంగ వస్తున్న విషయం తీరుగానే! గుండెల్ని పిండి చేసే రోదనల మధ్య, అపరిచయస్తుల వెంట పంపబడ్డారు. నేడు తమ బిడ్డలు అలాగేపోతున్నారు. రేపువాళ్ల బిడ్డలూ, బిడ్డల బిడ్డలూ ఇలాగే క్రమం తప్పకుండా శోకంతో కన్నవాళ్లనీ, తోబుట్టువులనీ, వదిలి అత్తవారింటికి చేరాలి. ఇంతకు మినహా వేరేమీ లేదని వాళ్లు అనుకుంటున్నరు. ఎంత బాధకరమైంది అనుకుంది సమీర" (రఘోత్తమరెడ్డి, 2006: 260).

## 4.6 సన్నివేశకల్పనా శిల్పం

కథేతివృత్తంలో పాత్రలకుతగ్గట్టు సన్నివేశాలను తీర్చిదిద్దాలి. పాత్రల మనస్తత్వానికి అనుకూలంగా ఉండే విధంగా కథానిర్మాణంలో సన్నివేశాలు ఉండాలి.కథను చదివే పాఠకుడికికథ తన చుట్టూ జరుగుతున్నట్లు అనుభూతి కలిగించే విధంగా సన్నివేశాల కల్పన జరగాలి. "కథలో జరిగే

వాటికి అనుగుణమైన పరిసరాలను, నేపథ్యాలను వాతవరణ పరిస్థితులను అత్యంత సహజంగా చిత్రించడమన్నది సన్నివేశకల్పనా శిల్పం” (దక్షిణామూర్తి, 1988: 407). కథాంశం, కథావస్తువు, పాత్రలు, సంఘటలు, వర్ణనలు ఇలా అన్ని సన్నివేశానికి తగ్గట్టుగా చిత్రించినప్పుడే ఆ కథ పాఠకుడికి అందించాల్సిన విషయాలను అందజేస్తుంది. అంతేగాని, అసాధ్యమన్నంత కల్పనతో పక్క తోవ పట్టేలాగా సన్నివేశాలను కల్పించకూడదు. సన్నివేశకల్పన అనేది సహజంగా, నాటకీయంగా ఉండాలి. పాఠకుడి దృష్టిని అధిగమించేలా ఉండకూడదని చెప్పాలి. ఒక కథలో ఎన్ని సన్నివేశాలున్నా ముఖ్య సంఘటన వద్దకు వచ్చి చేరతాయి.

తుమ్మేటి రాసిన కథల్లో సన్నివేశాలు ‘సవారీ-I & II’, ‘ఈ భూమి ఎవరిచ్చిన్రు’ లాంటి కథల్లో ప్రకృతి రమణీయతతో;‘బొగ్గుపొరల్లో’, ‘పురుడు’, ‘పట్టు’, ‘వాల్‌పోస్టర్’, ‘శత్రువు’ లాంటి కథల్లో బొగ్గుగని ప్రాంత వాతవరణంలో, పరిసరాల్లో, గని మురికి వాడల్లో, గని పనిస్థలాలు,కాలనీలు మొదలైన వాటి మధ్య సన్నివేశాలను రూపొందించారు రచయిత.‘బొగ్గుపొరల్లో’ కథలో గనికార్మికుల పనిపరిస్థితిని తెలియజేసేలా సన్నివేశవర్ణన ఉంటుంది. “అలవాటు ప్రకారం.. ఒకటో నంబర్ బొగ్గురాయి మీద రాక్షసి గొంతుతో సైరన్ కూసింది. ఓ కార్మికులారా? తొందరగా రండి తొందర తొందరగా రండి.. మీ శరీరాల నుంచి కొంచెం మాంసం మరికొంచెం నెత్తురు ఈరోజుకు సరిపడా నేను చప్పరించాలి” (రఘోత్తమరెడ్డి, 2006: 58). అంటూ భయంకరమైన పనిస్థలాన్ని రచయిత వర్ణించి ఆ గనుల్లో వాళ్ళ పనిపరిస్థితులు ఎలా ఉంటాయో అర్థం చేసుకొనే విధంగా రచించారు.

## 4.7 వర్ణనాశిల్పం

సంఘటనను తీసుకొని కథగా రాసే క్రమంలో ఆ సంఘటన చుట్టూ పరిసర ప్రాంతాలను రచయిత వర్ణిస్తాడు. దీని వల్ల పాఠకుడికి కథంతా తన ముందే జరుగుతున్నట్లు ఊహించుకుంటాడు. వర్ణనలు చేయడం ఎందుకనుకుంటే కథావస్తువును పాఠకుడికి హృద్యంగా చేరవేయడంలోనూ, రచయిత స్థానాన్ని నిర్ణయించటంలోనూ ఉపయోగపడతాయి. రచయిత వర్ణనలు ఎంత బాగా చేస్తే

అంత బాగా కథ పాఠకుని మనస్సుని హత్తుకుని కథ పట్ల చెరగని ముద్రను వేస్తాయి. సాహిత్యంలో వర్ణన అనేది అనాది నుండి వస్తున్న సంప్రదాయం. కావ్యంలో వర్ణనకు, కథలో వర్ణనకు తేడా ఉంది. కావ్యాలలో వర్ణనలు మీతిమిరినా ఆ కావ్యానికి ఏ లోటు ఉండదు. కాని కథలో మాత్రం సందర్భాన్ని బట్టి వర్ణనలు చేయడం ప్రధానం. ఔచిత్యవంతంగా చేసే వర్ణనలు కథకు బలాన్నీ, పుష్టినీ చేకూరుస్తాయి. కథలో చిత్రించే వర్ణనలకు పరిమితి ఉండి, అవి అందించే విషయాన్ని వాచ్యంగా, వ్యంగ్యంగా తెలుపుతాయి. పాఠకుడు ఆ విషయాల్ని పట్టుకోవాల్సి ఉంటుంది.

"ఉద్ధిష్ట విషయాన్ని కాని, వ్యక్తుల ఆకార వికారాలను గాని, మానసిక స్థితిని కాని, జరిగే సంఘటనను కాని, ఏర్పడే సన్నివేశాన్ని కాని, కనబడే దృశ్యాన్ని కాని ఇంద్రియ గోచరమయ్యే విధంగా చిత్రించడం వర్ణన" (దక్షిణమూర్తి, 1988: 337). అంటే రచయిత వర్ణించిన విషయాలు పాఠకుడికి ఆ కథపై కలిగే భావానికి దగ్గర ఉండాలి. పాఠకుడి కళ్ళముందు దృశ్యం కదలుతున్నట్లు అనిపించాలి. అనవసరమైన వర్ణనలు చేసి పాఠకుడికి గందరగోళం పుట్టించేలా మాత్రం ఉండకూడదు. విసుగు పుట్టించకుండా అవసరమైనచోట మాత్రం వర్ణనలు చేయడం మంచిది.

తుమ్మేటి రాసిన కథల్లో వర్ణనలు– బొగ్గుగని కార్మికుల బాధలను, పల్లెల వాతవరణాన్ని, రక్తం తాగుతున్న రాక్షసి బొగ్గుగని పరిసరాల వర్ణనలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆ వర్ణనలను కొన్ని భాగాలుగా విభజించి పరిశీలించి చూసినట్లయితేకింది విధంగా కనిపిస్తాయి.

### 4.7.1 ప్రకృతి వర్ణన

సాహిత్యంలో ప్రకృతి వర్ణనలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. ప్రకృతి మనిషి పుట్టుక నుండి చావు వరకు ఒక భాగంగా ఉంటూనే ఉంది. ప్రకృతి వర్ణనలు సందర్భోచితంగా వర్ణించటం వల్ల

కథకు, కథలోని విషయానికి ఒక ప్రత్యేకత ఏర్పడుతుంది. కథలో చెపుతున్న ప్రకృతి వర్ణనలు ఆ కథను చిరకాల స్వప్నంలా పాఠకుడికి మదిలో నిలుపుతాయి.

'ఒక్కటైతే' కథలో"సూర్యుడు అస్తమించిన పడమటి ఆకాశం... రాజకీయ వేత్తలు కొందరు పార్టీలు మార్చినట్టు, క్షణం క్షణం రంగులు మారుస్తోంది" (రఘోత్తమరెడ్డి, 2006: 34). పై ప్రకృతి వర్ణన వల్లసాయంత్రం అయితున్నట్లు పల్లెలో పనికి వెళ్ళిన వాళ్ళందరు ఇంటి ముఖం పట్టే సమయాన్ని తెలియజేస్తుంది. అలాగే మరోకథ 'నా పాత స్నేహితుడు' లో "పిండి కురిసినట్టు వెన్నెల మిలమిల మెరిసే చుక్కలతో దూది పింజల తీరుగ కదిలిపోతున్న మేఘాలతో ఆకాశం ఎంతో మనోహరంగా వున్నది. సన్నగా తోలుతున్న పైరగాలి శరీరానికి ఆహ్లాదం కలిగిస్తున్నది" (రఘోత్తమ రెడ్డి, 2006: 251). పై వర్ణనంతా కథకుడి మానసిక ప్రపంచాన్ని, భౌతిక ప్రవర్తనను తెలియజేస్తుంది. గనికార్మికునిగా కటికకష్టం చేసి తన ఇంటికి వెళ్ళి హాయిగా అమ్మనాన్నల ప్రేమను, స్వంత ఊరి స్వచ్ఛమైన గాలులను పీలుస్తూ అనుభవిస్తూ, అనుభూతి చెందే ప్రశాంతమైన జీవితాన్ని పరిచయం చేశాడు రచయిత.

### 4.7.2 స్వభావ వర్ణన

పాత్ర మనస్సులో కలిగే సూఖాలను, దు:ఖాలను, అనుభూతులను వర్ణించడమే ఆ పాత్ర స్వభావ వర్ణన. పాత్ర వ్యక్తిత్వన్నే, గుణాగణాలనూ, మంచి చెడులకి సంబంధించిన విషయాలనూ ఇందులో వర్ణిస్తారు.

'పట్టు' అనే కథలో "ఉప్పు పేలిన రవికతో అక్కడక్కడ నెరిసిన వెంట్రుకల్తో ముక్కుమీద కంటా కారిన బొట్టుతో– కళ్ళలో ఎవరూ జయించలేని అచంచలమైన పట్టుదలతో అంతెత్తుగా రాజవ్వ" (రఘోత్తమరెడ్డి, 2006: 198).ఈ వర్ణనలో రచయిత రాజవ్య పాత్ర రూపాన్ని వర్ణించినట్లు ఉన్నాఆమెకున్న ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను వర్ణించాడు. గోపయ్య, పోశెట్టి పాత్రల్లో మార్పును కలిగించిన రాజవ్వ వైలక్షణ్యాన్ని వర్ణించాడు రచయిత.

'పురుడు' కథలో "తన కొడుకు తన తీరుగ బొగ్గుతిని బొగ్గేరుగ కూడదు. తన కొడుకు తీరుగ యీ దరిద్రపు బతుకు బతకకూడదు... వీన్ని కూడ యీ రొంపి బతుకు బతికేట్టు చేయకూడదు. ఏమైనా సరే తన రెక్కల కష్టం అంతా ఖర్చు పెట్టయినా సరె వాన్ని బాగా చదివించాలి. దొర బిడ్డలాగ, రాజు కొడుకులాగ, అవును రాజు?" (రఘోత్తమరెడ్డి, 2006: 104). ఒక బొగ్గుగని కార్మికుడు తనలాగే తన తరువాత తరాన్ని బొగ్గుగని పనికి పంపకూడదని అనుకుంటాడు. ఒక తండ్రికి కొడుకును ఎలా తీర్చిదిద్దుకోవాలో ఆలోచించే స్వభావాన్ని వర్ణించాడు రచయిత.

### 4.7.3 సన్నివేశాల వర్ణన

కథ జరుగుతున్నప్పుడు తన చుట్టూ వాతావరణాన్ని, పరిసరాలను వర్ణనలు చేస్తారు. ఇవి సంఘటనలను ప్రభావంతంగా చూపటానికి దోహదపడతాయి.

'ఇల్లు' అనే కథలో గనికార్మికులు కొత్తగా కట్టుకున్న ఇళ్ళను పోలీసులు కూల్చివేసిన సందర్భాలలో"అపురూపంగ కట్టుకున్న పిట్టగూళ్ళ వంటి గుడిశెల్ని వాచ్‌మెన్ పీక్కొని లారీల్లో వేసుకుంటుంటే వాళ్ళ గుండెల్ని ఎవరో చేత్తొ పెకిలించినట్టు అయింది. వాళ్ళకు నెత్తురు పొంగింది. పిడికిల్లు బిగుసుకున్నయి. అటునుంచి తుపాకులు పేలినయి. యిటు నుంచి రాళ్ళు పడ్డాయి. వురుకులు పరుగులు పెడబొబ్బయి మొదలైనయి. నిమిషాల మీద కార్మికుల జనం పుట్ట చెదిరినట్టు ఉరికింద్రు" (రఘోత్తమరెడ్డి, 2006: 97) అని వర్ణించారు.

### 4.7.4 బొగ్గుగని కార్మిక కష్టాల వర్ణన

రచయిత స్వయంగా గని కార్మికుడు కనుక బొగ్గుగనుల్లో పనిచేసే కార్మికుల దు:స్థితినీ, పని వాతావరణంలో అనుకూలంగా లేని పరిసరాలనూ, కార్మికుల కష్టాలనూ వర్ణించాడు.

'బొగ్గుపొరల్లో' అనే కథలో గనికార్మికుని శ్రమ గురించి, కొత్తగా గనిలో చేరిన ఎల్లరెడ్డికినర్సయ్య ఈ విధంగా చెప్తాడు. "ఏందనకున్నవ్ బాయి పనంటే నాల్రోజులు గడిత్తె నీకు

తెలుత్తది. నీ తల్లి తెల్లారక ముందేలేసి వుడికి వుడకని కూడు బుక్కెడు తిని పొద్దుపోయిందని 'పిరో పిరో' అంటూ ఈడ్సుకుంటీడ్సుకుంట ఎగపోసుకుంట ఎండనక వాననక మైళ్ళకు మైళ్ళురికి ఎక్కడికో పాతాళం బెయినట్టు జారుట్ల బూరుట్ల దిగెటాళ్ళకే కాళ్ళన్ని రిళ్ళల వారె, యిగ పనికాడికి పోయె వారకెగు... బట్టలు తడిసి యిగ ఏ పొద్దుకో ఖాలి టబ్బులిత్తె పొట్ట నరాలు తెగంగ పేసిలకు దొబ్బుక పోయి, వశంగాని పొగల, కుమ్ముల పెట్టి వుడక వెట్టినట్టు వూడె. పుట్టెడు బండ కింద సచ్చిన సావెరుగక బతికిన బతుకెరుగక రెడ్డీ!" (రఘోత్తమరెడ్డి, 2006: 97). ఇలా గనిలోపల పని పరిస్థితిని, గని కార్మికుని బాధను వాస్తవికంగా తెలిసేట్లు వర్ణించారు రచయిత.

## 4.8 శీర్షికా శిల్పం

ఒక మనిషిని సూచించడానికి నామం ఎంత ముఖ్యమో ఒక కథని గుర్తించడానికి శీర్షిక అంత ముఖ్యం. కథానిక శిల్పం అనేది కథావస్తువుతో ముడిపడి ఉన్నదే కాని ప్రత్యేకమైన అస్థిత్వమున్నది కాదు. కాబట్టి కథకు శీర్షిక నిర్ణయించేటప్పుడు అది కథావస్తు సూచనమై ఉండడటం మంచిదని కొందరి అభిప్రాయం. కథకూ, శీర్షికకూ గల సంబంధాన్ని తెలుసుకోవడానికి పాఠకుడు బుద్ధికి పదునుపెట్టాలి. ఏ కథకు ఏ పేరు పెట్టినప్పటికి అది వస్తువుతోగాని, పాత్రతోగాని, ఒకానొక జీవితసత్యంతోగానిసంబంధించి ఉండాలన్నది నియమం. పాఠకుడు శీర్షిక చదివిన వెంటనే ఆకట్టుకొనే విధంగా ఉండి కథను చదివేవిధంగా ఆసక్తిని కలిగించాలి. అప్పుడు ఆ శీర్షిక కథను ప్రాచుర్యంలోకి తెచ్చి నామసార్థక్యాన్ని పొందుతుంది.పై విషయానికి భిన్నంగా కాళీపట్నం రామారావు గారు కింది విధంగా సూచించారు."చదివేలోగా పేరులోనే కథ ఏమిటో తెలిసిపోకూడదు. విలక్షణమైనా ఆ పేరు ఆ కథకు అవసరమైతే ఫరవాలేదు. కాని ఆకర్షణ కోసం పెడితే బెడిసికొట్టవచ్చు. మన అభిరుచుల దృష్ట్యాకాకుండా పాత్రలకు తగ్గ పేర్లుంచాలి?" (రామారావు, 1999: 836). కా. రా ఉద్దేశ్యం ప్రకారం కథ పేరు పాఠకులను ఆకర్షించే విధంగా ఉండకుండా పాఠకులను ఆలోచింపజేసే విధంగా ఉండాలి. ఏది ఏమైనా కథకు శీర్షిక నిర్ణయించే విషయం కథకుడి ఆలోచనను బట్టి, కథలో పాత్రలను బట్టి,

విషయాన్ని బట్టి ఉంటాయి. కొన్ని కథల్లో శీర్షిక ఆలోచించే విధంగా, మరికొన్ని కథల్లో ధ్వనిని వ్యక్తం చేసే విధంగా, మరికొన్ని కథపై ఆకర్షణ కలిగించే విధంగా ఇలా అనేక రకాలుగా ఉంటుంది. కథల పేరు పెట్టడంలో రచయితల ప్రతిభాశక్తి, చిత్తవృత్తి సూచనగా తెలిసిపోతాయి.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన కథల్లో పాత్రల ప్రాముఖ్యతననుసరించి శీర్షికలు సూచించలేదు. 'నా పాత స్నేహితుడు'కథ తప్ప మిగిలిన కథల్లో పాత్రలను సూచించే విధంగా శీర్షికలుండవు. 'నా పాత స్నేహితుడు' అనే కథలో కూడ కథకుడి సహాయంతో రచయిత తన జీవిత పరిణామాన్ని చిత్రిస్తాడే తప్ప నిరంజన్ అనే పాత్ర ప్రాధాన్యత తక్కువేనని చెప్పాలి.

### 4.8.1 ధ్వని ప్రధానంగా సూచించే శీర్షికలు

'పెండ్లి', 'వేటగాడి చూపులు'ఈ రెండు కథల్లో వివాహవ్యవస్థ పేరుతో ఒక వర్గపువాళ్ళు మరో వర్గాన్ని దోచుకొవడాన్ని వ్యతిరేకిస్తూ రచయిత ఈ శీర్షికను నిర్ణయించారు. మన వివాహవ్యవస్థను, దానిలో లోటుపాటులను ఎత్తిచూపిన కథలు ఇవి రెండు. వేటగాడి చేరువలో ఉన్న పక్షి ఎప్పుడు బలైతుందో తెలియదు. అలాగే 'వేటగాడి చూపులు' కథలోని పెళ్ళికూతురైన తస్లీమ జీవితానికి సర్వం ఆధారమైన పెండ్లికొడుకు చూపులో ఎటువంటి కారుణ్యం లేకపోగా అసహనం, వాంఛ ప్రస్ఫుటం అయ్యేలా ఉన్నాయని సూచించాడు.

### 4.8.2 సన్నివేశాలు ప్రధానంగా సూచించే శీర్షికలు

'ఓ మెరుపు మెరిసింది', 'బొగ్గుపొరల్లో' కథలు. వర్షంలో చిక్కిన తన కొడుకు కోసం ఎదురుచూస్తున్న నర్సయ్య ముసలివాడి గుండెల్లో మెరుపు మెరవడం. ఈ కథలోని మెరుపును ప్రతీకగా తీసుకుని చిత్రించారు. బొగ్గుగని బావిలోనివాతవరణం, అక్కడి పని పరిస్థితులు, ఆ బొగ్గుగనుల్లో కార్మికులు పడే కష్టాలు, వాళ్ళు ఎదుర్కొనే ప్రమాదాలు మొదలైన వాటన్నింటినీ తెలిపే విధంగా 'బొగ్గుపొరల్లో' అనే శీర్షిక పెట్టారు రచయిత.

### 4.8.3 ప్రశ్నార్థకాన్ని సూచించే శీర్షికలు

కన్న కొడుకు అన్నల్లో(కమ్యూనిస్టు) కలిసిపోగా తనకున్న జీవన ఆధారం ఒక్క భూమి. ఆ భూమిని కాస్త లాక్కోవడానికి వచ్చిన దొరలు, పోలీసులు ముసలివాన్ని భూమి గురించి అడిగిన ప్రశ్న 'ఈ భూమి ఎవరిచ్చిన్రు?'.

### 4.8.4 సంఘటనాత్మకంగా సూచించే శీర్షికలు

'సవారీ–I', 'సవారీ–II', 'నీళ్ళతగువు' మొదలైనవి. దొర సవారీ వెనుక పరుగెత్తుతున్న బాలుడు అలసిపోయి ఇక విముక్తిని ఆశించడం తప్ప ఆసక్తిని కనబరుచడం మా వల్ల కాదంటూ సభలతో, ఉద్యమాలతో పోరాటానికి సంసిద్ధమయ్యే సంఘటనాలను సూచించేవే'సవారీ–I', 'సవారీ–II' శీర్షికలు.రెండో శీర్షిక మొదటి దానికి కొనసాగింపు. బొగ్గుగని అధికారులతో పోరాడి నీళ్ళుసాధించుకున్న సంఘటనను సూచించే కథ 'నీళ్ళతగువు'.

ఈ విధంగా రఘోత్తమరెడ్డి కథల్లో శీర్షికలు కథలు చదివి ఒక ఆలోచనకు వచ్చి నిర్ణయించుకుంటే గాని శీర్షికలు వెనుకన్న కారణాలను పసిగట్టిలేం. మొత్తానికి ఈ శీర్శికలు ఒక దానికి అంటూకాక అన్ని విషయాలు మిళితమైన శీర్షికలు. కాని ఆలోచింప జేసే ఆచరణలో పెట్టే శీర్షికలు.

## 4.9 ఎత్తుగడ

కథారంభం ఏవిధంగా ఉంటుందో చూడటమే ఎత్తుగడ. రచయిత తాను ముందుగా తయారుచేస్తున్న ప్రణాళికను అనుసరించి కథను ఎక్కడ ఆరంభిస్తాడో దాన్నే 'ఎత్తుగడ' గా పిలుస్తారు. కథలోని ఎత్తుగడ ఆశ్చర్యం కలిగించే విధంగా కథంతా చదివేలా, ఆసక్తిని పెంచేలా ఆకర్షణీయంగా ఉండాలని చెప్తారు. కథాశీర్షికను చదివి కథను చదవడం మొదలు పెట్టగానే తరువాత ఏమి జరుగుతుందో అన్నంత కుతూహలం కలిగే విధంగా ఎత్తుగడ ఉన్నప్పుడు ఆ కథ పాఠకుడిని చదివించగలదు. మొత్తానికి కథపై మక్కువ పెంచి ఎక్కువ మంది చేత చదివించేటట్లు ఉండాలన్నది

నియమం. "మనస్సులో ఏర్పరచుకున్న ఇతివృత్తాన్ని ఆవిష్కరించే ప్రక్రియలో రచయిత లేదా కథకుడు మొట్టమొదట ఏ అంశాన్ని ఎత్తుకుంటాడో ఆ రచన కథలో ఎత్తుగడ అవుతుంది" (దక్షిణామూర్తి, 1988: 289). రచయిత కథలో ఎత్తుకున్న అంశం గూర్చి "మన కథ ఎంత గొప్పదైనప్పటికీ ఎత్తుగడ ఆకర్షణీయంగా లేకపోతే పాఠకుణ్ణి చదివించలేదు. కథలోని మొదటి వాక్యాలే పాఠకుని మనస్సులో రబ్బరు స్టాంపు వలె హత్తుకొని కథ మీద ఇంటరెస్టును పెంచాలి"(చంద్రశేఖర్ రెడ్డి, 1985: 17).తాళ్ళూరి నాగేశ్వర రావు ఈ విధంగా అన్నారని రాచపాలెం చంద్రశేఖరరెడ్డి గారు తెలిపారు. పై నిర్వచనాల ఆధారంగా కథారంభం ఏవిధంగా ఉండాలో తెలుస్తుంది. కాని ఈ అంశాలను అన్ని కథలకు వర్తించటం అనేది కొంత సందిగ్ధం. తుమ్మేటి లాంటి వాస్తవిక కథారచయితల్లో ఈ నియమం కొంత అసాధారణంగా ఉంటుంది. యిలానే ముగించాలి, యిలానే ప్రారంభించాలి అనడం కన్నా కథా ప్రారంభం అసక్తికరంగా అనవసరమైన వర్ణనలతో లేకుండా. కథకుడు చెప్పబోయే విషయంపై పాఠకుడికిఆసక్తిని కలింగిచేలా ఉండాలి. రఘోత్తం కథల్లో ఎత్తుగడలను ఈ కింది విధంగా విభజించాను.

### 4.9.1 వర్ణనాత్మక ఎత్తుగడ

కథలోని ప్రకృతిని గాని, విషయాన్ని గాని వర్ణిస్తూ ప్రారంభించడమే. వీటి వల్ల పాఠకుడికి కథ గురించి ఒక ఊహను ఏర్పరచుకోవడానికి, అసక్తి పెరగడానికి ఉపయోగపడుతుంది.

"సూర్యుడు అస్తమించిన పడమటి ఆకాశం.. రాజకీయ వేత్తలు కొందరు కొందరు పార్టీలు మార్చినట్లు, క్షణం క్షణం రంగులు మార్చినట్టు" (రఘోత్తమరెడ్డి, 2006: 34). 'ఒక్కటైతే' కథలోని సూర్యాస్తమయాన్ని వర్ణిస్తూ, రాజకీయ వేత్తల స్వభావాన్ని తెలియజేశాడు రచయిత.

### 4.9.2 సంభాషణాత్మక ఎత్తుగడ

కథ ప్రారంభమే సంభాషణలతో మొదలైతే సంభాషణాత్మక ఎత్తుగడ. ఇది ప్రస్తుతం జరుగుతున్న భావనను కలిగిస్తుంది.

"బాయి పనంటె మాటల్గాదె సెల్లె! లేటైతే లేటాయెగని– కసరెక్క ముదురాలె.. ఎట్లన్న జేసి ఈ సాలుకు ఈన్నే... ఇగమల్లగా పటేల్కెవుంచు గాయినకిందైతెనె వుంటడు" (రఘోత్తమరెడ్డి, 2006: 42). 'పగలూ రేయీ శ్రమ పడుతున్నా..' అనే కథలో సాయిలుతో, ఓదెమ్మ తన కొడుకును బొగ్గుగనిలోకి పనికి పంపించాలనుకుంటే అక్కడి పరిస్థితుల వల్ల తట్టుకోలేడని ఇక్కడ దొర దగ్గర పాలేరుగా ఉంచమని చెప్తాడు.

### 4.9.3 శీర్షికతో కూడిన ఎత్తుగడ

శీర్షికతో ప్రారంభమైన ఎత్తుగడ. "మెరుపు మెరిసింది. కళ్ళు బైర్లు కమ్మేటట్టుగా! వెనువెంటనే ఉరుము వురిమింది. చెవులు దిమ్మెక్కి పొయేటట్టుగా" (రఘోత్తమరెడ్డి, 2006: 52).'ఓ మెరుపు మెరిసింది' అనే కథలో శీర్షికతోనే కథ ఎత్తుగడ ఆరంభమై మనల్ని ఆశ్చర్యానికి లోను చేస్తుంది.

### 4.9.4 సందేహత్మక ఎత్తుగడ

కథ ప్రారంభమే సందేహమైన వాక్యాలతో, సందేహం కలిగించే విషయాలతో కథ ప్రారంభమవుతుంది.

"సమ్మిరెడ్డి ఆదరాబాదరగా వచ్చి షెడ్లో సైకిల్ పడేసి మ్యాన్–వే దిక్కు నడిచిండు. ఆయన మనసంతా ఆందోళనతో నిండి వుంది" (రఘోత్తమరెడ్డి, 2006: 199). 'వాల్‌పోస్టర్' అనే కథలో సమ్మిరెడ్డి కలిగిన ఆందోళనకు కారణమేంటో అని తెలుసుకోనే సందేహాం కలుగుతుంది.

### 4.9.5 బొగ్గుగని ప్రాంతాల పరిస్థితుల గురించి ప్రారంభమైన ఎత్తుగడ

బొగ్గుగని ప్రాంతాల్లో జరిగే మార్పులను, పరిసరాలను, వాతవరణాన్ని వివరిస్తూ కథ మొదలవడమే.

"అలవాటు ప్రకారం...... ఒకటో నంబర్ బొగ్గు రాయి మీద రాక్షసి గొంతుతో సైరన్ కూసింది. ఓ కార్మికులారా! తొందరగా రండి.. తొందర తొందరగా రండి.. మీ శరీరాల నుంచి కొంచెం మాంసం, మరికొంచెం నెత్తురు ఈ రోజుకు సరిపడా నేను చప్పిరించాలి" (రఘోత్తమరెడ్డి, 2006:58).పై విధమైన ఎత్తుగడ'బొగ్గపొరల్లో..' అనే కథలోనిది. బొగ్గుగని ప్రాంతాల్లో నిన్నటి రోజంతా పనిచేసి నిద్రపోయిన వారిని భయకరంమైన ధ్వనితో లేపుతున్న దృశ్యం మనకు ఎదుట నిలిచినట్లు అనిపిస్తుంది. మళ్ళీ గని పనికి సిద్ధంగా ఉండండి. రాక్షసి లాగా మీ రక్త మాంసాలు నేను ఆహారంగా తీసుకోవాలని ఊహించే విధంగా ప్రారంభమవుతుంది.

### 4.9.6 పాటతో ప్రారంభమైన ఎత్తుగడ

'ఇల్లు' కథలో పాటతో కథ ప్రారంభమవుతుంది.

"పొద్దు పొడుపూ.. మెరుపు తీగా.. పోయ్యేటి మేనత్తకూతురా...." అంటూ స్త్రీ, పురుషుల వియోగంలో ఏర్పడిన విషాదమైన పాటతో కథను ప్రారంభించాడు. ఈ కథలో భార్యభర్తల వియోగమే కథను ముందుకు నడిపిస్తుంది.

## 4.10 ముగింపు

కథ చివరగా రచయిత అందించిన విషయాన్ని 'ముగింపు' అంటారు. రచయిత పాఠకులకు అందించాల్సిన విషయం ముగియగానే కథ కూడా ముగుస్తుంది. కథ ముగింపుకు ప్రత్యేక స్థానం ఉంది.ముందున్న కథ భాగమంతా ఈ ముగింపుపై ఆధారపడి ఉంటుంది. ముగింపుకున్న ప్రాముఖ్యత"కథాసూత్రం నిలిచిపోయే స్థానమే ముగింపు"(దక్షిణామూర్తి, 1988: 313) అన్నారు.

మొత్తం కథానిర్మాణంలో కథకుడు పాఠకుడికి చేరవేయాల్సిన విషయాన్ని ఇక్కడ తెలుపుతాడు. ఈ ముగింపు అనేది పాఠకుడికి ఊహించని విధంగా విస్మయచకితున్నిగా చేసే అంశంగా ఉండాలని నియమం. అప్పుడే ఆ కథపై పాఠకుడు తనదైన వైఖరి నుండి ఒక ముద్రను నిలుపుకుంటాడు. "శిల్పం పూర్తయిన తర్వాత జీవం ఉట్టిపడేటట్టుగా కళ్ళను తీర్చదిద్దడం ఎలాంటిదో కథలో ముగింపు అలాంటిది"(రాజారాం, 1989: 64). కథాప్రారంభం ఎంత అసక్తికరంగా ఉంటే పాఠకుడు అంతగా ఆశ్చర్యానికిలోనైతాడు. అలాగే కథ ముగింపు ఎంత నేర్పుగా ఉంటే ఆ కథ అంతగా పాఠకుని మనస్సులో నిలిచిపోతుంది. కథలోని విషయాన్ని, కథాంశాన్ని పాఠకుడికి తీవ్ర అనుభూతిని, సామాజిక బాధ్యతని, ఆలోచన పరుల్ని చేసే విధంగా ముగిస్తే కథని చదివిన తరువాత పరిష్కారం పాఠకుడే నిర్ణయించుకోగలిగేలా ఉంటే బాగుంటుంది. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల్లోని ముగింపును కింది విధంగా విభజించి పరిశీలించాను.

### 4.10.1 పాత్రకు సంబంధించిన ముగింపు

'ధిక్కారం' కథలో తన తల్లిని కొట్టిన జగదీశ్వర్రావు, దొరసానిల ఇంటివైపు కసిగా చూసి రాయమల్లి చిన్న కొడుకు సారడు "విల్లులా వెనక్కి వంగి, వంకరగా చిమ్మే ఫౌంటెషన్‌లాగ మూత్రం పొయ్యడం" అనేది వాళ్ళకు నిరసన తెలిపిన ముగింపునిచ్చే పాత్రగా సూచించాడు రచయిత.

మరో కథలోని ముగింపు పాత్ర ద్వారా సందేశాన్ని, లోకంతీరును వివరించాడు. 'పెండ్లి' కథలోని వివాహం చేసుకొని వెలుతున్న చెల్లెలుని చూసి ఆనందం బాధపడతాడు. అప్పటి దాకా కనిపించని పాత్ర వచ్చి ముగింపునిచ్చే మాటల్లో ఆ కథ మొత్తం సారాన్ని అందిస్తుంది. ""వారీ! ఆనందా! నీకు సెల్లెను సూత్తేనే గట్ల అనిపిత్తదో నను సూత్తె ఏమనిపిత్తాందిరా వారీ! ఇగో నా రొండు కాళ్ళు కరకర నమిలి తిన్నరు. ఇగో నాతలకాయ మొదడు కూడ గొలిచ్చుక తిన్నరు. అరె కొడుకా! గట్లనే నువు కూడ అందరీ తీరుగ మనుషుల పీక్కుతిను అం!"(రఘోత్తమరెడ్డి, 2006: 111). అని వీరయ్య పాత్ర ద్వారా సమాజం వైఖరిని, దుష్టుల స్వభావాన్ని తెలిపాడు.

### 4.10.2 విషాదాత్మకమైన ముగింపు

'పగలూ రేయీ శ్రమ పడుతున్నా' అనే కథలో రామిరెడ్డి కొడుకు బొగ్గు గని బావి పనికోసం బయలుదేరినపుడు వారి ఇంటిలో ఉన్న సాయిలు, ఓదెమ్మ, రాంరెడ్డి భార్య ఇలా అందరు విషాదానికి గురైతారు. "నేడు రామిరెడ్డి పటేల్ కొడుకు పోతుంటె సరిగ్గా యిరువై ఎండ్ల కింద ఆఖరిని సాగనంపే దిక్కుకూడ లేకుండ తాను బాయి పనికి పోవడం గుర్తొచ్చి సాయిలు కూడ ఏడ్చిండు. అట్లనే తన కొడుకు పోతాడని గుర్తుకు తెచ్చుకుని ఓదెమ్మ ఏడ్చింది" (రఘోత్తమరెడ్డి, 2006: 51). భూస్వాముల బతికుల్లో కలిగే మార్పులను, సామాన్య కూలీల జీవనగమనాన్ని తెలిపే విధంగా ఉంటుంది. అలాగే 'శత్రువు' కథ కూడ విషాదాత్మక ముగింపుతో ముగుస్తుంది.

### 4.10.3 ఆలోచనాత్మక ముగింపు

కథని చదివిన తరువాత కొన్ని కథల్లో సాధారణంగా ముగింపులు పాఠకులకే వదిలేసినట్లు ఉంటాయి. నిర్ణయాన్ని పాఠకులే కనిపెట్టాలి. ఈవిధమైన ముగింపు రచయిత చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగా కాకుండా సంఘటనల ద్వారా పాఠకులే గ్రహించాలని ఉద్దేశ్యంతో రచయిత రాస్తారు. దీని వల్ల రచయిత సామాజిక బాధ్యత తెలుస్తుంది.

'ఇల్లు' అనే కథలోని గనికార్మికుల వేసుకొన్న గుడిసెలను పోలిసులు, గనిఅధికారుల పీకేయిస్తారు. వారి పరిస్థితి విషమంగా అవుతుంది. ఎటు తోచలేని పరిస్థితిలో నిస్సహాయులుగా మారిన గని కార్మికులు యాజమాన్యానికి తమ పరిస్థితిని తెలియజేయాలని నిరసనగా గని ముఖ్య కార్యాలయాల్లో వారి సంసారాలను దించుతారు. దీని వల్ల గని కార్యాలయాల్లో యాజమాన్యం ఆలోచనలో పడతారు. పాఠకులు కూడా వారి దీన పరిస్థితిని గురించి ఆన్వేషణలో పడతారు. "ఆయనకు నాలుగు రోజులు క్రితం గుడిశేలు పీకేయించిన సంగతి జ్ఞాపకం వచ్చింది. అట్ల జ్ఞాపకం వచ్చే సరికి ఆయన ముఖం రకరకాల భావాలు రంగులు మారుతోన్నట్టు" (రఘోత్తమరెడ్డి, 2006: 99).

'నా పాత స్నేహితుడు' అనే కథలో నేను అంటూ వచ్చిన కథకుడికి అతని మిత్రుడు నిరంజన్‌కు చెదరిన మిత్రృత్వం గురించి ముగింపు వాక్యాలు ప్రతివారిలో ఉన్న స్నేహితుల తత్త్వాన్ని బయటపెడతాయి. బాల్యం నుండి పచ్చని పొలాల్లో పెనవేసుకుని ఆట, పాటలతో పెరిగిన రెండు జీవితాలు కొంతకాలం తరువాత ఎవరికే వారే ఏర్పరచుకొన్న దృక్పథాల్లో నుంచి, భావజాలాల్లో నుంచి బయటపడలేక దగ్గర వారిని సైతం దూరం చేసుకున్న తీరును ఆలోచింపజేస్తాయి. "ఏమిటిది? పూర్తిగ మంచి చెడు తెలియని వాని తీరుగ అయిపోయినవు ఏమిటీ? నిరంజన్ అన్నాను. ఆ ఒక్కమాటతోనే ఎంతో బోధపడినట్టునపించి చివ్వున తల నావైపు తిప్పి ఛీత్కారభావంతో 'నీది నీకే మంచి– నాది నాకే మంచి' అన్నాడు" (రఘోత్తమరెడ్డి, 2006: 253).

## 4.11 భాషాశైలి

ఒకరి అభిప్రాయాలను, భావాలను మరొకరితో పంచుకోవడానికి ఎన్నో మార్గాలు ఉన్నా భాషంత బలమైన సాధనం లేదు. ఒకరి భావాల్ని వ్యక్తం చేసుకొని వాటిని శాశ్వతంగా మళ్ళీ తిరిగి వ్యక్తం చేయటానికి 'లిపి' ఎంతో ఉపయోగపడతుంది. ఏ రచనలో అయినా రచయిత ప్రయోగించే భాష తనదైన శైలిగా ఒకటి ఉంటుంది. ఎందుకంటే ఏ ఇద్దరు ఒకేలాగా మాట్లాడనట్టు, ఏ ఇద్దరు రచన చేసినా ఒకేలా ఉండదు. కాబట్టి రచయిత భాషాశైలి అతని రచనలోనే మనకు స్పష్టంగా వ్యక్తమవుతుంది. అంతేగాకుండా రచయిత పాఠకుడికి అందించాల్సిన కథాంశం, రచయిత కంఠ స్వరం శైలి ద్వారానే తెలుస్తుంది. "రచయిత ఆత్మధర్మాన్ని ప్రదర్శించేదే శైలి. శైలిలో రెండు దశలున్నాయి. కథాంశాన్ని క్రమంగా ప్రకాశింపచేసే నైపుణ్యం శైలిలో మొదటి దశ. తాను బోధింపదలచిన అర్థాన్ని ప్రకాశింప చేసే వాగ్రూపాన్ని సముచితంగా ప్రయోగించడం రెండో దశ కథాంశమూ, దాన్ని బోధించే వాగ్రూపమూ అవినాభావంగా ఉంటూ పఠిత హృదయాన్ని కథకుని మనోభావంతో తాదాత్మ్యం చెందే విధంగా చేసేదే శైలి" (శ్రీనివాస్, 2010: 33).కథలోని ఇతివృత్తం, పాత్రచిత్రణ, కథాగమనం, సంభాషణలు మొదలైన అంశాల్లో రచయిత శైలి కనిపిస్తుంది. రచయిత

ప్రతిభ, భాషా ప్రావీణ్యం అనేది ఆయన ఉపయోగించే శబ్ద, వాక్యల విన్యాసాల ద్వారా, ప్రయోగించే భాషావైవిధ్యం ద్వారా తెలుస్తుంది. ఒక్కొక్కరికి ఒక్కొక్క శైలి ఉంటుంది. ఒక్కొక్క రచయిత శైలి ఎంతగానో ఉపకరిస్తుంది. సాహిత్యంలో రచయితకున్న స్థానాన్ని గుర్తించడంలో, వైయుక్తిక ముద్రను వేయటంలో కూడా ఉపయోగపడతుంది. "శైలిలో భాషావ్యవస్థ నుంచి రచయిత గ్రహించిన సుత్రాలతో పాటు రచయిత వ్యక్తిత్వం కూడా ఉంటుంది. రచయిత వ్యక్తిత్వం అతని ఆలోచనా విధానంలో మాత్రమే కాకుండా, అభివ్యక్తీకరణలో కూడా బయటపెడుతూ ఉంటుంది. అందుచేతనే నాలుగువాక్యాలు చదవగానే కొందరి శైలిని గుర్తు పట్టుగలుగుతుంటాం" (వెంకటసుబ్బయ్య, 1995: 79).

శిల్పంలోని శైలి అనేది ఒక భాగం. ఈ రెండింటిలోదేని ప్రాముఖ్యత దానిదే. శిల్పమనేది విస్తృమైన అంశం. శైలి అనేది స్వల్పమైనది. అయినా శిల్పంలో ముఖ్యమైనది. "కథావస్తువు ఎంత ఉదాత్తమైందో కథ కూడా అంత ఉన్నతమైన శైలిలో సాగాలి. కథలో వాడిన ప్రతీమాటా స్పష్టమైన అర్థాన్ని ధ్వనింపజేయాలి. చిన్న కథ యొక్క శైలి రచయిత భావాలకు అనుగుణంగా ఉండి ప్రవాహంలా సాగి ప్రత్యేకతతో రాణించాలి"(చంద్రశేఖర రెడ్డి, 1985: 17). అని తాళ్ళూరి నాగేశ్వర రావు గారన్నట్లు చంద్రశేఖర రెడ్డి గారు తన గ్రంథంలో తెలిపారు. రచయిత తన మనస్సులో కలిగిన భావాలను పాఠకుడికి అభివ్యక్తీకరించే సమయంలో ప్రయోగించిన భాషనే ఆ రచయిత భాషాశైలి అవుతుంది. "కవి లేక రచయిత తనలో అంతర్లీనమైన భావాలను క్రమపద్ధతిగా, సుస్పష్టంగా శబ్దమైత్రి ద్వారా అభివ్యక్తీకరించేదే శైలి" (దక్షిణామూర్తి, 1975:412). రచయిత చిత్రించాలనుకున్న కథావస్తువుకు, అందులో పాత్రలకు తగ్గట్టు భాషను ప్రయోగించాలి. ముఖ్యంగా కథాంశాన్ని పాఠకుడికి స్పష్టంగా అర్థమయ్యేలా లోకవ్యవహారభాషరీతితో, మాండలిక భాష పదాలతో రచన సాగించాలి. అప్పుడు ఆ రచనలో సమాజం, ఆ ప్రాంతీయమైన ఆచార వ్యవహారాలు, సామెతలు, జాతీయాలు చోటు చేసుకుంటాయి.

తుమ్మేటి రఘోత్తమరెడ్డి పుట్టింది తెలంగాణ రాష్ట్రంలోనివరంగల్ జిల్లా ప్రాంతంలో. ఆ తరువాత కరీంనగర్ జిల్లా గోదావరిఖని ప్రాంతానికి ఉద్యోగ రీత్యా వలసవెళ్ళారు. ఆయన పుట్టి పెరిగిన

పరిస్థితులు, జీవనవైవిధ్యం, సంఘర్షణ, సామాజిక వ్యవస్థలు ఆయనను కథారచయితగా తీర్చిదిద్దాయి. ఆయన రాసిన కథల్లో సంభాషణలు ఎక్కువగా మాండలికంలో, కథనం ప్రామాణిక వ్యవహారంలో సాగించారు. కథల్లో మాండలిక భాషను ఉపయోగించాలంటే చిన్నప్పటి నుండి రచయితకు మాండలికంతో బాగా పరిచయం ఉండాలి. అలాంటి అనుభవం రఘోత్తమరెడ్డి గారికి ఉంది. కనుక కథల్లో పాత్రలకు తగ్గట్టు ఆయా భాషను ప్రయోగించాడు. ప్రతి భిన్న అంశాన్ని తీవ్ర భావనలతో ఆలోచించడం అతనికి అలవాటు. ఆ అలవాటు తాను చూసిన పెరిగిన ప్రపంచంలో వ్యవహర్తలు వాడిన నానుడులు, జాతీయాలు కథల్లో సమర్ధవంతంగా సందర్భానుసరించి ప్రయోగించారు. వాటిని ఇందులో పరిశీలించాను. భాషా పరిశీలన అనేది విస్తృతమైనది. ప్రత్యేక విభాగంగా చేయదగిన పరిశీలన. కాబట్టి ఇందులో భాష పరిశీలన పూర్తిగా చేయలేదు. "ఈయన కథలకు తెలంగాణా జీవభాష ప్రాణం. వ్యవహారిక భాషావాదులు సృష్టించిన సోకాల్డ్ ప్రామాణిక భాషలో తప్ప, మాండలికంలో, అంటే, యాసలో సాహిత్యం పుట్టదని నమ్మబలికే, భాషతో పెత్తనం చెలాయించిన వాళ్ళకు ఈ పుస్తకం మంచి సమాధానం. తెలంగాణ భాష సొగసుల్ని అర్థం చేసుకోడానికయినా ఇతర ప్రాంతాలవారు ఈ కథల్ని చదవాలి"(నాగేందర్, 2013: 364).

### 4.11.1 మాండలిక పదాలు

రఘుత్తమరెడ్డి కరీంనగర్, వరంగల్ జిల్లాల ప్రాంతానికి చెందిన మాండలిక భాషను తన కథల్లో ప్రయోగించారు. ఒక్కొ కథలో పాత్రకు తగిన పాత్రోచిత భాషను ఉపయోగించారు. దీని వల్ల కథ చదివే పాఠకులకు ఆసక్తికరంగా ఉంటుంది. తుమ్మేటి తన కథల్లో ప్రవేశపెట్టిన మాండలిక పదాలను కొన్నింటిని పరిచయం చేస్తున్నాను.

1. శెత్తలు (పు: 109) = శరీరాలు
2. మగ్గిన(పు:10)=తక్కువైన,ఉపశమనం
3. యావ (పు: 54) = ధ్యానము, దృష్టి
4. గలుమల (పు: 95) = ఇంటి ముందర
5. శెనార్తి (పు: 207) = కృతజ్ఞతలు
6. పెయి (పు: 91) = దేహం

7. బరుకతి (పు: 10) = ఆదాయం, డబ్బు మిగలకపోవడం

8. సాలుకు (పు: 42) = సంవత్సరానికి

9. తుర్బాజు (పు: 43) = తూర్పు వైపున

10. సిడిఁవెల (పు: 3) = తొందరగా

11. బరాబరి(పు:4)= సంపూర్ణంగా, పూర్తిగా

12. లగ్గం (పు: 107) = పెండ్లి

13. ఇజ్జత్ (పు: 110) = పరువు

14. పేర్నాలు (పు:110) = ఎగతాళి చేయడం

15. గంజు (పు: 110) = పాత్ర

16. రికామి (పు: 55) = తీరిక

17. యాది (పు: 56) = గుర్తు, జ్ఞాపకం

18. మత్లబ్ (పు:9) =విషయం, సమాచారం

19. నాదాన్ (పు: 15) = సిగ్గుచేటు

20. గడుక (పు: 30) = జొన్నముద్ద

21. అగమాగం(పు:52)= తొందర తొందరగా

22. కంచం (పు: 42) = పళ్ళెం

23. సోపతి (పు: 42) = స్నేహితుడు

24. పరుకు (పు: 42) = తేడా

25. ఖదర్ ఖాందన్ (పు: 107) = పరువు ప్రతిష్టలకు సంబంధించిన వంశం

26. పబ్బతి (పు: 105) = పశ్చాతాపం

### 4.11.2 బొగ్గుగని కార్మికులు ఉపయోగించే కొన్ని పదాలు

1. సెవెనింక్లైన్ (పు: 91) = 7వ నెంబర్ బొగ్గుగని

2. బదిలిఫిల్లర్ (పు: 91) = తాత్కలిక బొగ్గుగని ఉద్యోగి

3. కోల్‌ఫిల్లర్ (పు: 107) = బొగ్గుగని నింపే కార్మికుడు

4. డీఫిల్లరింగు (పు: 66) = ఫిల్లర్ లేకుండా తీసే పద్ధతి

5. మ్యాన్ వే (పు: 199) = గనిలోపలికి మనుషులు వెళ్ళడానికి పోయే దారి

7. కోల్‌కట్టర్ = బొగ్గు తవ్వే మనిషి

8. ఫైలూ (పు: 265) = గనుల్లో జత పనివాడు

9. సీము (పు: 67) = బొగ్గు పొర

10. పేసి (పు: 63) = గనుల్లో పని చేసే స్థలం

11. గోఫ్ (పు: 68) = గనుల్లో పిల్లర్లు సపోర్టు లేకుండా బొగ్గు తవ్వే చోటు

12. రేసు (పు: 265) = గని లోపల మెట్ల పై నుంచి

13. డీబు (పు: 265) = గని లోతట్టు ప్రాంతం

### 4.11.3 సామెతలు

భావవ్యక్తీకరణ అనేది సాధారణంగా కాకుండా సామెతలు జోడించి చెప్పినట్లయితే భావ ప్రసారం రమణీయంగా, ఆకర్షణీయంగా ఉంటుంది. జీవితానుభవాల నుండి ఈ సామెతలనేవి జనిస్తాయి. కొన్ని సందర్భాలలో సామెతలు మానవ జీవితానికి కావల్సిన సత్యాలను వెల్లడిచేస్తాయి. సామెతలు ఒక తరం నుండి ఇంకో తరానికి సంక్రమిస్తాయి. సంక్రమించే సమయంలో పూర్వం నాటి సంస్కృతి, పరిణామాలను తెలుసుకోవడానికి కూడా అవకాశాన్ని ఇస్తాయి. నాడు నేడు రేపు సామెతలుండి మానవ జీవనక్రమాన్ని కొంతవరకు రికార్డు చేయడంలో సహకరిస్తాయి. సామెతలు జనవ్యవహారంలో సుభాషితాలుగా ప్రచారమవుతాయి. అనుభవం వల్ల గాని, సమయోచిత ప్రవర్తన వల్ల గాని ఏర్పడిన సత్యం సామెతలుగా వాక్యల రూపంలో ఉంటాయి. ఇవి లోకంలో విరివిరిగా ప్రచారం పొంది నిత్యం వాడబడుతూ ఉంటాయి.

1. ముచ్చట సంబురాన దొంగ తిండి మర్సినట్టు (పు: 4)

2.జెర్రికి సీమలు తలిగినట్టు (పు: 4)

3.కంచంల పోసినయ్ తప్పుతయ్ గని, కుంచంల పోసినయ్ తప్పుతాయె (పు: 6)

4.తెగిన బొక్కెన నుతిల్దాక (పు: 30)

5. సింత చచ్చినా పులుపు సావది (పు: 33)

6.యాడికే ఆరుకోసి, మూడు అతుకుడు అతుకుడు అయితాంది (పు: 55)

7.అయిందానికి కాందానికి నలుగుట్లెకు పోవుడెందుకు (పు: 55)

8. కడుపు గట్టుకొని గోదారి ఈదినట్టు (పు: 55)

9. పెనం మీది నుంచి పొయిల పడ్డట్టే అయింది (పు: 59)

10. బాయిపనోని కడుపున బాయి పనోడు పుడుతడు (పు: 61)

11. ఎక్కడెవడు లేక అక్క మొగుడు దిక్కైనట్టు (పు: 62)

12. అయ్యగారి సంపాదన అమ్మ గారి పసుపు కుంకుమకు సరిపెయినట్టు(పు: 62)

13. పురుగు పుట్టదిని పుట్టలుండ బుద్ధికాక (పు: 62)

14. సచ్చిన సావెరుగక బతికిన బతుకెరుగక (పు: 64)

15. ఎవని సేతులు వాని నెత్తిమీద పెద్తరు (పు: 67)

16. కొండ చిలువ చప్పరించి, బయటకు నాలుకతో తోసినట్టు (పు: 66)

17. మెడకువడ్డ పాము కరువక మానుద్దా? (పు: 69)

18. నీదంత అబ్బర పులిఅంటె తోక బారెడు (పు: 71)

19. అతారె లేని సుతారి ఏడుళ్ళిండ్లకు గోడలు పెడుతునన్నడట (పు: 90)

20. ఆపతి పడంగ మంత్రసాని దగ్గరికి తోలిత్తె అంబాడంగ అచ్చినట్టు అయిద్ది (పు: 98)

21. పాముా పగైతే తోక సుట్టమా (పు: 98)

22. అయ్యకు బుట్టిన ఆరుగురు పరమ భాగోతులే (పు: 189)

23. నవ్వే ఆడిదాన్ని ఏడిసే మొగోన్ని నమ్మదట (పు: 190)

24. మొగోనికి పట్టింపు లేని సంసారం ఆడిది ఎంతకాలం ఏగోత్తది (పు: 192)

25. రెక్కాడితే గాని డొక్కడని వాళ్ళయ్యే (పు: 194)

26. ఏ గాలత్తె ఆ గాలికి పుచ్చిన కుక్క తీరుగ కొట్టుక పోవుడు కాదు (పు: 197)

27. చాతగానోనికి అద్దనోడే తల్లిదండ్రి (పు: 202)

28. నాయకుడు లేని తండా, నవాబు లేని జండా (పు: 203)

29.కఱ్ఱ మీది గింజ వస్తేనే కంచం లేచేది (పు: 245)

30. కాలం మనది గాదని, తరం గాంది తలకెత్తుకుందామా ? (పు: 263)

### 4.11.4 జాతీయాలు

జాతీయం అనే పదానికి నుడికారం, చమత్కారం, పలుకుబడి అనే పర్యాయపదాలున్నాయి. భాషకు పుష్టిని, సొబగు నిచ్చేవి 'జాతీయాలు' అని అంటారు. పదాలకుండే సహజార్థాన్ని మరుగుపరిచి, విలక్షణమైన అర్థంలో ప్రయోగింపబడే పదాలు లేదా పదబంధాలు 'జాతీయాలు' అవుతాయి. ప్రతి భాషలోనూ జాతీయాలు ఆ భాషకు ఒక ప్రత్యేక గుర్తింపును తెస్తాయి. వీటిని వేరే భాషలో అనువదించడం అంత సులభమైన పనికాదు. ప్రయోగించిన భాషలో పదాలు ఇచ్చే విశిష్ట అర్థాన్ని స్ఫురింప చేసే పదాలనే జాతీయాలుగా గుర్తించవచ్చు.

1. నలుగురితోటి నారాయణ (పు: 3)
2. తలమీది గుమ్మడి కాయంత (పు:6 )
3. పుట్ట చెదిరినట్టు (పు:14 )
4. సముద్రమోలిగె జనం (పు:14 )
5. వుసికపోత్తె రాలకుంట (పు:14 )
6. నాచిన పులిలా (పు:36 )
7. చెవులు దిమ్మెక్కి పోయేటట్టుగా (పు:52 )
8. వూళ్లె గద్దల సోంటి దొరలు (పు:5 )
9. కాలు గాలిన పిల్లిలాగా (పు:54 )
10. పచ్చి పుండ్ల తీరుగా (పు:58 )
11. తేలు కుట్టిన దొంగ తీరు (పు:67 )
12. తోక తెగిన కుక్క ఏడ్చినట్టు (పు:84 )
13. రాజు గుర్రం గాడిద అయినట్టు (పు:84 )
14. మాణిక్యం కట్టిన మసి పాతలా (పు:84 )
15. పార్టీ మార్చిన రాజకీయ పక్షిలా (పు:87 )

16. కాళ్ళకు బలపాలు కట్టుకున్నట్టు (పు:97 )

17. కడుపులో చేయ్యేసి దేవినట్టు (పు:105 )

18. నోరు లేని పోరి (పు:108 )

19. కోపం కపాళానికెక్కింది (పు:109 )

20. జోకినట్టే మాట్లాడవట్టివి (పు:195 )

21. కాళ్ళు కడుపులకు తన్నుకుని పండాలనే (పు:196 )

22. పురాగ జిగి సచ్చిన మనిషి తీరుగ (పు:241 )

23. అరుకోసి మూడు అతుకుడు (పు:245 )

24. రోగం దిప్పె రోహిణి కార్తె (పు:263 )

25. గూట్లో గుడ్డావులా (పు: 271)

# ముగింపు

ఆధునిక తెలుగు కథాసాహిత్యానికి ప్రముఖ స్థానం ఉంది. ఆధునిక తెలుగు కథకు అంత ప్రాధాన్యం రావడానికి మానవ జీవితాన్ని వాస్తవికంగా చిత్రంచడమే అని చెప్పవచ్చు. కథాశిల్పం ఆకట్టుకున్న తీరు కూడా మరో కారణం. మానవ వాస్తవిక జీవితాన్ని ఉన్నది ఉన్నట్లుగా చిత్రిస్తూ రావడం వల్ల పలువురి మన్ననలను పొందింది. అలాంటి క్రమంలో తెలంగాణలో వచ్చిన కథలో తెలంగాణ జన జీవన స్థితిగతులను, సామాజిక పరిణామాలను, దొరల దాష్టికాన్ని, అధికారుల దౌర్జన్యాలను, సామాన్యుల జీవితాలను చిత్రిస్తూ అనేకమైన కథలు వచ్చాయి. 1980-90ల కాలంలో జరిగిన తెలంగాణ ప్రజల సామాజిక జీవిత పరిణామాలను చిత్రించడానికి కృషి చేసిన వారిలో రఘోత్తమరెడ్డి ముఖ్యులు. తానెరిగిన జీవితాన్ని కథలుగా మలచి అలుపెరగని కష్టాల మధ్యలో బతుకుతూనే కథాసాహిత్యానికి ఎనలేని సేవ చేసిన అరుదైన వ్యక్తి. ఆనాటి కాలపరిస్థితుల వల్ల (1980-90) ఆర్థికలోపాన్ని ఎదుర్కోలేక రైతులు పడ్డ కష్టాలనూ, దిక్కులేని పరిస్థితిలో వలస మార్గాన్ని ఎన్నుకుని కార్మికులుగా మారడాన్నీ, వలసజీవితాల్లో అధికారుల జులుంను ఎదుర్కోవడాన్నీ, హక్కుల పరిరక్షణకై ఉద్యమాలు, పోరాటాలు చేయడాన్నీ, ఉద్యమాల వల్ల కార్మిక వాడల్లో విచ్ఛినమయ్యిపోయిన మానవసంబంధాలనూ రఘోత్తమరెడ్డి కథలుగా రాశారు. ఈ విధంగా తెలంగాణ ప్రాంత ప్రజల జీవితాన్ని తెలుసుకోవడానికి రఘోత్తమరెడ్డి కథలు ఎంతగానో తొడ్పడతాయి. రఘోత్తమరెడ్డి లాంటి సామాజిక బాధ్యత గల రచయిత కథల వల్ల ఒక కాల, ప్రాంత చరిత్రను అర్థం చేసుకోవడానికి దోహదపడతాయి.

వాస్తవ జీవితాన్ని తన కథల్లో వివరించిన తుమ్మేటిరఘోత్తమరెడ్డి కథలపై పరిశోధన జరిగితే బాగుంటుందని అనుకున్నాను. అందుకే నా ఎమ్.ఫిల్ పరిశోధనలో తుమ్మేటి కథలపైన పరిశోధన

చేయాలనుకున్నాను. నేను పరిశోధనకు తీసుకున్న కథలను పరిశీలనా సౌలభ్యం కోసం నాలుగు అధ్యాయాలుగా విభజించాను. వాటిలో ఉపవిభాగాలను విభజించి పరిశీలించాను.

మొదటి అధ్యాయం **"తుమ్మేటి రఘోత్తమరెడ్డి – జీవిత రేఖలు"**లో తుమ్మేటి రఘోత్తమరెడ్డి జీవితరేఖలను పరిచయం చేశాను. ఇందులో రఘోత్తమరెడ్డి జననం, బాల్యంపై ప్రభావం చూపిన సంఘటనలు, రైతు జీవితంలో తుమ్మేటి, గని కార్మికుడుగా పని చేయడానికి గల కారణాలను, సాహిత్యంలో ప్రవేశించడానికి గల ప్రేరణను, తుమ్మేటి రఘోత్తమరెడ్డివ్యక్తిత్వం, రచనా దృక్పథం, తెలంగాణ కథాసాహిత్యంలో తుమ్మేటి రఘోత్తమరెడ్డి స్థానాన్ని ఇలా రచయిత రచన వెనుక గల కారణాలను తెలియజేయడానికి ప్రయత్నం చేసిన ఆధ్యాయం. ఈ ఆధ్యాయాన్ని రఘోత్తం రచనా నేపథ్యాన్ని ఉపయోగించి రాసింది.

రెండో ఆధ్యాయం **"తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – వస్తు వైవిధ్యం"**లో నేను పరిశోధనకు తీసుకున్న తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల్లో వస్తువైవిధ్యాన్ని పరిశీలించాను. రచయిత వస్తువు ఎలా స్వీకరించాడో తెలుసుకోవడానికి ఉపయోగపడే ఆధ్యాయం ఇది. ఇందులో భూస్వామ్య వ్యవస్థపై నిరసనను, వెట్టిచాకిరీని ఎదురించడానికి చేసిన ప్రయత్నాన్ని, వివాహ సంబంధంలో ఉన్న దోపిడి వ్యవస్థను, భార్యభర్తల మధ్య కలతలు, భిన్న కాలాల్లో స్నేహితుల మధ్య కలిగిన అగాథాన్ని, ఉద్యమాల ప్రభావం వల్ల గనికార్మికుల కుటుంబాల్లోని ఏర్పడిన కలహాలను, బిడ్డల మీద తల్లిదండ్రులకు ఉన్న అనిర్వచనీయమైన ప్రేమలను, ఇలా మానవ సంబంధాలలోని నెలకొన్న వైరుధ్యాలను కథల్లో వస్తువులుగా చిత్రించినతీరు తెలుస్తుంది. వీటన్నింటిని తుమ్మేటి కథావస్తువులుగా చేసుకున్నారు. ముఖ్యంగా బొగ్గుగని కార్మిక జీవితంలో ఉన్న దుర్భర పరిస్థితులను, గని కార్మికులు నోచుకొని కనీస అవసరాలను, ప్రమాదకరమైన గని వాతవరణ పరిస్థితుల్లో తప్పని సరిగా చేయాల్సిన పనులను, గని ప్రమాదాలను, రైతులు గనుల్లోకి వలస వచ్చి పడే కష్టాలు, వారి శారీరక కష్టం, మానసిక క్షోభ వల్ల వాళ్ళ కుటుంబాల్లో విచ్ఛినమవుతున్న సంబంధాలు ఇలా సమస్త గనికార్మిక జీవితాలను, నష్టపోతున్న

తీరును రచయిత అనుభవపూర్వకంగా ఎదురీడిన కష్టాలను కథావస్తువులుగా స్వీకరించారు. వాటిని ఈ అధ్యాయంలో పరిశీలించాను.

మూడో అధ్యాయం **"తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – పాత్ర చిత్రణ"**లో తుమ్మేటి రఘోత్తమరెడ్డి రాసిన కథల్లో పాత్రచిత్రణను పరిశీలించాను. కథల్లో పాత్రల సంఘర్షణకులోనైన తీరును ఇందులో వ్యక్తం చేయడం జరిగింది. పాత్రలను ప్రధాన, అప్రధాన పాత్రలుగా విభజించి పరిశీలించాను. అంతేగాకుండా కొన్ని కథల్లో కథమొత్తాన్ని మలుపు తిప్పే పాత్రలు, అవి అందించిన విషయాన్ని పరిశీలించాను.

నాలుగో అధ్యాయం **"తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు–రచనాశిల్పం"** లో తుమ్మేటి రఘోత్తమరెడ్డి శిల్పంలో చూపిన నైపుణ్యాన్ని వివరించాను. అనేక అంశాల మిళితమైన శిల్పాన్ని విభిన్న అంశాలుగా విభజించి పరిశీలించాను. వస్తువు, పాత్రచిత్రణ, కథాకథనం, సంఘటన, సంఘర్షణ, సన్నివేశాల కల్పన, ఎత్తుగడ, ముగింపు, వర్ణన, శీర్షిక మొదలైన శిల్పాంశాలను తుమ్మేటి కథల్లో పరిశీలించి ఆయా విభాగానికి ఉదాహృతులను కూడా ఇచ్చి వివరించాను.

ఆనాటి విప్లవ కాలపరిస్థితుల వల్ల మానవ సుప్తచేతనంలో ఉన్న చైతన్యాన్ని అందించే కథలను ఒక మూస ధోరణి కథలంటూ ప్రక్కకు పెట్టి నెట్టి వేయడం నేరమేవుతుంది. అది మనకు మనం చేసుకునే అప్రయత్న బంగపాటే అవుతుంది. కథలు రాయడమే కాదు అలాంటి జీవితాల్లో స్వయంగా కొట్టుమిట్టాడీ సామాజిక న్యాయం, దోపిడి లేని సమాజాన్ని ఆశించే రచయితను నిషిద్ధం చేయడం సమంజసం కాదని నా భావన. 27 సంవత్సరాలు గని కార్మిక జీవితాన్ని అనుభవించి అలసిపోయి కూడా తనకిష్టమైన సాహిత్యంలో కృషి చేసిన రఘోత్తమరెడ్డికి తెలంగాణ కథాసాహిత్యంలో ఉన్నత స్థానాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది.

ఈ పరిశోధనలో కాల పరిమితి దృష్ట్యా ఒక పరిధికి లోబడి తీసుకున్న కథలను మాత్రమే పరిశీలిన చేసాను. ఇంకా మిగిలిన కథలను పరిశీలిన తీసుకోకుండా విడిగా ఉంచడానికి ప్రధాన

కారణం. అందులో విషయగాఢత. కాబట్టి మిగిలిన కథలను రాబోయే పరిశోధకులు తీసుకోవడం మంచిదని భావిస్తున్నాను. అంతేగాకుండా తెలంగాణ కథకుల్లో విశిష్ట, విలక్షణమైన కథకున్ని ప్రాపంచిక దృక్పథాన్ని పరిశీలించి రచయితకు ఇవ్వవలసిన స్థానాన్ని ఇవ్వగల బాధ్యత నేటి పరిశోధకుల మీద ఉందని చెప్పవచ్చు. రఘోత్తమరెడ్డి కథల మీద జరగాల్సిన పరిశోధన నాకు తెలిసిన అవగాహన నుంచి చూసినట్లయితే కింది విధంగా నిర్ణయించాను.

1. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – ప్రాపంచిక దృక్పథం
2. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – బొగ్గుగని కార్మిక జీవిత చిత్రణ
3. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – స్త్రీ, పురుష సంబంధాల వైవిధ్యం
4. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథానేపథ్యాలు – వాస్తవిక జీవితచిత్రణ
5. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – సామాజిక విశ్లేషణ
6. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు – కథాకథన పద్ధతులు

పైవిధంగా తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల మీద పరిశోధన చేయడానికి అవకాశం ఉందని చెప్పవచ్చు. ఈవిధంగా సాహిత్యాన్ని, జీవితాన్ని వేరుగా చూడకుండా తన జీవితాన్నే సాహిత్యంగా మలిచిన రఘోత్తమరెడ్డి గారి మీద పరిశోధన చేయడం ఎంతైనా అవసరం ఉందని తెలుస్తుంది.

# ఉపయుక్త గ్రంథాలు


1. అశోక్ కుమార్, కె.పి. 2008. ***"కథావలోకనం"*** (విమర్శ వ్యాసాలు) హైదరాబాదు: పాలపిట్ట బుక్స్
2. ఆంజనేయులు, గూడుగుంట్ల. 2009. ***"అంబల్ల జనార్థన్ కథలు – సవిమర్శక పరిశీలన"*** హైదరాబాదు: హైదరాబాదువిశ్వవిద్యాలయం (ఎం.ఫిల్ అముద్రిత సిద్ధాంత వ్యాసం)
3. కాత్యాయని విద్మహే. 2013**. రఘోత్తమరెడ్డి కథలు** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు
4. గుడిపాటి, 2003. ***"ఇతివృత్తం"*** (కథాసాహిత్య వ్యాసాలు) విజయవాడ: ఋషి ప్రచురణలు
5. చక్రపాణి, ఘంటా. 2009. "***బొగ్గుపొరల్లో అగ్గిబావుటా"*** (తెలంగాణ వనరుల దోపిడి – సింగరేణి కార్మికోద్యమం) హైదరాబాదు: వుమేష్ బాక్ ప్రింటర్స్
6. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాలెం. 2006. ***"కథాంశం"*** (తెలుగు కథానిక సాహిత్య విమర్శ) అనంతపురం: లక్ష్మీగ్రాఫిక్స్
7. చంద్రశేఖర్ రెడ్డి, రాచపాలెం. 1985. ***"గురజాడ తొలి కొత్త తెలుగు కథలు"*** అనంతపురం: శిల్ప ప్రచురణలు
8. చెంచయ్య, వి. 2001. ***"సాహిత్య దృక్పథం"*** (సాహిత్య విమర్శ వ్యాసాలు) నెల్లూరు: విరసం నెల్లూరు జిల్లా యూనిట్
9. దక్షిణామూర్తి, పోరంకి. 1988. ***"కథానిక స్వరూప స్వభావాలు"*** విజయవాడ: నవోదయ పబ్లికేషన్స్
10. దక్షిణామూర్తి, పోరంకి. 1999. **తెలుగు కథానిక** హైదరాబాదు: యువభారతి
11. నరేంద్ర, మధురాంతకం. 2000. ***"కథాయాత్ర తెలుగు కథానికా విమర్శలూ–పరామర్శలూ"*** హైదరాబాదు: అజో – విభొ ప్రచురణలు
12. నళిని, ఎస్. ఎస్. 2009. ***"సాహిత్య విమర్శ పదాల డిక్షినరీ"*** హైదరాబాదు: నవదోయ బుక్ హౌస్
13. నాగరాజు, పి. ఎస్. 1997. ***"మహాశ్వేతాదేవి కొన్ని నవలలు, కథలు – ఒక పరిశీలన"*** ఆంధ్రప్రదేశ్: జనసాహితి

14. నాగేందర్, పగడాల. 2013. **విప్లవోద్యమ కథకు ఇరుసు** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

15. పినాకపాణి. 2013. **తుమ్మేటి రఘోత్తమరెడ్డి** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

16. ప్రశాంత్. 2013. **తుమ్మేటి రఘోత్తమరెడ్డి రెండు కథలు** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

17. బలరాం, కచ్చళ్ళ. 2011. ***"ఒక రాత్రి – రెండు స్వప్నాలు" కథా సంపుటి –పరిశీలన***. హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం (ఎం.ఫిల్ అముద్రిత సిద్ధాంత వ్యాసం)

18. భుజంగెడ్డి, బి. 2007. ***"సమకాలీన తెలుగు సాహిత్యంలో స్త్రీవాదం"*** (1980-90) హైదరాబాదు: వసుమతి పబ్లికేషన్స్

19. మధుసూధనరావు, త్రిపురనేని. 1987. ***"సాహిత్యంలో వస్తుశిల్పాలు"*** హైదరాబాదు: నవదోయ బుక్ హౌస్

20. రఘోత్తమరెడ్డి, తుమ్మేటి (సం.పా). 2013. ***"ఒక కథకుడు – నూరుగురు విమర్శకులు"*** (తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథల చర్చా సర్వస్వం) హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

21. రఘోత్తమరెడ్డి, తుమ్మేటి (సం.పా). 2013. **హరగోపాల్ గారి అభిప్రాయం** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

22. రవికుమార్, దార్ల. 2000. ***"అరవింద్ కథలు – పరిశీలన"*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం (ఎం.ఫిల్ అముద్రిత సిద్ధాంత వ్యాసం)

23. రామచంద్రారెడ్డి, రాచమల్లు. 1989. ***"సారస్వత వివేచన"*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లికేషన్స్

24. రామశంకర్, యం. 2013. **గోదావరికి ఆవల అల్లం–ఈవలరఘోత్తం** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

25. రామారావు, కాళీపట్నం. 2013. **స్వగతం** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

26. రాజయ్య, అల్లం. 2013. **చిత్తడైన అంతరంగం** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

27. లక్ష్మీకాంతం, పింగళి. 1986. ***"సాహిత్య శిల్ప సమీక్ష"*** విజయవాడ: గంగాధర పబ్లికేషన్స్

28. వరప్రసాద్, దీవి. 1989. ***"కాళీపట్నం రామారావు కథలు – సామాజిక విశ్లేషణ"*** కృష్ణా: ధరిత్రీ పబ్లికేషన్స్
29. వరలక్ష్మి, కె. 2013. **తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు
30. విజయ్ కుమార్, వై. 1986. ***"సాహిత్యం – వాస్తవికత"*** (మార్క్సిస్టు పరిశీలన) హైదరాబాదు: శ్రీశ్రీ స్మారక సంస్థ
31. విజయ్ కుమార్, భూక్య. 2006. ***"నవీన్ కథలు – వస్తు శిల్ప వివేచన"*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం (ఎం.ఫిల్ అముద్రిత సిద్ధాంత వ్యాసం)
32. వీర్రాజు, శీలా. 2008. **కథానిర్మాణ శిల్పం** హైదరాబాదు: తెలుగు అకాడమి
33. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 1995. ***"కథాశిల్పం"*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
34. వెంకటసుబ్బయ్య, వల్లంపాటి. 2013. **ఇది పరిచయం కాదు** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు
35. వెంకటేశ్వర రావు, దార్ల. 2009. ***"వీచిక"*** (సాహిత్య విమర్శ వ్యాసాలు) హైదరాబాదు: ప్రజాశక్తి డైరీ ప్రింటింగ్ ప్రెస్
36. వేణుగోపాల్, ఎన్ (సం.పా). 2006. ***"తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు"*** ఆంధ్రప్రదేశ్: విప్లవ రచయితల సంఘం
37. వేణుగోపాల్, ఎన్. 2013. **అభిమాన కథకుడికి ప్రేమలేఖ** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు
38. వేణుగోపాల్, అమ్మంగి. 2013. **పొరల కింద ప్రాణస్పందనలు** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు
39. శరత్‌జ్యోత్స్నరాణి, ఎస్. (సం.పా). 2007. ***"తెలుగు కథాసాహిత్యం–ఆధునిక దృక్పథాలు"*** హైదరాబాదు: జ్యోత్స్న కళాపీఠ ప్రచురణలు
40. శివశంకర్, పాపినేని. 1996. ***"సాహిత్యంలో మౌళిక భావనలు"*** గుంటూరు: పాపినేని ప్రచురణలు
41. శ్రీనివాసమూర్తి, సిహెచ్. 2013. **కార్మిక–కర్షక–జీవన వెతలు** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు
42. శ్రీరామమూర్తి, కోడూరి (సం.పా). 2009. ***"తెలుగు కథానిక పరిశీలన"*** (1925–1980) హైదరాబాదు: మాడభూషి రంగాచార్య స్మారక సంఘం

43. శ్రీరాములు, ఎం. 2005. *జాతర నవల – సమగ్ర పరిశీలన* హైదరాబాదు విశ్వవిద్యాలయం

44. సత్యనారాయణ, ఎస్వీ. 2013. **తెలంగాణ కల్లోల జీవితాన్ని చిత్రిస్తున్న రచయిత** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

45. సదాశివ, సామల. 2013. ***తుమ్మేటి రఘోత్తమరెడ్డి – నేను*** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

46. సదాశివుడు, మల్లావఝుల. 2013. **ఆగిన అగ్రిధార** హైదరాబాదు: సౌభాగ్య ప్రచురణలు

47. సుదర్శనం, ఆర్. విస్. 2008. **తెలుగు నవల – పాత్రచిత్రణము** హైదరాబాదు: తెలుగు అకాడమి

48. సుందర్‌రాజు, నాగప్పగారి. 1994. **"పులికంటి కృష్ణారెడ్డి కథలు–ఒక పరిశీలన"** హైదరాబాద్: హైదరాబాదు విశ్వవిద్యాలయం (ఎం.ఫిల్అముద్రిత సిద్ధాంత వ్యాసం)

49. సుధారాణి, పి. 1997. "*రాచకొండ విశ్వనాథ శాస్త్రి కథలు – పరిశీలన*" హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం (పిహెచ్. డి అముద్రిత సిద్ధాంత వ్యాసం)

50. సుబ్బరావు, వావిలాల. 1993. ***"చలం గారి కథానిక సాహిత్యం అనుశీలనము"*** గుంటూరు: శ్రీ లక్ష్మీ గణపతి ప్రింటర్స్

51. సుబ్బరావు, చవడం. 2006. ***"తెలంగాణ తొలి తరం కథలు – పరిశీలన"*** హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం (ఎం.ఫిల్ అముద్రిత సిద్ధాంత వ్యాసం)

52. స్వామి, బి.వి.ఎన్. 2013. ***"కథా తెలంగాణం"*** (వ్యాసాలు) హైదరాబాదు: అడుగుజాడలు పబ్లికేషన్స్

## అంతర్జాలం

1. GOOGLE
2. YOUTUBE

# అనుబంధం

## తుమ్మేటి రఘోత్తమరెడ్డి గారితో ఇంటర్వ్యూ....

**1. మీరు అనుభవించిన జీవితాన్ని ఎందుకు కథాసాహిత్యంలో చిత్రించాలని అనుకున్నారు?**

బాల్యంలో వేమన పద్యాలు చదివాను. వాటి ప్రభావం అది. సమాజానికీ-సాహిత్యానికి సంబంధం ఏవిధంగా ఉండాలో, నాకు ఆ పద్యాల వల్ల బోధపడ్డది.

**2. మీరు రాసిన కథల్లో స్త్రీ, పురుష సంబంధాల గురించి రాసిన కథల్లో లేవనెత్తిన సమస్యల్లేమిటి? వాటికి పరిష్కారమేమైనా చెప్తారా?**

మొదటిది- నేను స్త్రీ, పురుష సంబంధాలను చర్చించలేదు. సామాజిక సంఘర్షణ నేపథ్యంలో సమూహాల మధ్య, వ్యక్తుల మధ్య, వ్యక్తి లోపలా విరుద్ధ భావాల మధ్య సంఘర్షణని సామాజిక వైరుద్యాల పరిష్కారంలో భాగంగా చిత్రించాను.

**3. మీరు సమాజంలో ఎలాంటి మార్పును ఆశించి కథలు రాశారు?**

దోపిడి-పీడనలు లేని మంచి సమాజ మార్పును ఆశించి.

**4. మీ కథలలో ఉన్న మానవ సంబంధాల గురించి వివరిస్తారా?**

మానవ సంబంధాల్ని, భావజాల సంబంధాలే! నాదృష్టిలో

**5. బొగ్గుగని కార్మికుల కష్టాలను, జీవితాలను, గురించి మీ అభిప్రాయం, వారి జీవితాలను మార్చే, పరిష్కారించే మార్గమేమన్న ఉందా?**

భూ ప్రపంచంలో అత్యంత నికృష్ట పరిస్థితుల్లో బొగ్గుగని కార్మికులు పని చేస్తారు. ప్రకృతికి నియమాలకు విరుద్దంగా వారు పని చేయవలసి ఉంటుంది. ఇప్పుడిప్పుడు పరిస్థితులు మెరుగు పడుతున్నాయి. వారిలో పోరాట చైతన్యం ఎక్కువ. వారి గురించి ఆలోచించే తీరిక మన పాలక వర్గాలకు లేదు.

**6. మీ కథలు ఏ ప్రయోజనాన్ని ఉద్ధేశించాయి? అవి నేరవేరాయా?**

నేను కథలు రాయాలని ప్రయత్నం ప్రారంభించిన తరువాత, ఆ ప్రయత్నంలో నాకు చాలా విషయాలు తెలుస్తూవచ్చాయి. వాటిని పాఠకమిత్రులతో పంచుకోవాలనుకున్నాను. అవి పాఠకుల్లోకి వెళ్లినదాన్ని బట్టి ఫలితం.

**7. ఒకే కథలోని సంఘటనలు యిమాడ్చటం వల్ల పాఠకులకు కథపై కొంత సందిగ్ధం ఏర్పడుతుంది? దానికేమంటారు? (పట్టు, శత్రవు, ఇల్లు)**

నాది చాలా కఠినమైన వృత్తి. సమయాభావం– ముఖ్యవిషయాలనే క్లుప్తంగా చెప్పాలనుకోవడం. అందువల్ల చాలా కథలు సంఘటనల వద్ద ప్రారంభమవుతాయి. అక్కడ అయితే సహజంగానే చాలా విషయాలు కథలోకి వస్తాయి. 'సందిగ్ధత' అనే మీ మాటకు పాఠకుల్లో కూడా రకరకాల చైతన్యాల వాళ్ళుంటారు. ఒక కథ అందరికి ఒకే విధంగా అందదు.

**8. మీ కథలో కొన్ని వాటిలో రచయిత వాఖ్యానం ఎక్కువగా కనిపిస్తుంది? పాఠకులు విషయాన్ని తప్పుగా అర్థం చేసుకుంటారని వాఖ్యానించారా?**

నేనెక్కడ వ్యాఖ్యానించానో చెప్తే బాగుండేది. అటువంటి ధోరణి నాలో లేదనే నేను అనుకుంటాను.

**9. మీ కథలు విప్లవ కథలని కొందరు అంటున్నారు. మీ సమాధానం?**

కావచ్చు! నా కథల మీద అనేక వ్యాఖ్యానాలు చేసారు.

**10. మీ కథలు ఆపేయడంపై పలువురు విమర్శకులు విమర్శించారు? వాటికి సమాధానం ఏమిటి?**

కథలు రాయడం ఆపేసినందుకు నన్నెవరూ విమర్శించలేదు. ఇంకా రాస్తే బాగుండునని అన్నారు.

**11. మీ కథారచన ప్రారంభించే అవకాశాలు గాని, మళ్ళీ రాయాలని అకాంక్ష గాని ఎమైనా ఉందా తెల్పండి?**

బహుదూరపు బాటసారికి, విశ్రాంతులు కూడా అవసరమే. కథారచనని ఆపాను కాని విరమించుకోలేదు. తరువాత కాలంలో 'ఆశుకథలు' చెప్పి విడుదల చేసాను. మళ్ళీ కొంత విరామం తీసుకున్నాను. నాలుగేండ్లు పదకొండు వేల కొటేషన్స్ రాసాను. మళ్ళీ ప్రస్తుతం విరామం. నాకు ప్రక్రియ పరమైన అభిమాన దురభిమానాలు లేవు. విషయాన్ని బట్టి–అవసరాన్ని బట్టి ఏవిధంగా రాయాలో నిర్ణయించుకుంటూపోవడమే. రచన విషయంలో అంతిమ నిర్ణయమంటూ నాకు ఏదీ లేదు. కాలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించడం అంతే!

**12. మీ జీవితంలో మరుపురాని అతి ముఖ్య సంఘటన ఏదైనా వివరిస్తారా?**

గడిచిన జీవితమంతా ఏదీ మరుపున పడలేదు. జీవితం ముఖ్యమైందని భావించేవాన్ని. అనూహ్యమైనవో, అద్భుతమైనవో అంటూ నాకేం లేవు. నాది మామూలు జీవితం. నేను అనుకునే విధంగానే సాగుతోంది.

**13. మీ కథల్లో మీకు నచ్చిన 'కథ' ఏది? ఎందువల్ల ?**

'నా పాత స్నేహితుడు' అది నా ప్రాతినిధ్య కథగా భావిస్తాను.

**14. మీ కథల్లో మీకు నచ్చిన 'పాత్ర' ఏది? ఎందువల్ల ?**

అటువంటి ప్రశ్నకు ఆస్కారం లేదు. కథారచయితగా అన్ని రకాల పాత్రల్ని సంయమనంతో చిత్రించవలసి ఉంటుంది.

**15. మీరు కథలు రాయడానికి దోహదం చేసిన పరిస్థితులేవి?**

నా జీవన నేపథ్యం– నేను ఆలోచించిన తీరు కారణం.

**16. విరసం వేసిన 'తుమ్మేటి రఘోత్తమరెడ్డి' కథలు కథాసంపుటిపై మీ అభిప్రాయం?**

చలసాని ప్రసాద్– కృష్ణబాయి గారలు విరసం తరపున ప్రచురిస్తామని నా అనుమతి అడిగారు. నేను సరె అన్నాను. వారికి కృతజ్ఞతలు

**17. మీ కథలో వస్తు వైవిధ్యానికి ప్రధానంగా ఎంచుకున్న భూమిక ?**

నేను పుట్టి పెరిగిన – నేను ఉద్యోగం చేసిన జీవితమే నా కథలకు భూమిక. కథాప్రక్రియ గురించి నేను చేసుకున్న ఆలోచనలు వగైరా.

**18. మీ కథలు సమాజానికి ప్రధానంగా చెప్పదలచే అంశాలేమిటి?**

'స్వార్జితం మీద బతకడం–సామాజిక రుణం తీర్చుకోవడం' అని కాళీపట్నం రామారావుగారు ఓ సభలో మాట్లాడగా విన్నాను. బతుకులనైనా, సాహిత్యాన్నైనా సార్థకం చేసే మాట అది. దానిని మించి నేను చెప్పదలుచుకున్న అంశాలు మరేమీ లేవు.

**19. మీ రచనల మీద మార్క్సిజం, కమ్యూనిజం ప్రభావం లేదని చెప్పారు. వాటిపై మీ నిర్ణయం?**

వాళ్ళకు అర్థమయినంత మేరకు రచయితని రకరకాలుగా వ్యాఖ్యానిస్తారు.

**20. మీ కథల్లో బొగ్గుగని బావి కార్మికుల జీవితాలు ఎక్కువగా చిత్రించారు. ఆ జీవితం గురించి వివరణ ఇస్తారా?**

బొగ్గుగని కార్మికుల గురించి బయటి ప్రపంచానికి తెలిసింది తక్కువ. నేనా జీవితంలో ఉన్నాను. కనుక కొంత రాసాను.

**20. ప్రత్యక్షంగా, పరోక్షంగా మీ కథలు సాధించుకున్న ప్రయోజనాలేమిటి?**

అవి నాకు అంతగా తెలియదు కాని, కథలు రాసే ప్రయత్నం వల్ల నేను అనేక విషయాలు తెలుసుకున్నాను. అది నాక్కలిగిన ప్రయోజనం.

**21. 'పెండ్లి', 'వేటగాడి చూపులు' ఈ రెండు కథల్లో సంప్రదాయ వివాహ వ్యవస్థను దునుమాడారు? సంప్రదాయా వివాహ వ్యవస్థపై మీ నిర్ణయం?**

చాలా విషయాలు మనం ఆలోచించే తీరును బట్టి ఉంటుంది. మనుషుల ఇష్టాయిష్టాలను గౌరవించాలి. భద్రత కల్పించాలి.

**22. "ఇల్లు" కథలో ముగింపు స్పష్టంగా ఇవ్వలేదు? కారణంమేమిటీ?**

ఏ ముగింపు అయినా తాత్కాలికమే! ఒక్కోసారి అస్పష్టంగా కూడా కనిపిస్తుంది.

**23. వాస్తవిక జీవితాన్ని కథలుగా చిత్రించినప్పుడు మీకు ఎదురైనా సమస్యలు, ఆటుపోట్లను వివరించగలరా?**

నాకు అలవికాని విషయాల్ని వదిలేసాను. ఆలోచనకూ-మాటకూ, చేతకూ సమన్వయం కుదుర్చుకునే ప్రయత్నంలో నాకు చాలా సంఘర్షణ ఎదురైంది. అవే కథల్లోకి వచ్చింది. నేను నిలబడాల్సిన చోటు ఏదో ఎంచుకోవాల్సి వచ్చింది- అదే రాసాను.

**24. కొన్ని కథల్లో (ఇల్లు, ఈ భూమి ఎవరిచ్చిన్రు?) సామూహికంగా అనామిక పాత్రలు వచ్చి చైతన్యాన్ని పొందుతుంటాయి? కారణం ఏమిటి?**

జీవితం అనేక విధాలుగా ఉంటుంది. ఆ కథల్ని కూడా అలాగే చూడాలి.

**శుభాకాంక్షలతో....**

తుమ్మేటి రఘోత్తమరెడ్డి

22- జూన్-2015.